
# సండే కామెంట్స్



వేమన వసంతలక్ష్మి

PERSPECTIVES

# సండే కామెంట్స్

వేమన వసంతలక్ష్మి

ప ర్ స్పె క్టి వ్స్

ఏలే వారికి పాపభీతి లేదు, ప్రజల భయం లేదు. అంతగా అయితే 'కొత్తప్రజ'లను వాళ్ళు ఎన్నుకోవచ్చు. రాజ్యాంగం సాక్షిగా అంతా నిజమే చెబుతాను అని అసత్య ప్రమాణం చేయొచ్చు. ఇది ఒక ప్రాంతం లేదా దేశాన్ని ఏలే వారి కథ కావచ్చు. ఊరూరి కథ కావచ్చు, ప్రజల వ్యథలే కావచ్చు... స్పందించాల్సిన ప్రజా చైతన్యం మసకబారి తలక్రిందులవుతున్నప్పుడు - ఆ విలోమత్వాన్ని రకరకాల ప్రక్రియల ద్వారా నిగ్గదీసి ప్రశ్నించాలి అక్షరం.

మూడు దశాబ్దాల జర్నలిజం జీవితం నుంచి పొందిన స్పృహకి రాజకీయార్థిక దృష్టి కోణం, హక్కుల ఉద్యమ తాత్వికత తోడవగా.. వేమన వసంతలక్ష్మి కవ్విస్తూ, నవ్విస్తూ, వేదనతో ఇవ్వాల్టి లోకరీతిని పంచుకోను అలవోకగా చెప్పినవే ఈ చిట్టి పొట్టి గల్పికలు.

ఏ వారానికి ఆ వారం రాసిన ఈ విలక్షణ కామెంట్స్ సప్త వర్ణ రాగ రంజితమైన ఇంద్రధనస్సులు; చివరిలో మెరిసే మెరుపులు వ్యవస్థల్ని, మానవ ప్రవృత్తిని నిరసించే అధిక్షేప నిక్షేపాలు. ప్రజాస్వామిక అంతరంగం నుంచి జాలువారిన అపురూప పదచిత్రాలే ఈ

**సండే కామెంట్స్**

**- ఆర్ కె**

జూలై 2018 పర్స్పెక్టివ్స్

*వేమన వసంతలక్ష్మిది నెల్లూరు జిల్లా కరటంపాడు గ్రామం. జననం: 1.8.1954. తల్లిదండ్రులు వేమన కృష్ణకుమారి, పాపయ్యనాయుడు. మానవహక్కుల ఉద్యమకారుడు కె. బాలగోపాల్ జీవిత సహచరుడు. కుమారుడు ప్రభాత. చదివింది బి.ఎ. జాగ్రఫీ మద్రాసులో, ఎం.ఎ. పొలిటికల్ సైన్స్ శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో. 1978 నుండి 2017 వరకు జర్నలిస్టుగా పని చేశారు. ఆంధ్రప్రభ, ఉదయం, నీహార్ ఆన్‌లైన్ (వెబ్‌సైట్), ఆంధ్రజ్యోతి పనిచేసిన పత్రికలు. అనేక అనువాదాలు చేశారు. వాటిలో 'దుశ్శాసనాలు', 'కొంబాహీ రివర్ కలెక్టివ్' పుస్తకాలుగా వచ్చాయి. మానవి ప్రచురణలు పేరుతో నాలుగు పుస్తకాలు తీసుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో, తర్వాత మానవహక్కుల వేదికలో చురుకుగా పనిచేశారు. మానవహక్కుల వేదికకు చాలాకాలం పబ్లికేషన్స్ ఎడిటర్‌గా ఉన్నారు. ఇది ఆమె తొలి పుస్తకం.*

**- పర్‌స్పెక్టివ్స్**

# సండే కామెంట్స్

ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం నుండి ఎంపిక చేసిన రచనలు

**వేమన వసంతలక్ష్మి**



**పర్ స్పెక్టివ్స్**


*సామాజిక శాస్త్రం / సాహిత్యం*

**హైదరాబాద్**

2018

ISBN-978-93-81172-15-5

■ ప్రచురణ సంఖ్య : **58**



## ■ సండే కామెంట్స్

ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం
నుండి ఎంపిక చేసిన రచనలు
(2002 – 2016)

■ రచన : **వేమన వసంతలక్ష్మి**

■ ప్రథమ ముద్రణ : **జూలై 2018**

■ సోల్ డిస్ట్రిబ్యూటర్స్ :
**నవోదయ బుక్ హౌస్**
ఆర్యసమాజ్ ఎదురు వీధి,
కాచిగూడ చౌరాస్తా,
హైదరాబాద్ – 500027
ఫోన్ నెం. 040–24652387

■ పబ్లిషర్స్ :
**ప ర్ స్పె క్టి వ్స్**
సామాజిక శాస్త్రం / సాహిత్యం
ప్లాట్ నెం 305
ఇ.నెం. 2–2–647/182/ఎ3
హిమశివ అపార్ట్‌మెంట్స్
బాగ్ అంబర్‌పేట్
హైదరాబాద్ – 500013
సెల్ : 8332934548

వెల : **Rs. 150/–**

book : www.kinige.com

■ కవర్ బ్యాక్‌గ్రౌండ్:
**జాసక్ గోవిక్** సౌజన్యంతో

■ కవర్ డిజైన్:
**అన్వర్**

■ లే అవుట్ & కంపోజింగ్ :
**గంగాధర్,** హైదరాబాద్
సెల్ : 9848133848

■ ముద్రణ :
**హిమాలయ గ్రాఫిక్స్**
భాగ్యనగర్ కాంప్లెక్స్
ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ దగ్గర
హైదరాబాద్ – 500020
తెలంగాణ
ఫోన్ : 040–65552357

# ఆదివారం వ్యాఖ్యలు
# చైతన్యపు చిరుజల్లులు

ఈ సంకలనంలోని రచనలన్నీ వేమన వసంతలక్ష్మిగారు గల్పికల రూపంలో పాఠకులతో పంచుకున్న ఆలోచనలు, వ్యాఖ్యలు, చిన్న కథలు. 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ఆదివారం అనుబంధం సంపాదకురాలిగా ఆమె సుమారు పధ్నాలుగేళ్ళ పాటు సండే కామెంట్స్ పేరుతో రాసిన వాటిల్లోంచి కొన్నిటిని ఎంపికచేసి ప్రచురించిన పుస్తకం ఇది.

'ఆంధ్రజ్యోతి' ఆదివారం అనుబంధం అంటేనే ఇంటిల్లిపాదీ ఆస్వాదించగల విశేషాల కలగలుపు. అందులోని శీర్షికలు దైనందిన వార్తలకు, సంపాదకీయాలకు పూర్తిగా భిన్నమైనవి. సీరియస్ పాఠకుల కోసం కొంత సాహిత్యం, పిల్లల కోసం కొన్ని రంగుల పేజీలు, ప్రముఖుల జీవిత చిత్రణలు, స్థానిక జీవితపు సొబగులు - హరివిల్లును తలపుకు తెచ్చేవి. వీటి మధ్యన మరీ గంభీరంగా లేదా ప్రబోధాత్మకంగా ఉండకుండానే సమకాలీన ప్రపంచాన్ని సెలవు రోజున కాస్తంత సావకాశంగా, లోతుగా, మానవీయంగా పరిశీలించేందుకు దోహదపడేవి ఈ వ్యాఖ్యలు.

అత్యంత త్వరితంగా మారిపోతున్న మన ప్రపంచాన్ని, చాపకింద నీరులా వస్తూన్న మార్పుల్ని మన దృష్టికి తేవడం, 'నిజానికి అసలేం జరుగుతోంది?' అన్న ప్రశ్నకు జవాబు వెతికే ప్రయత్నం చేయడం ప్రధాన

లక్ష్యాలుగా ఈ రచనలు సాగాయి. అలాగే బాహ్య ప్రపంచంలో వస్తున్న మార్పుల ఫలితంగా మనకు తెలియకుండానే మన లోలోపల - ముఖ్యంగా మధ్యతరగతిలో - వస్తున్న పరిణామాలకు కూడా ఈ వ్యాఖ్యలు అద్దం పడతాయి. కొన్ని వ్యాఖ్యలు పర్యావరణం పట్ల పాఠకులు తమ ఎరుకను, జాగరూకతను పెంచుకునేలా సున్నితంగా అయినా సునిశితంగా హెచ్చరికలు చేస్తాయి. మిగిలినవి పూర్తిస్థాయి సృజనాత్మక కథారచనలుగా దర్శనమిస్తాయి. ఇన్ని వైవిధ్యమయిన కారణాల వల్ల ఈ సంకలనంలోని రచనలు ఒకవైపు నుంచి యువతరం కోసం రాసిన బొమ్మల్లేని అమరచిత్ర కథలుగాను, మరో పార్శ్వం నుంచి పెద్దలను ఉద్దేశించిన లోతైన 'చందమామ' కథలుగాను గోచరిస్తాయి.

పెద్దల్ని ఆలోచింపజేసే రచనలు చేయటం చెయ్యితిరిగిన రచయితలకు, పాత్రికేయులకు కూడా పెను సవాలే. ఇందుకు రెండు ప్రధానమైన కారణాలున్నాయి. మొదటిది - చాలామంది మనుష్యులు వయసు పెరిగే కొద్దీ పెళుసుబారిపోతారు. మంచీచెడుల అన్వేషణలో కొంతదూరం ప్రయాణించాక అలిసిపోతారు. సుస్థిరమైన అభిప్రాయాలతో అల్లిన ఒక అభేద్యమైన గూడును తమ చుట్టూ నిర్మించుకొని అక్కడే ఆగిపోతారు. ఆ గూడు కల్పించే రక్షణలోంచి రంగుల రెక్కల్ని విదిలించుకొని బయటపడాలనుకుంటే, సీతాకోకచిలకల్లా స్వేచ్ఛాజీవులుగా ఎగరాలను కుంటే కొత్త అన్వేషణలూ, నిరంతర ప్రయోగాలూ, వీటన్నిటితో బాటు అంతర్గత సంఘర్షణా అవసరం. జీవన ప్రయాణాన్ని, అన్వేషణని సుదీర్ఘంగా కొనసాగించాలనుకునే వ్యక్తులు అనవసరపు లగేజీని ఎప్పటికప్పుడు వదిలించుకోకపోతే ముందుకు సాగలేరు. అయితే ఈ ఆలోచన, ఆచరణ బహు కొద్దిమందిలోనే కనపడుతుంది.

పెద్దలను ఉద్దేశించి చేసే రచనల్లో, ముఖ్యంగా వారి దృక్పథంలో మార్పును ఆశించే రచయితలు ఎదుర్కొంటున్న సవాలుకు రెండవ కారణం బాహ్య పరిణామాలకు సంబంధించినది. దేశంలోని అన్ని రంగాలూ రెండు శిబిరాలుగా చీల్చివేయబడుతూన్న సందర్భంలో సహేతుకమైన చర్చకు తావు లేకుండా పోతున్నది. సమాలోచన తగ్గుతోంది. అభిప్రాయాల

సంరంభం పెరుగుతోంది. వాస్తవాల్ని, చరిత్రని సవివరంగా, లోతుగా పరిశీలించే సహనం లోపిస్తున్నది. చాలా సందర్భాల్లో కార్యకారణ సంబంధాలను తలక్రిందులు చెయ్యడం లేదా గందరగోళ పరచడం జరుగుతోంది. నేటి చింతనలలో, చర్చలలో అప్రధానమైన, తుచ్ఛమైన అంశాలపై దృష్టి పెరిగిపోతోంది. దాంతో కీలకమైన పలు సామాజిక అంశాలు మరుగున పడిపోతున్నాయి. దీనికి మీడియా కూడా కారణభూతమవుతోంది. తప్పుడు ప్రచారాలకూ, ఆ ప్రచారాలతో విభేదించేవారిపై ఎదురుదాడులకూ సోషల్ మీడియాను వాడుకోవడం సర్వసాధారణమైపోయింది. తమతో ఏకీభవించని వారందర్నీ శత్రువులుగా చిత్రించి, వారిపై వ్యక్తిగత నిందారోపణలు, భౌతిక దాడులు చేసే కాలం దాపురించింది. ఇది మూర్ఖత్వానికి, సంకుచితత్వానికి దారితీసే ఒక అప్రజాస్వామికమైన, ప్రమాదకరమైన ధోరణి.

మరి ఇలాంటప్పుడు జనబాహుళ్యపు దృష్టిని నేటికాలపు కీలక సామాజికాంశాల వైపు ఎలా మళ్లించాలి? సవాలుగా మారిన ఈ బృహత్కార్యాన్ని, బాధ్యతని సమర్థవంతంగా, అవిరామంగా ఎలా నిర్వహించాలి?

ఈ రెండు ప్రశ్నలకూ ఈ సంకలనంలో జవాబులు పుష్కలంగా దొరుకుతాయి. స్థూలంగా చెప్పుకోవాలంటే, మార్పును కోరే రచయితలు - ముఖ్యంగా జనరంజక మాధ్యమాల్లో అయితే - మహా సున్నితంగా వ్యవహరించాలి. తమ ఆలోచనలను విరోధభావం లేకుండా, కుండబ్రద్దలు కొట్టినట్లు కాకుండా, స్నేహపూర్వకంగా ప్రతిపాదించాలి. తద్వారా తలెత్తే ప్రశ్నలు చర్చను మొదట్లోనే త్రుంచి వేయకుండా పెంచి పోషించేవిగా రూపుదిద్దుకోవాలి. ఈ రచనలన్నీ కూడా సామాన్యుల పక్షాన నిలబడి పాఠకులను ఆలోచింపజేస్తాయి. ప్రజాహితాన్ని కోరుకుంటూనే కొత్త కోణాలను ఆవిష్కరిస్తాయి. ఈ పనిని అవి ఎంతో సున్నితంగా, మనుషుల పట్ల ప్రేమతో, సంఘం పట్ల నిష్ఠతో, అలాగే పర్యావరణం పట్ల శ్రద్ధతో చేశాయి. ప్రతి రచనలోనూ కనీసం ఒకటో రెండో గుర్తుంచుకోవలసిన వాక్యాలూ, ఆగి ఆలోచించాల్సిన సందర్భాలూ కనిపిస్తాయి. మరోవైపు

ప్రజాకంటకుల్ని, దుర్మార్గుల్ని, అవినీతిపరుల్ని అవకాశం దొరికినప్పుడల్లా నిర్దాక్షిణ్యంగా మాటల కొరడాతో చావగొడతాయి. అలాగని ఈ రచనల్లో ఎక్కడా సైద్ధాంతిక చర్చలు లేవు. వ్యంగ్యం మితిమీరలేదు; హాస్యం వికటించలేదు; చురకలే గాని వాతల్లేవు. ఈ రచనలన్నీ కూడా ఒక చిరకాల మిత్రురాలు తమతో ప్రత్యక్షంగా సంభాషిస్తున్న అనుభూతిని పాఠకులకు కలిగిస్తాయి. ఇక్కడున్నవన్నీ ఏకపక్ష తీర్మానాలకు, అంతిమ పరిష్కారాలకు దూరంగా నడయాడే ప్రజాస్వామిక ప్రతిపాదనలు.

భాషను ఏకకాలంలో పొదుపుగానూ, సమర్థవంతంగానూ వినియోగించగల రచయిత్రి నేర్పును గమనిస్తే ఈ సంకలనం యువ పాత్రికేయులకూ, మంచి తెలుగు రాయాలనుకొనేవారికీ కరదీపిక కాగలదనిపిస్తుంది. అలాగే చెల్లాచెదురు వార్తా శకలాలను అర్థవంతంగా అతికించడానికి ప్రయత్నించే విశ్లేషకులకు మార్గదర్శకం కాగలదు. నూతన ఇతివృత్తాలనూ, శిల్పంలో మెళకువలనూ నిత్యం అన్వేషించే కథా రచయితల కోసం కొత్త కిటికీలను తెరవగలదు.

మీ ముందున్నది జీవితం నుండి, సమాజం నుండి నిత్యం నేర్చుకుంటూనే ఉండాలని తెలియజెప్పే ఆధునిక పంచతంత్ర కథల సమాహారం, మన కాలపు పెద్దబాలశిక్ష. ఏ పుటనైనా తెరవండి. ఏ వ్యాఖ్యనైనా చదవండి. మధ్యమధ్యలో పుస్తకాన్ని మూసి కాసేపు ఆలోచించండి. మళ్లీ ముందుకి సాగండి.

3 జూలై 2018 **ఉణుదుర్తి సుధాకర్**

హైదరాబాదు

## ‘కామెంట’రీ


| | | |
|---|---|---|
| | ఆదివారం వ్యాఖ్యలు - చైతన్యపు చిరుజల్లులు | 9 |
| 1. | ఉయ్ మస్ట్ బి క్రేజీ | 17 |
| 2. | తోటలోన పూవు ఒకటి | 19 |
| 3. | దారి ఇవ్వరూ... | 21 |
| 4. | రూంబా | 23 |
| 5. | చదువు మాంద్యం | 25 |
| 6. | ఏడీ? | 27 |
| 7. | ‘గుంపు’ విద్య | 29 |
| 8. | అడవి కల | 31 |
| 9. | మీమాంస | 33 |
| 10. | ఔరా ... | 35 |
| 11. | ఎలుక - ఏనుగు | 37 |
| 12. | ఫ్యూచర్ టెన్స్ | 39 |
| 13. | కొత్త నాన్నలకు స్వాగతం | 41 |
| 14. | కన్సల్టెంట్లు కావాలోచ్! | 43 |
| 15. | ఆకుపచ్చ భాష | 45 |
| 16. | ‘అసలు’ ఎంత కష్టం | 47 |
| 17. | సాగర విలాపం | 49 |
| 18. | ఈజీగా పళ్ళు నూరుకోవడమెలా! | 51 |
| 19. | మాయావి | 53 |
| 20. | వాళ్ళతో మనకేం పని... | 55 |
| 21. | చెప్తేనేం .... | 57 |
| 22. | తారుమారు | 59 |

| | | |
|---|---|---|
| 23. | వైకల్య సౌందర్యం | 61 |
| 24. | అబ్బో... మన దగ్గర కుదరదు | 63 |
| 25. | గాంధీగారు బతికుంటే... | 65 |
| 26. | అంకెలూ అంకెలూ ఎందుకమ్మా అలిగారు? | 67 |
| 27. | ఇప్పుడింతే | 69 |
| 28. | లాభం$^{2}$ | 71 |
| 29. | ఇట్లు... | 73 |
| 30. | గుంతలే కాని ఇంకుడు గుంతలు కావు | 75 |
| 31. | తప్పోత్సవాలు | 77 |
| 32. | గెలుపోటములు | 79 |
| 33. | ఫామో'పీడి'యా (Formopedia) | 81 |
| 34. | తాత ముత్తాతల తరపున.... | 83 |
| 35. | వృక్ష విలాసం | 85 |
| 36. | నెమలికన్ను ప్రయాణాలు | 87 |
| 37. | పిల్లా... నా వల్ల కాదు | 89 |
| 38. | 'ఆదా'యం | 91 |
| 39. | ఒక నిజం కథ | 93 |
| 40. | ఇదా ప్రిస్క్రిప్షన్! | 95 |
| 41. | ఈసారి ఛాన్స్ వాళ్ళకిద్దాం | 97 |
| 42. | మా ఊరి మామిడి చేదు | 99 |
| 43. | జాకీ ఎందుకు రాలేదబ్బా! | 101 |
| 44. | ...అడుగుతూనే ఉంటారు | 103 |
| 45. | మనిషి ఆజ్ఞ లేనిదే... | 105 |
| 46. | అవంటే ఎందుకు అలుసు? | 107 |
| 47. | దీని పేరేంటో! | 109 |
| 48. | ఈ పౌరుడు బుద్ధిమంతుడు | 111 |
| 49. | అసంపూర్ణ తత్వాలు | 113 |
| 50. | కడుపులో దాచుకోకండి | 115 |

| | | |
|---|---|---|
| 51. | జోడీ నెంబర్ ఎక్స్ | 117 |
| 52. | అర్థాలు మార్చండి | 119 |
| 53. | ఆజన్మాంతం కృతజ్ఞుడ్ని | 121 |
| 54. | ఇదే అదృష్టం | 123 |
| 55. | జల జాబిల్లి | 125 |
| 56. | ఏకవాక్య అల్లర్లు | 127 |
| 57. | ఏ మాటకా మాటే | 129 |
| 58. | ఒక షార్కు ... తాజా చేపలూ | 131 |
| 59. | కంటి తెలివి | 133 |
| 60. | ఒక శ్రీకాకుళం లెక్క | 135 |
| 61. | 'సూక్ష్మ' రహస్యాలు | 137 |
| 62. | సెన్స్**Y** | 139 |
| 63. | బే'జారు' | 141 |
| 64. | సత్యంతో ఇంటర్వ్యూ | 143 |
| 65. | అబ్బా... ఎంత సహజం! | 145 |
| 66. | రెండు ఉన్మాదాలు | 147 |
| 67. | అవి-నీతి కథలు | 149 |
| 68. | ఇనుమూ నీవెంత బంగారానివే | 151 |
| 69. | మాతృభాషాభిమానం | 153 |
| 70. | నరకగల వారెవరు? | 155 |
| 71. | ఆ పుణ్యమూ మీరే కట్టుకోరూ.. | 157 |
| 72. | కథలు చెప్పొద్దే అమ్మా! | 159 |
| 73. | అవలోకనం | 161 |
| 74. | డామిట్ ... కథ అడ్డం తిరగదా! | 163 |
| 75. | మంచివాళ్ళ సభలు | 165 |
| 76. | పాపం.. కాలం ఏం చెబుతుంది? | 167 |
| 77. | వెనకడుగులు | 169 |
| 78. | ఆశ్చర్యమాశ్చర్యమాయనే! | 171 |

| | | |
|---|---|---|
| 79. | ఆ ఒక్కటీ అడక్కు | 173 |
| 80. | ఎంతెంత దూరం... | 175 |
| 81. | 'చెత్త' ఆలోచనలు | 177 |
| 82. | కళ్ళు...కథాకమామీషు! | 179 |
| 83. | చెప్పొచ్చేదేమంటే... | 181 |
| 84. | మన్మోహన్‌కో సిక్సర్ | 183 |
| 85. | రావమ్మా.. కాళ్ళొదిలి రావమ్మా! | 185 |
| 86. | ఈ కథలూ కంచికేనా! | 187 |
| 87. | అనగనగా ఒక రైతు | 189 |
| 88. | కాకి...ఓ ఉద్గ్రంథం | 191 |
| 89. | ప్రయాణమూ ఒక పండగే | 193 |
| 90. | అదేనా అసలు సమస్య | 195 |
| 91. | అంతర్యామికీ అలుపొచ్చింది | 197 |
| 92. | బియ్యపుగింజ తలపోత | 199 |
| 93. | రసమా...రసాయనమా? | 201 |
| 94. | దారి మరిచిన తేనెటీగలు | 203 |
| 95. | చీమ దరఖాస్తు | 205 |
| 96. | హాచ్.. ఇదేం జబ్బో చెప్పండి | 207 |
| 97. | హైless సింద్రోమ్ | 209 |
| 98. | అవ్వా... రాజెప్పుడొస్తాడే! | 211 |
| 99. | ఎవరు మేలంటారు? | 213 |
| 100. | విలేఖరికో విన్నపం | 215 |
| 101. | ఎంత నిర్భయంగా బతుకుతున్నాం.. | 217 |
| 102. | అనాగరిక ఒత్తిడి | 219 |
| 103. | ప్రశ్న... జవాబు | 221 |
| 104. | మనిషి డైరీలో ఒక పేజీ | 223 |
| | కొన్ని వివరణలూ... కొన్ని కృతజ్ఞతలూ | 225 |

# ఉయ్ మస్ట్ బి క్రేజీ

ఇరవై ఏళ్ళ కిందటి కథ ఇది.

హెలికాప్టర్‌లో పోతూ ఒక అమెరికన్ తాగేసిన ఒక ఖాళీ కూల్‌డ్రింక్ బాటిల్‌ను కిందికి విసిరేస్తాడు.

అది ఆఫ్రికాలోని ఒక ఆదివాసి గూడెం మధ్య పడుతుంది. దేవుడు ఏదో బహుమతి పంపించాడని అందరూ ఆశ్చర్యంగా దాని వంక చూస్తారు. తర్వాత దానితో చేయదగ్గ పనులేమిటా అని చూస్తారు. పిల్లలు బంతాట ఆడుకోవాలని చూస్తారు. ఆడవాళ్ళు దానితో పచ్చడి నూరడానికి ప్రయత్నిస్తారు. ఒక పెద్దాయన వీపు గోక్కోవడానికి కూడా ప్రయత్నించినట్టు జ్ఞాపకం.

ఎవరికి వాళ్ళు దానితో ఏదో ఒకటి చేయాలనుకోవడంతో వాళ్ళ మధ్య తగువులు, కొట్లాటలు వస్తాయి. దేవుడేమిటి ఇలాంటి వస్తువు పంపాడు అని బాధపడతారు. చాలా ఆలోచించాక బహుశా ఇది దేవుడు పంపింది కాదేమో అనుకుని తమ మధ్య గొడవలు తీసుకువస్తున్న ఆ బాటిల్‌ను ఎక్కడైనా దూ.... రంగా పారేయాలని నిర్ణయించుకుంటారు.

గూడెంపెద్ద ఆ బాటిల్ పట్టుకుని బయల్దేరతాడు. కొండలు కోనలు అడవులు ఎడారులు దాటి వెళుతూనే ఉంటాడు. ఎన్ని చోట్ల దాన్ని వదిలేసి వచ్చినా అది మళ్ళీ మళ్ళీ ఆయన దగ్గరకే తిరిగి వస్తూ ఉంటుంది. ఆ గోచీపాతరాయుడి పాట్లు చూసి మనకెంత నవ్వొస్తుందో!

వెధవ బాటిల్ కోసం ఇంత కష్టమేమిటని విసుగొస్తుంటుంది కూడా. కాని అతను మాత్రం అమాయకంగా అలా ఇంకా దూరం... ఇంకా దూరం వెళుతూనే ఉంటాడు.

* * *

ఇది ఒక సినిమా కథ. దాని పేరు 'గాడ్స్ మస్ట్ బి క్రేజీ'. మన రాష్ట్రంలో కూడా చాలా రోజులు ఆడింది. తెలిసో తెలియకో ఆ ఆదివాసి ఆ రోజే మనల్ని హెచ్చరించేందుకు ప్రయత్నించాడు. ఖాళీ కూల్‌డ్రింక్ బాటిల్‌ను పారేయడానికే అతను అంత దూరం వెళ్ళినప్పుడు నిండు కూల్‌డ్రింక్ బాటిల్స్ విషయంలో మనం ఇంకెంత దూరం వెళ్ళాలి?

*17 ఆగస్టు 2003*

# తోటలోన పూవు ఒకటి

పాత పెంకుటిల్లు. గేటు తీసుకుని లోపలికి వెళితే రకరకాల పూలమొక్కలు. వరస, పొందిక ఏమీ లేవు. అక్కడొకటి అక్కడొకటి సౌందర్య తపస్సు చేస్తున్నట్టున్నాయి. వాటన్నిటి మధ్యా ఒకే ఒక గులాబీ మొక్క. ఆ ఇంట్లోని ఆడపిల్ల రోజుకు ఎన్నిసార్లు చూస్తుందో దాని వంక. భలే మురిపెం ఆ పిల్లకు దానిని చూస్తే.

లేచీ లేవగానే దాని దగ్గరికే పరిగెత్తుకు వెళుతుంది. రాత్రి కురిసిన మంచు బిందువుల్ని దులిపేసి, ఎండిన ఆకులుంటే గిల్లేసి, ఎన్ని మొగ్గలున్నాయో లెక్కేసుకుని, పూసిన పువ్వు వంక ఆరాధనగా చూస్తూ చాలాసేపు నిలబడేది. ఆ ఊర్లో అదొక్కటే ఎర్ర గులాబీ. సాయంత్రం స్కూల్ నుంచి వచ్చేటప్పుడు ఆ అమ్మాయి ఫ్రెండ్సుందరూ కూడా ఆగి చూసి వెళ్ళేవాళ్ళు. ఎప్పుడైనా ఒక పువ్వు టీచర్ కిస్తే ఆ రోజంతా వాళ్ళు ఆమె వెనకాలే తిరిగే వాళ్ళు.

పాప పెద్దయి సిటీకి వచ్చింది. అక్కడ మన పబ్లిక్ గార్డెన్ అంత పెద్ద తోట నొకదాన్ని చూసింది. దాంట్లో ఒక ఎకరా నిండా గులాబీ మొక్కలే. ఎరుపు తెలుపు పసుపు ఎన్నెన్నో

రంగులు. తనింట్లో పువ్వుల్లా చిన్నగా, అమాయకంగా లేవవి. తామర పువ్వుల్లా విచ్చుకుని ఆకాశం వంక ధీమాగా చూస్తున్నాయి. కాని ఆ అమ్మాయికి వాటిని చూస్తే సంతోషంగా ఏమీ అనిపించలేదు. పైపెచ్చు లోపల్నించి దుఃఖం పొంగుకొచ్చింది. వెక్కి వెక్కి ఏడ్చింది. తోడొచ్చిన స్నేహితురాలు ఆశ్చర్యపోయింది. గులాబీలంటే నీకు ఇష్టమని ఇక్కడికి తీసుకొస్తే నువ్వేంటి ఇలా ఏడుస్తున్నావు అని అడిగింది.

'నాకేం తెలుసు లోకంలో ఇన్ని గులాబీలు ఉంటాయని? మరి నా గులాబీ ప్రత్యేకత ఏమిటి? ఇన్నాళ్ళూ దాన్ని నేనెంత అపురూపంగా చూసుకున్నాను. అదంతా వృథాయేనా' అని ఆ అమ్మాయి తన దుఃఖాన్ని వెళ్ళబోసుకుంది.

తోటమాలి అంతా విని 'పిచ్చిపిల్లా. లోకంలో ఎన్ని గులాబీలుంటేనేం నీ గులాబీ నీకు ప్రత్యేకమే. ఈ గులాబీలను నువ్వు దూరం నుంచి చూసి ఆనందపడగలవే కాని వాటిని ముట్టుకోగలవా! వాటి వాసనను మనసంతా నింపుకోగలవా! ఈ గులాబీలకు ఏమైనా అయితే నీ గుండె గాయపడుతుందా! నీకు అపురూపం అవడంలోనే ఉంది నీ గులాబీ ప్రత్యేకత. దానిమీద నువ్వు పెట్టిన శ్రద్ధ, వెచ్చించిన సమయం, దానితో నీ జ్ఞాపకాలు అవే ముఖ్యం. ఇక్కడున్న గులాబీలతో ఎవరికీ అటువంటి అనుబంధం లేదు. నీ గులాబీకున్న అదృష్టం వీటికెక్కడిది?' అని ఓదార్చి పంపించాడు. మెరుస్తున్న కళ్ళతో వెనుదిరిగిందా అమ్మాయి.

*21 సెప్టెంబరు 2003*

# దారి ఇవ్వరూ...

సాయంత్రం ఆరుగంటల సమయం.

హైదరాబాద్‌లోని అబిడ్స్ రోడ్డు కిక్కిరిసి ఉంది. వందలాది వాహనాలు. వాటి మధ్య ఒక తెల్ల వ్యాను.

డ్రైవరు అదే పనిగా సైరన్ మోగిస్తున్నాడు.

కార్లలో, స్కూటర్లలో వెనక కూర్చున్న ప్రయాణీకులు ఉలిక్కిపడి ఒక్క క్షణం తలతిప్పి దానివంక చూస్తున్నారు. డ్రైవర్లకు ఆ వెసులుబాటు కూడా లేదు.

సైరన్ మోత పెరిగింది. లేక అదే పనిగా వినడం వల్ల అలా అనిపించిందో. ఆ శబ్దంలో ఒక అర్జెన్సీ ఉంది. తక్షణం దారి ఇవ్వమనే డిమాండ్ ఉంది. మీవి బతుకు సమస్యలైతే నాది చావుబతుకుల సమస్య, గుర్తించండిరా బాబూ అనే ఆక్రోశం ఉంది. అయినా ఎవరూ దారి ఇవ్వలేదు. ఇవ్వడానికి అక్కడ దారీ లేదు.

అది ఒక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వారి అంబులెన్స్ వ్యాను. అంబులెన్స్ అనే ఇంగ్లీషు అక్షరాలు ఎర్రరంగులో తిరగేసి రాసి ఉన్నాయి దాని ముందుపక్క. మిగతా మూడు పక్కలా కూడా కాపిటల్స్‌లో అవే అక్షరాలు.

అరగంట క్రితం గుండెపోటు వచ్చిన మనిషి  అందులో వెళుతున్నాడేమో. లేక రోడ్డు ప్రమాదంలో తల పగిలిన ఒక అభాగ్యురాలిని రక్షించడానికే వాళ్ళంత హడావుడి పడుతున్నారేమో. ఒక నిమిషం ముందుగా వైద్య సదుపాయం అందినా బతకొచ్చని లోపల ఆమె చెయ్యి పట్టుకుని కూర్చున్నవాళ్ళు ఎంత ఆరాటపడుతున్నారో.

ఇవేమీ మనకు తెలియదు కాని ఊహించగలం. ఎప్పుడోసారి అటువంటి అనుభవం మనకూ అయ్యుంటుంది. లేదా విననైనా విని ఉంటాం.

ఒక్కరి వల్ల ఏమవుతుందనుకుంటాం.
నిజమే ఒక్కరి వల్ల ఏమీ కాదు.
అందరం తలచుకుంటే మాత్రం అవుతుంది.

ఎన్నిసార్లు మనం రాష్ట్రపతికి దారి ఇవ్వడం లేదు! ప్రధానమంత్రికి ఇవ్వడం లేదు! గవర్నరుకు, ముఖ్యమంత్రికి, జడ్జీలకు ఎందరికో రోజూ ఎన్ని అర్జెంట్ పనులున్నా ఆగి దారి ఇస్తున్నామే... మరి ప్రాణం మీదికి వచ్చిన మనిషికి ఎందుకు ఇవ్వలేకపోతున్నాం?

పోలీసులు వాకీటాకీలలో మాట్లాడి ముందుగానే ట్రాఫిక్‌ను ఎక్కడికక్కడ ఆపేసి వాళ్ళందరికీ దారి కల్పించినట్లే వీళ్ళకోసమూ చేయాలి. ప్రతి అంబులెన్స్‌కూ కాకపోయినా ప్రాణాంతక రోగుల్ని తీసుకెళుతున్న అంబులెన్స్‌లకైనా తక్షణమే దారి కల్పించాలి. అటువంటి వారిని తీసుకెళుతున్న వ్యాన్‌లకు ప్రత్యేక సైరన్ శబ్దం కేటాయించి, అది  వినబడగానే ట్రాఫిక్‌ను నియంత్రించే ఏర్పాటు చేయాలి.

భయంతోనో భక్తితోనో ఇంతమందికి దారి ఇచ్చే జనం మానవత్వం కోసం ఎందుకివ్వరు? తప్పకుండా ఇస్తారు.

*22 ఫిబ్రవరి 2004*

❋ అంబులెన్స్‌లకు ఇప్పటికీ ఫ్రీ వే ఇవ్వడం లేదు కాని గుండె, కాలేయం మార్పిడి కేసులలో మాత్రం పోలీసులు ఈ పద్ధతి పాటిస్తున్నారు.

# రూంబా

ఇది ఒక మరమనిషి పేరు.

ఇల్లంతా తిరిగి శుభ్రం చేస్తుంది. దానికి దుమ్ము ఎక్కడుందో చెప్పక్కరలేదు. బూజు ఎక్కడుందో చూపెట్టక్కరలేదు. మీట నొక్కితే చాలు అదే అన్ని చోట్లకూ తిరిగి పనంతా చేసు కొచ్చేస్తుందట.

రూంబా బహుశా ప్రతి ఇల్లాలికీ ప్రతి రాత్రీ వచ్చే ఓ అద్భుతమైన కల.

వాళ్ళకొచ్చే కలలు ఇంకా చాలా ఉన్నాయి.

కూరలన్నీ ముందేస్తే చచ్చులూ పుచ్చులూ ఏరుకుని కడిగి కావల్సిన సైజులో కోసుకుని, ఏ పద్ధతిలో వండమంటే ఆ పద్ధతిలో వండే మరో రూంబా...

ఇంట్లో ఏమేం సరుకులు అయిపోయాయో చూసుకుని లిస్టు రాసి వీలైతే ఫోన్ మీద తెప్పించి డబ్బాల్లో సర్దేసే మరో రూంబా...

పిల్లలకు ఏం హోంవర్క్ ఉందో చూసి, బతిమాలో భయపెట్టో అదంతా పూర్తి చేయించి ఎక్కడి పుస్తకాలు అక్కడ సర్దిపెట్టే మరో రూంబా....

అబ్బో చెప్పాలంటే చాలానే ఉన్నాయి.

కాని వీటిని తయారుచేసే వాళ్ళ ప్రాధాన్యతలు వేరే ఉన్నాయి.

వృద్ధుల బాగోగుల్ని చూసే మరమనుషులను, సర్జరీలో డాక్టర్లకు సహాయం చేసే మరమనుషులను, గనుల్లోకి వెళ్ళి భద్రతను తనిఖీ చేసే మరమనుషులను, భూగర్భ డ్రైనేజీలోకి దూరి చెత్తా చెదారాన్ని తీసేసే మరమనుషులను... ఇలా ముఖ్యమైన, మనుషులకు పని తగ్గించే, ప్రమాదాల్ని నివారించే మరమనుషుల డిజైన్‌లో వాళ్ళు తలమునకలుగా ఉన్నారు.

వాటితోపాటు కాస్త ఖాళీ ఉన్నప్పుడు ఆడవాళ్ళకు సాయం చేసే మరికొన్ని రకాల రూంబాలను కూడా తయారుచేస్తే బాగుండు! లేదా ఇంటి మగాళ్ళే ఆ సాయం చేసేలా వారి మెదళ్ళలో ప్రోగ్రామింగ్‌ను మార్చినా సరే.

*20 జూన్ 2004*

# చదువు మాంద్యం

బాగా చదువుకున్న పండితుడు ఒకాయన ఒక రోజు నూనె గానుగ దగ్గరికి వెళ్ళాడు.

నువ్వులు ఆడించే గానుగ అది.

అప్పుడే కూర తిరగమోత పెట్టినట్టు కమ్మటి వాసన వస్తోంది.

ఒక ఎద్దు తప్ప ఎవరూ కనిపించలేదు.

దాని మెడలోని గంట శబ్దం తప్ప ఇంకే అలికిడీ లేదు.

వచ్చిన పెద్దాయన చుట్టూ చూసి 'రామయ్యా' అని గట్టిగా పిలిచాడు.

గానుగ యజమాని గుడిసెలో నుంచి పరిగెత్తుకుంటూ వచ్చాడు.

నూనె కొన్న తర్వాత పండితుడు అతడ్ని అడిగాడు. ఎప్పుడొచ్చినా ఉండవు, అయినా పని నడుస్తూ ఉంటుంది ఎలా... అని.

ఎద్దు మెడలో గంట కట్టింది అందుకే కదయ్యా. గంట శబ్దం వినబడుతున్నంత సేపూ ఎద్దు తిరుగుతున్నట్టే, పని నడుస్తున్నట్టే. అది ఆగినప్పుడు నిద్రలో ఉన్నా తెలుస్తుంది. లేచి పరిగెత్తుకొచ్చి కాస్త పచ్చగడ్డేసి, నీళ్ళు పెట్టి మెడ నిమిరి,

అది మళ్ళీ నడవడం మొదలుపెట్టాక నేనెళ్ళి నా పని చూసుకుంటా... అన్నాడు రామయ్య.

పండితుడికి అనుమానం తీరలేదు.

ఎద్దు ఒకే చోట నిలబడి కదలకుండా తల మాత్రం ఆడిస్తుంటే నీకు గంట శబ్దం వినబడుతుంది కాని పని సాగదు కదా... అప్పుడెలా? అన్నాడు.

తన ఎద్దు అలా చెయ్యదని రామయ్య నమ్మకంగా చెప్పాడు.

ఎలా చెప్పగలవు అని పండితుడు సమాధానం కోసం పట్టుపట్టాడు.

అది మీలాగా చదువుకున్నది కాదయ్యా. దానికా ఆలోచనే రాదు ... అన్నాడు రామయ్య.

రైతులు నిజంగా అప్పుల వల్లే ఆత్మహత్యలు చేసుకుంటున్నారా? లేక ప్రభుత్వం ఇచ్చే పరిహారం కోసం చేసుకుంటున్నారా అని రైతులు కాని వాళ్ళంతా అనుమానాలు వ్యక్తం చేయడం విన్నప్పుడు ఈ కథ గుర్తొచ్చింది.

*18 జూలై 2004*

# ఏడీ?

భూమిని సృష్టించినప్పుడు దేవుడు భలే గర్వంగా ఫీలయ్యాడట.

అమీబా నుంచి మనిషి వరకు ఎవరికీ ఏ లోటూ లేకుండా చెట్టూ చేమా, పాడీ పంటా అన్నీ సృష్టించేశాను. ఇక అందరూ ఎవరి పాటికి వాళ్ళు ఆనందంగా బతకొచ్చని ఆయన తన పాటికి తాను విశ్వ పర్యటనకు బయల్దేరి పోయాడట.

మైదాన ప్రాంతాల వాళ్ళకి తనతో ఎక్కువ పనేం ఉంటుందని కొండలు, గుట్టల మీద మాత్రం తన ఏజెంట్లని పెట్టి వెళ్ళాడట.

కలియుగం మధ్యలో తిరిగొస్తూ ఏజెంట్లని పలకరిస్తే 'మహాప్రభో! మా దగ్గర మీకివ్వమని ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. గుడి బయట కనబడుతున్న క్యూలు కూడా అందుకే. ఏం చేయమంటారు స్వామీ' అని అడిగారట వాళ్ళు.

దేవుడు మాత్రం ఏం చెప్పగలడు?

'నేనేదైనా ఒక్కసారే చేస్తాను. తర్వాతి పరిణామాలకు నేను

బాధ్యుడ్ని కాను. దయచేసి వాళ్ళెవర్నీ నా దగ్గరకు పంపొద్దు. నేను ఎక్కడుందీ కూడా వాళ్ళకు చెప్పొద్దు' అని హడావుడిగా బయల్దేరబోయాడట.

'ఎక్కడికి వెళతారు స్వామీ? ఒక్కో దేశంలో కోట్ల మంది మనుషులు జీవిస్తుండగా మీరు ఎవరి కంటా పడకుండా ఎలా తప్పించుకోగలరు' అని వాళ్ళు దేవుడి స్పీడ్‌కు బ్రేక్ వేశారు.

'మీరే చెప్పండి ఎక్కడ దాక్కోమంటారో' అని దేవుడు వాళ్ళ వంక ప్రాధేయ పూర్వకంగా చూశాడు.

ఏజెంట్లందరూ కూడబలుక్కుని 'ఒకే ఒక చోటుంది. వెంటనే ఎవరి కంటా పడకుండా వెళ్ళి మనిషి హృదయంలో దాక్కోండి' అని సలహా ఇచ్చారు.

'అదేమిటయ్యా నేరుగా పులి గుహలోకి వెళ్ళమంటారు' అని దేవుడు దిక్కుతోచక నిలబడితే 'మా మాట నమ్మండి. అక్కడొక్క చోటే వాళ్ళు మీ కోసం వెతకరు. ధైర్యంగా వెళ్ళండి' అని పంపించారట వాళ్ళు.

* * *

నిజం.

వాళ్ళన్నట్టే ఎవరూ ఆయన్ని ఇంతవరకు కనిపెట్టలేదు.

కట్టుకున్న భార్యను కుక్కల బోనులో పెట్టడం, కన్న కొడుకులే తల్లిదండ్రులను హతమార్చడం ఇవన్నీ దానికి నిదర్శనాలే.

ఇదివరకు ఇంట్లో కన్నీళ్లూ, బయట నెత్తురూ ప్రవహించేవి. ఇప్పుడు లోపలా బయటా రెండూ ప్రవహిస్తున్నాయి.

*25 జూలై 2004*

# 'గుంపు' విద్య

ప్రతి ఏడాదీ ఏదో ఒక నదికి పుష్కరం. మరో నదికి అంత్య పుష్కరం. మరీ పెద్ద నదికి కుంభమేళా.

సంవత్సరమంతా ఏదో ఒక దేవుడికి కళ్యాణం లేదా బ్రహ్మోత్సవం లేదా తెప్పోత్సవం.

చిన్న దేవుళ్ళకయితే జాతర్లు, తిరునాళ్ళు.

మరీ పెద్ద దేవుళ్ళకయితే రథయాత్రలు.

ఈ మధ్య నగల నుంచి చెప్పుల దాకా అన్ని వస్తువులూ ఊరూరా ఎగ్జిబిషన్లు జరుపుకుంటున్నాయి.

కొత్తగా జిల్లాలు సైతం పండగలు చేసుకుంటున్నాయి.

ఎలాగూ ఐదేళ్ళకు ఒకసారి ఎన్నికలొస్తాయి. నెలా, రెండు నెలల ముందు నుంచి ఆసేతు హిమాచలం భారీ బహిరంగ సభలు తప్పవు.

ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయమూ ఎవరో ఒకరికి అసంతృప్తి కలిగించక మానదు. కాబట్టి వీధుల్లో నిత్యం ధర్నాలు, ఊరేగింపులు జరుగుతూనే ఉంటాయి.

ఇవన్నీ జనాన్ని వీధుల్లోకి తెచ్చేవే.

కాకపోతే వీటి గురించి ఎంతో కొంత ముందుగానే తెలుస్తుంది.

చెప్పా పెట్టకుండా జనం ఒక్కసారిగా కదిలి వెళ్ళాల్సిన సందర్భాలు కూడా మన భరతఖండంలో చాలా ఎక్కువే. వరదలు, ఉప్పెనలు, కరువులు, కలహాలు సంభవించినప్పుడు క్షణాల్లో లక్షల మందిని తరలించాల్సి వస్తుంది.

అంటే గుంపులను క్రమబద్ధీకరించాల్సిన అవసరం మన దేశంలో చాలా ఉంది. అదొక విద్య. పోలీసులు ఒక్కరే చేయగలిగింది కాదు. అప్పటికప్పుడు డిప్యుటేషన్ మీద వెళ్ళినవాడు చేయగలిగిన పని అసలే కాదు. చాలా శిక్షణ అవసరం. నాలుగు పుష్కరాలు చూసి నేర్చుకునే దాకా ఆగగలిగిన వ్యవహారం కాదు.

వేలల్లో, లక్షల్లో మనుషులు ఒకచోట గుమిగూడినప్పుడు వాళ్ళ అవసరాలు, ప్రవర్తన, మనస్తత్వం, రాగల ప్రమాదాలు మొదలైనవన్నీ ఊహించగల స్టడీలు, కోర్సులు అవసరం. వడ్డనకు, పూల అలంకరణకు కూడా కోర్సులున్నప్పుడు దీనికి ఎందుకు ఒక ప్రత్యేక కోర్సు పెట్టరు?

5 సెప్టెంబరు 2004

* *గోదావరి పుష్కరాలప్పుడు రాజమండ్రి దగ్గర తొక్కిసలాట జరిగి అనేకమంది మరణించిన సందర్భంలో రాసినది.*

# అడవి కల

ఆకుపచ్చ నేలలు ... ఆకాశాన్నంటే చెట్లు ... సెలయేళ్ళ గలగలలు. అబ్బ... అడవి ఎంత అందంగా ఉంటుంది.

⁂

ఆదివాసులు ఎంత అమాయకులు. బోలెడు గాజులు పూసలతో చూడడానికి ఎంత చక్కగా ఉంటారు. కాని ఎన్నాళ్ళలా వెనకబడి ఉంటారు చదువు సంధ్యలు లేకుండా? ఎల్లకాలం వాళ్ళలా అనాగరికంగా ఉండడం ఏం న్యాయం అసలు? ఆ అడవులు గుట్టలు వదిలేసి ... వేటా పోడూ వదిలేసి... వాళ్ళూ మనలా కూలో నాలో చేసుకుని బతకొచ్చు కదా !

అవున్నిజమే.

నక్సలైట్లు మహా దుర్మార్గులు. యూనిఫారాలు వేసుకుని ఆయుధాలు పట్టుకు తిరుగుతుంటే పాపం ఆదివాసులు ముక్కోటి దేవతల్లో వాళ్ళూ ఒకళ్ళనుకుంటున్నారు. చాలా తప్పు. బుద్ధుడు పుట్టిన దేశం మనది. మహాత్ముడు నడిచిన నేల ఇది. ప్రజాస్వామ్యంలో తీవ్రవాదానికి చోటు లేదు.

అన్ని సమస్యల్నీ చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలి. అయినా కలపకు, ఖనిజాలకు, ఔషధాలకు నిలయాలైన అడవుల్లో నక్సలైట్లు స్థావరాలు ఏర్పరచుకోవడమేమిటి? అభివృద్ధికి అడ్డుపడే వాళ్ళను చరిత్ర క్షమించదు. వాళ్ళు వెంటనే అడవుల్ని ఖాళీ చేసి జనజీవన స్రవంతిలోకి రావాలి.

అవున్నిజమే.

అడవి దొంగలు పరమ నీచులు. తల్లిలాంటి అడవిని వాళ్ళు దోచుకు తినడమేమిటి? దంతాల కోసం ఏనుగుల్ని, అడ్డుకున్నందుకు మనుషుల్ని చంపడం చాలా కిరాతకం. ఏ నాగరిక సమాజమూ దీన్ని సహించలేదు. పెద్ద పెద్ద మీసాలు పెంచినంత మాత్రాన ఇక్కడ భయపడే వాళ్ళెవరూ లేరు. మర్యాదగా చెపితే విననప్పుడు కాల్చి చంపడం ఒకటే మార్గం.

అవున్నిజమే.

⁂ ⁂ ⁂

వీరప్పన్‌ను ప్రపంచబ్యాంకు చంపించిందంటే చాలామంది నవ్వారు. నిజమే... దానికి ప్రపంచబ్యాంకు ఎందుకు?

అడవులతో మన అవసరాలు పెరిగాయి.

మనకిప్పుడు మనుషుల్లేని అడవులు కావాలి.

ప్రశాంతమైన అడవులు కావాలి.

మన పిల్లాపాపా సాహసయాత్రలు చేయగల అడవులు కావాలి.

*7 నవంబర్ 2004*

# మీమాంస

ఒక నాటుకోడి బ్రాయిలర్ కోడిని చూసి ఇలా ఈర్ష్య పడింది.

...

నాలా గడ్డివాముల మీదా, ఇళ్ళ పైకప్పుల మీదా ఎక్కి పడుకోవాల్సిన అగత్యం లేదు దానికి. ఎండ... వాన... చలి దేనికీ భయపడాల్సిన పని లేదు. ముఖ్యంగా తిండికి, నీళ్ళకు వెతుక్కోనక్కరలేదు. దేనికీ ఇటు అడుగు తీసి అటు వేయనక్కరలేదు. వేకువ జామునే లేచి కొక్కొరోకో అని అరవాల్సిన అవసరమే లేదు. ఎల్లవేళలా తెల్లగా, స్వచ్ఛంగా, బలంగా, బొద్దుగా బతకొచ్చు. ఒక రోగం లేదు... రొష్టూ లేదు. ముందే అన్నిటికీ టీకాలు. అవసరమైతే డాక్టర్ ఫార్మ్‌కే వస్తాడు. అన్నిటికంటే పిల్లల్ని కని పెంచాల్సిన బాధ లేదు. కనీసం గుడ్లు పెట్టే కష్టం కూడా లేదు. చావు ఎవరికైనా తప్పదు కాని చచ్చే ముందు అది చూడండి ఎంత గ్రాండ్‌గా వ్యాన్‌లో వీధులన్నీ తిరుగుతూ వెళుతుందో! హు... నా బతుకూ ఉంది...!

ఒక బ్రాయిలర్ కోడి నాటుకోడిని చూసి ఇలా అసూయ పడింది.

సీతాకోక చిలుకల్లా ఎన్నేసి రంగులో దానికి. ప్రతి కోడికీ ఒక పేరు, గుర్తింపు. నాలా సర్వం పరిత్యజించినట్టు తెల్ల

రంగేసుకుని తిరగాల్సిన బాధ లేదు. ఊరిలో ఎక్కడ తిరిగినా దాన్ని అడిగేవాళ్ళు లేరు. నాలా ముప్పొద్దులా ఒకటే రకం తిండి తినాల్సిన ఖర్మ లేదు. హాయిగా చెట్లూ పుట్టలూ ఎక్కుతూ దిగుతూ లోకంలో ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. సాయంత్రమైతే ఇంటివాళ్ళు భొ.. భొ... అని ఎంతో ప్రేమగా దగ్గరకు పిలిచి గింజలు పెడతారు. పిల్లలకు అవంటే ఎంత ఇష్టం! ఎక్కడ కనబడ్డా వెంటపడి ఆడుతుంటారు. అన్నిటికంటే ముఖ్యంగా వాటికి అమ్మ ఉంటుంది. పిల్లలూ ఉంటారు. వారిని వెంటేసుకుని తిరుగుతూ, మంచీ చెడ్డా నేర్పుతూ బతకడంలో ఎంత ఆనందం ఉంటుంది. పైగా అన్ని కళల్లోనూ దాని ప్రస్తావన ఉంటుంది. పాటల్లో, బొమ్మల్లో, కథల్లో అన్నిట్లోను అది కనబడుతుంది. పౌరుషాన్ని పోల్చాలన్నా, అమ్మ ప్రేమను వర్ణించాలన్నా ముందు గుర్తుకొచ్చేది అదే. ఛీ ... కండలు పెంచడం తప్ప ఏముంది నా బతుకులో...?

* * *

ఇద్దరి ఆలోచనలోనూ నిజం ఉంది. ఇద్దరి వాదనలోనూ సత్యం ఉంది.

పల్లె పట్టణ జీవితాల మధ్య, ఆడంబర నిరాడంబరాల మధ్య, స్వదేశీ విదేశీ ఉద్యోగాల మధ్య, వివాహ అవివాహ జీవితాల మధ్య, స్వతంత్ర అస్వతంత్ర జీవితాల మధ్య... మరెన్నో విషయాలలో ఇలాంటి ఆలోచనలు వస్తుంటాయి మనందరికీ.

కొన్ని పొందడానికి కొన్ని పోగొట్టుకోక తప్పదని సరిపెట్టుకుందామా? లేక ఎవరితోనూ పోలిక పెట్టుకోకుండా ఉన్నదానితో తృప్తిపడదామా?

*14 నవంబర్ 2004*

# ఔరా ...

చాలా సమావేశాల్లాగే ఇదీ జెనీవాలో జరిగి ఉండొచ్చు.

ఆహార నిపుణులు, పౌష్టికాహార నిపుణులు, అర్ధ పౌష్టికాహార నిపుణులు, నిరాహార నిపుణులు ఇలా చాలామంది వచ్చారు ఆ సమావేశానికి.

అందరూ బృందాలు బృందాలుగా విడిపోయి కూర్చున్నారు. హోరాహోరీగా చర్చలు సాగుతున్నాయి.

ఎవరితో ఎవరూ ఏకీభవించడం లేదు.

మాంసాహారమే ఉత్తమమని మాంసాహారులూ, శాకాహారమే శ్రేష్టమని శాకాహారులూ ఒక రోజంతా వాదించుకున్నారు.

మనిషికి కనీసం లీటరు పాలు అవసరమని కొందరూ... అదేమోగాని లీటరు నీళ్ళు మాత్రం కచ్చితంగా అవసరమని మరికొందరు దెబ్బలాడుకున్నారు.

An apple a day keeps the doctor away అని యాపిల్ తోటలున్న దేశాలవాళ్ళూ, Banana is better than apple అని ఉష్ణమండల దేశాలవాళ్ళూ ఎడతెగకుండా చర్చించు కున్నారు.

హెవీ బ్రేక్‌ఫాస్ట్ బెటరా లేక హెవీ డిన్నర్ బెటరా అని ఒక బోర్డు పెట్టి దానికో పది కారణాలు, దీనికో పది కారణాలు చెపుతున్నారు ఇంకోచోట.

మా దేశాల్లోని మనుషులు బక్కగా ఉండడానికి కారణాలు కనిపెట్టాం.. కనీసం ఒక గంట వ్యవధి ఇస్తే చెపుతాం అని దక్షిణార్ధగోళం వాళ్ళు అరుస్తుంటే అది మీ ప్రాంతీయ సమస్య, మా సమస్య ఒబేసిటీ, దాని గురించి ముందు మాట్లాడండని అవతలి శిబిరం వాళ్ళు నిలదీస్తున్నారు.

సోయా మంచిదా వేరుశెనగ మంచిదా?

జొన్న, మొక్కజొన్నలలో ఏది బెటర్?

ఫ్రూట్స్ తిన్నాక మొలకెత్తిన విత్తనాలు తినాలా లేక రెండూ ఒకేసారి తినొచ్చా లేక రోజు మార్చి రోజు తినాలా?

అన్నట్టు కోడిగుడ్డులో తెలుపు మాత్రమే మంచిదంటున్నారు... పసుపును బయట పారేస్తే పర్యావరణానికి నష్టమేం లేదు కదా.

ఈలోగా ఏం తిన్నా పర్వాలేదు కాని తిన్న తర్వాత నడవడం ముఖ్యం అని వెనకాల కూర్చున్నాయన ఎవరో లేచి నడవడానికి వెళ్ళిపోయాడు.

* * *

మన సభల్లో లాగా అక్కడ శ్రోతలు ఎవరూ ఉండరు కాబట్టి ఎవరూ కంగారుపడడం లేదు. ఎవరి అభిప్రాయాలు వాళ్ళు చెప్పుకుంటూనే ఉన్నారు. త్వరలోనే ఇలాంటి అంతర్జాతీయ సమావేశం మరొకటి జరగాలనే విషయమై ఏకాభిప్రాయం కుదిరినట్టు చివర్లో ఒక ప్రకటన మాత్రం వెలువడింది.

*12 డిసెంబర్ 2004*

# ఎలుక - ఏనుగు

ఊర్లో కరువొచ్చి పంటలు పండకపోవడంతో ఒక ఎలుక బతుకుతెరువు వెతుక్కుంటూ పట్నం వెళ్ళింది. ఎప్పట్నించో అక్కడుంటున్న తమ ఊరి ఎలుక అడ్రసు ఒకటి పట్టుకుని వాళ్ళింటికి వెళ్ళింది. అది ఇల్లులా లేదు. ఇంద్రభవనంలా ఉంది. ఆ ఎలుక కూడా ఎలుకలా లేదు. ఏనుగులా ఉంది.

'ఏమిటి ఏమైనా జబ్బా?' అడిగింది ఊరి ఎలుక.

'ఏం లేదు... ఇక్కడ తిండే అంత' చెప్పింది నగర ఎలుక.

ఇద్దరూ కలిసి సాయంత్రం బయటికెళ్ళారు.

కార్ల నిండా ఎలుకలే. అన్నీ ఏనుగుల్లానే ఉన్నాయి.

'ఏమిటి ఏదైనా అంటువ్యాధా?' మళ్ళీ అడిగింది ఊరి ఎలుక ఉండబట్టలేక.

'ఊహూ... ఈ ఊరి నీళ్ళ తీరే అంత' చెప్పింది నగర ఎలుక.

ఒక్క పిల్లీ కనిపించకపోవడం ఊరి ఎలుకకి మరింత ఆశ్చర్యం గొలిపింది.

‘మీ ఊళ్ళో పిల్లులు ఉండవా?’ అడిగింది అది.

‘ఒకప్పుడుండేవి కాని ఎలుకలు ఏనుగుల్లా అయ్యాక పారిపోయాయవి. కొన్ని మాత్రం ఎలుకల్లా మారి ఎవరూ గుర్తుపట్టలేని విధంగా బతుకుతున్నాయి’ వివరించింది నగర ఎలుక.

‘ఎంత పని జరిగింది? జరిగిన నష్టం మీకెవరికీ అర్థమవుతున్నట్టు లేదే. ఎలుకలన్నీ ఏనుగుల్లా మారిపోతే ఎలుక జాతి ఏమవుతుంది? పిల్లులు పారిపోయాయని సంతోషిస్తున్నారు కాని తమ వేషంలో ఉన్న మిమ్మల్ని ఏనుగులు బతకనిస్తాయను కుంటున్నావా? పిల్లి నుంచి తప్పించుకోవడం మనకు తెలుసు కాని ఏనుగు నుంచి తప్పించుకోవడం మనకొచ్చా? మీరు చదువుకుని వచ్చి మమ్మల్ని ఉద్ధరిస్తారను కుంటే ఇదేమిటి ఇలా జాతి వినాశనానికి ఒడిగట్టారు?’ చాలా దుఃఖపడింది ఊరి ఎలుక.

‘ఊర్లలో మిగిలిన మా బోటి ఎలుకలే ఇక మన జాతికి గతి కాబోలు’ అనుకుంటూ హడావుడిగా ఊరు బయల్దేరి వెళ్ళిపోయింది.

*19 డిసెంబర్ 2004*

# ఫ్యూచర్ టెన్స్

ఫ్యూచర్ టెన్స్ అని ఒక ప్రోగ్రాం వస్తోంది టీవీలో.

'నేను ఒకతన్ని చంపాను' అనే వాక్యానికి భవిష్యత్ కాలం చెప్పమని క్విజ్ మాస్టర్ అడుగుతున్నాడు.

పాల్గొంటున్నవారిలో ఒకాయన వెంటనే బజర్ మోగించి 'నేను ఒకతన్ని చంపబోతున్నాను' అని చెప్పాడు.

'నువ్వు చెప్పింది కరెక్టేగాని ఇంకెవరైనా కాస్త సృజనాత్మకంగా చెప్పగలరా' అడిగాడు క్విజ్ మాస్టర్.

'నేను జైలుకు వెళ్తాను' అన్నాడొకతను సీరియస్‌గా.

అందరూ నవ్వారు.

నిజమే. హంతకుడు ఎప్పటికైనా జైలుకు వెళ్ళాల్సిందే కదా! క్విజ్ మాస్టర్‌కు ఆ సమాధానం నచ్చింది కాని ఎందుకైనా మంచిదని అభ్యర్థుల వైపు మరోసారి చూశాడు.

మరొకతను బజర్ మోగించాడు.

'భగవంతుడు ఒకతన్ని చంపబోతున్నాడు' అన్నాడతను. నవ్వబోయి మానేశారందరూ.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఏమన్నాడు?

చంపెడి వాడెవడు? చచ్చే వాడెవడు? అన్నీ నేనే అన్నాడు కదా! దాని ప్రకారం అతని వాక్యం కరెక్టే.

వాతావరణం గంభీరంగా మారింది.

భగవంతుడు ఎవరి ప్రాణమైనా తీసుకుంటే దాన్ని చంపడం అనొచ్చా అని అనుమానం వచ్చింది కొందరికి.

‘‘మన చుట్టూ ఇన్ని హత్యలు జరుగుతుంటే ఈ చచ్చు పుచ్చు జవాబులేమిటి? ‘నేను ఇంకెవర్నీ చంపను’, ఇదీ ఆ వాక్యం భవిష్యత్ కాలం’’ అని ఒకతను బజర్ నొక్కకుండానే గట్టిగా అరిచి చెప్పాడు.

*20 మార్చి 2005*

# కొత్త నాన్నలకు స్వాగతం

తలుపు కొట్టడంలోనే తెలిసిపోయేది వచ్చిందెవరో. లోపల సునామీ లాంటి పరుగు. వెంటనే హిమాలయాలంత నిశ్శబ్దం.

రేడియోలు ఆగిపోయేవి. పేకముక్కలు పరుపుల కిందకి వెళ్ళిపోయేవి. వాగ్యుద్ధాలు మౌనంలో ఒదిగిపోయేవి. కళ్ళతోనే శాంతి ఒడంబడికలు జరిగిపోయేవి. దిండ్లు యథాస్థానానికి వెళ్ళిపోయేవి. నిద్రకళ్ళు నీళ్ళతో తేటపడేవి. విసిరేసిన పుస్తకాలు హస్తభూషణాలుగా భాసిల్లేవి.

అంతా అరక్షణం లోపే.

వచ్చింది ఆ కుటుంబ పెద్ద. ఆ ఇల్లాలి భర్త. ఆ పిల్లల తండ్రి. ఆ ఇంటి మగవాడు.

అతనంటే వారికి ఎంత ప్రేమున్నా, ఎంత గౌరవమున్నా భయమే ఎక్కువ బయటికి కనిపించేది.

చేతికి మంచినీళ్ళు ఇచ్చేవాళ్ళు. బ్యాగు తీసుకుని లోపల పెట్టేవాళ్ళు. మొహం కడుక్కుంటే తువ్వాలు అందించే వాళ్ళు. వేడివేడిగా అన్నం వడ్డించేవాళ్ళు. కూరల్లో మంచి

మంచి ముక్కలు ఏరి పెట్టేవాళ్ళు. అప్రియమైన విషయాలేమీ చెప్పేవాళ్ళు కాదు. అతనికి బహుశా స్వర్గంలో అడుగుపెట్టినట్టు ఉండేదేమో.

కాని ఇవ్వాళ....

నాన్న వచ్చాడని తెలియగానే పిల్లలు ఇంకాస్త గట్టిగా అరుస్తూ తలుపు దగ్గరకు పరిగెత్తుకొస్తున్నారు. బ్యాగ్ లాక్కుని ఎవరికి కావాల్సింది వాళ్ళు తీసేసుకుంటున్నారు. 'మీ నాన్నకు చెపుతాను ఉండు' అనే వాక్యం చరిత్ర గర్భంలో కలిసిపోయి 'మీ అమ్మకు చెప్పనా!' గా రూపాంతరం చెందింది.

ఈ రోజు-

చికెన్‌లు చివరగా తినేది నాన్నలే.

పాయసాలు ఆఖరుగా తాగేది నాన్నలే.

ఇంటిలో ఎవరికీ టీవీలు చూసే ఖాళీ లేనప్పుడు మాత్రమే రిమోట్ నాన్న చేతిలోకి వస్తోంది.

పిల్లల ఫ్రెండ్స్ ఇంటికొస్తే నాన్నలు బెడ్‌రూముల్లోకి రిటైర్ అవ్వాల్సొస్తోంది.

పిల్లలు చదువుతుంటే నాన్నలకు కూనిరాగం తీసే స్వేచ్ఛ కూడా లేకుండా పోతోంది.

కొత్తగా కొనుక్కున్న చొక్కాలు, బూట్లు, వాచీలు, సెల్‌లు ఏవైనా పిల్లలకు నచ్చకపోతేనే నాన్నలకు మిగులుతున్నాయి.

అయితేనేం...

ఈ నాన్నలు ఎంత హాయిగా ఉన్నారు! ఎంత సహజంగా బతుకుతున్నారు!

నాన్నలు ఎప్పటికీ ఇలాగే ఉండాలి. కొత్త నాన్నలకు జిందాబాద్.

*15 మే 2005*

# కన్సల్టెంట్లు కావాలోచ్!

ఎన్ని కనిపెట్టీ ఏం లాభం సినిమా వాళ్ళకే అర్థం కావడం లేదని బాధపడకుండా ఇకనుండి శాస్త్రవేత్తలు కూడా సినిమాలు చూసి ఆనందించే రోజులొచ్చాయి... కనీసం ఆంగ్లంలో.

శాస్త్రవేత్తలు అసలు సినిమాలు చూస్తారా....చూసితిరి పో బాధ కూడా పడతారా అనుకోవచ్చు మనం.

కాని కొందరు చూస్తారు. చూసి సైన్సు విషయాలలో, లెక్కల విషయాలలో సినిమా వాళ్ళు చేసే తప్పులకు బాధపడతారు. సిగ్గుపడతారు. వాళ్ళ అజ్ఞానాన్ని సరిదిద్దడమెలా అని కూడా ఆలోచిస్తారు.

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో బయోకెమిస్టుగా పని చేస్తున్న లిజ్జీ బర్న్స్ అలాంటి ఒక శాస్త్రవేత్త. 'బ్యాక్ టు ది ఫ్యూచర్', 'హనీ ఐ ష్రంక్ ద కిడ్స్' సినిమాలలో శాస్త్రవేత్తలను దద్దమ్మలుగా చూపించడం ఆవిడ భరించలేకపోయింది. 'ఇటి'లో పరాయిగోళం నుండి వచ్చిన ఒక జీవిని కోసి చూద్దామనుకునే క్రూరులుగా వారిని చిత్రీకరించడం ఆమెకు చాలా బాధ కలిగించింది. 'టర్మినేటర్'లో వాళ్ళు

సృష్టించిన రోబోలు రెచ్చిపోయి నానా బీభత్సం చేసినట్టు చూపించడమూ ఆమెకు నచ్చలేదు. 'స్టార్ వార్స్'లో శక్తి గురించి ఇచ్చిన వివరణ ఆమెను సినిమా లోంచి లేచి వచ్చేట్టు చేసింది. ఇవి కొన్ని మాత్రమే. హాలీవుడ్ సినిమాలలో 'ఉన్మాద' శాస్త్రవేత్తలకైతే లెక్కేలేదట.

ఇంకా ఎన్నేళ్ళు ఇలా.. ఇంకా ఎన్ని సినిమాలు ఇదే పద్ధతిలో ... అనుకుందావిడ. ప్రొఫెసర్ జొనాథన్ ఫార్లే అనే గణిత శాస్త్రవేత్తతో కలిసి 'హాలీవుడ్ మాథ్స్ అండ్ సైన్స్ కన్సల్టెన్సీ' కంపెనీ నొకదాన్ని పెట్టింది. సైన్సు, లెక్కలతో సంబంధమున్న ఏ సినిమాకైనా, టీవీ సీరియల్‌కైనా సలహాలు, సూచనలు ఇవ్వడమే దాని పని. ఇప్పటికే 'నెంబర్స్' అనే ఒక అమెరికన్ టీవి సీరియల్ షూటింగ్‌కి వెళ్ళి సెట్స్, భాష, స్క్రిప్టు అన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో చూసొచ్చారట.

'శాస్త్రవేత్తల మీద ఈగ వాలనివ్వకూడదని కాదు మా ఉద్దేశం. శాస్త్రాన్ని తప్పుగా చెప్పకూడదు, శాస్త్రవేత్తను నీచంగా చూపకూడదు అని మాత్రమే' అని చెప్పిందావిడ.

లెక్కలు, సైన్స్ వంటి పెద్ద విషయాల మీద మన వాళ్ళు ఎలాగూ సినిమాలు తీయరు కాబట్టి ఈ కన్సల్టెన్సీలు మనకు అక్కరలేదు కాని ఈ తరహాలో మన దగ్గర కూడా అత్యవసరంగా రావాల్సినవి కొన్ని ఉన్నాయి.

ఉదాహరణకు - కోయలు, భిల్లులు, గోండులు వగైరా ఈ దేశ మూలవాసులందరూ తెలుగు కెమెరామాన్‌ని చూడగానే ఈకలు తగిలించుకుని డాన్సులు చేయడాన్ని ఆపే ఒక కన్సల్టెన్సీ ఉంటే బాగుండు.

అచ్చ తెలుగు నుండి అచ్చ ఉర్దూ దాకా మాట్లాడే ముస్లింలున్నారు కాని నీకీ ... నాకీ భాష మాట్లాడరని సినిమా వాళ్ళకు చెప్పే ఒక కన్సల్టెన్సీ ఉండే బాగుండు.

సినిమాలలో సిగరెట్టు తాగితేనే పొగతాగుట ఆరోగ్యానికి హానికరం అని కింద హెచ్చరికలు వేసేవాళ్ళు రీలుకొకసారి హీరోయిన్ చెంప ఛెళ్ళుమంటుంటే ఆపరెందుకని అడగడానికి కూడా ఒక కన్సల్టెన్సీ ఉంటే బాగుండు.

ఒకటా ... రెండా... ఇలాంటి కన్సల్టెన్సీల అవసరం మనకే ఎక్కువ ఉంది. కథల్లో, కల్చర్‌లో ఎలాగూ హాలీవుడ్‌ని అనుకరిస్తున్నారు కదా ... వాటిని సరిదిద్దడంలో కూడా మనం అదే ఫాలో అవ్వొచ్చుగా!

*5 జూన్ 2005*

# ఆకుపచ్చ భాష

వానలెందుకు రావడం లేదు?

నీలి మేఘమా జాలి చూపుమా అని మన సినిమా వాళ్ళు ఎప్పుడోనే పాట కట్టి పాడినా...

హిందూ ముస్లిం భేదం లేకుండా అందరూ ప్రార్థనలు చేస్తున్నా...

చిన్న పిల్లలు సైతం వానల్లు కురవాలి వానదేవుడా, మా వరిచేలు పండాలి వానదేవుడా అని ఆటపాటలతో ఆహ్వానించినా ...

ఈ వానలెందుకు రావడం మానేశాయి?

కొంపదీసి మన భాష మేఘాలకు అర్థం కావడం లేదా?

అంతే అయి ఉంటుంది.

అందుకే అవి ఆగమన్న చోట ఆగకుండా, కురవమన్న చోట కురవకుండా వెళ్ళిపోతున్నాయి.

అనంతపురం వాళ్ళు ఎంత ప్రాధేయపడ్డా ఏటా అవి నాన్‌స్టాప్‌గా చిరపుంజి దాకా వెళ్ళిపోవడానికి బహుశా ఇదే కారణమై ఉంటుంది.

ఇప్పుడెలా?

మన దేశం అసలే బహుభాషా దేశం. ఏ భాషలో చెపితే హిందూ మహాసముద్రం దాటివచ్చే ఈ మేఘాలకు ఎక్కడెక్కడ ఆగి కురవాలో అర్థమవుతుంది?

కాళిదాసు ఏ భాషలో మేఘసందేశం పంపి ఉంటాడు?

అనేకమంది అనేక రకాలుగా ఆలోచించారు.  చరిత్ర గ్రంథాలన్నీ తిరగేశారు. నాగరికత మూలాలన్నీ అన్వేషించారు.

కొందరి శోధనలో ఆకు, ఆకుపచ్చ, అడవిలాంటి పదాలు ఎక్కువగా కనిపించాయట. మరీ ముఖ్యంగా అడవి వాటికి అత్యంత ప్రియమైన పదం అని తెలిసిందట.

అనవసరంగా ఇన్నాళ్ళూ చెట్టు ముందా విత్తు ముందా అని తెగ చర్చిస్తూ కూర్చున్నాం. దాని కంటే వాన ముందా అడవి ముందా అని చర్చించి ఉంటే ఈ పాటికి అనంతపురం కూడా సస్యశ్యామలంగా మారి ఉండేదేమో!

*26 జూన్ 2005*

# 'అసలు' ఎంత కష్టం

పిల్లి అరుపులున్న క్యాసెట్ ఎక్కడైనా దొరుకుతుందా అని అందర్నీ అడుగుతోంది ఒక అమ్మాయి.

అదేమైనా వెంకటేశ్వర సుప్రభాతమా ఎవరైనా రికార్డు చేసి అమ్మడానికి!

అయినా పిల్లి అరుపులు దేనికి? అదేం కోకిల స్వరమా... చిలక పలుకా...!

మా ఇంటి నిండా ఎలుకలున్నాయి... పిల్లి అరుపులున్న క్యాసెట్ పెడితే పారిపోతాయేమోనని.. చెప్పిందా పిల్ల.

పిల్లినే పెంచుకోవచ్చు కదా.

అమ్మో... పాలకు, పెరుగుకు కాపలా కాయాలి. మసాలా వాసనొస్తే చాలు వచ్చి మిడిగుడ్లేసుకుని కూర్చుంటుంది. ఊహు... పిల్లి వద్దు, పిల్లి అరుపులున్న క్యాసెట్ చాలు... చెప్పింది అమ్మాయి.

కార్ల తిరోగమన సంగీతాలలో గాని, సెల్‌ఫోన్ల కాలర్ ట్యూన్‌లలో గాని ఆ ధ్వని దొరుకుతుందేమోనని చూశారు. కానీ అక్కడ ఏడ్చే బిడ్డలు, మొరిగే కుక్కలు తప్ప మ్యావ్ మ్యావ్‌లు లేవు.

అయినా ఎలా ఉంటాయి? అశుభానికి సంకేతమైన ధ్వనిని ఎవరు కొని పెట్టుకుంటారు?

లాభం లేదని ఆ అమ్మాయే అద్భుతమైన మిమిక్రీతో మ్యావ్ మ్యావ్‌మని గండుపిల్లిలా అరుస్తూ కూర్చుంది

ఊహూ... ఒక్క ఎలుకా బయటికి రాలేదు.

ఎంతకని అరుస్తుంది? ఒక ఖాళీ క్యాసెట్ తీసుకుని దాన్నిండా తన మ్యావ్ మ్యావ్‌లే రికార్డు చేసి 24 × 7 వార్తల్లా ప్రసారం చేసింది.

ఆఖరి వార్తలు అందే నాటికి కూడా ఒక్క ఎలుకా డబ్బాల చాటునుంచి బయటికి రాలేదు. ఇదేదో నా అరుపులా ఉందని కనీసం పిల్లి అయినా ఆ ఇంట్లోకి తొంగి చూడలేదు.

ప్రపంచమంతా నకిలీలతో నిండిపోయిందని బాధపడేవారికి బహుశా ఇది కాస్త ఊరట ఇస్తుందేమో!. కొన్ని చోట్లయినా ఒరిజినాలిటీకి ఇంకా గుర్తింపు ఉంది.

*10 జూలై 2005*

# సాగర విలాపం

'అబ్బ ఏమిటింత ఉప్పు కసిం?' మగ చేప ఆడ చేపను విసుక్కుంది.

'అమ్మా ఒళ్ళంతా బరువుగా అనిపిస్తోంది. ఈదలేకపోతున్నానే' పిల్ల చేప వచ్చి తల్లి చేపకి మొరపెట్టుకుంది.

కొన్నాళ్ళుగా ఇవే మాటలు. పొరుగింటి పీత కూడా పొద్దున కనిపించినపుడు చాలాసేపు దీని గురించే మాట్లాడింది.

ఆడ చేప నిట్టూర్చి ఆకాశం వంక చూసింది. వర్షాకాలం వచ్చి చాన్నాళ్ళయింది. ఆలస్యంగా మొదలైనా భూమ్మీద వానలు జోరుగానే పడుతున్నాయి. కానీ తమకే నీళ్ళు రావడం లేదు.

ఏటా ఈ పాటికి గుడ్లు బయటికొచ్చేసి చేప పాపాయిలతో ఈ నీళ్ళన్నీ కళకళలాడేవి. వాటి కోసం వచ్చే పక్షులతో ఈ ప్రాంతమంతా ఎంత సందడిగా ఉండేదో. కొత్త నీళ్ళు రాకుండా ఈ ఉప్పు కసిం నీళ్ళల్లో పిల్లల్ని ఎలా పెంచాలో. అసలు బతుకుతాయో లేదో. ఈ పిల్లలు పెరగకపోతే పాపం భూమ్మీద ఉండే ఆ బెస్తవాళ్ళ బతుకులు ఏమైపోతాయో. ఇప్పటికే సునామీ బాధల్లో ఉన్నారు... ఆడ చేప పరిపరి విధాల ఆలోచిస్తోంది.

పగడాల పెద్ద కూడా దిగులుగానే కనిపించాడు. లవణం పెరిగితే పగడం బతకదని తమ పెద్దలు తమకు ఏనాడో చెప్పారు. కాని దీవులకు దీవులు తుడిచి పెట్టుకుపోయే ప్రమాదం ఏర్పడిందిప్పుడు. మూడే మూడు పగడపు జాతులకు మాత్రమే ఎంత ఉప్పునైనా తట్టుకునే శక్తి ఉంది. కాని అవి అంత అందమైనవి కావు. నవరత్నాలలో ఒకటైన పగడం లేకపోతే ఆడమనుషులు వేసుకునే ఆభరణాలకు కళ తగ్గిపోదూ....

సముద్రుడి మొహంలో అయితే జీవమే లేదు. సూర్యుడి వేడినంతా జీర్ణం చేసుకుని... నన్ను నేను ఆవిరిజేసుకుని... మేఘాల్ని కని భూమి మీదకు పంపితే నా మనవళ్ళెవర్నీ నా దగ్గరికే రానివ్వరా? ఇదేం న్యాయం? నేను కటిక ఉప్పు తిని నా సంపదనంతా ఇస్తున్నది ఎవరి కోసం? ... ఈ మనుషుల కోసం కాదూ ... విలపించాడు సాగర తాత.

* * *

నదుల మీద మరిన్ని ఆనకట్టలు కట్టకపోవడం వలన వర్షం నీళ్ళు సముద్రంలోకి వృథాగా పోతున్నాయని గగ్గోలు పెట్టేవాళ్ళ కోసం ఈ గల్పిక. వర్షపు నీటి అవసరం భూమికి ఎంత ఉందో సముద్రానికీ అంతే వుంది. వర్షాలు సమృద్ధిగా కురిసేలా మనం మన వాతావరణాన్ని తీర్చిదిద్దుకోవాలి తప్ప సముద్రంలోకి వెళ్ళే నీళ్ళను వృథా అని ఒక్కనాటికీ అనుకోరాదు. భూమిని, సముద్రాన్ని కలిపి చూసే సమగ్ర భూగోళ దృక్పథాన్ని మనం అలవర్చుకోవడం అవసరం.

*14 ఆగస్టు 2005*

# ఈజీగా పళ్ళు నూరుకోవడమెలా!

పేపర్లో రెండు నెంబర్లుంటాయి.  మొదటి దానికి ఫోన్ చేస్తే రెండో దానికి చేయమని చెపుతుంది ఓ స్వరం. మరి మొదటి నెంబరు అచ్చేయడం దేనికి అని అడగడానికి లేదు ... ఎందుకంటే అది ఫోర్త్ జెండర్ ... యంత్ర స్వరం.

ఆ ఫోన్‌కు చేస్తే 'నాతో వస్తావా ... నాతో వస్తావా' అని అదే పనిగా ఆహ్వాన గీతం. ఏం జవాబు చెప్పాలి? అవతల వాళ్ళెవరో తెలియదు. ఎక్కడికి రమ్మని పిలుస్తున్నారో తెలియదు. మీ సందేహం తీరకముందే అదే దయతలచి స్టార్ డయల్ చేయండని చెపుతుంది. చేశాక ఏ భాషకు ఏ నెంబరో చెపుతుంది.

అక్కడ్నించి మాంత్రికుడి గుహలోకి అడుగుపెట్టినట్టుగా అనేక మలుపులు తిరుగుతూ వెళతాం. టిక్కెట్ల వివరాలకైతే ఒకటి, సినిమాల వివరాలకైతే రెండు, థియేటర్ల వివరాలకైతే మూడు, నచ్చిన పాటలకైతే నాలుగు... ఇలా ఏడెనిమిది ఉంటాయి. మీకు కావల్సింది టిక్కెట్లే అయితే అందులో మళ్ళీ నాలుగు రకాలు, మీరు వారి సంస్థలో సభ్యులు కాకపోతే మరో నాలుగు రకాలు, ఏ భాషా సినిమా కావాలో ఎంచుకోవడానికి ఇంకో మూడు రకాలు, అందులో మళ్ళీ

ఏ సినిమానో ఎంచుకోవడానికి ఓ 50 నెంబర్లు, ఆ సినిమాను ఏ థియేటర్‌లో చూడదలచుకుంటారో చెప్పడానికి ఇంకొన్ని నెంబర్లు, వాటిలో మళ్ళీ షోలు, తరగతులు ఎంపిక చేసుకోవడానికి మరికొన్ని నెంబర్లు... ఫోన్ మీద నుంచి చెయ్యి తీయడానికి వీల్లేనంత ఉత్కంఠతో ముందుకు సాగుతాం. కౌన్ బనేగా కరోడ్‌పతిలో అయినా బ్రేక్ ఉంటుంది కాని దీనికి అదీ లేదు.

చివరాఖరికి మీకు కావాల్సిన సినిమాకి, కావాల్సిన థియేటర్‌లో, కావాల్సిన షోకి, కావాల్సిన తరగతి టిక్కెట్లు దొరికితే మాంత్రికుణ్ణి చంపి మణిని చేజిక్కించుకున్నంత ఆనందం. దొరకకపోయినా మాంత్రికుణ్ణి, మణిని కూడా చూసొచ్చిన పారవశ్యం.

ఇద్దరు ఉద్యోగులకిచ్చే రెండేసి వేల జీతాలు ఎగ్గొట్టడానికి ఎంత ప్రోగ్రామింగ్ జరిగిందో చూడండి.

ఈ సౌకర్యాన్నే కొందరు కమ్యూనికేషన్ విప్లవం అంటున్నారు.

కొందరు ప్రపంచీకరణ తర్వాత భారతీయుడికి లభించిన విస్తృతమైన ఛాయిస్ అంటున్నారు.

వాళ్ళేమో గడప వద్దకే వినోదం పథకమంటారు.

మనమేమో ఏ రాయి అయితేనేం పళ్ళూడగొట్టుకోవడానికి అనుకుంటాం.

ఇంకా నయం. దీన్ని ఇప్పుడు సినిమా టిక్కెట్లకే వాడుతున్నారు. రేపు ఆస్పత్రుల వాళ్ళు కూడా మొదలు పెట్టారనుకోండి. ఏం జబ్బు, ఎప్పట్నించి, ఏం మందులు వాడారు, ఎన్నిసార్లు ఆపరేషన్లు చేయించుకున్నారు, తొలి గుండెపోటా, రెండోదా... ఇలా అడుగుతూ పోతే...

బాబోయ్... ఏమైపోతాం మనం !

*21 ఆగస్టు 2005*

❋ *ఇవ్వాళ ఏ కస్టమర్ కేర్ నెంబర్‌కు డయల్ చేసినా ఇదే పరిస్థితి కాబట్టి అందరం అలవాటు పడిపోయాం. కాని 13 ఏళ్ళ క్రితం సినిమా టిక్కెట్లకు మాత్రమే ఈ పద్మవ్యూహ సేవా సదుపాయం ఉండేదని గుర్తు.*

# మాయావి

ఆరుబయట స్టేజి మీద ఒక మెజీషియన్ ప్రదర్శన ఇస్తున్నాడు. పొదల చాటు నుంచి ఒక పులి ఆ మాజిక్ షోను చూస్తోంది. మెజీషియన్ చెవుల్లో నుంచి, చేతుల్లో నుంచి, బూటు నుంచి, కోటు నుంచి రకరకాల వస్తువులు బయటికి తీస్తున్నాడు. ప్రతిసారీ జనం ఉత్సాహంగా చప్పట్లు కొడుతున్నారు. అన్నిట్లోకీ అతను టోపీలో నుంచి తీసి చూపించిన కుందేలుపిల్ల పులికి బాగా నచ్చింది.

పులికి పాపం పిల్లల్లేరు. ఎలాగైనా ఒక పులిపిల్లను సంపాదించి పెంచుకోవాలనేది దాని చిరకాల కోరిక. ప్రదర్శన ముగిసి మెజీషియన్ ఇంటికి వెళుతుంటే అది దారికాచి అతణ్ణి అటకాయించింది. టోపీలో నుంచి కుందేలును తీసినట్టు ఒక పులిపిల్లను కూడా తీయమంది. 'నా వల్ల కాదు. కుందేలు ముందు నుంచే నా సంచిలో ఉంది కాబట్టి బయటికి తీసి చూపెట్టగలిగాను. పులిని తీయడం నా వల్ల కాదు. గాలిలో నుంచి జంతువుల్ని సృష్టించే విద్య నాకెవ్వరూ నేర్పలేదు బాబోయ్' అని నిలువెల్లా వణుకుతూ మొరపెట్టుకున్నాడు మెజీషియన్.

పులి వినలేదు. పులిపిల్లను తెచ్చివ్వకపోతే నీకు ఇదిగో ఇక్కడే నూకలు చెల్లిపోతాయి అని గాండ్రించింది.

మెజీషియన్ వేగంగా ఆలోచించాడు. ఎలాగోలా ముందు ప్రాణం దక్కించుకోవాలనుకున్నాడు. పులిపిల్లను ఇస్తాను కానీ నెలరోజులు పడుతుంది అన్నాడు. ఆగుతానంది పులి. ఆ నెలరోజులూ మీరు పూర్తి శాకాహార భోజనం చేయాలన్నాడు. చేస్తానంది పులి. నెల గడిచింది. పులి తిరిగివచ్చింది.

ఈసారి మెజీషియన్ ఇంకా పెద్దఎత్తున ఏర్పాట్లు చేయించాడు. విశిష్ట అతిథి కోసం ఇస్తున్న విశిష్ట ప్రదర్శన కదా. ముందు హాం... షూం... లాంటి మంత్రాలేవో చదివాడు. అబ్రకదబ్ర లాంటి శబ్దాలేవో చేశాడు. ఆ తర్వాత టోపీలోకి చెయ్యి పెట్టి ఒక చిన్న జంతువును బయటికి తీశాడు. ఊపిరి బిగబట్టి చూస్తున్న జనమంతా ఒక్కసారిగా నవ్వారు. ఇది పులెందుకు అయింది... పిల్లి కదా అంటూ తెరలు తెరలుగా నవ్వారు. అప్పుడే ఆ పిల్లి కూడా నోరు తెరిచి మ్యావ్... అంది.

పులికి పట్టరాని కోపం వచ్చింది. దిక్కులు పిక్కటిల్లేలాగా గాండ్రించింది. కనీసం గాండ్రించానని అనుకుంది. కాని నెల రోజుల శాకాహారం వల్ల బాగా నీరసించి ఉంది అది. గొంతులో నుంచి గాండ్రింపుకు బదులు అచ్చం పిల్లికూన గొంతులానే మ్యా...వ్ అని వచ్చింది. జనం ఈసారి మరింత విరగబడి నవ్వారు.

* * *

ఈ మెజీషియన్ మన ముఖ్యమంత్రి కావచ్చు. ఆయన పార్టీ అధ్యక్షురాలు కావొచ్చు. ఆ పులి మనం కావొచ్చు. మన ఓటర్లు కావొచ్చు. మన రాష్ట్రానికి చెందిన కొన్ని పార్టీల వారు కావొచ్చు. బట్ ద షో ఈజ్ గోయింగ్ ఆన్.

*11 సెప్టెంబర్ 2005*

# వాళ్ళతో మనకేం పని...

వాడో చిన్నపిల్లాడు. పేపర్లు అమ్ముతుంటాడు.

నాలుగేళ్ళ క్రితం ఒకరోజు 'ఒసామా బిన్ లాడెన్‌ను పట్టిస్తే పాతిక మిలియన్ డాలర్లు... ఒసామా బిన్ లాడెన్‌ను పట్టిస్తే పాతిక మిలియన్ డాలర్లు...' అని గొంతెండిపోయేలా పేపర్‌లోని హెడ్డింగులను అరిచి చెపుతూ రోడ్డు మీద తిరుగుతుంటాడు. ఆ రోజు పేపర్‌లో అదే ప్రధాన వార్త.

ఇంతలో అచ్చు ఒసామా బిన్ లాడెన్‌లానే పొడవాటి షేర్వాణీతో, అంతే పొడవాటి గడ్డంతో, సన్నటి కోల మొహంతో ఒక పెద్దాయన తారసపడతాడు. పేపర్‌లోని ఫోటోను, అతన్ని మార్చి మార్చి చూస్తాడా పిల్లవాడు. సందేహం లేదు. అతడే. దోస్తులకు చెబుతాడు. మొదట నమ్మరు వాళ్ళు. నమ్మకం కుదిరాక ఒక బాలుడి తండ్రి దగ్గరున్న వీడియో కెమెరాను దొంగిలించి మధ్యాహ్నం పూట నమాజు చేసుకుంటున్న 'బిన్ లాడెన్'ను చిత్రీకరిస్తారు.

ఆ పిల్లవాడికి డబ్బులతో చాలా అవసరం ఉంటుంది. స్కూల్లో ఫీజు కట్టాలి. పుస్తకాలు కొనాలి. అమ్మకు మందులు కొనాలి. వీటన్నిటికీ డబ్బు కావాలంటే ఇదొక్కటే మార్గం అనుకుంటాడు వాడు. పాతిక మిలియన్ డాలర్లంటే తమ

బుర్కినా ఫాజో (వాళ్ల దేశం పేరు, ఆఫ్రికాలో ఉంటుంది.) కరెన్సీలో ఎంతవుతుందో లెక్కేయడానికి ఆ పిల్లలంతా కలిసి ప్రయత్నిస్తారు. ఇసుకలో ఎన్నిసార్లు లెక్కేసినా వాళ్ళకు జవాబు రాదు. చివరికి కొన్ని ఖర్చులకు సరిపోయినా చాల్లే అనుకుంటారు.

తాడు, బాణం, ఒక మాదిరి కత్తి వగైరాలన్నీ సిద్ధం చేసుకుని 'ఒసామా'ను బంధించాలని బయలుదేరతారు. ఎంతసేపు ఎదురు చూసినా ఆయన నమాజుకు రాడు. హోటల్‌కి వెళ్ళి కనుక్కుంటే ఇప్పుడే ఎయిర్‌పోర్టుకి వెళ్ళాడంటారు. అక్కడికి పరుగెత్తుకుని వెళ్ళేసరికి విమానం వెళ్లిపోతుంది. దాన్ని చూసి ఆ పిల్లాడి కళ్ళ వెంట ధారగా నీళ్ళు. 'ఒసామా బిన్ లాడెన్... ప్లీజ్... ఒకసారి తిరిగి రావా' అని ప్రాధేయపడతాడు. ఇంకెవరికో అతన్ని బంధించే అదృష్టం దక్కుతుందని అసూయపడతాడు. మిగతా పిల్లలు ఓదారుస్తారు. 'పోనీ బుష్‌నే కిడ్నాప్ చేసి డబ్బులు చెల్లించమంటే...' అని ఒకడు సలహా ఇస్తాడు. ఏమో బుష్ ఎక్కడుంటాడో... అతనూ ఇలానే చేజారిపోతే... వాటికంటే చేతిలో ఉన్న వీడియో కెమెరానే అమ్ముకోవడం మంచిదనుకుంటారు. పిల్లాడి చదువుకు, వాళ్ళమ్మ అనారోగ్యానికి ప్రస్తుతానికి ఆ డబ్బు చాల్లే అనుకుంటారు.

సెప్టెంబర్ 11 నాటి దుర్ఘటన మీద వచ్చిన ఒకానొక చిన్న సినిమా ఇది. పదకొండు నిమిషాల తొమ్మిది సెకండ్లే దీని వ్యవధి. కెనాల్ అనే ఫ్రెంచ్ స్టూడియో 9/11 నేపథ్యంలో సినిమాలు తీయమని వివిధ దర్శకుల్ని అడిగినపుడు ఇద్రీసా ఔద్రింగో అనే దర్శకుడు తీసిన చిట్టి సినిమా ఇది.

బిన్‌లాడెన్‌ల గురించీ, బుష్‌ల గురించీ ఏ మాత్రం తెలియని తరం ఒకటి పుట్టి పెరుగుతోందని గుర్తు చేసినందుకు దర్శకుడికి ధన్యవాదాలు.

*18 సెప్టెంబర్ 2005*

# చెప్తేనేం ....

ప్రతి శనివారం ఆ స్కూల్‌లో క్విజ్ జరుగుతుంది.

ఆ శనివారం కూడా లంచ్ బ్రేక్ తర్వాత ఒక పెద్ద క్లాసురూములోకెళ్ళి కూర్చున్నారు పిల్లలంతా.

ఇటీవలి సంఘటనల మీద ప్రశ్నలు అడుగుతోంది టీచరు.

మన దేశానికి తొలి దళిత రాష్ట్రపతి ఎవరు?

కె.ఆర్. నారాయణన్ .... కె.ఆర్. నారాయణన్... అరిచి చెప్పారు పిల్లలంతా. వాళ్ళీ మధ్యే పేపర్లలో ఆ వార్త చదివారు. కొందరు టీవీల్లో కూడా చూశారు.

ఈ లోపల ఆయా వచ్చి టీచరును పిలిచింది. హెడ్‌మాస్టారు రమ్మన్నారట.

'ఇప్పుడే వస్తాను. ఈ లోపు ఎవరో ఒకరు మీకు తోచిన ప్రశ్నలు అడుగుతూ ఉండండి' అని చెప్పి టీచరు వెళ్ళిపోయింది.

ఒకబ్బాయి ఈ మధ్యే వర్ణవ్యవస్థ గురించిన పాఠం చదివాడు. అది గుర్తొచ్చి... మన దేశానికి తొలి బ్రాహ్మణ రాష్ట్రపతి ఎవరు? అని అడిగాడు.

అందరూ నోరెళ్ళబెట్టారు. ఎవరికీ సమాధానం తోచలేదు.

కాసేపటికి ఎవరికి గుర్తొచ్చిన రాష్ట్రపతి పేరు వాళ్లు చెప్పడం మొదలుపెట్టారు.

రాజేంద్రప్రసాద్, రాధాకృష్ణన్, జైల్ సింగ్, వెంకట్రామన్, జాకీర్ హుస్సేన్, వి.వి.గిరి, ఎస్.డి శర్మ, ఫక్రుద్దీన్ అలీ అహ్మద్, అబ్దుల్ కలాం, నీలం సంజీవరెడ్డి...

ఇందులో మూడు పేర్లు వాళ్ళకే స్పష్టంగా ముస్లింలవని తెలిసిపోయింది.

జైల్‌సింగ్ గురించి కూడా ఎప్పుడో తొలి సిక్కు రాష్ట్రపతి అని చదివినట్లు వాళ్ళకు గుర్తొచ్చింది.

చివర్లో రెడ్డి ఉండడం వల్ల నీలం సంజీవరెడ్డి బ్రాహ్మణుడు కాడని అర్థమైంది.

ఇంక ఐదుగురున్నారు. ఈ దేశంలో బోలెడు కులాలున్నాయి. మరి వాళ్ళు ఏ కులానికి చెందుతారో...

వాళ్ళ ఊహాగానాలు సాగుతుండగానే టీచరు తిరిగొచ్చింది.

'వెల్ చిల్డ్రన్... ఇప్పటి ప్రశ్న ఏమిటి?' అడిగిందామె.

అందరూ ఒక్కసారిగా అరిచారు.

మన దేశానికి తొలి బ్రాహ్మణ రాష్ట్రపతి ఎవరు?

టీచరు నోరెళ్ళబెట్టింది. అదేం ప్రశ్న అని... అడిగిన పిల్లవాడి వైపు గుడ్లురిమి చూసింది. వాడు భయపడి సారీ టీచర్... వెరీ సారీ టీచర్.. అంటూ పిల్లల వెనక్కెళ్ళి నక్కాడు.

ఆ రాత్రి వాళ్ళ నాన్నను అడిగితే గాని వాడికి తెలియలేదు ఆ ఐదుగురి కులం ఏమిటో. ఒకాయన క్షత్రియుడని, మిగతా నలుగురు బ్రాహ్మణులని చెప్పాడాయన. అయితే తొలి బ్రాహ్మణ రాష్ట్రపతి, రెండో బ్రాహ్మణ రాష్ట్రపతి, మూడో బ్రాహ్మణ రాష్ట్రపతి, నాలుగో బ్రాహ్మణ రాష్ట్రపతి అని వాళ్ళ గురించి ఎందుకు రాయరో వాడికి అర్థం కాలేదు.

అంతమంది ఉన్నారని తెలిసిపోతుందనా!

*20 నవంబర్ 2005*

# తారుమారు

ఏది ఎప్పుడు ప్రాచీనమవుతుందో ... ఏది ఎప్పుడు ఆధునికమవుతుందో తెలియడం లేదు. అలాగే ఏది ఎప్పుడు అనాగరికమవుతుందో ... ఏది ఎప్పుడు నాగరికమవుతుందో కూడా తెలియడం లేదు. అంతేనా... ఏది ఎప్పుడు ఆటవికమవుతుందో ... ఏది ఎప్పుడు మానవత్వమవుతుందో కూడా తెలియడం లేదు.

మట్టికప్పులతో టీ తాగడం పేదరికమా ... ఫ్యాషనా?

గోనె సంచుల్లో సరుకులు తెచ్చుకోవడం సౌకర్యమా ... పర్యావరణమా?

పచ్చికూరలు తినడం ఆటవికమా .. ఆరోగ్యమా?

ఆలోచించేకొద్దీ అనుమానాలు పెరుగుతుంటాయి.

కాలినడకన తిరగడం సింప్లిసిటీయా ... పబ్లిసిటీయా?

మూలికావైద్యం మూఢవిశ్వాసమా ... ప్రకృతి శాస్త్రమా?

అలంకరణ అందమా ... ఆడంబరమా?

పల్లెల్లో ఇళ్ళు అమ్మేసి పట్టణాలకు తరలిరావడం నాగరికమా... పట్టణాల్లో ఉంటూ శివార్లలో ఫార్మ్‌హౌస్‌లు కట్టుకోవడం నాగరికమా?

నెమలి ఈకను దాచుకోవడం అందమైన బాల్య జ్ఞాపకమా... చంపబడ్డ నెమలి చేదు జ్ఞాపకమా?

అన్నీ ప్రశ్నలే.

తెలుగుకు ప్రాచీన భాష హోదా తెచ్చుకోవాలని ప్రయత్నించడం మన భాషను మనం గౌరవించుకోవడమా... ఇతర భాషల్ని అగౌరవపరచడమా?

ప్రాచీన గౌరవాలు భాషకేనా? లేక జాతులకు కూడా ఉంటాయా?

జాతులను గౌరవించని వాళ్ళు భాషల్ని గౌరవిస్తారా?

కళింగనగర్ కాల్పుల్లో చనిపోయిన పన్నెండుమంది ఆదివాసులు మనకంటే ప్రాచీనమైన జాతులకు చెందిన వాళ్ళని ప్రభుత్వాలకు తెలియదా?

వాళ్ళ జోలికి వెళ్ళకుండా ఉండేందుకు మన తెలుగు భాషకు ఇచ్చినట్టుగా ఓ వంద కోట్లు ఆ ప్రభుత్వాలకు కూడా ఇస్తే బాగుండు.

*22 జనవరి 2006*

# వైకల్య సౌందర్యం

అప్పుడెప్పుడోనే జపాన్‌వాళ్లు ఒక కళను కనిపెట్టారు.

దాని పేరు వాబీసాబీ.

అదో సౌందర్య తత్వశాస్త్రం.

వంకర టింకర ఓ, వానీ తమ్ముడు సో లలోని అందాలను గుర్తింపజేసే కళ.

అన్నిటికీ కన్నాలు ఉంటాయి, వాటిలో నుంచే వెలుతురు లోపలికి వస్తుంది అన్న కవి మాటలను ప్రకృతికి, జీవితానికి అన్వయించిన శాస్త్రం.

కాడ ఊడిన కప్పుల్లో, సగం పగిలిన జాడీల్లో, మొండి శిల్పాలలో, శిథిల భవనాలలో గొప్ప సౌందర్యం ఉంటుందని చెబుతుందది.

మనకీ తెలుసు.

ప్రకృతిలో లాగే మానవ శరీర నిర్మాణంలోనూ కొన్ని లొసుగు లుంటాయి. మెదడు పనిలోనూ వైకల్యాలుంటాయి.

కాని వాటిల్లో మాత్రమే మనం ఎందుకు అనాకారితనాన్ని చూస్తున్నాం అని ప్రశ్నిస్తుందది.

నిజానికి మూడొంతుల ప్రపంచంలో ఈ వైకల్య సౌందర్యమే ఉంది. అయినా మనిషి అందానికి, ఆరోగ్యానికి మనం వేరే ప్రమాణాలు నిర్దేశించుకున్నాం.

ఇప్పుడు హిందీ సినిమాలలో ఈ వాబీసాబీ గాలే వీస్తున్నది. పుట్టు అంధులు, పుట్టు మూగా చెవిటివాళ్ళు, స్కిజోఫ్రీనియా బాధితులు హీరో హీరోయిన్లుగా వచ్చేస్తున్నారు. కన్నీళ్ళు పెట్టిస్తున్నారు. చప్పట్లు కొట్టించుకుంటున్నారు.

అందాన్ని ఇష్టపడడానికి ప్రత్యేక శిక్షణ అక్కర్లేదు. అన్నీ ఉన్నవార్ని అభిమానించడానికి ప్రత్యేక ప్రయత్నం అవసరం లేదు.

అనాకారితనాన్ని ఇష్టపడడానికి మాత్రం ప్రత్యేక శిక్షణ అవసరం. అన్నీ లేనివార్ని అభిమానించడానికి కూడా ప్రత్యేక ప్రయత్నం అవసరం.

'బ్లాక్' అదే చెప్పింది. 'ఇక్బాల్' అదే చెప్పింది. ఇప్పుడు '15 పార్క్ ఎవెన్యూ' సినిమా కూడా దాన్నే ఇంకెప్పుడూ మర్చిపోలేనంత గాఢంగా నేర్పింది.

*29 జనవరి 2006*

# అబ్బే... మన దగ్గర కుదరదు

'వేర్లను వెతుకుతాం' అనే పేరుతో భారత ప్రభుత్వం ఈ మధ్య ఒక కొత్త పథకాన్ని ప్రారంభించింది.

ప్రవాస భారతీయులందరి గుండెలూ ఉప్పొంగాయి ఆ రోజు.

వాళ్ళలో ఒక తెలుగువాడు కూడా ఉన్నాడు.

వెంటనే సంపాదించిందంతా మూటగట్టుకుని ఫ్లయిట్ ఎక్కాడు. దారంతా కలలు. ముందు ఢిల్లీలో దిగుతాడు. ప్రవాస భారతీయుల వ్యవహారాలు చూసే విదేశాంగ శాఖ విభాగానికి వెళతాడు. నా పేరు ఇప్పుడు సుబ్రావ్ మట్టి. కాని మా ముత్తాత పేరు మట్టి సుబ్బారావు. మా ఇంట్లో ఆయన బ్లాక్ అండ్ వైట్ ఫోటో కూడా ఉంది. ఇదిగో తెచ్చాను అని చూపెడతాడు వాళ్ళకి.

ఊరు పేరే సరిగ్గా తెలియదు. సముద్రం దగ్గరని వాళ్ళ తాత చెప్పినట్టు గుర్తు. చేపలు దండిగా తినేవాడట తన ముత్తాత. ముత్తవ్వ భలే అందంగా ఉండేదని, ముక్కుకి మూడు బులాకీలు ఉండేవని కూడా చెప్పేవాడు. ప్చ్... ఆవిడ ఫోటో లేదు. అప్పట్లో ఆడవాళ్ళు ఫోటోలు దిగేవాళ్ళు కాదట,

ఇద్దరికీ పడవ నడపడం బాగా వచ్చని, సముద్రం మీదకి వేటకు వెళ్ళేవాళ్ళని, ఆ భయంలేని తనమే వాళ్ళని ఓడెక్కి ఇంత దూరం వచ్చేలా చేసిందని తాత కాస్త గర్వంగా, కాస్త దిగులుగా చెప్పేవాడు.

ఆయనకూ వాళ్ళ ఊరు గురించి అంతగా తెలియదు. కాని అక్కడ తిన్నట్టే, తిరిగినట్టే ఊహించుకునేవాడు. నాకు ఊహించడానికి కూడా అవకాశం లేదు. ఇంతకంటే ఏమీ తెలియదు. అయితేనేం... ప్రభుత్వం సహాయం చేస్తానంటోంది కదా. ఆల్రెడీ ఉత్తరప్రదేశ్‌లో ఎనిమిది మందికి వాళ్ళ ఊళ్ళు వెతికి పెట్టిందట. బీహార్‌లో కూడా కొంతమంది స్వంత ఊర్ల కోసం గాలిస్తోందట. నా కోసం మాత్రం ఎందుకు వెతకదూ....

ఇలా ఆలోచిస్తూ ఇండియా వచ్చి ఢిల్లీలో ఒక అధికారిని వెంటబెట్టుకుని బంగాళాఖాతం దగ్గరకు వెళ్ళాడు.

అక్కడ సుబ్రావ్ మట్టి వర్ణనకు సరిపోయే ఊరొక్కటీ కనబడలేదు.

విశాఖపట్నంలో వెతికితే ఉక్కు ఫ్యాక్టరీ కట్టినప్పుడు చాలా ఊళ్ళు లేచిపోయాయన్నారు. లేచిపోయిన ఊళ్ళ వాళ్ళు ఎక్కడికెళ్ళారని అడిగితే వాళ్ళు వెళ్ళిన చోట కొత్తగా రేవు ఏదో రావడంతో అక్కడ్నించీ వాళ్ళు మళ్ళీ వెళ్ళిపోయారని చెప్పారు. దక్షిణానికి వచ్చి శ్రీహరికోట దగ్గర వెతికితే అక్కడా అదే సమాధానం. అక్కడి వాళ్ళు చిత్తూరు జిల్లా సత్యవేడు మండలానికి వెళ్ళారట. అక్కడ్నించి కూడా మళ్ళీ ఎక్కడికో వెళ్ళబోతున్నారట.

ఎక్కడని వెతుకుతాడు? వేర్లు సాగుతూనే ఉన్నాయి.

తిరిగి వెళ్ళడానికి హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తే అక్కడ సుబ్రావ్ మట్టికి తన లాంటి ఇంకొకాయన తగిలాడు. నాగార్జునసాగర్ దగ్గర ఏదో గ్రామమనుకుని వచ్చాడట. అక్కడ్నించి దేవరకొండ వెళ్ళి, ఎవరో చెపితే రంగారెడ్డికి వచ్చి ఎక్కడా తన ఊరు దొరక్క తిరిగెళ్ళిపోతున్నాడట.

వీళ్ళంతా ఢిల్లీ వెళ్ళి విదేశాంగ శాఖకు ఏం చెప్పారో గాని వేర్లను వెతికే పథకం ఆంధ్రప్రదేశ్‌కు వర్తించదని మర్నాడే కొత్త జీ.వో ఒకటి జారీ చేశారు!

*23 ఏప్రిల్ 2006*

# గాంధీగారు బతికుంటే...

పాపం కల్లు ఉప్పుకు ఊహించని కష్టం వచ్చిపడింది.

తీరం వెంబడి ఎకరాల కొద్దీ విస్తరించిన తన వైభవం ఇంత త్వరగా ముగిసిపోతుందని అదెప్పుడూ ఊహించలేదు.

తెల్లగా స్ఫటికంలా మెరుస్తూ బండ్లమీద ఊరేగిన రోజులు పదే పదే కళ్ళముందు మెదులుతున్నాయి.

ఉప్పమ్మ ... ఉప్పో అని బండివాడు ఒక్క కేక పెట్టడం ఆలస్యం ఇల్లాళ్ళందరూ బిలబిలమంటూ బయటికి వచ్చి శేర్లు శేర్లు కొనుక్కెళ్ళిన రోజుల్ని మరచిపోదామన్నా మరచి పోలేకపోతోంది అది.

తన పేరు ఎత్తకుండా, తన రుచి తగలకుండా మనుషులకు ఒక్క రోజు కూడా గడవకపోయేది. తను ఏ రోజైనా ఇంట్లో లేకపోతే ఆడవాళ్ళు మొగుళ్ళను ఎంతలా సాధించేవారు. ఉప్పు నిప్పు లేని సంసారం మేము చేయలేమని ఒకటే పోట్లాటలు కాదూ.

ఏ మాటకు ఆ మాట చెప్పుకోవాలి. తన వల్ల మనుషులు కష్టాలు పడ్డ సందర్భాలు కూడా ఉన్నాయి. ఉప్పు కోసమే కదా గిరిజనులు తమ సరుకుల్ని మొదటిసారిగా మార్పిడి

చేసుకుంది. ఎంత అమాయకులు వాళ్ళు. గాంధీగారిలా వాళ్ళూ సమీప సముద్రానికి వెళ్ళి ఉప్పు తయారుచేసుకుని ఉంటే ఇవ్వాళ కొండలు, అడవులు ఖాళీ చేయాల్సిన అగత్యమే వచ్చేది కాదు వాళ్ళకు.

ఉప్పు తక్కువైందనో ఎక్కువైందనో పెళ్ళాల్ని కొట్టి చంపే మగవాళ్ళ గురించి చదివినప్పుడు కూడా తనకు భలే బాధేసేది. ఉప్పును చేత్తో పట్టుకున్న మనుషులెవరూ అలా ప్రవర్తించరని తనకి తెలుసు.

వేమన గొప్ప కవి అంటారు కాని ఆయనకీ తన విలువ సరిగ్గా తెలియదని తన గట్టి నమ్మకం. 'ఉప్పు కప్పురంబు నొక్క పోలిక నుండు చూడ చూడ రుచుల జాడ వేరు' దాకా ఓకే గాని ఆ తర్వాత వాక్యంలో పురుషులందు పుణ్యపురుషులు వేరయా అంటాడేమిటి? భగ్గున మండే కర్పూరానికీ సమస్త ఆహార పదార్థాలనూ పాడవకుండా కాపాడే తనకూ మధ్య పోలికే తప్పు అనుకుంటే పైగా దాన్ని గొప్ప చేయడం.

అయినా ఇప్పుడు తనకొచ్చిన కష్టం కర్పూరం వల్ల కాదనుకో. కర్పూరం పొడిలా ఉండే అయొడిన్ ఉప్పే ఇప్పుడు తనను ఈ భూమ్మీద నుంచి తుడిచిపెట్టే ప్రయత్నం చేస్తోంది.

గాంధీగారు బతికుంటే ఇలా జరిగేదేనా? ఉప్పు మీద పన్ను వేశారనే అంత పెద్ద సత్యాగ్రహం చేశాడే... ఎక్కువమందికి అక్కర్లేని, పైపెచ్చు హాని కలిగించే అయొడిన్ ఉప్పును తెల్ల వ్యాపారస్తులు భారతీయుల నోట్లో బలవంతంగా కుక్కుతూ ఉంటే ఆయన ఊరుకునేవాడా?

తనకిప్పుడు ఎవరి మీదా ఆశ లేదు. చనిపోయేలోగా ఎవరో ఒక కవిని పట్టుకుని వేమన పద్యాన్ని మాత్రం మార్చి రాయించాలి.

ఉప్పు కల్లుప్పు నొక్క రంగు నుండు
చూడ చూడ వాటి గుణములు వేరు
మనుషులందు మంచి మనుషులు వేరయా
..................

ఇలా ఏదో ఒకటి రాయించాలి. కల్లుప్పు తిన్న విశ్వాసం ఉన్న కవి ఒక్కరైనా ఉండకపోతారా?

*28 మే 2006*

# అంకెలూ అంకెలూ ఎందుకమ్మా అలిగారు?

ఒకటి నుండి ఎనిమిది వరకు అంకెలన్నీ మిస్సింగ్.

రాష్ట్రమంతా గగ్గోలు.

టీచర్లకు ఒకటే ఆదుర్దా. స్కూళ్ళు తెరిచే రోజులు దగ్గరపడ్డాయి. అంకెలు కనబడకపోతే ఇంకేమైనా ఉందా? లెక్కల పాఠాలెలా చెప్పాలి? ఏ మొహం పెట్టుకుని క్లాస్ రూమ్‌లోకి వెళ్ళాలి?

ఎండాకాలంలో మంచినీళ్ళు, వర్షాకాలంలో పొడినేల, శీతాకాలంలో సూర్యుడు మాయమైనట్టు మాయమై పోయాయవి.

పట్టి తెచ్చిన వాళ్ళకి పదివేల రూపాయల నజరానా ప్రకటించారు పోలీసులు. మూడంకె వేసి పడుకున్న వాళ్ళను, ఆరున్నొక్క రాగంలో ఏడుస్తున్న వాళ్ళను అనుమానించి అరెస్టు చేశారు కూడా.

ఎన్ని లారీలు విరిగినా తొమ్మిది, పది, సున్న తప్ప వేరే ఏ అంకెల్నీ ఇటీవలి కాలంలో చూడలేదన్నారు అందరూ ఏకగ్రీవంగా.

అలుగుటయే ఎరుంగని అమాయకపు ప్రాణులైనా అలిగాయేమో ఎవరికెరుక అని స్కూళ్ళు, పార్కులు, మైదానాలు అన్నీ గాలించారు. రైల్వేస్టేషన్లు, బస్టాండుల వద్ద అలర్ట్ ప్రకటించారు.

ఒకటి నుండి ఎనిమిది వరకు అంకెల్ని గుర్తుపట్టగల స్పెషల్ పోలీసులను అంతరాష్ట్ర సరిహద్దుల దగ్గర కాపలా పెట్టారు. మరోవైపు గ్రేహౌండ్స్ లాంటి పోలీసు దళాలు అడవిని జల్లెడ పడుతున్నాయి. చెట్ల చాటున ఎక్కడైనా నక్కి ఉంటే ఎన్‌కౌంటర్ చేయకుండా తీసుకొచ్చి కోర్టులో అప్పజెపుదామని.

ఇంతలో అంకెల అదృశ్యం వెనక ఉన్న రహస్యం హైస్కూలు పిల్లలకు మాత్రమే తెలుసునని ప్రభుత్వానికి ఇంటలిజెన్స్ నివేదిక అందింది. వెంటనే స్కూలుకు ఇద్దరు పిల్లల చొప్పున తీసుకుని సెక్రటేరియట్‌కు రమ్మని ప్రిన్సిపాళ్ళకు కబురెళ్ళింది.

సెలవులు కదా. పిల్లలు ఎక్కడ దొరుకుతారు? ఇళ్ళకు ఫోన్లు చేసి మొత్తానికి ఎలాగైతేనేం రప్పించారు. పిల్లలు, వాళ్ళ తల్లిదండ్రులు, టీచర్లు అందరూ పాలోమంటూ ముఖ్యమంత్రి ఛాంబర్‌లోకి వెళ్ళారు.

సి.ఎం బాగా కోపంగా ఉన్నారు. జలయజ్ఞం మొదలు పెట్టినప్పటి నుంచి ఆయనకు అంకెలతో సాన్నిహిత్యం పెరిగింది. ఒక్కొక్క ప్రాజెక్టు మీద ఎన్ని కోట్లు ఖర్చుపెట్టాలి, ఏ తేదీ లోపల ముగించాలి ఇదొక్కటే రంథి కాబట్టి ఆయన బుర్ర నిండా అంకెలే. అలాంటి అంకెలు కనబడకుండా పోవడం ఎంత చికాకు! అవే మాయమయ్యాయో, ఎవరైనా ఎత్తుకుపోయారో కూడా తెలియదు. ఈ పిల్లలే ఏమైనా చేశారేమో....

అదే అడిగాడు.

పిల్లలు కాసేపు నిశ్శబ్దంగా ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. చివరికి ఒక అమ్మాయి అడిగింది మీరు ఈ మధ్య పేపర్లేవీ చూడలేదా అని.

ఈ పిల్లకు కూడా సెటైరా అనుకుని దానికీ దీనికీ ఏమిటి సంబంధం అన్నాడాయన.

చూస్తే మీకే తెలిసేది... టెన్త్ ఇంటర్మీడియెట్ ఫలితాలు వచ్చాయి. తొంభైలు వందలు వచ్చిన వాళ్ళ ఫోటోలు, ఇంటర్వ్యూలే మీడియా నిండా. ఆ రోజు రాత్రే మిగతా అంకెలు మీటింగ్ పెట్టుకున్నాయి. ఒకటి రెండు అంకెలకు మాత్రమే పట్టం కట్టే సమాజాలలో ఉండలేమని తీర్మానించుకున్నాయి. ఎటు వెళ్ళాయో మాకూ తెలియదు. కాని ఈ వివక్షను తొలగించి పిల్లలు, పెద్దలు మనస్ఫూర్తిగా ఆహ్వానించిన రోజే తిరిగి వస్తామని చెప్పాయి... చెప్పిందా పిల్ల.

*4 జూన్ 2006*

# ఇప్పుడింతే

మీ ఇంట్లో రేడియో ఉందా?

ఉంది.

కొత్తదా పాతదా?

రెండూ. ఒకటి మామూలు రేడియో ఒకటి వరల్డ్ స్పేస్ రేడియో.

టేప్ రికార్డర్? ఉంది. టు ఇన్ వన్ ఒకటి. వాక్‌మన్ ఒకటి.

మ్యూజిక్ సిస్టం? ఉంది. విత్ స్పీకర్స్.

సిడి ప్లేయర్? ఉంది.

డి.వి.డి? ఉంది.

అబ్బా... మీకు పాటలు వినడానికి చాలా టైం దొరుకుతుందనుకుంటా....

అబ్బే... ఎక్కడండీ... ఎప్పుడైనా టైం ఉంటే కారులో మాత్రం వింటా.

* * *

మీ ఇంట్లో మిక్సీ ఉందా? ఉంది.

గ్రైండర్..? ఉంది.

రోలు? అదీ ఉంది.

ఇడ్లీలు, దోసెలు, గారెలు ఎక్కువ చేసుకుంటారేమో...!

లేదండి.. ఎక్కువగా బయటే కొంటాం

పచ్చళ్ళకు, పొడులకు వాడతారేమో?

ఊహూ... బయట కొన్నవి తినడానికే టైం ఉండడం లేదు.

⁂

రోజూ వాకింగ్‌కు వెళతారనుకుంటా...

ఎక్కడండీ... రాత్రి పడుకునేసరికి ఒంటిగంట. ఇక పొద్దున్నే ఏం లేస్తాను...

మరి ఈ వాకింగ్ షూసూ, జాగింగ్ డ్రస్సులూ...

ఎప్పటికైనా వెళ్ళాలని కొనిపెట్టాను.

⁂

మంచి ఎన్‌సైక్లోపీడియా కొన్నారు. మీ పిల్లల కోసమా?

ఎక్కడండీ.. వాళ్ళకి క్లాస్ పుస్తకాలే సరిపోతాయి.

ఈ వయసులో కూడా కొత్త విషయాలు తెలుసుకోవాలని మీకింత ఆసక్తి ఉండడం నిజంగా విశేషం.

అబ్బే ... అంతలా పొగడకండి. ఆఫీసు ప్రాజెక్టులు చదివీ చదివీ ఇంటికొచ్చాక ఇంకేం చదవలేకపోతున్నానండి.

మరి అవన్నీ...

రిటైరయ్యాక టైం దొరుకుతుందేమోనని...

⁂

ఊరవతల మీకో చక్కటి ఫామ్ హౌస్ ఉందటగా... మీ పల్లెటూరి మూలాల్ని మరిచిపోయినట్టు లేరు. తరచూ వెళుతుంటారా?

లేదండి .. ఎప్పటికైనా ధర పెరుగుతుందని.

⁂

కొండమీద మంచి కాటేజి కట్టించారని విన్నాను. ఎంత సంపాదించినా దైవభక్తిని నిలుపుకోవడం మీ గొప్పతనం ...

అది ఇన్‌కంటాక్స్ కోసమండి. తెలిసీ తెలియక నేనేమైనా పాపాలు చేసుంటే క్షమించమని దేవుడ్ని నేను రోజూ ఇంట్లోనే కోరుకుంటాను కాబట్టి అక్కడి దాకా వెళ్ళనండి.

*16 జూలై 2006*

# లాభం[2]

ఒక యువకుడు తెగ కష్టపడుతున్నాడు. రాత్రింబవళ్ళు ఆఫీసులోనే ఉంటున్నాడు. కొత్తకొత్త ప్రాజెక్టులు చేస్తున్నాడు. వాటికోసం ఏ దేశం వెళ్ళమంటే ఆ దేశం వెళుతున్నాడు. ఏ భాషలో మాట్లాడమంటే ఆ భాషలో మాట్లాడుతున్నాడు.

భార్యాబిడ్డల్ని మరిచిపోవాల్సి వస్తే మరిచిపోయాడు. అమ్మానాన్నలను చూడకుండా ఉండాల్సొస్తే ఉన్నాడు. స్నేహితులను కలవకుండా ఉండాల్సొస్తే కలవడం మానేశాడు.

ఉన్న ఊరే సొంతూరు అనుకున్నాడు. ఉన్న దేశమే స్వదేశమనుకున్నాడు.

ఎప్పుడైనా చంద్రుడ్ని చూశాడేమో కాని సూర్యుణ్ణి అసలు చూడలేదు. ప్రయాణాలలో ఆకాశం నుంచి భూమిని చాలాసార్లు చూశాడు కాని భూమి మీద నుంచి ఆకాశాన్ని చూడ్డానికి వీలవలేదు అతనికి.

పక్షుల పేర్లు, పువ్వుల పేర్లు, మొక్కల పేర్లు అన్నీ మర్చిపోయాడు.

నిత్యం నాలుగు గోడల మధ్యే.

చాలా కంపెనీలు పెట్టాడు. వేలాది మందికి పని కల్పించాడు.

కొన్నేళ్ళకు వృద్ధుడయ్యాడు.

ఒకసారి మనవడు కాబోలు వచ్చి అడిగాడు తాతా ఎంత సంపాదించావని. అడిగింది మనవడు కాబట్టి ముచ్చటపడి ఉన్నదంతా లెక్కేశాడు. ఆస్తులన్నీ కూడాడు. కోట్ల కోట్లు ఉన్నాయి.

'డబ్బు కాదు' అన్నాడు మనవడు.

'నా కీర్తికేం తక్కువ? డబ్బు కంటే అదే ఎక్కువ' అన్నాడు.

'ఇంకా ఎక్కువ కీర్తి రావాలంటే ఒక మార్గముంది' అన్నాడు మనవడు.

'ఏమిటి?' అన్నాడు కోట్ల కోట్ల కోటీశ్వరుడు.

'ఆ డబ్బును దానం చెయ్యడమే' అన్నాడు మనవడు.

కోట్ల కోట్ల కోటీశ్వరుడు బాగా ఆలోచించాడు.

ఇదీ బాగానే ఉందనుకున్నాడు. అలాగే ఇచ్చేశాడు.

అనుకున్నట్లుగానే మరింత కీర్తి వచ్చింది.

⁂ ⁂ ⁂

ఇప్పుడతను ధన కోటీశ్వరుడే కాక కీర్తి కోటీశ్వరుడు కూడా అయ్యాడు. అంటే రెండు విధాలా లాభపడ్డాడు. ఇందుకోసం ఎందర్ని కష్టపెట్టావని మాత్రం అతన్ని ఎవరూ అడగలేదు. అలాగే ఏం కోల్పోయావని కూడా ఎవరూ అతన్ని అడగలేదు.

*30 జూలై 2006*

# ఇట్లు...

ఎంతమంది చనిపోతే ఒక సమస్యకు గుర్తింపు వస్తుందని గణాంక శాస్త్రవేత్తల మధ్య ఒకసారి చర్చ వచ్చింది.

ఒక్కొక్కరు ఒక్కొక్క నిర్వచనం ఇస్తున్నారు. ఎవరి నిర్వచనానికి సరిపోయే ఉదాహరణ వాళ్ళు చెపుతున్నారు.

రైతుల ఆత్మహత్యలు మొదట ప్రస్తావనకు వచ్చాయి. 'ఆత్మహత్యలనగానే రైతులు గుర్తొచ్చేంతగా రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయి కాబట్టి ఏటా 4000 మంది చనిపోతే ఒక సమస్యకు బాగా గుర్తింపు వస్తుంద'ని తేల్చాడు ఒకాయన.

రైతుల మీద నాకు కూడా చాలా సానుభూతి ఉంది కాని మీరు చెప్పిన దానితో నేను ఏకీభవించలేను. ఎందుకంటే విద్యార్థులు కూడా దాదాపు అంతే సంఖ్యలో ఆత్మహత్యలు చేసుకుంటున్నా వారి సమస్యకు అదే స్థాయి గుర్తింపు రాలేదు కదా' అన్నాడు ఇంకొకాయన. అంతే సంఖ్యలో అని ఎలా చెప్పగలరని ఎవరో అడిగారు. ఒక పత్రికను, ఒక ఎన్‌జిఓను, ఒక పరిశోధకుల బృందం చేసిన అధ్యయనాన్ని ఉటంకించి నిజానికి ఆత్మహత్యలు చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్యే రైతుల కంటే ఎక్కువ

అన్నాడాయన. అమెరికాకి వెళ్ళే విద్యార్థులకు వచ్చే పబ్లిసిటీ వీళ్ళకు ఎందుకు రాదో ఎన్ని అధ్యయనాలు చేసినా తనకి అర్థం కాలేదని కూడా చెప్పాడు.

ఇంకొకాయన లేచి దేశానికి ఇంతమంది సైనికులు, పోలీసులు ఎందుకున్నారో రిటైర్‌మెంట్ దగ్గర పడుతున్నా తనకు బోధపడలేదన్నాడు. ఇరవై ఏళ్ళుగా సియాచిన్ మంచుగడ్డలకు కాపలా కాసే బదులు, ప్రజాసేవ స్పెల్లింగ్ తెలియని రాజకీయ నాయకులకు రక్షణ కల్పించే బదులు రోడ్డుమీది కొచ్చి నిలబడి ట్రాఫిక్‌ను సరిగా నియంత్రిస్తే వాళ్ళు ఏటా లక్షలమంది ప్రాణాలను కాపాడొచ్చన్నాడు. రోడ్ల గురించి మాట్లాడేటప్పుడు డొంక తిరుగుడు వద్దని ఒక పెద్దాయన సలహా ఇచ్చాడు. సరే అయితే... భారతదేశంలో ఏటా జరిగే రోడ్డు ప్రమాదాల్లో లక్షమంది దాకా చనిపోతున్నారు. పది లక్షల మందికి పైగా తీవ్రంగా గాయపడుతున్నారు. ముంబై లోకల్ రైళ్ళ నుంచి కిందపడి రోజుకు పదిమంది చచ్చిపోతున్నారు. మరి ఇవేవీ పెద్ద సమస్యలుగా ఎందుకు గుర్తింపు పొందడం లేదని అడిగాడు.

నీరసించి లెక్కలు తీయడం మానేశారు కాని స్త్రీల మరణాల సంఖ్యా తక్కువేం కాదు అని ఒక లేడీ గణాంకవేత్త కూర్చునే మైకులో చెప్పింది.

మీరంతా సంఖ్యలకు ఎక్కువ విలువ ఇస్తున్నారు. ఎంత జనాభాలో ఎంత మంది బలవన్మరణాల పాలవుతున్నారనే లెక్కలు తీయడం సరైన పద్ధతి అని చెప్పాడు ఓ బడుగు వర్గాల అధ్యయన గణాంకవేత్త. నిష్పత్తి లెక్కల ప్రకారం చూస్తే ఆదివాసులు, మావోయిస్టులు ఎక్కువ మంది చనిపోతున్నారని, అయినా వారి సమస్యలకు తగిన గుర్తింపు రావడం లేదన్నాడు.

ఇంకా చాలాసేపు జరిగిందా చర్చ. చివరికి వాళ్ళొక తీర్మానం చేసుకున్నారు.

అంకెల్ని బట్టి సమస్యకు గుర్తింపు రాదు. వయస్సును బట్టి సమస్యకు గుర్తింపు రాదు. ప్రాంతాన్ని బట్టి సమస్యకు గుర్తింపు రాదు. జెండర్‌ను బట్టి సమస్యకు గుర్తింపు రాదు. సిద్ధాంతాన్ని బట్టి కూడా సమస్యకు గుర్తింపు రాదు.

ఇంతవరకు స్పష్టం. అయితే దేనివల్ల ఒక సమస్యకు ఎక్కువ గుర్తింపు వస్తుందో ఈ సమావేశం తేల్చలేకపోతోంది. ఇది కేవలం రాజకీయవేత్తలు నిర్ణయించే ప్రాధాన్యాలను బట్టి జరుగుతోందని ఈ సమావేశం అనుమానపడుతోంది.

**ఇట్లు....**

*6 ఆగస్టు 2006*

# గుంతలే కాని ఇంకుడు గుంతలు కావు

ఆకాశంలో నక్షత్రాలను లెక్క పెట్టలేనట్టే భూమి మీద లెక్క పెట్టలేనివి ఏమిటి?

ఒక టి.వి యాంకర్ పదే పదే అడుగుతోంది ఈ ప్రశ్నను. సమాధానం తెలిసినవారు 00000 00001 కి ఎస్ఎంఎస్ చేయాలని లేదా 001 నెంబరు పోస్టు బాక్స్‌కి ఉత్తరం రాయాలని చెబుతోంది.

మర్నాడు కూడా ఆవిడ మళ్ళీ అదే ప్రశ్న అడుగుతోంది. ఎవరూ సమాధానం చెప్పలేకపోతున్నందువల్ల ఒక క్లూ ఇస్తానంది. అదేమిటంటే గుంతలే కాని ఇంకుడు గుంతలు కావు అంది. వెంటనే వందలాది ఎస్ఎంఎస్‌లు, వేలాది పోస్టుకార్డులు ఆవిడ చెప్పిన నెంబర్లకు వెళ్ళాయి. దాదాపు అందరూ 'రోడ్ల మీద గుంతలు' అని కరెక్టు సమాధానమే పంపారు.

అందరూ కరెక్టు సమాధానమే పంపారు కాబట్టి గుంతల గురించి మరికొన్ని ప్రశ్నలు అడుగుతాం. ఎక్కువ జవాబులు కరెక్టుగా చెప్పిన వారికి ఒక సువర్ణావకాశం లభిస్తుందని చెప్పింది ఆ చిన్నది.

సువర్ణం పేరు వినబడగానే అందరూ ఊపిరి బిగబట్టి ఆ ప్రశ్నల కోసం ఎదురు చూడడం మొదలుపెట్టారు.

✪ **పలుగూ పారా పట్టకుండా గుంతలు తవ్వడం సాధ్యమా?**

❑ సాధ్యం ❑ అసాధ్యం ❑ తెలియదు

✪ **అతి తక్కువ వ్యవధిలో అతి ఎక్కువ గుంతలు పడేలా చేయగలిగిన వాళ్ళెవరు?**

❑ మునిసిపాలిటీవాళ్ళు ❑ సెల్‌ఫోన్ల వాళ్ళు ❑ కాంట్రాక్టర్లు

❑ పై ముగ్గురూ ❑ తెలియదు

✪ **ఈ రోజు పొద్దున వర్షం వెలిసే సమయానికి మీ వీధిలో ఎన్ని గుంతలున్నాయి?**

❑ 20 లోపు ❑ 50 కి పైగా ❑ దాదాపు వంద ❑ తెలియదు

✪ **గుంతల్ని సైజుల వారీగా గుర్తించడం మీకొచ్చా? మీ వీధిలో ఈ కింద సైజుల్లో ఎన్నేసి గుంతలున్నాయి?**

❑ చిన్న ❑ మధ్యతరహా ❑ పెద్ద (XL, XXL)

❑ అంత నైపుణ్యం ఇంకా అలవడలేదు

✪ **ప్రస్తుత వర్షాకాలంలో మీ పట్టణంలో ఈ గుంతల్లో పడి ప్రాణాలు కోల్పోయిన లేదా గాయపడిన వారి సంఖ్య (ఫోటోలు తప్పనిసరిగా జతపరచాలి)**

❑ పది ❑ ఇరవై ❑ తెలియదు

**గమనిక :** డ్రైనేజి, వాటర్‌వర్క్స్, ఫోను, సెల్‌ఫోను కంపెనీల ఉద్యోగులు, రోడ్డు కాంట్రాక్టులు చేసే కంపెనీల సిబ్బంది ఈ క్విజ్‌లో పాల్గొనడానికి అనర్హులు.

**మరో గమనిక :** ఈ క్విజ్‌లో గెలిచిన వాళ్ళకు మాత్రమే ఈసారి మీమీ నగరాలు లేదా పట్టణాలలో జరిగే రన్‌లలో పాల్గొనే అవకాశం ఉంటుంది. లేకపోతే మిడిమిడి రోడ్డు జ్ఞానంతో గుంతల్లో బొక్కబోర్లా పడిపోయే ప్రమాదముంది. (అంటే బొక్కలిరిగేలా బోల్తా పడడమన్న మాట).

*13 ఆగస్టు 2006*

# తపోత్సవాలు

ఆయన అన్నీ వెరైటీగా చేస్తాడు.

తను తప్పటడుగులు వేయడం మొదలుపెట్టి అరవై ఏళ్ళయిందని ఆ మధ్య షష్ఠిపూర్తి జరుపుకున్నాడు. వక్తలకు ఏం మాట్లాడాలో తోచలేదు. చివరికి ఒకాయన తప్పటడుగులు వేరు తప్పు అడుగులు వేరు, మనుషులు ఎన్ని తప్పటడుగులైనా వేయొచ్చు కాని ఒక్క తప్పు అడుగు కూడా వేయకూడదు. ఆ సందేశం ఇవ్వడానికే మాస్టారు ఈ సభ పెట్టారని గడగడా చెప్పేసి కిందికి దిగిపోయాడు. మిగతా వాళ్ళు కూడా అదే ధోరణిలో మాట్లాడి అదనంగా ఆయన నిజాయితీని, హాస్యచతురతను కూడా మెచ్చుకుని బతుకుజీవుడా అని బయటపడ్డారు.

ఆయనే మరోసారి 'అవనత శిరస్సు రజతోత్సవాల'ని మరో సభ పెట్టి తనకు తెలిసిన వాళ్ళందర్నీ ఆహ్వానించాడు. బోలెడన్ని అక్షింతలు కలుపుకుని దీవించడానికి వెళ్ళిన సభికులు వాటిని ఎవరి మీద వెయ్యాలో తెలియక తమ కాళ్ళమీద తామే పోసుకుని బయటపడ్డారు. అది జీవితంలో ఆయన తలదించుకున్న సందర్భాల జ్ఞాపకార్థమట.

అలాగే విమర్శల స్వర్ణోత్సవమని, ఆరోపణల వజ్రోత్సవమని ఆయన ఎప్పటికప్పుడు సభలు పెడుతుంటాడు. తను చేసిన వాటికీ, తనపై వచ్చిన వాటికీ కూడా.

ఈ సంప్రదాయాన్ని ఇప్పుడు తన ఒక్కడికే పరిమితం చేయదలచుకోలేదాయన. సమాజం కూడా తన తప్పులను తాను గుర్తించే కార్యక్రమాలను ఏర్పాటు చేయడం ప్రారంభించాడు.

వీధివినాశన శతదినోత్సవం అని పెద్ద బ్యానర్ రాయించి ఆ మధ్య కాలనీ మొదట్లో తోరణంలా కట్టాడు. సైకిల్ వెళ్ళేంత జాగా కూడా లేకుండా రోడ్డు పాడయిపోయి ఆ నాటికి వంద రోజులైందట.

పచ్చదన విధ్వంసానికి పదహారేళ్ళు పేరుతో ఒకరోజు రోడ్డు మధ్యలో ఒక సభ పెట్టాడు. మునిసిపాలిటీ వాళ్ళు అక్కడి వేపచెట్టును కూల్చేసి ఆ రోజుకు పదహారేళ్ళయిందట. కోల్పోయిన ప్రాణవాయువుకు గుర్తుగా అక్కడో చెట్టు బొమ్మ కూడా తగిలించాడు.

బావులకు ద్విదశాబ్ది, చెరువులకు త్రిదశాబ్ది, నదులకు చతుర్దశాబ్ది పేరుతో మనం కోల్పోయిన వాటన్నిటికీ పండగలు చేస్తూ ఊరూరా తిరుగుతున్నాడాయన ఇప్పుడు. మాయమైన ఊళ్ళకు మ్యూజియాలు ఏర్పాటు చేయాలనే ఆలోచనలో కూడా ఉన్నాడాయన. ముందే చెపితే కన్సల్టెన్సీ పేరుతో ఆయా ఊళ్ళను మింగిన సంస్థలే ప్రభుత్వంతో ఎక్కడ ఒప్పందం కుదుర్చుకుంటాయోనని కొంచెం కూడా విషయం బయటకు పొక్కకుండా గుంభనంగా ప్లాన్ చేస్తున్నాడట.

⁂ ⁂ ⁂

పాటకు పదేళ్ళు, రచనకు వందేళ్ళు, సంస్థకు రెండు వందల ఏళ్ళు జరుపుకోవడంలో తప్పు లేదు కాని మనం చేస్తున్న తప్పులకు కూడా అంతే దీర్ఘకాల ప్రభావం ఉంటుందని గుర్తుంచుకుందాం.

*15 అక్టోబరు 2006*

# గెలుపోటములు

గెలుపుదేముంది... ఓడడమే కష్టం.

గెలిస్తే అందరూ చప్పట్లు కొడతారు. నెత్తిమీద కిరీటాలు పెడతారు. మెడలో పూలమాలలు వేస్తారు. చేతుల్లో అవార్డులు పెడతారు. జేబుల్లో డబ్బులు పెడతారు. పక్కన నిలబడి ఫోటోలు తీసుకుంటారు. దూరంగా నిలబడి ముద్దులు విసిరేస్తారు. అమ్మ నుంచి క్షామం దాకా అన్నిటి మీద అభిప్రాయాలు అడిగి తెలుసుకుంటారు.

కాని ఓడితే అలా కాదే.

అవతలి వాడి కోసం కొట్టిన చప్పట్లు వినాలి. వాడి నెత్తిమీద పెట్టే కిరీటాన్ని చూడాలి. వాడి మెడలో పడే పూలదండల వాసనను పీల్చాలి. అవార్డు కోసం ముందుకు రాబోయిన తన కుడిచేతిని ఎడమ చేత్తో గట్టిగా పట్టుకుని ఆపుకోవాలి. ఖాళీ జేబుల వంక చూసుకోకుండా దుఃఖాన్ని అదిమి పెట్టుకోవాలి. వెలగని ఫ్లాష్‌లైట్లను, దగ్గర్నించి కూడా గుర్తుపట్టని మనుషుల్ని చూసీ చూడనట్టుగా నిలబడాలి. పదే పదే గుర్తొచ్చినా సరే అమ్మా ... అని ఏడవకుండా ఉండాలి.

ఇప్పుడు చెప్పండి ఏది ఎక్కువ కష్టం?

అందరూ గెలిచేవాడి కష్టాన్నే గుర్తిస్తున్నారు కాని ఓడేవాడి కష్టాన్ని గుర్తించడం లేదు. ఎందరు ఓడితే ఒకడు గెలుస్తాడు?

*10 డిసెంబరు 2006*

# ఫామో'పీడి'యా (Formopedia)

మీ పేరేంటి? మీరు ఆడా మగా? మీ వయసెంత? మీ పుట్టినరోజు ఎప్పుడు? టెన్త్ ఎప్పుడు పాసయ్యారు? ఏ ఊళ్ళో పాసయ్యారు? ఎన్నోసారి రాసి పాసయ్యారు? డిగ్రీ, పీజీ, ఇంకేమేం చదివారు? ఎన్ని మార్కులొచ్చాయి? అన్ని సర్టిఫికేట్లూ ఉన్నాయా? ఒరిజినల్సా డూప్లికేట్లా? అన్నీ తలా ఒక కాపీ పెట్టండి.

పెళ్ళయిందా? ఎప్పుడు? మేరేజి సర్టిఫికెట్ తీసుకున్నారా? మీ భార్య లేదా భర్త పేరేమిటి? వాళ్ళ వయసెంత? చదువు? ఊరు? ఉద్యోగం? అత్తమామలు ఏం చేస్తారు? మీది ఉమ్మడి కుటుంబమా? లేక వొంటికాయ శొంఠికొమ్ములా ఇద్దరే ఉంటారా? అన్నిటికీ సర్టిఫికేట్లు జత చేయండి.

పిల్లలున్నారా? వాళ్ళ వయస్సెంత? ఆడా మగా? బర్త్ సర్టిఫికేట్ తీసుకున్నారా? అన్ని వాక్సిన్లూ వేయించారా? మీ నామినీలుగా వాళ్ళనే పెడతారా ... ఇంకెవర్నయినా పెడతారా? వాళ్ళకు గార్డియన్‌గా మీరే ఉంటారా? లేక అమ్మమ్మ, తాతయ్య, నాయనమ్మ లాంటి వాళ్ళెవరినైనా పెడతారా? జాగ్రత్తగా చూసి బాక్సుల్లో టిక్కులు పెట్టండి.

ఇంటిమీద అప్పు ఉందా? కారు మీద? స్థలం మీద? మొత్తం ఎంత ఉంది? ఎవరెవరి పేర్ల మీద ఉంది? ఏయే బ్యాంకుల్లో ఉంది? ప్రైవేటు అప్పులు కూడా ఉన్నాయా? ఆయా పత్రాల జిరాక్స్‌లు జతచేయండి.

పాన్‌కార్డు ఉందా? క్రెడిట్ కార్డు ఉందా? బ్యాంకు అకౌంట్ ఉందా? ఎల్‌ఐసి ఉందా? హెల్త్ ఇన్సూరెన్స్ ఉందా? రేషన్ కార్డు? డ్రైవింగ్ లైసెన్సు? సి-బుక్? పాస్‌పోర్టు? వీసా? టెలిఫోన్ బిల్లు, గాస్‌బండ రసీదు, కరెంటు బిల్లు, మునిసిపల్ టాక్స్ రసీదు, ఓటరు గుర్తింపు కార్డు.... అన్నీ జస్ట్ ఒక్కొక్క కాపీ తీసి అటాచ్ చేయండి.

ఇంకేం మిగిలినై? ఆ.... అన్నట్టు పెళ్ళి కాకముందు మీ అమ్మగారి ఇంటి పేరు ఏమిటో కూడా రాయండి. ఫోటోలు సంగతి మీకు తెలిసే ఉంటుంది. రెండు పాస్‌పోర్టు సైజువి, రెండు స్టాంపు సైజువి, రెండు బ్లాక్ అండ్ వైట్‌వి.

ఈ మధ్య వేలిముద్రలు కూడా తీసుకోమని కొత్త రూల్ పెట్టారు. దయచేసి అవి కూడా సంతకాలు పెట్టిన ప్రతి చోటా వాటి పక్కనే కుడి లేదా ఎడమ బొటనవేలిని బ్లాక్ స్టాంపు పాడ్ మీద అద్ది జాగ్రత్తగా పెట్టండి. జస్ట్ సేఫ్ సైడ్‌గా... ఫోర్జరీల నుంచి ప్రొటెక్షన్ కోసం.

ఓకె. ఇంక మీరు వెళ్ళొచ్చు.
మీరు ఈ దేశ పౌరులే.

⌘ ⌘ ⌘

ఇలాంటి ఒక్క దరఖాస్తు చాలదూ బయోగ్రఫీ రాయడానికైనా, ఆటోబయోగ్రఫీ రాసుకోవడానికైనా.

*18 ఫిబ్రవరి 2007*

* *అప్పటికింకా ఆధార్ కార్డు రాలేదు. ఐరిస్ స్కానింగ్‌లు, ముఖ స్కానింగ్‌లు కూడా రాలేదు.*

# తాత ముత్తాతల తరఫున....

'ఆఫ్రికా చాలా అందంగా ఉంటుందా నాన్నా' అని అడుగుతోంది ఒక బ్రిటిషమ్మాయి వాళ్ళ నాన్నను.

'అందంగా ఉంటుందని కాదు తల్లీ వెళ్ళేది' చెప్పాడా తండ్రి.

'అడవులు చూపెట్టాలని తీసుకెళుతున్నావా' మళ్ళీ అడిగింది ఆ అమ్మాయి.

'కాదమ్మా'.

'జంతువుల్ని చూపెట్టాలనా?'

'కాదమ్మా'.

'మరి?'

'వాళ్ళకు క్షమాపణ చెప్పి వద్దామని.'

'ఎందుకు? ఏం తప్పు చేశావు?'

'నేనేం చేయలేదు. మా ముత్తాతలు చేశారు.'

'దానికి నువ్వెందుకు చెప్పడం?'

'వాళ్ళకు తప్పని తెలియదు కనుక అప్పుడు చెప్పలేక పోయారు. ఇప్పుడు మనకు తెలుసు కాబట్టి చెపుదాం.'

'ఇంతకీ ఏం తప్పు చేశారు?'

'అక్కడి మనుషుల్ని బానిసలుగా తీసుకొచ్చి ఇక్కడ అమ్మేవారు. అలా తీసుకు వచ్చేటప్పుడు చాలామంది దారిలో చనిపోయారు కూడా.'

'అయ్యో ... మరి వాళ్ళు క్షమిస్తారా నాన్నా?'

'తెలియదు తల్లీ. వాళ్ళు క్షమించకపోయినా చెప్పాల్సిన బాధ్యత మనకుంది కదా!'

ఏ నాటకంలో సంభాషణలు ఇవి అని ఆశ్చర్యపోకండి. చరిత్ర రంగస్థలంపై అప్పుడప్పుడు ఇలాంటి ఘట్టాలూ ఉంటాయి.

* * *

గత కొంతకాలంగా ఇలాంటి క్షమాపణల పర్వం ఒకటి ప్రపంచంలో నడుస్తోంది. పోప్ జాన్‌పాల్ - 2 తో మొదలుపెట్టి జపాన్ చక్రవర్తి, అమెరికా అధ్యక్షుడు, బ్రిటన్ ప్రధాని, దక్షిణాఫ్రికా మాజీ పాలకుడు, పైన చెప్పిన ఆ తండ్రి దాకా ఎందరో ప్రముఖులు, సంపన్నులు తమ తమ జాతుల తరపున, దేశాల తరపున, మతాల తరఫున, కుటుంబాల తరఫున గత తప్పిదాలకు క్షమాపణలు కోరుతున్నారు. కొందరైతే చేతులకు గొలుసులు కట్టుకుని మోకాళ్ళ మీద వంగి మరీ క్షమించమని బాధితుల వారసులను వేడుకుంటున్నారు.

ఇన్ని శతాబ్దాల తర్వాత ఈ క్షమాపణల వల్ల వాళ్ళకు ఒరిగేదేమిటని అనుకోవచ్చు మనం. నిజమే. వాళ్ళకు ఒరిగేదేమీ లేదు. కాని మనకు ఒరిగేదే ఒకటి ఉంది. ఇప్పుడు మనం చేసే తప్పులకు మన మనవళ్ళు, మునిమనవళ్ళు రేపు ఇంకొకరి ముందు చేతులు కట్టుకుని క్షమాపణ చెప్పే పరిస్థితి లేకుండా చూసుకోగలగడం ఒక్కటే దీన్నించి మనం నేర్చుకోవాల్సిన జ్ఞానం.

*8 ఏప్రిల్ 2007*

# వృక్ష విలాసం

ఎండాకాలం రావడానికి చాలాముందే దట్టమైన ఓ అడవిలో జరిగిందా సభ.

అది ఇంకెక్కడ జరిగినా ఈ పాటికి మీకు తెలిసుండేదే. అడవిలో జరగడం వల్లా, అక్కడ చెట్లు ఉండడం ఇంకా ఆశ్చర్యకరమైన విషయం కానందువల్లా ఏ ఇన్ఫార్మరూ దీని గురించి పోలీసులకు గాని, మీడియాకి గాని చెప్పలేదట. ఏమైతేనేం సభ సజావుగా జరిగి వారు ఈ కింది తీర్మానాలు విడుదల చేశారు.

అ. పెద్దవాళ్ళను అగౌరవపరిచే ధోరణి మనుషుల్లో లాగ వృక్షజాతిలో కూడా పెరుగుతోంది. నగరవాసులు లాన్‌గడ్డిని, కుండీ మొక్కల్ని ఎక్కువ ఆదరిస్తున్నంత మాత్రాన మహావృక్షాల కంటే తాము అధికులమని అవి విర్రవీగరాదు. తమ స్వప్రయోజనాల కోసం మనుషులు కొన్ని రకాల మొక్కల్ని ప్రోత్సహించడం అనాదిగా వస్తున్నదేనని యావత్ వృక్షజాతి గుర్తుంచుకోవాలి.

ఆ. చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకునే వాళ్ళకు మనలో ఏ ఒక్కరూ నీడనివ్వరాదు. మన పేర్లు కూడా వాళ్ళకు తెలియకుండా జాగ్రత్తపడగలిగితే మరీ మంచిది.

ఇ. కాయలున్న చెట్టుకే దెబ్బలు అని తమ దుశ్చర్యలను సమర్థించుకోవడాన్ని ఇకపై క్షమించకూడదు. మంచి పనులు చేసే మనుషుల మీద దాడి చేయడానికే ఈ మాటను ఎక్కువగా వాడుతున్నారని గమనించండి. కాయలున్నా లేకున్నా చెట్లను రాళ్ళతో కొట్టడం నాన్ బెయిలబుల్ నేరంగా పరిగణిస్తూ వృక్షజాతి శిక్షాస్మృతిని సవరించుకుందాం.

ఈ. తాటిచెట్టులా పెరిగావు, తులసివనంలో గంజాయి మొక్క, గుమ్మడికాయంత తెలివి కంటే గురివిందంత అదృష్టం మేలు లాంటి చెట్లను, మొక్కలను కించపరిచే సామెతల్ని, పోలికల్ని మనుషులు ఉపయోగించడం మానుకోవాలి. కొందరు తులసిని ఎక్కువ గౌరవించినంత మాత్రాన గంజాయిని కించపరచాల్సిన అవసరం లేదు. దేని ఉపయోగాలు దానివి. ఈ విధమైన పోలికలు పెట్టి మన మధ్య ఐక్యతను దెబ్బ తీసే ప్రయత్నాలను మనం సహించకూడదు.

ఉ. లాస్ట్ బట్ నాట్ లీస్ట్ (చివర్లో చెప్పినప్పటికీ ముఖ్యమైనదని అర్థం) నారు పోసిన వాడికే ఫలము... నీరు పోసిన వాడికే నీడ అనేది ఇకపై మన నినాదం. బుష్షే వచ్చి (పొద కాదు) మనకు అప్పులిచ్చినా ఇందులో మార్పు ఉండదు కాక ఉండదు.

వృక్షో రక్షతి రక్షితః

*29 ఏప్రిల్ 2007*

# నెమలికన్ను ప్రయాణాలు

ఎండాకాలం సెలవులకు ఎటు వెళ్ళాలో తేల్చుకోలేకపోతోంది ఆ కుటుంబం.

ఊరెళ్లి అమ్మను చూడాలని ఆవిడా...

వాళ్ళ నాన్న వ్యవసాయం చేసిన భూముల్ని చూడాలని ఆయనా...

అడవుల్లో ట్రెక్కింగ్ చేద్దామని కొడుకూ...

ప్రపంచం చుట్టి వద్దామని కూతురూ...

.... అందరిదీ తలొక అభిప్రాయంగా ఉంది.

ఎవరి కారణాలు వారివి.

అమ్మ ఇంకెన్నాళ్ళో బతకదు కాబట్టి ఈ నెల్లాళ్ళయినా దగ్గరుండాలని ఆవిడ కోరిక.

ఆ పొలాలు ఇక ఎప్పటికీ కనబడవు. రోడ్డు కోసమో ప్రాజెక్ట్ కోసమో అవి మాయమయ్యేలోపు వాటిని కళ్ళారా చూడాలని, పిల్లలకు చూపించాలని ఆయన కోరిక.

ఇక ముందు అడవులు ఉండవని, ఆదివాసులు ఉండరని, అమెరికా వెళ్ళేముందు జీవితంలో ఒక్కసారైనా అడవుల్నీ, ఆదివాసుల్నీ చూడాలని ఆ అబ్బాయి కోరిక.

కూతురికి పర్యావరణ ధ్యాస ఎక్కువ. గ్లోబల్ వార్మింగ్ గురించి ఇంటర్నెట్‌లో చదివీ చదివీ మొత్తం ప్రపంచమే మటుమాయమై పోతుందనే భయం పట్టుకుంది ఆ అమ్మాయికి. మంచుఖండాలు కరిగిపోతాయి. వాతావరణం వేడెక్కుతుంది. కరువు కాటకాలు రాబోతాయి. అనేక జీవరాశులు కనుమరుగై పోతాయి.... వంటి విషయాలు తెలుసుకున్నప్పట్నించీ మొత్తం ప్రపంచాన్ని ఒక్కసారైనా చుట్టి రావాలనే కోరిక పట్టుకుంది ఆమెకు.

టూరిజం పెరగడానికి మనుషుల సంపాదన పెరగడం ఒక్కటే కారణమను కుంటున్నారు చాలామంది. కాని నిలుపుకోలేని వాటి పట్ల ప్రేమ, కోల్పోబోయే అనుభవాల పట్ల ఆసక్తే మనుషులను ఈ ప్రయాణాలకు ఎక్కువ పురిగొల్పు తున్నాయేమో ఆలోచించండి.

*6 మే 2007*

# పిల్లా... నా వల్ల కాదు

వామ్మో ... ఈ నేల మీద ఆడపిల్లను ప్రేమించడం నా వల్ల కాదు.

అందరిలోకి అందమైన ఆడపిల్లను... అతి తక్కువ దుస్తులు వేసుకున్న అల్లరి పిల్లను ఈ రోడ్ల మీద ఎక్కడని వెతికి పట్టుకోను....

కనబడ్డా ఐ లవ్ యు అంటూ ఈ ట్రాఫిక్‌లో ఆవిడ వెంట ఎక్కడ పడను....

అర్జెంటుగా బట్టలు మార్చేసుకుని అన్ని ప్రపంచ నృత్యరీతుల లోను డాన్స్ చేస్తున్నట్టు ఈ సెల్‌ఫోన్ మోతల మధ్య ఎక్కడ కలలు కనను...

హైజంప్, లాంగ్ జంప్‌ల స్పెల్లింగులే రాని నేను అర్ధరాత్రి పరాయింటి బెడ్‌రూమ్‌లోకి దూరి ముద్దు పెట్టుకుని ఆ అమ్మాయి అరిచేలోపు ఎక్కడ అంతర్ధానమవను...

దొంగా పోలీసు గాని, నేలా బండా గాని, ఆఖరికి దాగుడు మూతలు గాని ఏదీ ఇంతవరకు ఆడని నేను వాళ్ళింటి కుక్కల్నించి, రౌడీల నుంచి ఎలా తప్పించుకుని పారిపోను...

ఉల్లిపాయలే తరగలేని నేను అన్ని దేశాల వారి అన్ని ఆయుధాలనూ ఉపయోగించి మనుషుల కుత్తుకలను ఎలా నరకను....

తెలుగు గూండాలనే కన్నెత్తి చూడలేని నేను బీహారీ షేర్‌లతో ఎలా తలపడగలను...

ఇవన్నీ చేసినా -

తీరా వాళ్ళ నాన్న స్మగ్లర్ కాకపోతే ...

అన్న పేరు మోసిన గూండా కాకపోతే ...

కాల్చి వాతపెట్టే మేనత్త ఆమెకు లేకపోతే ...

ఆఖరి క్షణంలో విమానం దిగే బావ లేకపోతే ...

ఎలా ... నేను ప్రేమించడమెలా ...

నాకు పెళ్ళవడమెలా ?

⁂

తెలుగు సినిమాలన్నీ చూసిన ఓ యువకుడి నిర్వేదం.

*29 జూలై 2007*

# ‘ఆదా’యం

చాలా మందికి వృథా చేయడం ఇష్టముండదు.

అది డబ్బు కావొచ్చు. ఆహారం కావొచ్చు. వస్తువులు కావొచ్చు. సమయం కావొచ్చు. మాటలు కావొచ్చు.

కాని చాలాసార్లు మన చేతిలో ఏముండదు.

అందరూ సంపాదిస్తున్నారు కదా అని అవసరమున్నా లేకపోయినా మనమూ సంపాదిస్తుంటాం.

అన్ని రకాల పదార్థాలు పెట్టినప్పుడు కొన్నయినా రుచి చూడకపోతే ఎలా అనుకుని అవసరానికి మించి పెట్టుకుని వదిలేస్తుంటాం.

ఫంక్షన్‌కి పిలిచినప్పుడు ఒట్టి చేతులతో వెళితే ఏం బాగుంటుందని ఏదో ఒకటి కొనుక్కుని వెళ్ళి అవతలి ఇంటిని ఎన్నో అనవసర వస్తువులతో నింపేస్తాం.

అందరూ చూసిన సినిమాను మనం చూడకపోతే ఎలా, అందరూ వెళ్ళిన చోటుకు మనం వెళ్ళకపోతే ఎలా అనుకుని విలువైన కాలాన్ని ఎంతగానో వృథా చేస్తాం.

మాటల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే లేదు.

కమ్యూనికేషన్ పేరుతో జరుగుతున్నదంతా 24/7 మాటల కుంభవృష్టే.

మరి దీన్నించి బయటపడడమెలా?

పనికొచ్చే ప్రతి వస్తువునూ ఉపయోగించుకోవడమెలాగో చెప్పే ఉద్యమం ఒకటి కొన్ని దేశాల్లో ఉంది. దాని పేరు ఫ్రీగన్స్. దాని సభ్యులు ఏం చేస్తారంటే ...

* తమకు అక్కర్లేని వస్తువును ఫ్రీస్టోర్స్‌లో వదిలేస్తారు. అవసరమైన వాళ్ళెవరైనా దాన్ని తీసుకోవచ్చు.
* ఒక వెబ్‌సైట్ పెట్టి తమ దగ్గర తమకు అక్కర్లేని ఏఏ వస్తువులు ఉన్నాయో అందులో తెలియజేస్తారు. కావాల్సిన వాళ్ళెవరైనా వచ్చి వాటిని తీసికెళ్ళొచ్చు.
* ఒకే చోటకు వెళుతున్న వారంతా కలిసి ఒకే వాహనాన్ని ఉపయోగించుకుంటారు. వాహన మరమ్మత్తులను నేర్చుకుని సొంతంగా బాగు చేసుకుంటారు. ముఖ్యంగా పర్యావరణ వాత్సల్య సైకిళ్ళను ఉపయోగిస్తారు.
* విందులు, వినోదాలు జరుగుతున్న చోట వృథా అయ్యే ఆహారాన్ని అవసరమైన వారికి అందజేస్తారు.

ఇలా ఎన్నో పనులు చేస్తున్నారు వాళ్ళు. ఖాళీగా ఉన్న భవంతులను కిరాయి ఇవ్వనవసరం లేని ఇళ్ళుగా మార్చి పేదలకు ఇవ్వడంతో సహా. అంతంత పెద్ద పనులు మనం చేయలేకపోయినా వస్తు వృథా, ఆహార వృథాలలోనైనా వాళ్ళను మనం అనుసరించొచ్చు కదా.

*9 సెప్టెంబరు 2007*

# ఒక నిజం కథ

కొండ ప్రాంతంలో నుంచి వెళుతోంది ఒక బస్సు. పరిసరాలు ఆహ్లాదంగా ఉన్నాయి. డ్రైవర్ ఓ యువతి.

బస్సులో 14 మంది ప్రయాణీకులున్నారు. కొందరు నిద్రపోతూ కొందరు కలలుగంటూ కొందరు ప్రకృతిని ఆస్వాదిస్తూ సేద తీరుతున్నారు. ఓ ముగ్గురు మాత్రం డ్రైవర్‌నే చూస్తున్నారు. మొదట కుతూహలంగా, తర్వాత వంకరగా, ఆ తర్వాత కామంగా.

సగం దూరం వెళ్ళాక బస్సు ఆపి ఆమెను కిందకి దిగమన్నారు. ఆమె సహాయం కోసం ప్రయాణీకులను అర్థించింది. గూండాల్లా కనిపిస్తున్న ఆ ముగ్గురికి భయపడి ఎవరూ ముందుకు రాలేదు.

కాని ఒకతను వచ్చాడు. సన్నగా పీలగా ఉన్న ఆ నడి వయస్కుడు లేచి వచ్చి తప్పు ... ఆడకూతురి మీద అఘాయిత్యం ఏమిటని వాళ్ళను కోప్పడ్డాడు. వాళ్ళు ఆయన్ని కొట్టి తోసేశారు.

అతనికి చాలా కోపం వచ్చింది. పట్టపగలే ఇంత అరాచకమా మీరెందుకు స్పందించరు అని ప్రయాణీకుల మీద కేకలేశాడు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

ఆ ముగ్గురూ ఆమెని కిందికి దింపి పొదల్లోకి లాక్కెళ్ళారు. అరగంట తర్వాత నలుగురూ తిరిగి వచ్చారు. ఆమె జుట్టు సర్దుకుని తిరిగి సీట్లో కూర్చుంది.

'ఏయ్ నువ్వు కిందికి దిగు' అని అంతకుముందు తనకు సహాయం చేయడానికి ముందుకొచ్చిన వ్యక్తిని ఉద్దేశించి అంది. 'నేనా? నేనెందుకు దిగాలి? నీకు సహాయం చేయడానికి ప్రయత్నించింది నేనే కదా!' అన్నాడతను ఆశ్చర్యంగా. 'నువ్వా? నువ్వేం సహాయం చేశావు నాకు?' కోపంగా అంది ఆమె. కొందరు ప్రయాణీకులు వెక్కిరింతగా నవ్వారు. 'నేను దిగను గాక దిగను. నేను టిక్కెట్టు కొని ఎక్కాను. ఎందుకు దిగాలి?' అని పట్టుదలకు పోయాడాయన.

'ఆయన దిగకపోతే నేను బస్సు నడపను' అంది డ్రైవరు.

అప్పటిదాకా మౌనంగా ఉన్న ప్రయాణీకులు 'దిగు...దిగు మాకు చాలా పనులున్నయ్యి. ఇప్పటికే చాలా ఆలస్యమైంద'ని అతన్ని బలవంతంగా కిందికి దింపారు. తమ పని ఆమెకు అంత నచ్చేసిందనుకుంటూ గూండాలు ముగ్గురూ విజయగర్వంతో నవ్వుకున్నారు.

బస్సు బయల్దేరింది. మొదట నిదానంగా. తర్వాత వేగంగా. ఆ తర్వాత శరవేగంగా. బస్సు కొండెక్కుతోంది. ప్రయాణీకులు భయపడ్డారు. ఏదో ఉపద్రవం జరగబోతోందని గూండాలు పసిగట్టారు. ముందుకెళ్ళి స్టీరింగ్ పట్టుకోవడానికి ప్రయత్నించారు. కాని అప్పటికే బస్సు కొండవాలు నుంచి లోయలోకి దూసుకు పోయింది.

మర్నాడు పత్రికల్లో కొండపై నుంచి బస్సు దొర్లిపడి 14 మంది మరణించారని వార్త వచ్చింది.

ఆ వార్త చూసి బస్సు నుండి గెంటేయబడ్డ ప్రయాణీకుడు వెక్కిళ్ళు పెట్టి ఏడ్చాడు.

* * *

చైనాలో జరిగిన ఒక నిజం కథ ఇది.

నిస్సహాయులు నిస్సహాయులుగానే ఉండిపోరనడానికి ఇదొక ఉదాహరణ.

వాకపల్లిలో రేపేం జరుగుతుందో!

*23 సెప్టెంబరు 2007*

# ఇదా ప్రిస్క్రిప్షన్!

అప్పుడాయన పిలవకుండానే ఇంటికొచ్చేవాడు. చిరునవ్వుతో ఇంటిల్లిపాదినీ పలకరించేవాడు. పిల్లల్ని నవ్వించేవాడు. పెద్దల్ని కుశలప్రశ్నలు అడిగేవాడు. వృద్ధుల్ని ఊరడించేవాడు.

పక్కకొచ్చి కూర్చుని చెయ్యి పట్టుకునేవాడు. కళ్ళలోకి తొంగి చూసేవాడు. గుండె శబ్దం వినేవాడు. చివర్లో భుజం తట్టి ధైర్యం చెప్పి వెళ్ళిపోయేవాడు.

అవసరమైతే మళ్ళీ అర్ధరాత్రయినా వచ్చేవాడు. అప్పుడాయన చేతిలో చిన్న పెట్టె ఒకటే ఉండేది.

పెట్టెలోని వస్తువుల సైజు పెరిగాక ఆయన ఇళ్ళకు రావడం మానేశాడు. మనుషులే ఆయన దగ్గరకు వెళ్ళడం మొదలు పెట్టారు.

చిరునవ్వు పలచబడింది. ప్రశ్నలు తగ్గిపోయాయి.

చెయ్యి పట్టుకోవడానికి ఒకరు, కళ్ళల్లోకి తొంగి చూడడానికి ఒకరు, గుండె శబ్దం వినడానికి ఇంకొకరు వచ్చి చేరారు అక్కడ.

వాళ్ళేదో రాసి ఇచ్చేవారు. అవి చూసి ఆయన ఇంకేవో రాసి ఇచ్చేవాడు. ఏం జరిగిందో తెలిసే లోపు జేబులు మాత్రం ఖాళీ అయ్యేవి.

కొన్నేళ్ళ తర్వాత ఆయన మళ్ళీ బయటకు రావడం మొదలుపెట్టాడు. కాని మనుషులుండే ఇళ్ళకు కాదు రోగాలుండే ఆస్పత్రులకు.

ఒక ఆస్పత్రి నుండి మరో ఆస్పత్రికి. ఒక క్లినిక్ నుండి మరో క్లినిక్‌కి. బాగా బిజీ అయిపోయాడు.

ఆయన నిలబడ్డా కూర్చున్నా చుట్టూ యంత్రాలు. నడుస్తున్న ఫ్యాక్టరీలా అయిపోయాడు.

ప్రతి యంత్రానికీ డబ్బిచ్చుకుంటూ ఆయన దగ్గరకు వెళ్ళడం మనుషులకు రోగం కంటే ఎక్కువ కష్టమైపోయింది.

* * *

ఆస్పత్రి చావుల్లో ఎన్ని సహజమైనవో, ఎన్ని అసహజమైనవో ఎవరు తేల్చగలరు?

చావును అంగీకరించలేని మానవ బలహీనత చరిత్ర నిండా దుఃఖంగా మాత్రమే బయటికొచ్చింది. ఎప్పుడో ఒకసారి అది ఆగ్రహంగా కట్టలు తెంచుకోవచ్చు.

కోపమూ ఒక రోగమేనని వైద్యునికి తెలియదా?

కాని చేత్తో గన్ పట్టుకుని, వెనకాల పోలీసును పెట్టుకుని తిరగాలనుకోవడం ఏ రోగానికి చిహ్నం?

*23 డిసెంబరు 2007*

# ఈసారి ఛాన్స్ వాళ్ళకిద్దాం

ఎదురింటి మాధవి ఇంకెన్నాళ్ళు అంత లావుగా బతకదలచుకుంది? రేపట్నించి రోజూ పొద్దున్నే ఓ ఐదారు కిలోమీటర్లు నడవమని చెప్పాలి.

* సుబ్బయ్య గారు ఇంకెన్నాళ్ళు మీటింగుల్లో అవే విషయాలు మళ్ళీ మళ్ళీ చెపుతారు? ఆయనకో బస్‌పాస్ ఇచ్చి లోకం తిరిగి రమ్మని చెప్పాలి.
* పాపం పక్కింటి దంపతులు ఇంకెన్నేళ్ళు ఇంటి విషయాల మీదే కొట్టుకుంటారు? ఒక మనిషిని పెట్టుకుని ప్రపంచ సమస్యలన్నీ రోజూ చదివించుకోమని చెప్పాలి.
* పైపోర్షన్‌లో ఉండే ఆ ఐదుగురు అబ్బాయిలు ఇంకెన్నేళ్ళు 99 మార్కుల దగ్గర ఫెయిలవుతూ ఉంటారు? How to face a failure@99 పేరుతో ఒక వెబ్‌సైట్‌ను, ఇన్‌స్టిట్యూట్‌ను పెట్టుకోమని చెప్పాలి.
* భారతీయ విద్యార్థులు ఇంకెన్నేళ్ళు అమెరికన్ వీసాల కోసం ప్రయత్నిస్తూ ఉండాలి? అమెరికానే ఇండియాకు తీసుకువచ్చే పని మన్‌మోహన్‌సింగ్ ఈ ఏడాదిలో నైనా తప్పకుండా చేయాలి.

* రాజకీయ నాయకులు ఇంకెన్నాళ్ళు ఇతరుల అవినీతి గురించి మాత్రమే మాట్లాడతారు? ఇకనుంచి వాళ్ళ అవినీతి గురించి కూడా వాళ్ళు మాట్లాడాలని ఎన్నికల కమిషనో మరొకటో నిబంధన పెట్టేలా చేయాలి.

⁂ ⁂ ⁂

ఏమిటిదంతా అనుకుంటున్నారా?

2008 లోకి అడుగుపెడుతూ కూడా ఇంకా మన గురించే మనం నిర్ణయాలు తీసుకోవడమేమిటని! స్వార్థం వీడి కొత్త సంవత్సరం తీర్మానాలన్నీ ఇతరుల కోసం చేసిపెడదాం.

*30 డిసెంబరు 2007*

# మా ఊరి మామిడి చేదు

మీ ఊళ్ళో పంటలు బాగా పండుతయ్యా?

అబ్బే లేదండి. ఎకరాకు నాలుగు బస్తాలు పండితే ఎక్కువ.

నీళ్ళ సౌకర్యం బాగా ఉందా?

ఎక్కడండి... రాష్ట్రమంతా వర్షాలు పడినా మా ఊళ్ళో నీటిచుక్క కనిపించదు.

కూలీలు బాగా దొరుకుతారా?

అయ్యో వాళ్ళ గురించే అడిగారూ! మహా బద్ధకస్తులండి. ఒక్క గంట అయినా సరిగ్గా పని చేయరు.

కరెంటు ...

దాని గురించి మాట్లాడుకోవడం దండగ. అదిగో అక్కడ కనిపిస్తున్న కొండ అవతల నుంచి రావాలి మాకు కరెంటు. దారిలో ఎప్పుడూ ఏదో ఒక స్తంభం పడిపోతూనే ఉంటుంది.

ఆ కొండలో ఇనుమో బాక్సైటో ఉందట కదా!

ఒట్టి మాటలండి. పనీపాటా లేని పేకాట బ్యాచ్‌గాళ్ళ మాటల్ని మీ లాంటోళ్ళు కూడా నమ్మడం ఏమిటండి?

మీ ఊరు మామిడికాయ మహా రుచి అంటారు. నిజమేనా?

మహా చేదండి బాబూ. ఉగాది పచ్చట్లో మేము వేప్పువ్వు బదులు ఇదే వేసుకుంటాం.

మీ చెరువులో చేపలు ....

హెచ్ఐవి తర్వాత కొత్తగా వచ్చిన ఆ జబ్బు పేరేమిటో నాకిప్పుడు గుర్తు రావట్లేదు కానీండి అది మా చెరువులో చేపలు తిన్నాకే వచ్చిందట. అప్పట్నించి చేపలు పెంచడమే మానేశాం.

మీ తాటితోపుల్లో గ్యాస్ నిక్షేపాలు....

కొరివి దెయ్యాలంటే తెలియని కాలేజి కుర్రాళ్లు అలా అనుకున్నారొకప్పుడు. నీళ్ళే లేని ఊళ్ళో గ్యాస్ ఎక్కడ్నించి వస్తుందండి.... అంతా గ్యాస్.

మీ ఊర్లో అందరూ ఐకమత్యంగా ఉంటారని విన్నాను.

ఇంకా నయం. ఎప్పుడూ కొట్లాటలే. సగం మంది ఆస్పత్రిలో, మిగతా వాళ్ళు జైళ్ళలో ఉంటారు. ఏ కాకీ ఇంకో ఇంటి మీదకు వాలడానికి లేదు. అందువల్ల ఒక ఇంటి ఎంగిలి మెతుకులు సరిపోక కాకులన్నీ మా ఊరు వదిలిపెట్టి చాలా కాలమైంది. నువ్వొచ్చిన టైంకి ఊళ్ళో ఎవరూ లేరు కాబట్టి బతికిపోయావు. మా ఊరు గురించి ఎవరు ఆరా తీసినా నీళ్ళు నిక్షేపాలు సమృద్ధిగా ఉన్న లోకానికి వారిని తరలించాలని ఈ మధ్యే నిర్ణయించారు. ఇదొక్కటే మేము ఐకమత్యంగా చేసిన ఆలోచన ఇప్పటివరకూ.

* * *

మా ఊరు ఇంత గొప్ప అంత గొప్ప అని చెప్పే రోజులు పోయాయి.

దిష్టి తగులుతుందని పిల్లల అందాన్ని మెచ్చుకోని తల్లిలా ఉండడం నేర్చుకోండి.

అబ్బే.... మా ఊరేం ఊరు ... ఒక నేలా ఒక ఆకాశమా ఏదీ లేని పల్లె అంటుండండి. ఎవరి కంటా పడకుండా గబగబా దాచేసుకోండి... సెజ్‌లకు దూరంగా.

*13 ఏప్రిల్ 2008*

# జాకీ ఎందుకు రాలేదబ్బా!

జాకీచాన్‌ను ఒక్కసారైనా కళ్ళతో చూడాలని ఎంతో ఆశపడ్డాడతను.

చెన్నై దాకా వచ్చినవాడు మన రాష్ట్రానికి ఎందుకు రాలేదో? ఎక్కడైనా అదే ఉక్క, అదే చెమటేగా.

చిన్నప్పుడంతా జాకీయే తన డ్రీమ్ హీరో. ఎన్నిసార్లు అతనిలా తన్నాలనుకున్నాడో. అతనిలా ఎంతమందిని చితకబాదాలనుకున్నాడో. అలా అనుకున్న ప్రతిసారీ అతని సినిమాను మరోసారి చూసి ఆ రాత్రంతా ఆ తన్నుల్ని ప్రాక్టీసు చేసి నిద్రలోనే ఆయా వ్యక్తుల్ని చితక్కొట్టి పొద్దున ప్రశాంత చిత్తంతో లేచి సుఖంగా దినచర్యలోకి దిగిపోయేవాడు.

'ద లిటిల్ టైగర్ ఆఫ్ కాంటన్' నుంచి 'పోలీసు స్టోరీ'లు, 'రష్ అవర్'లు, 'మిత్'లు అన్నీ చూశాడతను. తన్నినచోట తన్నకుండా 2 గంటల సేపు మనుషుల్ని తన్నడం మామూలు కమిట్‌మెంట్ కాదు. తన్నడం బోర్ కొట్టకపోయినా ఆ మనుషులైనా బోర్ కొట్టాలి కదా. పాపం మహానుభావుడు. ఎప్పుడూ ఎవరి విషయంలోనూ అలా ఫీలవలేదు. డైరెక్టరు చెప్పినంతసేపూ సినిమా సాగినంతసేపూ న్యాయం జరిగేంత వరకూ ప్రేక్షకులు లేచి వెళ్ళేంతవరకూ కొడుతూనే ఉండేవాడు.

అలాంటివాడు ... అంత నిర్భయుడు ... అంత శక్తిశాలి ఆంధ్రప్రదేశ్‌కి రావడానికి ఎందుకు జంకాడు? తనలాంటి వీరాభిమానులు ఉన్నారని తెలియకపోవడం వల్లనా? లేక మరేదైనా కారణం ఉందా?

కనుక్కునేదాకా మనసుండబట్టక చెన్నై బయల్దేరి వెళ్ళాడు. ఎవర్నడిగినా తమకు తెలియదంటే తమకు తెలియదన్నారు. చివరికి అతను బసచేసిన హోటల్ రూమ్‌కి వెళ్ళి బాయ్‌ను మాటల్లోకి దించాడు. సార్ ఏం తినేవారు, ఏం తాగేవారు, ఏం సినిమాలు చూసేవారు, టీవీలో ఏం ప్రోగ్రాములు చూసేవారు ఇత్యాది విషయాలన్నీ అడిగాడు.

తెలుగువాళ్ళల్లో తనకు అభిమానులు చాలామంది ఉన్నారని తెలిసి సార్ కొన్ని తెలుగు సినిమాలు తెప్పించుకు చూశారని చెప్పాడతను. టీవీలో కూడా తెలుగు న్యూసే ఎక్కువగా విన్నారని చెప్పాడు. అవునా అని ఎంతో సంతోషపడిపోయాడు జా. చా. అభిమాని. అయినా సార్ మా రాష్ట్రానికి రాకపోతిరి అన్నాడు నిష్ఠూరంగా.

'ఎలా వస్తారు? ఏ కండా లేకుండా ఏ బెల్టూ సాధించకుండానే తెలుగు హీరోలు దెబ్బకు వందమందిని చొప్పున గాల్లోకి లేపి కొడుతుంటే ఆయన ఏ మొహంతో మీ ఊరు రాగలరు? అంతేకాదు చెయ్యీ కాలూ లేపకుండా ఒట్టిమాటలతోనే రక్తగాయాలయ్యేలా మీ రాజకీయ నాయకులు మాట్లాడుకోవడం విని సార్ ఎంత బెదిరిపోయారో. ఈ కొత్త విద్యలు నేర్చుకున్నాక కానీ ఎక్కడికీ రానని, ఏ సినిమాలోనూ నటించనని చెప్పి వెళ్ళిపోయారు' వివరించాడు బాయ్.

ఇప్పటిదాకా ఎవరికీ తెలియదీ రహస్యం. జాకీచాన్ తన ఆత్మకథలో రాసుకుంటాడో లేదో కూడా డౌటే!

*4 మే 2008*

# ... అడుగుతూనే ఉంటారు

కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. సంజాయిషీలు కూడా ఎప్పుడూ ఒకేలా ఉండవు.

ఇదివరకు కారు కొంటే సంజాయిషీ. ఇప్పుడు కొనకపోతే సంజాయిషీ.

కొంటే మారుతి 800 కొన్నందుకు సంజాయిషీ, ఇండికానో ఆడినో కొననందుకు సంజాయిషీ.

ఇంట్లో ఏసీ వాడకపోతే ఒక సంజాయిషీ. డబ్బా ఏసీ వాడుతుంటే మరో సంజాయిషీ. స్ప్లిట్ ఏసీ కొననందుకు మరో పెద్ద సంజాయిషీ.

కెమెరా లేకపోతే ఒక సంజాయిషీ, అది డిజిటల్ కాకపోతే మరో సంజాయిషీ. వీడియోదో, మూవీదో కాకపోతే మరో అతి పెద్ద సంజాయిషీ.

బిఎస్ఎన్ఎల్ ఫోన్ ఉంచుకుంటే ఒక సంజాయిషీ. సెల్‌ఫోన్ మార్చనందుకు మరో సంజాయిషీ. అందులో కెమెరా లేకపోయినా, ఎంపి-3 లేకపోయినా, ఇంటర్నెట్ లేకపోయినా, జిపిఎస్ లేకపోయినా, ఏ యాప్ లేకపోయినా సంజాయిషీలే సంజాయిషీలు.

గ్యాస్ ఉంటే చాలదు. నాలుగు పొయ్యిల స్టవ్ లేనందుకు సంజాయిషీ చెప్పాలి.

కుక్కర్ ఉంటే చాలదు. ఆటోమాటిక్ కుక్కర్ లేనందుకు సంజాయిషీ చెప్పాలి.

అల్యూమినియం ఓవెన్ ఉంటే చాలదు. మైక్రో ఓవెన్ లేనందుకు సంజాయిషీ చెప్పాలి.

టీవీ ఉంటే చాలదు. హోమ్ థియేటర్ లేనందుకు సంజాయిషీ చెప్పాలి.

ఎక్సర్‌సైజ్ సైకిలుంటే చాలదు. ఇంట్లో జిమ్ ఏర్పాటు చేసుకోనందుకు సంజాయిషీ చెప్పాలి.

పిల్లల్ని చదివిస్తే చాలదు. విదేశాల్లో ఉద్యోగం చేయగల చదువు చదివించనందుకు సంజాయిషీ చెప్పాలి.

మంచి బట్టలు కొనుక్కుంటే చాలదు. బ్రాండెడ్ బట్టలు కొనుక్కోనందుకు సంజాయిషీ చెప్పాలి.

నిజమే ... కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. సంజాయిషీలు కూడా ఎప్పుడూ ఒకందుకే ఉండవు.

మధ్యతరగతికి ఇది సంజాయిషీల యుగం.

*15 జూన్ 2008*

# మనిషి ఆజ్ఞ లేనిదే...

ఒక చీమ రోడ్డు దాటడానికి ప్రయత్నిస్తోంది గంట నుండి. కాని రోడ్డు అస్సలు ఖాళీలేదు. రయ్ రయ్‌మని వాహనాలు తిరుగుతూనే ఉన్నయ్యి. ధైర్యం చేసి ఒకడుగు ముందు కేయడం, నేల అదురుకు భయపడి రెండడుగులు వెనక్కేయడం. ఇలా 60 నిమిషాల నుంచి ఎక్కడి చీమ అక్కడే ఉండిపోయింది.

పొద్దున ఒకసారి వచ్చింది రోడ్డు దాటడానికి. పాలవ్యాన్లు, కూరగాయల బండ్లతో కొంచెం కూడా ఖాళీ లేదు. కాసేపటికి స్కూలు బస్సులు తిరగడం మొదలుపెట్టాయి. ఆ పిల్లల్ని చూస్తూ చాలాసేపు అలా నించుండిపోయింది. ఎవరో పాప చాక్లెటు పడేస్తే దాన్ని చెట్టు కిందకి లాక్కెళ్ళి తిని అక్కడే కాసేపు విశ్రాంతి తీసుకుంది.

లేచి చూసేసరికి ఎండ చిరచిరలాడుతోంది. ఇంత ఎండలో ఎవరు తిరుగుతారులే ... రోడ్లు ఈ పాటికి ఖాళీ అయ్యుంటాయనుకుంటూ మళ్ళీ రోడ్డు అంచుకు వచ్చింది. పెద్ద పెద్ద ఎ.సి కార్లు హారన్ వేయకుండా వరసగా పోతున్నాయి.

హైజంప్‌లు, లాంగ్‌జంప్‌లు రావు దానికి. చీమలా నడవడం మాత్రమే వచ్చు. కాని నడిచి రోడ్డు దాటే కాలమా ఇది!

ఎవరైనా మనిషి మీదికి ఎక్కి ఆ మనిషిని కుట్టకుండా కొంతదూరం ప్రయాణించి దిగిపోవచ్చు. కాని అది రిస్క్‌తో కూడిన వ్యవహారం. శివుడాజ్ఞ లేదని తను కుట్టకుండా ఉండొచ్చు కాని ఆ విషయం తెలియక మనిషి తనను నలిపి పడేయొచ్చు. లేదా తాను అనుకున్న చోటికి కాకుండా ఆ మనిషి మరోవైపు వెళ్ళిపోవచ్చు.

ఇలా మథనపడుతుండగానే సాయంత్రమైంది. చీకట్లో తనకు కళ్ళు బాగా కనిపించవు. రాత్రి రోడ్లు నిర్వాహనమైనప్పుడు వెళ్దాంలే అని జామకాయ ముక్క దొరికితే తిని ముడుచుకు కూర్చుంది.

రాత్రయింది. వాహనాలు తగ్గాయి కాని వాటి వేగం పెరిగింది. గుండెలు అరచేత్తో పట్టుకుని ఎలాగోలా ఒలింపిక్ చీమల స్పీడుతో తెల్లారేసరికి రోడ్డు దాటేసింది. కనీసం దాటానని అనుకుంది. ఊహు... అది డివైడర్‌ని మాత్రమే చేరుకుంది. ఇంకో రాత్రి గడిస్తే గాని అది అవతలి వైపుకు చేరలేదు.

పాపం చీమ! దాని పుట్ట అటువైపు ఉంది. చెరుకు తోటలేమో ఇటువైపు ఉన్నాయి. ఆహారం కోసం రోజూ ఫోర్‌లేన్ హైవేని దాటాలంటే దానివల్ల అయ్యే పనేనా!

*14 సెప్టెంబర్ 2008*

# అవంటే ఎందుకు అలుసు?

వాళ్ళ తెలుగు టీచరు మహా స్ట్రిక్ట్.

ఆ రోజు క్వార్టర్లీ మార్కులిచ్చే రోజు.

పిల్లలందరూ భయంభయంగా కళ్ళను గుమ్మానికి వేలాడదీసి ఎదురుచూస్తుండగా వచ్చిందామె ... మహా నిశ్శబ్దంగా.

గుడ్ మార్నింగ్, శుభోదయం లాంటి పలకరింపులేమీ లేకుండా లోపలికి వచ్చి కూర్చుంది. వాళ్ళనూ కూర్చోమని సైగ చేసింది.

ఒక్కొక్కర్ని దగ్గరికి పిలిచి ఆన్సర్ షీట్లు చేతిలో పెట్టింది. వెనక్కొచ్చి కూర్చుని పేజీలు తిప్పిన పిల్లలందరి మొహాల్లోనూ భయంకరమైన సస్పెన్స్. ప్రశ్నార్థకాలూ ఆశ్చర్యార్థకాలతో రూము నిండిపోతుండగా టీచరు లేచి నిలబడింది. హోంవర్కు చేసినవాళ్ళు మాత్రమే రేప్పొద్దున క్లాసుకు రండి అనేసి వెళ్లిపోయింది.

స్కూలయిపోయినా పిల్లలు ఇంటికి వెళ్ళలేదు. పార్కుల్లో, ప్లే గ్రౌండ్లలో, సూపర్‌బజార్లలో, సినిమాహాళ్ళ దగ్గర, కూరగాయల మార్కెట్లో వేటి కోసమో తెగ వెతుకుతున్నారు.

టీచరు తెమ్మన్నవి తప్ప అన్నీ దొరుకుతున్నాయి. ఇళ్ళకొచ్చి ఇంటర్నెట్‌లో వెతికినా ఆ పేర్లుగలవేవీ తమ దగ్గర లేవు... సారీ అని వస్తోంది. అమ్మా నాన్నలను అడిగితే వాటి గురించి ఎక్కడో విన్నట్టే ఉంది కాని సరిగ్గా గుర్తు రావడం లేదన్నారు. అయినా మరీ ఇంత డిఫికల్ట్ హోంవర్కులు యిస్తారేమిటో ఈ తెలుగు టీచర్లు అని గొణుక్కున్నారు కొందరు.

రిటైర్డ్ తెలుగు పండితుడొకాయన తమ కాలనీలో ఉన్నాడని తెలుసుకుని మర్నాడు పొద్దున కొందరు తమ పిల్లల్ని ఆయన దగ్గరికి పంపించారు. ఆయన ఒకవేళ వాటిని అమ్మే పనయితే కొనుక్కుని రమ్మని డబ్బులు కూడా ఇచ్చి పంపించారు.

పిల్లలెళ్ళి ఆయన్ని అడిగిందేమిటో తెలుసా! కొన్ని ఒత్తులు, గుణింతపు గుర్తులు, కాసిన్ని పొట్టలో చుక్కలు కావాలని. అవన్నీ తెచ్చిపెట్టాకే మా పేపర్లు దిద్దుతుందట మా టీచరు అని దీనంగా మొహంపెట్టి చెప్పారు వాళ్ళు.

⁂ ⁂ ⁂

'$(A+B)^2 = A^2 + B^2 + 2AB$

$(A+B) X (A-B) = A^2 - B^2$

వీటిల్లో ఏ అక్షరం తప్పు పడ్డా, ఏ గుర్తు తప్పు పడ్డా లెక్కల టీచరు మార్కులివ్వదు కదా. గుణింతాలు, ఒత్తులు, పొట్టలో చుక్కలు కూడా అలాంటివే. అన్నీ ఉంటేనే అవి అక్షరాలు, మీకు మార్కులు' మర్నాటి క్లాసులో వార్నింగ్ ఇచ్చింది వాళ్ళ తెలుగు టీచరు.

*19 అక్టోబర్ 2008*

# దీని పేరేంటో!

ఈ మధ్య ఎందుకో తిండి అస్సలు సయించడం లేదు. నిద్ర కూడా రావడం లేదు.

ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా ... లేచి శుభ్రంగా స్నానం చేసి ఇస్త్రీ చేయని మామూలు బట్టలేసుకుని బయటికి వెళ్ళిపోదామా అని ఒకటే కోరికగా ఉంటోంది.

మెదడు నిండా ఏవేవో ఆలోచనలు. అన్నీ గొప్పగానే అనిపిస్తున్నాయి. ఇన్ని దశాబ్దాల జీవితంలో ఎన్నడూ రానన్ని సృజనాత్మక ఆలోచనలు ఒకేసారి ముప్పిరిగొంటున్నాయి.

ఏ ఊరు వెళ్ళినా అక్కడి చరిత్ర వివరంగా గుర్తొస్తోంది. మనుషులందరూ చిరపరిచితులుగా కనిపిస్తున్నారు. ఏ ఆడవాళ్ళను చూసినా అమ్మా అనబుద్ధేస్తోంది. ఎక్కడ చిన్న పిల్లల్ని చూసినా ఎత్తుకోబుద్ధేస్తోంది. ముసలివాళ్ళు ఎవరు కనిపించినా నడిపించబుద్ధేస్తోంది. ఎవరు ఏ మాండలికంలో మాట్లాడినా అర్థమవడమే కాక వాళ్ళు అడిగే ప్రశ్నలకు జవాబులు కూడా అరనిమిషం వ్యవధిలో చెప్పేయగలుగుతున్నాను.

భాష ... ఇంత భాష నాకు వచ్చని ఇదివరకు ఎవరైనా చెప్పినా నమ్మకపోయేవాణ్ని. ముచ్చట గొలిపే ప్రాసతో ఆశువుగా అనర్గళంగా మాట్లాడుతున్న నన్ను చూస్తే నాకే ఎంత ముద్దొస్తోందో. సకల విషయాల మీద సాధికారికంగా మాట్లాడగల ఈ సామర్థ్యం రోడ్డెక్కగానే దానంతటదే ఎలా వస్తోందో నాకే ఆశ్చర్యంగా ఉంది.

ఏ పనిముట్టు కనబడ్డా పట్టుకోవాలనిపిస్తోంది. అది పట్టుకున్నంతసేపూ ఆ వృత్తివాళ్ళు నాకు ఆత్మీయులుగా అనిపిస్తున్నారు.

ఎంతసేపైనా నిలబడగలగడం ... చేతులూపడం... చిరునవ్వులు చిందించడం... ఎండకు భయపడకపోవడం ... కోపమనేది రాకపోవడం ... వచ్చినా ప్రదర్శించక పోవడం ... ఇవన్నీ పూర్వజన్మ సుకృతంలా ఒకేసారి వచ్చేశాయి నా జీవితంలోకి.

ఎవరు ఏది అడిగినా ఇచ్చేయాలనిపిస్తోంది. అడగకపోయినా ఇచ్చేయాలనిపిస్తోంది. నాలో ఇంత దానగుణం ఉందని నా బంధుమిత్రుల్లో ఒక్కరైనా ఇంతవరకు నాకు చెప్పలేదు. చూడండి... ఎంత కృతఘ్నులో.

సంచార జీవితం పట్ల నాకు ఇంత మమకారం ఉందని కూడా నేనేనాడూ ఊహించలేదు. ఇంకో ఆరునెలలు సొంత ఊరికి గాని, ఇంటికి గాని వెళ్ళాలని పించడం లేదు.  ఆరుబయట అమాయక జనం మధ్య ఇట్లాగే బతికేయాలని పిస్తోంది.

⁂ ⁂ ⁂

ఈ భావాలన్నిటికీ కలిపి ఇంగ్లీషులో ఓ పేరుంది. పి.ఇ.ఎస్. అంటే ప్రీ ఎలక్షన్ సింద్రోమ్.

*16 నవంబర్ 2008*

# ఈ పౌరుడు బుద్ధిమంతుడు

ఎవరో ఒకర్ని ఎన్‌కౌంటర్ చేయకపోతే ప్రశాంతంగా బతకడం అసాధ్యమనుకున్నాడు ఒక పౌరుడు.

మొదట రాత్రొచ్చిన పీడకలల్ని చేద్దామనుకున్నాడు.

తర్వాత పేపర్‌లో కనిపించిన దుర్మార్గుల పని పట్టాలనుకున్నాడు.

పిల్లలు ఏడుస్తూ స్కూళ్ళకు వెళ్లడం చూసి వాళ్ళకు పాఠాలు రాసిన, నిర్ణయించిన విద్యావేత్తలందర్నీ ఉరికంబం ఎక్కించాలనుకున్నాడు.

భోజనం చేస్తున్నంతసేపూ ఆహారానికి రుచి లేకుండా చేసిన సమస్త మానవ రసాయన సమూహాల్ని సర్వనాశనం చేయాలనుకున్నాడు.

రోడ్డెక్కాక దాన్ని ప్రతిరోజూ యుద్ధభూమిగా మారుస్తున్నదెవరో కనిపెట్టి వాళ్ళను ఏడు యోజనాల అవతలికి విసిరేయాలనుకున్నాడు.

ఆఫీసుకెళ్ళాక ఏ ఉద్యోగం చేసినా అక్రమాలు చేయక తప్పని పరిస్థితి కల్పిస్తున్న శక్తులేవో తెలుసుకుని ప్రపంచ బహిష్కారం చేయాలనుకున్నాడు.

చెడుతో కలిపి తప్ప మంచిని చూపెట్టలేని సినీ, టీవీ రచయితల సృజన రహస్యాన్ని కనిపెట్టి చిదిమేద్దామనుకున్నాడు.

ఇంకా చాలా అనుకున్నాడు. అసలు వ్యవస్థనే ఎన్‌కౌంటర్ చేద్దామనుకున్నాడు.

కాని ఎవరో ఒకర్నే కదా తను చంపాలనుకున్నది. ఇంతమందిలో ఎవరో ఒకర్నే ఎంచుకోవాలంటే ఎలా? ఆ ఒక్కడూ ఎక్కువ దుర్మార్గుడైపోడూ, మిగతావాళ్ళు తక్కువ దుర్మార్గులైపోరూ. పైగా ఇందరిని చంపేంత శక్తి తనకు ఎక్కడుంది!

అందుకే ఆ పౌరుడు ఎవర్నీ ఎన్‌కౌంటర్ చేయకుండా బుద్ధిమంతుడిగా ఉండిపోయాడు.

*21 డిసెంబర్ 2008*

# అసంపూర్ణ తత్వాలు

తత్వవేత్తలు చాలా విషయాలు సగం సగం చెప్పి వదిలేస్తారెందుకో.

ఉదాహరణకి కోరికలే దుఃఖానికి హేతువులన్నాడు బుద్ధుడు. మరి కోరికలకు హేతువేమిటి? అది చెప్పొద్దూ. అజ్ఞానపు అవధులు తెలియడమే నిజమైన జ్ఞానమన్నాడు కన్‌ఫ్యూషియస్. ఎవరి అజ్ఞానం? మనదా అవతలి వాడిదా? స్పష్టంగా చెప్పకపోతే ఎలా ?

సత్యాన్ని వెతుకుతున్న వాడ్ని నమ్ము కాని దొరికిందన్న వాడ్ని నమ్మొద్దు అన్నాడు ఇంకొకాయన. వాడు సరిగ్గా వెతక్కపోతే ... చూసినా గుర్తించకపోతే .... అయినా నమ్మొచ్చా?

ఒక వాచీ ఉన్నవాడు టైమెంతో కచ్చితంగా చెప్పగలడు కాని రెండు వాచీలున్నవాడు అంత కచ్చితంగా చెప్పలేడన్నాడు మరో తత్వవేత్త. అంటే ఏమిటి? ఒకటి కంటే ఎక్కువ అభిప్రాయాలు మంచిది కాదనా! అసలు దేన్నయినా కచ్చితంగా చెప్పడం మంచిదా, చెప్పకపోవడం మంచిదా?

మనకు కొత్త జ్ఞానం రావాలంటే మన ప్రపంచం కొత్త ప్రశ్నలతో నిండాలన్నాడు ఒక పెద్దమనిషి. మంచి మాటే చెప్పాడు కాని పాత ప్రశ్నలు, పాత జ్ఞానం వచ్చిన తర్వాతి

విషయం కదా అది. అవెలా రావాలి? పాత ప్రశ్నలతో నిండిన ప్రపంచంలో కొన్నాళ్ళు బతికి ఆ జ్ఞానం పొందిన వాళ్ళ కోసం మాత్రమే ఈ మాట చెపుతున్నానని చెప్పాలి కదా!

వెయ్యిమంది కలిసి కూడా నగ్నంగా ఉన్నవాడి బట్టలు ఊడదీయలేరని ఓ గ్రీకు తత్వవేత్త అన్నాడు. భలే వండర్‌ఫుల్ ఐడియా. ఇది బట్టలకే వర్తిస్తుందా? సిగ్గు శరం వంటి ఇతర మానవ లక్షణాలకు కూడా వర్తిస్తుందా?

నొప్పిని భరించొచ్చు కాని దురదని భరించలేమన్నాడు ఓ చైనా జ్ఞాని. ఏ దురదను? భౌతిక దురదనా కీర్తి సంపదల దురదనా?

ఇవన్నీ సరే ... ఉన్నదానితో తృప్తి పడడం మంచిదని చాలామంది తత్వవేత్తలు చెప్పారు. అది కేవలం డబ్బుల గురించా లేక జ్ఞానం గురించి కూడానా? ఎందుకంటే ఇటీవల ఎక్కువమంది తమకు తెలిసిందే ఎక్కువని తృప్తి పడడం అలవాటు చేసుకున్నారు.

ఏమిటో ఈ తత్వవేత్తలు దేన్నీ పూర్తిగా చెప్పకపోవడం వల్ల ఎన్ని సందేహాలో చూడండి.

*1 మార్చి 2009*

# కడుపులో దాచుకోకండి

ఊరికే నన్ను తిట్టుకుంటూ కూర్చోవడం తప్ప నా సమస్యల గురించి ఆలోచించే వాళ్ళు ఒక్కళ్ళూ కనిపించడం లేదు.

మిగతా వాటి కంటే నేను ప్రముఖంగా కనబడాలని, అందరూ నన్నే చూడాలని నేనెప్పుడైనా కోరుకున్నానా?

చరిత్ర పూర్వదశ నుండి ఉండీ లేనట్టుగా ఒదిగి ఒదిగి బతికిన నన్ను ఇప్పుడిలా బయటేసి ఎందుకింత అల్లరి పెడుతున్నారో నాకేం అర్థం కావడం లేదు. ఎన్నో చిత్రాలు, శిల్పాలు చూసి ఉంటారు కదా ఎప్పుడైనా ఎందులోనైనా నన్ను చూసిన జ్ఞాపకముందా మీకు?

నేను అడక్కముందే అన్నం పెడతారు. వద్దు వద్దన్నా కొసరి కొసరి తినిపిస్తారు. అరగలేదన్నా ఆపరు. ఇది చైనీస్, అది జపనీస్, ఇది మెక్సికన్, అది ఇటాలియన్ అంటూ ఏవేవో పెడతారు. ఆ రుచులు నాలిక్కి బాగుండొచ్చు కాని నాకు వచ్చే లాభమేమిటి... మరింత పని తప్ప. పరాయి దేశాల పదార్థాలకు కూడా నా చేత ఇంతింత బండ చాకిరీ చేయిస్తే ఆ బాధను నేను ఎన్నాళ్ళు కడుపులో దాచుకోగలను?

నా కోసమే పొద్దున లేచానని ఒకడు, కొత్త బూట్లు కొన్నానని ఒకడు, జిమ్‌కి వెళుతున్నానని ఒకడు, పార్కుల చుట్టూ పరిగెడుతున్నానని ఒకామె, గేమ్స్ ఆడుతున్నానని ఓ బాలుడు, యోగాసనాలు వేస్తున్నానని ఓ వృద్ధుడు, కొత్త డ్రస్‌లు కుట్టించుకున్నానని ఓ మహిళ ... ఇలా ప్రతి పనీ నా కోసమే చేస్తున్నట్టు మాట్లాడడం నేర్చారు ఈ మధ్య. ఆ పనులన్నీ వాళ్ళు నిజంగా చేస్తే నేనెందుకిలా ఉంటాను?

నా వల్ల తమకు కలిగిన కష్టం గురించి ఇంత మాట్లాడుతున్నారు కాని వాళ్ళందరి వల్లా నాకొస్తున్న కష్టం గురించి ఎవరైనా ఆలోచిస్తున్నారా? ఆలోచిస్తే నా లోపల అంతంత కుళ్ళు దాచి పెట్టుకుంటారా? దాన్ని కొవ్వుతో కప్పెట్టి తప్పంతా నాదే అయినట్టు ఇలా ముందుకు పొడుచుకొచ్చినట్టు నడవడం నాకెంత బరువుగా, అసహ్యంగా ఉంటుందో ఊహించగలరా?

ఒకప్పుడు పొట్ట నిండా కథలున్న మనుషులుండే వారట. కనికరించి నా ఈ కష్టాల గురించి రాయడానికి వారిలో ఒక్కరైనా ముందుకొస్తే బాగుండు. కడుపు చించుకుని వాళ్ళ కాళ్ళ మీద పడతాను.

*8 మార్చి 2009*

# జోడీ నెంబర్ ఎక్స్

ఇవ్వాళ పొద్దున ఆ ప్రశ్న చూసినప్పటి నుంచి అతనికి మహా ఉత్సాహంగా ఉంది. అలాంటి ప్రశ్నలు తన గురించి కూడా ఎవరైనా అడక్కూడదూ? ఎన్నాళ్ళ నుంచో కాచుకుని ఉన్నాడు అడిగితే చెబుదామని.

తనకీ తన మొహానికీ మ్యాచ్ కావడం లేదని అతను ఏనాడో డిసైడైపోయాడు. కాని మీ ఇద్దరికీ జోడీ కుదిరిందా లేదా అని ఇన్నేళ్ళలో ఒక్కరూ తనను అడగలేదు. అడిగి ఉంటే... దాని మీద ప్రజాభిప్రాయ సేకరణ జరిపి ఉంటే... కుదరలేదనే జవాబు ఎక్కువమంది నుంచి వచ్చి ఉంటే... దాన్ని మార్చడానికి ఎవరో ఒకరు ఈ పాటికి ముందుకు వచ్చేవారే.

తనకీ తన మార్కులకీ కూడా ఏ ఏడాదీ మ్యాచ్ అవలేదు. ఆ ప్రశ్న కూడా ఎవరైనా అడిగి ఉంటే ... జనం తన ఆన్సర్ షీట్లు దిద్దిన టీచర్లకు గడ్డి పెట్టి ఉంటే .... వాళ్లకా అధికారం తొలగించి ఉంటే ... ఈ పాటికి తన ప్రతిభకు రావాల్సిన గుర్తింపు అంతా వచ్చేసి ఏ స్మిత్‌సోనియన్ ఇన్‌స్టిట్యూట్ లోనో ఉద్యోగం చేస్తూ ఉండేవాడు.

అంతెందుకు ... తనకీ తన కాలనీ రోడ్డుకు మధ్య ఎప్పుడైనా మ్యాచింగ్ కుదిరిందా? రోడ్డు మీద వేగంగా నడిచే అవకాశం లేక కాదూ తనకు జీవితంలోనూ వేగంగా నడవడం చేతకాకుండా పోయింది? దీని మీద ఒపీనియన్ పోల్ జరిపితే ఎంతమంది తనను సమర్థించి ప్రభుత్వం నుంచి భారీ నష్టపరిహారం ఇప్పించి ఉండేవాళ్ళో.

తనకీ తన అమ్మానాన్నలకీ, తనకీ తన ఆస్తికీ, తనకీ తన ఆలోచనలకీ, తనకీ తన ఆచరణకూ ఎప్పుడైనా జోడీ కుదిరిందా? ఒక్కరయినా దీని మీద మీడియాలో ప్రశ్నలడిగి, జవాబులు రాబట్టి తన లాంటి వాళ్ళ జీవితాలను మార్చే ప్రయత్నం చేస్తున్నారా? ... చాలాసేపు అలా వాపోతూనే ఉన్నాడు.

* * *

ఇంతకీ అతను ఆ రోజు పొద్దున చూసిన ప్రశ్న ఏమిటో మీకు తెలియదు కదూ! సానియా, సొహ్రాబ్‌లకు జోడీ కుదిరిందా లేదా అని ఒక జాతీయ పత్రిక తమ పాఠకులను అడిగిన ప్రశ్న అది. సెలబ్రిటీ అయినంత మాత్రాన ఆవిడ జీవితంలోకి అంతగా చొచ్చుకొని వెళ్ళాలా? తమకు, తమ వృత్తిధర్మానికి మధ్య జోడీ కుదిరిందో లేదో ... ఆ పత్రిక ముందుగా తమ పాఠకులను అడిగి తెలుసుకుని ఉంటే బాగుండేది.

*19 జూలై 2009*

# అర్థాలు మార్చండి

వాటిని పుస్తకాలు చదివి తెలుసుకోనక్కర్లేదు.
స్కూల్‌కెళ్ళి నేర్చుకోనక్కర్లేదు.
ఇంట్లో ఉన్నా వస్తాయి. వీధిలోకెళ్ళినా వస్తాయి.
ఏ భాషలో విన్నా గుర్తు పట్టేయొచ్చు.

ఏమిటవి?

లిపి ఉన్నా లేకున్నా
అన్ని భాషల్లోనూ తప్పనిసరిగా ఉంటాయి.
కాకపోతే రాతలో తక్కువ. మాటలో ఎక్కువ.
ఒకసారి వింటే ఎప్పటికీ మర్చిపోం.

ఏమిటవి?

పెద్దలు పిల్లలు ఆడ మగ అందరూ వాడతారు.
బీదా గొప్పా తారతమ్యం ఉండదు.
పేదా ధనిక వ్యత్యాసం అసలే ఉండదు.
కొందరైతే ఇవి లేకుండా మాట్లాడనే మాట్లాడరు.

ఏమిటవి?

ఎప్పుడు పుట్టాయో ఎవరికీ తెలియదు.
శాసనాధారాలు, సాహిత్యాధారాలు పెద్దగా దొరకవు.

కాని అన్ని భాషల్లోనూ అవే మూడు రకాలు.
మతాన్ని, జాతిని, కులాన్ని ఆశ్రయించి ఉంటాయి.
శరీరాన్ని, వాటి క్రియలను వాడుకుంటాయి.
మరీ ముఖ్యంగా అమ్మను ఎక్కువగా అంటిపెట్టుకుని ఉంటాయి.

ఏమిటవి?

ఒంటరిగా కంటే సమూహంలోనే వాటి వాడకం ఎక్కువ.
ఇతర భాషల్లో కంటే సొంత భాషలో వాడితేనే సంతృప్తి అధికం.

ఏమిటవి?

కొందరిలో వెంటనే ఒత్తిడిని తగ్గిస్తాయి. కోపాన్ని పోగొడతాయి.
భయాన్ని, అభద్రతను పారద్రోలతాయి.
అందరికీ సులభంగా అర్థమవుతాయి.
కాని క్షణాల్లో శత్రుత్వాన్ని పెంచుతాయి.

ఏమిటవి?

ఒకప్పుడు అమాయకమైనవే.
అసలు అర్థాలు మంచివే.
మనమే వాటిని కర్ణకఠోరం చేశాం.

ఏమిటవి?

మీరు అసెంబ్లీ కార్యక్రమాలు రోజూ చూస్తున్నా, కనీసం పేపర్లు చదువుతున్నా ఈ పొడుగాటి పొడుపు కథకు వెంటనే సమాధానం చెప్పగలరు.

.........

అమ్మ అక్క ఆలి ఆడది మగాడు అనే పదాలను పాలో నీళ్ళో పన్నీరో ఫినాయిలో పోసి కడిగి ఇకనైనా వాటి అసలు అర్థాల్లో వాడడం మొదలుపెట్టమని మన గౌరవనీయులైన రాజకీయ నాయకులకు చెబుదాం.

*16 ఆగస్టు 2009*

# ఆజన్మాంతం కృతజ్ఞుడ్ని

ఒక సంపాదకునికి సన్మానం జరుగుతోంది.

ఎందరో ప్రసిద్ధ రచయితలు, సాధారణ రచయితలు, ఔత్సాహిక రచయితలు, అవార్డు గ్రహీతలు, రాజకీయ నాయకులు, పాత కొత్త తరాల పాఠకులు, సహోద్యోగులు, ఇతర పత్రికల సంపాదకులు సన్మానానికి తరలివచ్చారు.

వారందరితో సభా ప్రాంగణం కళకళలాడ్డమే కాక వారు వెదజల్లుతున్న సాహితీ పరిమళాలతో ఘుమఘుమ లాడుతోంది.

పూలదండలు వేయడం, సన్మాన పత్రాలు చదవడం అయిపోయాక ఒక్కొక్క రచయితా వేదికనెక్కి ఆ సంపాదకునితో తమకున్న అనుబంధం చెపుతున్నారు.

తన మొదటి రచన అచ్చయింది ఆయన సంపాదకత్వంలోనే అని, తన మేలి రచనలు అచ్చువేసింది ఆయనేనని, తన ఎక్కువ రచనలు అచ్చయింది ఆయన పత్రికలోనేనని వాళ్ళు తమ అనుభవాలను పంచుకుంటున్నారు. ఎన్నో విలువైన సూచనలు ఇచ్చేవారని, ఎంతగానో ప్రోత్సహించే వారని, ఎన్నో కొత్త విషయాలు చెప్పేవారని, ఎంతో సమయం వెచ్చించేవారని కొనియాడుతున్నారు. ఏం రాయాలో, ఎలా

రాయాలో, ఎంత రాయాలో ఎప్పటికప్పుడు చెప్పేవారని శ్లాఘిస్తున్నారు. ఎలా రాసినా విసుక్కోకుండా చదివేవారని, ఎంతో సహనంగా విషయాలు వివరించేవారని ప్రశంసిస్తున్నారు. అన్ని రకాల సాహిత్యాలతో ఆయనకు మంచి పరిచయం ఉండేదని, పాలూనీళ్ళను వేరు చేయగల సమర్థుడని, ప్రతి రచననూ తూకం వేయగల మేధావి అని, కొత్త ధోరణులను పసిగట్టగల దార్శనికుడని, గొప్ప విశ్లేషకుడని .... ఇలా అందరూ తమ తమ వ్యక్తిగత అనుభవాల్ని ఉటంకిస్తూ చెపుతున్నారు.

అందరూ మాట్లాడేసిన తర్వాత ఇంక సమయం లేదని చెపుతున్నా వినకుండా ఒక వ్యక్తి వేదికమీదకి వచ్చాడు. ఇంతమంది మాట్లాడాక ఇంక ఏముంది చెప్పడానికి అని నిర్వాహకులు విసుక్కున్నా వెనుదిరగకుండా మైక్ దగ్గరికి వచ్చి నిలబడి గద్గద స్వరంతో ఆయన ఇలా అన్నాడు. 'నా రచనలు అచ్చు వేయకుండా నా పరువు నిలిపినందుకు ఈ సంపాదకునికి నేను ఆజన్మాంతం ఋణపడి ఉంటాను' అని ఒకటే వాక్యం చెప్పి దిగిపోయాడు.

*20 సెప్టెంబర్ 2009*

# ఇదే అదృష్టం

స్వైన్ ఫ్లూ రోజుల్లో ఒట్టి ఫ్లూ రావడమే అదృష్టం.

గుండెపోట్ల రోజుల్లో గుండె రివర్సయి డెంగూగా రావడమే అదృష్టం.

టీవీ చూసి గుండె ఆగే రోజుల్లో కరెంటు కోత ఉండడమే అదృష్టం.

టెర్రరిస్టులకు భయపడే రోజుల్లో జేబు దొంగలు తారసపడడమే అదృష్టం.

బ్యాంకులు దివాళాతీసే రోజుల్లో డబ్బులు లేకపోవడమే అదృష్టం.

ఉద్యోగాలు పోయే రోజుల్లో చదువు లేకపోవడమే అదృష్టం.

అమెరికాకు ఆర్థిక మాంద్యం వచ్చిన రోజుల్లో వీసా దొరకకపోవడమే అదృష్టం.

కందిపప్పు కొనలేని రోజుల్లో దానికి రుచి లేకుండా పోవడమే అదృష్టం.

సన్నబియ్యం దొరకని రోజుల్లో సన్నబడాల్సి రావడమే అదృష్టం.

ఆడపిల్లల్ని కననివ్వని రోజుల్లో గర్భం రాకపోవడమే అదృష్టం.

ప్రేమికులు ఆసిడ్ బాటిళ్ళతో తిరిగే రోజుల్లో ఎవరి ప్రేమకూ నోచుకోకపోవడమే అదృష్టం.

మానసిక సౌందర్యాన్ని గుర్తించలేని రోజుల్లో శారీరక సౌందర్యం లేకపోవడమే అదృష్టం.

పెళ్ళిళ్ళ ఖర్చు ఆకాశాన్నంటే రోజుల్లో పెళ్ళి మీద విరక్తి కలగడమే అదృష్టం.

మొగుళ్ళే యముళ్ళుగా మారుతున్న రోజుల్లో 'అనాథ' మహిళలుగా బతకడమే అదృష్టం.

వర్షాలు పడని రోజుల్లో వలస పోగలగడమే అదృష్టం.

నాయకులు లేని రోజుల్లో ప్రార్థించడానికి ఒక వినాయకుడు ఉండడమే అదృష్టం.

పుట్టగొడుగుల మధ్య బతకాల్సి వచ్చిన రోజుల్లో నిజం గొడుగు కింద నిలబడ గలగడమే అదృష్టం.

తలవంచి బతకడం తప్పనిసరైన రోజుల్లో తలలో ఏమీ లేకుండా ఉండడమే అదృష్టం.

అబద్ధాలు ప్రచారమయ్యే రోజుల్లో నిజాలు నిలకడ మీద తెలుస్తాయన్న ఆశను నిలుపుకోగలగడమే అదృష్టం.

నేరుగా తిట్టలేని రోజుల్లో ఇదిగో ఇలా చురకలు వేసి కోపం తీర్చుకోగలగడమే అదృష్టం.

*27 సెప్టెంబర్ 2009*

# జల జాబిల్లి

చంద్రుడి మీద నీళ్ళున్నాయని తెలియగానే చాలామంది బుర్రల్లో కొత్త ఆలోచనలు తళుక్కుమన్నాయి.

మల్టీనేషనల్ కంపెనీలు ముందుచూపుతో మల్టీప్లానెటరీ కంపెనీలుగా పేరు మార్చుకుని అక్కడ తాము పెట్టబోయే అన్నిరకాల ఫ్యాక్టరీల కోసం, గనుల కోసం, సెజ్‌ల కోసం దరఖాస్తులు పెట్టేసుకున్నాయి.

ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కంపెనీలన్నీ కలిసి కన్సార్టియంగా ఏర్పడి రోడ్లు, విమానాశ్రయాలు, హౌసింగ్ కాలనీలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు కట్టడానికి టెండర్లు సిద్ధం చేసుకోసాగాయి.

విజ్ఞాన శాస్త్రంలో చంద్రుడి గురించి ఉన్న సమాచారాన్నంతా క్రోడీకరించి అక్కడికి వెళ్ళడానికి అవసరమైన పరికరాలు, వస్తువుల్ని డిజైన్ చేయడంలో మాన్యుఫాక్చరింగ్ ఇండస్ట్రీ యమ బిజీగా ఉంది.

అన్ని ప్రపంచ భాషల్లో చంద్రుడి మీద ఉన్న కథలు కాకరకాయలు కలిపి ఓ వెయ్యి పుస్తకాల సెట్‌ను ముద్రించే పనిలో పడ్డారు పబ్లిషర్లు.

ఇదంతా చంద్రుడికి ఎలాగో తెలిసింది. ఎలాగో ఏమిటిలే మనం ఇంత దూరం నుంచి అక్కడి నీటివాసనను పసిగట్టగా లేనిది అది ఓ వెన్నెల రాత్రి భూమి మీద జరిగే విషయాలను తెలుసుకోలేదా ఏమిటి? వెంటనే నాసాకు ఏవో సంకేతాలు పంపింది. వాటిని డీకోడ్ చేసి చదివితే అర్థమైందేమిటంటే-

'ఇంతకాలం నాలో ఒక కుందేలు, ఒక అవ్వ మాత్రమే ఉందని నమ్మిన మీరు ఇప్పుడు అభిప్రాయం ఎందుకు మార్చుకున్నారు?

మీ దృష్టిలో నేను ఎవర్ని అసలు? సూర్యుడి భార్యనా, చెల్లెల్నా, భూమి కూతుర్నా, అమ్మనా? ఆడదాన్నా, మగవాడినా? మంచిదాన్నా, చెడ్డవాడినా? తేల్చుకున్నారా ఇప్పటికైనా?

నన్ను చూస్తే సముద్రాలు సంతోషంగా ఉప్పొంగుతాయని మీరే అంటారు. మనుషుల్లో ఉన్మాదం పెచ్చరిల్లుతుందని కూడా మీరే అంటారు. ఏది నిజం?

నాలో అమృతం ఉందని ఊహించింది మీరే. మట్టి తప్ప మరేమీ లేదని ఇప్పుడు 'కనిపెట్టింది' మీరే. నా వృద్ధి క్షయాలకు బోలెడన్ని భాష్యాలు చెప్పుకునే మీరు, అప్పుడప్పుడు వచ్చే నా గ్రహణాలకే భయపడే మీరు అవన్నీ మర్చిపోయి ఏ ధైర్యంతో నా దగ్గరకు వచ్చి నా మీద నివాసం ఉండాలనుకుంటున్నారు?

అయినా నా దగ్గర ఉన్నది పిడికెడు నీరు. అది కూడా టన్నుల కొద్దీ నా మట్టిని పిండితే వచ్చే నీరు. మా సౌర కుటుంబమంతా కలిసి మీ కోసం అంత జలరాశిని సృష్టించి ఇచ్చినా మీకు సరిపోలేదా?

ఒక మాట చెప్పనా ... ఆ కాస్త నీరే నన్ను చల్లగా ఉంచుతుంది. ఆ చల్లదనంతోనే మీకు సుఖమైన నిద్రనిస్తాను. దాన్ని కోల్పోవడానికి కూడా సిద్ధపడిపోతున్నారే మీరు!'

అంతే ఉంది అందులో. ఆ తర్వాత నాలుగు కన్నీటి చుక్కలు కనిపించాయి.

ఎంత మట్టిని పిండి వాటిని పంపిందో పాపం.

*4 అక్టోబర్ 2009*

# ఏకవాక్య అల్లర్లు

ఒక వర్గం వారు మరో వర్గం వారి ప్రార్థనా మందిరాల వద్ద తమ జెండాలు పాతి దాడికి దిగడంతో రెండో వర్గం వారు మొదటి వర్గం వారిపై ఎదురుదాడి చేయడం, ఆ దాడులలో ఇరువర్గాలవారూ గాయపడడం, ఫలితంగా ఆయా వర్గాలకు చెందిన రౌడీ షీటర్లు రెచ్చిపోయి ప్రత్యర్థి వర్గాలవారి వాహనాలకు నిప్పుపెట్టడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాల వారినీ చెదరగొట్టడానికి మొదట లాఠీచార్జి, ఆపై బాష్పవాయు ప్రయోగం, రబ్బరు బుల్లెట్లతో గాలిలోకి కాల్పులు జరిపినా ప్రయోజనం లేకపోవడంతో ఉత్తర దక్షిణ మండలాలలోని 25 పోలీసు స్టేషన్ల పరిధిలో బలగాలను రప్పించి ప్రతి వీధి మొదట్లో ఇద్దరేసి పోలీసుల చొప్పున, కూడలిలో నలుగురు, ప్రధాన చౌరస్తాల వద్ద ఆరుగురు చొప్పున గస్తీ నియమించి, సాయుధ టాస్క్‌ఫోర్స్ దళాల చేత పెట్రోలింగ్ చేయించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఒక వర్గం రాజకీయ నాయకుల ప్రోత్సాహంతో మరో వర్గానికి చెందిన ముష్కరులు అల్లర్లకు పాల్పడుతూనే ఉన్నందువల్ల దీని వెనక వివిధ మతశక్తుల ప్రమేయమే కాక కొన్ని విదేశీ శక్తుల ప్రచ్ఛన్న హస్తం కూడా ఉందన్న బలమైన అనుమానాలు

వ్యక్తమవుతున్న నేపథ్యంలో మతకలహాలకు నెలరోజుల క్రితమే బీజం పడిందన్న ఒక పోలీసు ఉన్నతాధికారి ప్రకటన తీవ్ర ఆందోళనకు, అనేక సందేహాలకు తావిస్తోందని ప్రతిపక్షాలతో పాటు అధికార పార్టీలోని ఒక వర్గం భావించి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసి కర్ఫ్యూ విధించడం వల్ల ప్రజలకు వచ్చిన సమస్యలతో పాటు తరచూ పాతబస్తీలోనే ఇలాంటి సమస్యలు ఎందుకు వస్తున్నాయో చర్చించాలని, ఒక సవివరమైన నివేదిక లేదా ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని, అప్పుడే ఇరు వర్గాలవారూ ఇతర వర్గాలవారి జెండాల జోలికి వెళ్ళకుండా, రాళ్లు రువ్వకుండా, వాహనాలు దగ్ధం చేయకుండా శాంతి సామరస్యాలతో జీవించగలుగుతారని ప్రకటనలు విడుదల చేశారు...

ఏమైనా అర్థమైందామ్మా?

ఒక ముక్క అర్థం కాలేదు. మా టీచరు పెట్టే ఆల్జీబ్రా పరీక్ష కంటే కష్టంగా ఉంది. మళ్ళీ మొదట్నించి చెప్పు.

అమ్మో ... నా వల్ల కాదు.

పోనీ ఏ వర్గం ఏం చేసిందో అదైనా చెప్పు.

అది అసలు అడక్కు. వాళ్ళు కూడా చెప్పలేరు. రోజూ ఇదే చదివి చదివి వాళ్ళు కూడా తమ వర్గం పేరు మరిచిపోయారు.

*11 ఏప్రిల్ 2010*

# ఏ మాటకా మాటే

మీరు గొంగట్లో అన్నం తినాల్సి వస్తే వెంట్రుకలు ఏరుకుని తింటారా? వాటితో పాటే తింటారా?

వెంట్రుకలు ఏరాలంటే కష్టం. అలాగని వాటితో పాటు తినడమూ కష్టమే. కాబట్టి అన్నమే ఏరుకుని తింటాను.

పురుషుల్లో పుణ్యపురుషులు ఉన్నారని నమ్ముతారా మీరు ?

నమ్మను. రాక్షసుల్లో క్రూరరాక్షసులు విడిగా లేనప్పుడు వీళ్ళలో మాత్రం ఎలా ఉంటారు?

ఆత్మహత్యలు ఎందుకు పెరుగుతున్నాయంటారు?

ఎక్కడ ... దేహం లోపలా బయటా?

ఐస్‌లాండ్‌లో అగ్నిపర్వతాలు బద్దలయినప్పుడు ఆశ్చర్య పోయారా మీరు?

లేదు. స్త్రీలు ఎక్కువగా ఉన్న దేశం కాబోలనుకున్నాను.

మనుషులకు బందిలదొడ్లు ఎందుకు ఉండవు?
నిత్యం దారి తప్పి నడిచేవాళ్ళకు ఎన్నని పెట్టగలరు?

అభిప్రాయాలు ఎందుకు నిలకడగా ఉండవు?

ఎలా ఉంటాయి? భూమి తన చుట్టూ తాను, సూర్యుడి చుట్టూ తాను రెండు రకాలుగా తిరుగుతున్నప్పుడు మనం పడిపోకుండా నిలబడి ఉండడమే విశేషం. ఇక అభిప్రాయాలను కూడా ఎక్కడ నిలబెట్టగలం?

చివరి ప్రశ్న. స్వార్థం వెర్రితలలు వేయడమంటే ఏమిటి?
మనిషి 681.65 కోట్ల జనాభాగా మారడమని.

ఒక్క మంచి విషయం చెప్పండి.
ఎలా ... ఒక్క మంచి ప్రశ్న అడగండే!

*2 మే 2010*

# ఒక షార్క్ ... తాజా చేపలూ

జపాన్ వాళ్ళకు చేపలంటే భలే ఇష్టం. చుట్టూ సముద్రమే కాబట్టి వాళ్ళకు కావాల్సిన దానికంటే ఎక్కువ చేపలే దొరుకుతుండేవి ఇన్నాళ్ళూ.

కాని కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా.

జపాన్ దగ్గరి సముద్ర జలాల్లో చేపలు దొరకడం మానేసాయి. కాలుష్యమో థర్మల్ ప్లాంట్లో ఏదో కారణమన్నారు.

మత్స్యకారులు చేపల కోసం దూరం వెళ్ళాల్సి వచ్చింది. చిన్న పడవలు సరిపోక పెద్దవి చేయించుకున్నారు.

అక్కడ చేపలైతే దొరికాయి కాని అంత దూరం నుండి తెచ్చేసరికి తాజాతనం పోయి జనం కొనలేదు.

ఫిషింగ్ కంపెనీలు రంగప్రవేశం చేసి పడవలకు ఫ్రీజర్లు అమర్చుకున్నాయి. వాటిల్లో చేపల్ని భద్రపరిచి తెచ్చి అమ్మినా జనం కొనలేదు. ఎందుకంటే ఫ్రోజెన్ చేపల రుచి నచ్చలేదు వాళ్ళకు. దాంతో ఆ చేపల్ని తక్కువ ధరకు అమ్మాల్సి వచ్చింది.

ఈసారి కంపెనీల వాళ్ళు పడవల్లోనే నీళ్ళ ట్యాంకులు ఏర్పాటు చేసుకుని పట్టిన చేపల్ని వాటిల్లో వేసి

తీసుకురాసాగారు. అయితే ఆ ట్యాంకుల్లో ఈదడానికి కాదు కదా కదలడానికి కూడా చోటు లేకపోవడంతో చేపలు మందకొడిగా తయారై తాజాదనం కోల్పోయేవి. జపాన్‌వాళ్ళకు వాటి రుచీ నచ్చలేదు.

అప్పుడు కంపెనీలు ఏం చేశాయో తెలుసా! ఆ ట్యాంకుల్లో మామూలు చేపలతో పాటు ఒక షార్క్ చేపనీ వేయసాగాయి. షార్క్ సంగతి తెలుసుగా మీకు? చేపలే దాని ఆహారం.

ఆ షార్క్ చేపల్ని తినేస్తే మరి వాళ్ళకు ఏమిటి లాభం అనకండి. ఉంది. షార్క్ నుంచి తప్పించుకోవడానికి చేపలు చురుకుగా తిరుగుతాయి కదా. వాళ్ళకు కావల్సింది అదే. కొన్ని చేపలు పోతేనేం జనానికి తాజా చేపల్నయితే అమ్మొచ్చు.

అబ్బ... జనమంటే ఎంత ప్రేమ కంపెనీల వారికి అనుకోకండి. తాజాచేపల్ని ఎంతకైనా కొనే జనం అభిరుచి పట్లే వారి ప్రేమంతా.

నీతి: 1. శత్రువు ఉన్నప్పుడే మనం చురుగ్గా ఉంటాం.

2. జనానికి ఏది ఇష్టమైతే దాన్ని మొదట దూరం చేసి, తర్వాత దానికి ఎక్కువ రేటు పెట్టి అమ్మాలి.

*22 ఆగస్టు 2010*

# కంటి తెలివి

కన్ను అదిరిందంటే అర్థమేమిటి?

అపశకునం, వేడి చేయడం, నరాల జబ్బు ... వీటిలో ఏదైనా కావచ్చు. కాని డాక్టర్ అవేమీ కావన్నాడు.

కొన్నాళ్ళకు కళ్లు అరమోడ్పులయ్యాయి. రెప్పల్ని లేపి పట్టుకున్నా చటుక్కున కిందకు వాలిపోతున్నాయి. డాక్టరు కారణం చెప్పలేకపోయాడు.

మెల్లగా చూపులో తేడా వచ్చింది. అన్ని దృశ్యాలూ కాక కొన్ని దృశ్యాలే కనబడుతున్నాయి.

కొత్త జబ్బు. ఈ భూమ్మీద ఇదే మొదటిసారి. పరిశోధన చేసి కనిపెట్టాలన్నారు.

ఈలోగా అది చెవులకూ పాకింది. కొన్ని గొంతుల్ని, కొన్ని పదాల్ని విన్నప్పుడు లోపలేదో ముడచుకుపోతోంది. అదృష్టవశాత్తు రోజువారీ పనులకేమీ ఇబ్బంది రావడం లేదు.

మళ్ళీ డాక్టరు దగ్గరికి వెళ్లారు. ఈయన టెక్నీషియన్ మీద ఆధారపడే డాక్టరు కాదు. అందుకే కళ్ళే కాక గుండె, మెదడు కూడా పరీక్షించాడు ... అవి రెండూ బాగానే ఉన్నాయి. కాసేపు ఆలోచించాడు. విషయం అర్థమైంది.

గాయపడతాననుకున్నపుడు కన్ను ఏం చేస్తుంది? దానంతటదే మూసుకుపోతుంది కదా. ఎత్తు మీదకు వెళ్లేటపుడు చెవులు ఎందుకు మూసుకుపోతాయి? గాలిలో పెరిగే ఒత్తిడి నుండి రక్షించుకునేందుకు దిబ్బడేసినట్టుగా అయిపోతాయి కదా. అలాగే రోజూ ఒకటే వార్తలు వింటూ, చూస్తూ ఉండేసరికి ముందుజాగ్రత్తగా ఏ అవయవానికి ఆ అవయవం స్వీయరక్షణ కోసం ఆ విధంగా ప్రవర్తిస్తున్నాయని ఆయన వాళ్ళందరికీ వివరించారు.

అబ్బో... మెదడు కంటే వీటికే తెలివి ఎక్కువలా ఉందే అని అబ్బురపడ్డారు ఆ 'వ్యాధి' బారిన పడ్డామనుకున్న వాళ్ళందరూ.

*5 సెప్టెంబర్ 2010*

# ఒక శ్రీకాకుళం లెక్క

ఎన్ని చాక్లెట్లు, ఐస్‌క్రీములు తింటే ఒక పిల్లవాడికి మొహం మొత్తుతుంది?
ఎన్ని దెబ్బలు తింటే ఒక ఆడపిల్ల ఇంటి నుంచి బయటికి వెళ్ళిపోతుంది?
ఎన్ని వృత్తులు నాశనమైతే ఒక డిగ్రీ చేతికి వస్తుంది?
ఎన్ని ప్రశంసలు లభిస్తే ఒక రచయిత సంతృప్తి చెందుతాడు?
ఎన్ని గుంటలు పడితే ఒక రోడ్డుకు చికిత్స మొదలవుతుంది?
ఎన్ని ఫ్లైఓవర్లు కడితే ఒక నగరం తన పేరును మార్చుకుంటుంది?

* * *

ఎన్ని ఉద్యమాలు జరిగితే ఒక రాష్ట్రం అవతరిస్తుంది?
ఎంత పని చేశాక ఒక శరీరం విశ్రాంతిని కోరుకుంటుంది?
ఎంత డబ్బు జేబులో ఉంటే ఒక మనిషికి ధైర్యం వస్తుంది?
ఎంత ప్రయాణం పూర్తయితే గమ్యస్థానం ఏమిటో తెలుస్తుంది?
ఎంత స్తబ్ధత తర్వాత ఒక సమాజం మేలుకుంటుంది?
ఎంత అవినీతి జరిగితే దేవుడు కొత్త అవతారం ఎత్తుతాడు?
ఎంత మంచితనం జతపడితే ఒక సమాజం బాగుపడుతుంది?

* * *

ఇలాంటి గణాంకాలు కూడా చెప్పే శాస్త్రవేత్తలు ఎప్పుడు వస్తారో!

⁂ ⁂ ⁂

ఆ మధ్య శ్రీకాకుళంలో -

కోటానుకోట్ల మంది వచ్చినారు బాబూ అని ఒకావిడ చాలా గొప్పగా చెప్పింది.

కోటానుకోట్ల మంది ఏమిటే లక్షలాది లక్షల మంది వచ్చారు అన్నది రెండో ఆవిడ ఇంకా గొప్పగా.

లక్షలాది లక్షల మంది కాదే వేలాది వేల మంది వచ్చారంది ఇదంతా వింటున్న మూడో ఆవిడ మరింత గొప్పగా.

వాళ్ళు లెక్కలు తెలియక అలా అంటున్నారనుకున్నారు అందరూ.

కాని లెక్కలు తెలిసిన అభివృద్ధి శాస్త్రవేత్తలు కూడా ఇలాంటి లెక్కలే వేస్తున్నారే!

*19 సెప్టెంబర్ 2010*

# 'సూక్ష్మ' రహస్యాలు

ఎవరో కొద్దిమందికి తప్ప ఇల్లు అంటే అందమైన ఊహలే వస్తాయి.

ఎత్తయిన కొండమీద ఒక ముచ్చటయిన పొదరిల్లు కట్టుకుని ఉండగలిగితే ... నిద్ర లేవగానే సూర్యకాంతిలో వెలిగిపోయే ప్రకృతిని సుదూరాల వరకూ చూడగలిగితే ... చేయి చాపి మేఘాలను అందుకోగలిగితే ... అందరికంటే ముందు వాన చినుకులను స్పృశించగలిగితే ...

అడవి మధ్యలో చెట్టుమీద చెక్క ఇల్లు కట్టుకుని ఉండగలిగితే ... పక్షులను అతి దగ్గరగా చూస్తూ వాటి సంగీతాన్ని వింటూ ... జంతువుల రాకపోకల్ని నిశ్శబ్దంగా గమనిస్తూ ... పండ్లూ ఫలాలు తింటూ ... అడవి వాసనల్ని గుండెల నిండా పీల్చుకుంటూ ....

నది ఒడ్డున పర్ణశాల కట్టుకుని ఉండగలిగితే ... రోజంతా నదిలో తిరిగే పడవల్ని చూస్తూ ... మారుతున్న నది నీటి రంగుల్ని కళ్ళల్లో నింపుకుంటూ ... ప్రవాహంలో జీవిత పరమార్థాన్ని వెతుక్కుంటూ...

పల్లెలో వేపచెట్ల నీడన పెంకుటిల్లు కట్టుకుని ఉండగలిగితే ... కోళ్ళూ, గొర్రెలూ, బర్రెలూ పెంచుకుంటూ ... వ్యవసాయం చేసుకుంటూ సాయంత్రమైతే ఆరుబయట ఆకాశం కింద పడుకుని నక్షత్రాలు లెక్కబెడుతూ ...

పట్టణం చివర బస్సులు తిరగని కాలనీలో చిన్న డాబా ఇల్లు కట్టుకుని ఉండగలిగితే ... కూరగాయలు కాయిస్తూ ... పూల మొక్కల్ని పూయిస్తూ .. చదువుల కోసం, వైద్యం కోసం పల్లెనుండి వచ్చినవాళ్ళని ఆదరిస్తూ ....

⁂ ⁂ ⁂

పది రోజుల నుండి ఈ ఊహలన్నీ ఊపిరాడక గిలగిలా కొట్టుకుంటున్నాయి. నగరాల మురికివాడల్లోను, అపార్ట్‌మెంట్ల అంతస్తుల్లోను కూడా సజీవంగా ఉండగలిగిన ఆ ఊహలన్నీ ముంబయిలో ముకేష్ అంబానీ కట్టుకున్న ఇల్లు చూశాక మాత్రం ప్రాణభీతితో పారిపోతున్నాయి.

ఆ ఇంటికైన ఖర్చు పదివేల కోట్లట. ప్రస్తుతం మన రాష్ట్రంలో పేద కుటుంబాల ఉసురు పోసుకుంటున్న సూక్ష్మరుణాల మొత్తంతో అది సరిసమానం. ఆయన దానికోసం అప్పంటూ తీసుకుని ఉంటే అది నిస్సందేహంగా పావలా వడ్డీకే అయ్యుంటుంది.

*24 అక్టోబర్ 2010*

# సెన్స్ Y

అదొక ఊరు. ఆ ఊరు మధ్యలో ఒక దేవాలయం. ఆలయం బయట పెద్ద చెట్టు. చెట్టు కింద పెద్ద అరుగు. రోజూ రాత్రి భోజనాలయ్యాక ఆ అరుగు మీద చిన్నా పెద్దా కలిసి కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుకుంటుంటారు.

ఇవ్వాళ మంచి వర్షం పడింది. రేపు లేదు ఎల్లుండి దున్నడం మొదలుపెట్టొచ్చు.

బండిమీద పోతుంటే నిన్న సుబ్బయ్య అల్లుడికి కాలు విరిగిందట. ఆపరేషన్‌కు లక్ష అడిగారట.

సత్యవతి కూతురికి పెళ్ళి కుదిరింది. మంచి ఉద్యోగం చేస్తున్నా కట్నం ఏమీ వద్దన్నాడట ఆ అబ్బాయి.

విత్తనాలు బ్లాక్‌లో దొరకటం కూడా కష్టంగా ఉంది. పొలం దున్ని ఏం ప్రయోజనం!

రేపు రేషన్ ఇస్తారంట. బియ్యం బాగున్నాయని చెప్పాడు మస్తాన్.

మనూరికి కొత్త రోడ్డు శాంక్షన్ అయిందని చెప్పాడు రెడ్డి. తొందరగా వేస్తే బాగుండు.

ఒక్క రూపాయి అప్పు దొరకని కాలం దాపురించింది. రోడ్లు, విమానాలు ఏం చేసుకోను?

కూరగాయల రేట్లు మరీ ఇంత ఘనం పెరిగిపోతే ఏం వండుకుని తినాలి? విస్తరి ముందు కూర్చోబుద్ధే కావడంలా.

............

వాళ్ళకు టెలికాం రాజాలు, నీరా రాడియాలు, బర్ఖా దత్‌లు తెలియరు కాబట్టి పచ్చి స్వార్థంతో కేవలం తమ కష్ట సుఖాల గురించే రోజూ ఓ అరగంటసేపు మాట్లాడుకుంటారు.

మాటలన్నీ అయిపోయి వాళ్ళంతా లేచి ఇళ్ళకు వెళ్ళిపోయే లోపల ఒక ఔత్సాహిక విలేఖరి వాళ్ళ కష్టసుఖాలన్నీ లెక్కేసి ఇవ్వాళ మన ఊరి సెన్సెక్స్ పది పాయింట్లు పెరిగిందనో, పదిహేను పాయింట్లు తగ్గిందనో ప్రకటించాడనుకోండి. ఊర్లలో విదేశీ ఇన్వెస్టర్లు, స్వదేశీ స్కాములవీ ఉండవు కాబట్టి వాళ్ళ సెన్సెక్స్ పాయింట్లు మరీ వందల్లో వేలల్లో పెరగడమో తగ్గడమో ఉండదు. కాని పల్లె ఆరోగ్యం గురించి అలా రోజువారీగా తెలుసుకోవడం బాగుంటుంది కదా!

అయినా ఎప్పుడూ వ్యాపార, వాణిజ్య వర్గాల సెన్సెక్స్‌లే ఎందుకు వినాలి మనం? ఈ జనాల సెన్సిటివ్ ఇండెక్స్‌లను కూడా లెక్కేసి పరిపాలకులకు వినబడేలా రోజూ టీవీలలో చెప్పే ఏర్పాటు ఎందుకు చేసుకోకూడదూ!

*5 డిసెంబర్ 2010*

# బే'జారు'

ఎక్కడ పడ్డావో చూసుకోవద్దు, ఎక్కడ జారావో చూసుకో అని చెపుతుంది ఒక ఆఫ్రికన్ సూక్తి.

⁂ ⁂ ⁂

ఒక్క చోటే పడితే అలాగే చూసుకోవచ్చేమో. అయినా పడిన చోటు చూసుకోవడానికే టైం లేనివాళ్లం వెనక్కెళ్ళి జారిన చోటు చూసుకునేంత తీరికెక్కడుంది మనకు? పైగా జారినట్టు తెలియొద్దూ ... పడినట్టు తెలియొద్దూ ... తెలిసినా ఒప్పుకోవద్దూ!

మరయితే దారి పొడవునా జారుడు బండలే ఉండే రోడ్డులో నడవాల్సిన వాళ్ళ పరిస్థితేమిటి?

అయినా జారిన చోటు చూసుకుంటే ఏమొస్తుంది? మరోసారి జారకుండా జాగ్రత్త పడతామనా! మళ్ళీ అదే మార్గంలో వెళతామని ఏమిటి నమ్మకం? వెళ్ళినా అక్కడే జారతామని గ్యారంటీ ఏమిటి? పోనీ ఇతరులకైనా జాగ్రత్తలు చెప్పొచ్చనా! అయ్యో రామ... వాళ్ళందరూ జారి పడకుండా సరిగ్గా నడిచేలా చేస్తే అయినట్టే. అందరూ మనల్ని దాటి ముందుకెళ్ళిపోరూ! ... అప్పుడు మనం వెనకబడిపోమూ!

ఎవరూ జారి పడిపోకుండా చూడడానికి ఇక్కడ కూర్చున్నానని చెప్తే జనం నమ్ముతారా? ఎగతాళి చేయకుండా వదిలిపెడతారా? ముందుకు వెళ్ళడం చేతకాక ఈ కబుర్లు చెబుతున్నాననుకోరూ!

అయినా మనకంటే ముందు వెళ్ళినవాళ్ళలో కొందరైనా అక్కడ జారిపడి ఉంటారు కదా! వాళ్ళేమైనా చెప్పారా మనకి ఇక్కడ జారిపడతావు జాగ్రత్తని. మనలాగే టైం లేక ఆగకుండా వెళ్ళిపోయారనుకున్నా జారిపడకుండా అక్కడ ఏదైనా ఏర్పాటు చేయొచ్చు కదా!

అయినా జారిపడడం మానవ లక్షణం. అనాదిగా మనుషులు, జంతువులు అన్నీ జారి పడుతూనే ఉన్నాయి. జారి పడకుండా ముందుకు పోవడం అసాధ్యం. జారిన చోటు చూసుకోవడం కోసం వెనక్కి వెళ్ళడం ప్రకృతి విరుద్ధం. కాబట్టి పడిన చోటునే కాదు జారిన చోటును కూడా ఆగి చూడాల్సిన అవసరం లేదు. పడ్డప్పుడు తగిలిన గాయాల్ని తడుముకోవాల్సిన అవసరం కూడా లేదు. అసలు జారినట్టే, పడినట్టే తెలియనట్టుగా ముందుకు సాగిపోండి. అదే ఈ యుగ లక్షణం.

*27 ఫిబ్రవరి 2011*

# సత్యంతో ఇంటర్వ్యూ

సత్యంగారూ.. మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడగాలనుకుంటున్నాను.

అడగండి.

మీకెన్ని ముఖాలున్నాయి?

ఇంతవరకు ఎవరూ కనిపెట్టలేదు.

పోనీ మీకైనా తెలుసా?

తెలుసనుకున్న ప్రతిసారీ అది అబద్ధమని తేలింది. దాంతో నేను లెక్కపెట్టడం మానేసాను.

మిమ్మల్ని గుర్తుపట్టడమెలా? ఏదైనా ఒక రంగులో ఉంటారా?

కొన్నాళ్ళు తెలుపులో ఉంటాననుకొనేవారు. ఆ తర్వాత నా నివాసం నలుపు అని చాలామంది నిర్ధారించుకున్నారు. రెండూ కాదు బూడిద రంగు అని చదువుకున్న వాళ్ళు అనడం విన్నాను. అంటే నలుపు తెలుపులకు మధ్యనుండే గ్రే కలరట. ఈ మధ్య అయితే అన్ని రంగుల్లోనూ నన్ను చూస్తున్న వాళ్ళున్నారు.

అంటే దేవుడిలా మీరూ సర్వాంతర్యామిగా మారిపోయారా?

అవునని చెప్పాలని మనసు పీకుతోంది కాని సత్యాన్ని కాబట్టి అనలేను. దాని కంటే ముక్కలు ముక్కలుగా విడిపోయి అన్ని రంగుల్లో, ఛాయల్లో కలిసిపోయాననడం వాస్తవంగా ఉంటుందేమో.

మిమ్మల్ని ఏ కాలంలో పోల్చుకోవడం తేలిక?

చెప్పలేను. వర్తమానంలో నన్ను గుర్తుపట్టడం ఎక్కువ కష్టమని మాత్రం చెప్పగలను.

మీరు ఎప్పుడూ ఇలాగే అస్పష్టంగాను నిగూఢంగాను ఉంటుంటారా?

అది చూసేవాళ్ళను బట్టి ఉంటుంది. కొంతమంది నేను కళ్ళెదుట ఉన్నట్టే భావించడం తెలుసు నాకు.

మిమ్మల్ని గుర్తుపట్టగలిగినపుడు మనుషుల హావభావాల్లో ఏమైనా తేడాలు ఉంటాయా?

ఒకప్పుడు ఉండేవంటారు. అప్పుడు వాళ్ళ కళ్ళు సూటిగా నిర్భయంగా చూస్తాయని, గొంతు గట్టిగా ధైర్యంగా పలుకుతుందని అనేవారు. కాని ఇప్పుడు తేడా కనుక్కోవడం కష్టంగా ఉందని అనుకోవడం వింటున్నాను.

చివరి ప్రశ్న. మీ పుట్టుక సత్యలోకంలోనే కదా. బ్రహ్మ మనుషుల్ని తయారుచేసేది కూడా అక్కడే అయినపుడు మరి మిమ్మల్ని గుర్తుపట్టడానికి వాళ్ళు ఇంత అవస్థపడాల్సిన అవసరం ఎందుకొచ్చింది?

మంచి ప్రశ్న. ఇద్దరం ఒక చోట పుట్టడమే కాదు ఇద్దరం వేరు వేరు కూడా కాదు. నాకెన్ని ముఖాలున్నాయో చెప్పడానికే ఆయన నిరంతరం ఇంతమంది మనుషుల్ని సృష్టిస్తున్నాడు.

థాంక్స్ సత్యంగారూ. సత్యమేమిటో నాకిప్పుడు బోధపడింది.

మళ్ళీ అదే పొరపాటా ... ఎప్పటికీ నేర్చుకోవా?

*20 మార్చి 2011*

# అబ్బా... ఎంత సహజం!

రోడ్డు మీద రెండు వాహనాలు ఢీ కొంటాయి... లేదా రాసుకుంటాయి... ఇద్దరు డ్రైవర్లూ కిందికి దిగి ఒకరివైపు మరొకరు దూసుకెళతారు.

కళ్ళల్లోంచి నిప్పులు రాలి పడుతుంటాయి. ఒకరి చొక్కా కాలర్ మరొకరు పట్టుకుంటారు. రెండో చెయ్యి కొట్టడానికన్నట్టు పైకి లేస్తుంది. మాతృభాషలో మాతృ మూర్తిని కించపరిచే పదాలు జరిగిన ప్రమాదాని కంటే ప్రమాదకరంగా రోడ్డంతటా పరుచుకుంటాయి. అటిద్దరు ఇటిద్దరు నిలబడి ఇద్దర్నీ విడదీసేందుకు ప్రయత్నిస్తుంటారు.

దారినపోయే వాళ్ళంతా కాసేపాగి చోద్యం చూస్తుంటారు. ఒక్కోసారి శబ్ద కాలుష్యంతోనే ఆ ఘటన పరిసమాప్తమవు తుంది. ఒక్కోసారి పర్సు బయటికొచ్చి కొంత డబ్బు చేతులు మారుతుంది.

అంతా అయిపోయిందనుకున్న దశలో కూడా ఇద్దరూ వెనక్కి తిరిగి కోపంగా ఒకర్నొకరు చూసుకుంటూ తమ తమ వాహనాల దగ్గరికి వెళతారు. కాసేపు వాటి చుట్టూ తిరిగి సొట్టలు పడ్డ చోటును మరోసారి చూసుకుని ఒకరికొకరు వినపడేలా భారంగా నిట్టూర్చి అప్పుడు ఎవరి గమ్యాల వైపు వాళ్ళు వెళతారు.

ఇందులో కొత్తేముంది... రోజూ చూసేదేగా అనుకుంటున్నారా?

కొత్తేమీ లేదు. కాని ఏ సినిమా రచయితా స్క్రిప్టు రాయకుండానే, ఎవరికీ పూర్వ నటనానుభవం లేకుండానే అందరూ తూ.చా. తప్పకుండా అవే హావభావాలు, ఎలా ప్రదర్శించగలుగుతున్నారో, అవే మాటలు ఎలా మాట్లాడగలుగుతున్నారో ఎప్పుడైనా ఆలోచించారా?

ఎన్నికలప్పుడూ, అసెంబ్లీ సమావేశాలు జరిగేటప్పుడూ, ఆందోళనలు రోడ్డెక్కినప్పుడూ, స్కాములు బయటపడ్డప్పుడూ, పోలీసులు అరెస్టు చేసినప్పుడూ ఇలాగే ఏ స్క్రిప్టూ, ఏ పూర్వానుభవం లేకుండానే అందరూ తమ తమ పాత్రల్ని ఏక రీతిలో పోషిస్తుండడం మన యూనివర్సిటీల ఫైన్ ఆర్ట్స్ శాఖల వాళ్ళు గమనిస్తున్నారో లేదో! ఈ 'సహజ' నాటకాల మీద వాళ్ళు ప్రత్యేకంగా ఒక పేపర్ పెడితే వర్తమాన సమాజాన్ని మనం మరింత బాగా అర్థం చేసుకోగలుగుతామేమో!

*10 ఏప్రిల్ 2011*

# రెండు ఉన్మాదాలు

ఎప్పటిలాగే అమెరికావాళ్ళు మరోసారి తొందరపడ్డారు. ఎన్ని ప్రశ్నలుండిపోయాయి బిన్ లాడెన్‌ని అడిగి తెలుసుకుందామనుకున్నవి.

‘9/11 ఆలోచన మీకు మొట్టమొదట ఎప్పుడు వచ్చింది? మీకే వచ్చిందా? మీ అనుచరులెవరికైనా వచ్చిందా? ఆ రాత్రి మీకు అన్నం సయించిందా? నిద్ర పట్టిందా? మీరు వేసుకున్న అంచనా కూడా మూడు వేల మంది పోతారనేనా? లేక ముప్పైవేల మంది పోతారనుకున్నారా? ఈ పదేళ్ళలో మీకు ఎన్ని పీడకలలు వచ్చి ఉంటాయి? ఆ కలల్లో ఎవరెవరొచ్చే వాళ్ళు?’ ...ఇలాంటి కొన్ని వేల ప్రశ్నలు అడిగి జవాబులు తెలుసుకుందామని ప్రపంచ మీడియా ఎన్నేళ్ళుగా కాచుకుని ఉంది!

‘మీ డ్రస్ సెన్స్ చాలా బాగుంటుంది. మీకు స్పెషల్ డిజైనర్లు ఉన్నారా? లేక రహస్యంగా లండన్, ప్యారిస్, న్యూయార్క్ లాంటి నగరాలకు వెళ్ళి కొంటారా?’ ... అని ఆయన్ని అడుగుదామని ఫ్యాషన్ డిజైనర్లు కూడా ఎన్నేళ్ళుగా ఎదురు చూస్తున్నారో తెలుసా!

‘అంత స్లిమ్ పర్సనాలిటీ... అదీ 54 ఏళ్ల వయసులో... ఎలా సాధ్యం’... అని ఆయన్ని అడగాలనుకుంటున్న వాళ్ళయితే వేలల్లో ఉన్నారు. వారిలో ఒబేసిటీ క్లినిక్‌ల వాళ్ళు, యోగా గురువులు, జిమ్ ట్రైనర్లు, డైటీషియన్లు, డాక్టర్లు మరెందరెందరో ఉన్నారు.

‘9/11 అంత పవర్‌ఫుల్ అంకె అని ఎవరు చెప్పారు మీకు? అలాంటి పవర్‌ఫుల్ అంకెలు ఇంకేమైనా తెలుసా మీకు’ ... అని అడగాలని ప్రపంచవ్యాప్తంగా ఎందరు న్యూమరాలజిస్టులు ఎదురుచూస్తున్నారో అమెరికావాళ్ళకేం తెలుసు?

అపరాధము, పశ్చాత్తాపము వంటి విషయాలమీద లాడెన్ అభిప్రాయా లేమిటో, అలాంటి ఆలోచనలు ఆయనలో ఎప్పుడైనా కలిగాయో లేదో, కలగకపోతే ఎందుకు కలగలేదో తెలుసుకోవాలనుకుంటున్న వాళ్ళయితే బహుశా కోట్లలోనే ఉండి ఉంటారు.

‘చూడ్డానికి అంత సాధువులా కనిపిస్తూ మనసులో అంతటి ఘోరాలోచనలు దాచుకోవడం మామూలు విషయం కాదు. గురూ... ఎక్కడ నేర్చావీ కళ’ అని ఎన్ని వందల మంది నటులు, మెజీషియన్లు, వ్యక్తిత్వ వికాస నిపుణులు, పోలీసులు, అపరాధ పరిశోధకులు ఆయన్ని అడగాలనుకున్నారో అమెరికా వాళ్ళు ఊహించనైనా ఊహించలేరు.

లాడెన్‌తో ఒక సంవత్సరం మాట్లాడి కనీసం పది సంపుటాల జీవిత చరిత్ర రాద్దామనుకున్న రచయితలు ప్రపంచ భాషలలో ఎన్ని వేలమంది ఉండి ఉంటారు!

వీళ్ళకూ, ఇలాంటి వాళ్ళు మరెందరికో ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా లాడెన్‌ను కాల్చేసి, శవాన్ని సముద్రంలోకి తోసేసి అమెరికా ఏం సాధించాలనుకుందో అర్థం కాదు. ఇప్పటిదాకా మనం లాడెన్ ఆ పిచ్చిపని ఎందుకు చేశాడో ఊహిస్తూ కూర్చుంటే ఇకముందు అమెరికా ఈ పిచ్చిపని ఎందుకు చేసిందా అని ఊహిస్తూ కూర్చోవాల్సొస్తోంది.

*15 మే 2011*

# అవి-నీతి కథలు

అందరూ అవినీతి గురించి మాట్లాడుతున్నప్పుడు తమ స్కూలులో ఇంకా నీతి గురించే మాట్లాడడం వెనకబాటు తనం అవుతుందనుకున్నాడు ఒక స్కూలు హెడ్మాస్టరు.

పొద్దున అసెంబ్లీ జరుగుతున్నప్పుడు తెలుగు టీచరు ఎప్పట్లా సుభాషితాలేవో చెప్పబోతుంటే ఆయన సైగ చేసి ఆపేశాడు. తనే మైకు ముందుకు వచ్చి ఎవరికీ అక్కరలేని నీతి సూక్తులు మనకీ వద్దు. మీరసలే పిల్లలు. భావి భారత పౌరులు. మీ భవిష్యత్తుకి ఏది అవసరమైతే అదే చెప్పడం గురువులుగా మా కర్తవ్యం. ఇకనుంచి అవినీతి సూక్తుల గురించి తెలుసుకుందాం. అవినీతి పద్యాలు వల్లె వేద్దాం. అవినీతి కథల గురించి మాట్లాడుకుందాం... అనేసి పేపర్ తెరిచి ఒక అవినీతి కథనం చదివి వినిపించాడు.

పిల్లలకు అది ఏ మాత్రం నచ్చలేదు. ఆ కథనంలోని ఏ పేరూ వాళ్ళకు నోరు తిరగలేదు. అది అసలు కథలా లేదు. కోట్లు, కుంభకోణాలు లాంటి పదాలు వాళ్ళ పాఠాల్లోకి ఇంకా రాలేదు. చూసి చూసి స్కూలు లీడరుగా ఉన్న అమ్మాయి ముందుకొచ్చి ఈ కథ మాకెవరికీ అర్థమే కాలేదు సార్ అంది.

హెడ్మాస్టరు కోపంగా చూశాడు. నీతి వాక్యాలు, పద్యాలు, కథలు పుట్టిన కొత్తలో కూడా మీలాంటి పిల్లలు ఇదే మాటన్నారు. వాళ్ళకోసం ఆ కథలు, పద్యాలన్నిట్నీ సరళం చేసుకుంటూ వచ్చారు నా బోటి టీచర్లు. అయినా అర్థమైందా మీకు, ఆచరిస్తున్నారా వాటిలో వందో వంతైనా అని అరిచాడు.

పిల్లలు పాపం బిక్కమొహం వేశారు. మర్నాడు తల్లిదండ్రులందరూ కలిసి హెడ్మాస్టరుకు ఒక వినతి పత్రం రాసి పంపారు. 'మీరు ప్రతి తరానికి నీతి కథలు, సూక్తులు చెపుతున్నా కూడా మనుషులు ఇలా తయారైనపుడు అవి చెప్పడం మానేసి అవినీతి కథలు చెపితే ఇక ఈ దేశం ఏమైపోతుందో ఒక్కసారి ఆలోచించండి. దయచేసి నీతి కథలే కొనసాగించండి' అని ఉంది అందులో.

*26 జూన్ 2011*

# ఇనుమూ నీవెంత బంగారానివే

ఈ పాటికే ఈ మార్పు రావాల్సింది. ఎందుకో బాగా ఆలస్యమైంది.

ఇంట్లో చిన్న పిల్లలకు అన్నం తినిపించేటపుడు మనం ఏమనాలి? ఇంకా మా బుజ్జివి కదూ, మా బంగారువి కదూ అనడమేమిటి? 'మా అమ్మవు కదూ మా ఇనపగజ్జెల తల్లివి కదూ. ఈ ఒక్క ముద్దా నోట్లో పెట్టుకోమ్మా' అని కదా అనాలి.

వాడిది ఎంత ఐరెన్ లెగ్ అంటే... అని మొదలుపెట్టి వాడి వల్ల తమకు కలిగిన కష్టనష్టాలన్నీ చెప్పుకొస్తుంటారు కొందరు. ఎప్పటి భావన అది! 'ఒరేయ్ ఐరూ... కుడి అయినా ఎడమ అయినా పరవాలేదు. లెగ్ అయినా హ్యాండ్ అయినా పరవాలేదు. నువ్వు లోపలికొస్తే చాలు మాకు అష్టైశ్వర్యాలూ సిద్ధిస్తాయి' అని ఆహ్వానించాల్సిన రోజులు కదా ఇవి.

పెళ్ళికూతురికి హారతి ఇచ్చి లోపలికి తీసుకెళ్ళేటపుడు ఏం పాడాలి?

'రావమ్మా ఇనుపలక్ష్మి రావమ్మా

ఈ కోవెల, ఈ ఇల్లు కొలువై ఉందువుగాని

రావమ్మా ఇనుపలక్ష్మీ రావమ్మా' అని కదా.

రామ రామ ఏమిటీ అపశకునపు, అప్రాచ్యపు, అరాచకపు, అన్యాయపు మాటలు, పాటలు అనొద్దు. అంత తొందరపడొద్దు.

ఈ దేశపు ధనవంతుల జాబితా చూడండి. అందులో ఇనుము ద్వారా ధనవంతులై ఫోర్బ్స్ జాబితాలోకి ఎక్కి కూర్చున్న వారెంతమంది ఉన్నారో చూడండి. ఇనుప ఖనిజాన్ని తవ్వినా, అమ్మినా, దానితో వస్తువుల్ని తయారుచేసినా, ఉక్కుగా మార్చినా ధనలక్ష్మి ఉరుకులు పరుగులతో వారి వద్దకు వెళుతోంది. అలాంటప్పుడు మనమింకా ఇనుప గజ్జెల తల్లి అని, ఐరెన్ లెగ్ అని ఇనుమును వెక్కిరిస్తూ కూర్చుంటే మన స్థితి ఎప్పటికీ ఇలాగే ఉంటుంది. ఫోర్బ్స్‌లో F దాకా కూడా చేరుకోలేం.

తెలివిగల తెలుగువాళ్ళు ఇప్పటికైనా తమ భాషను మార్చుకోవాలి.

*3 జూలై 2011*

# మాతృభాషాభిమానం

"... ఇందుకోసం కూడా తెలుగు భాషను మనలో ప్రతి ఒక్కరం మరింత బాగా నేర్చుకోవాల్సిన అవసరం ఉందని నా అభిప్రాయం" మైకులో ఒక పెద్దాయన గొంతు వినబడుతోంది.

తెలుగు భాష ఔన్నత్యం, ఆవశ్యకతలపై జరుగుతున్న సదస్సు అది. పొద్దున్నించి దేశభాషలందు తెలుగు ఎందుకు లెస్సో ( ఇంగ్లీషు Less కాదు) అందరూ చెప్పీ చెప్పీ వినీ వినీ అలిసిపోయి ఉన్నారు. ఇది మధ్యాహ్నం సెషన్. అన్నపూర్ణ లాంటి తెలుగు భోజనం తిని, తెలుగు భుక్తాయాసంతో, తెలుగు నిద్రామైకంలోకి జారుకుంటుండగా ఈ మాటలు వినిపించాయి. ఠక్కున లేచి కూర్చున్నారందరూ.

తెలుగు గొప్పతనం గురించి, తెలుగును బతికించుకోవాల్సిన అవసరం గురించి ఇంతమంది కవులు, కథకులు, పండితులు, భాషావేత్తలు చెప్పని ఏ కొత్త విషయాన్ని ఆయన చెప్పబోతున్నాడో వాళ్ళకు అర్థం కాలేదు. ఊపిరి బిగబట్టి చెవులు రిక్కించారు.

"నేనో రాజకీయ నాయకుడ్ని. నాకు వ్యాకరణం, పద్యం, శైలి, శిల్పం వగైరాల గురించి తెలియదు. కాని తెలుగు

భాష మాత్రం ఉండి తీరాలి. వేరే ఏ భాషలోనూ నాకు తిట్లు రావు. అలాగే నేను ఎవర్నయినా పొగడాలన్నా, ఎవరైనా నన్ను పొగడాలన్నా... వీటి అవసరం నాకు ప్రతిరోజూ ఉంటూనే ఉంటుంది... తెలుగు భాష నాకూ, వాళ్ళకీ కూడా వచ్చి ఉండాలి. మా ఇద్దరికి మాత్రమే వస్తే సరిపోదు. నా నియోజకవర్గం ప్రజలకు, మీడియా వాళ్ళకు కూడా వచ్చి ఉండాలి. ఢిల్లీ వాళ్ళకు, ఇంకా చెప్పాలంటే అమెరికా వాళ్ళకు తెలుగు భాష రాకపోవడం వల్ల నాకు ఇప్పటికే చాలా నష్టం జరిగింది. ఒక రాజకీయ నాయకుడ్ని అర్థం చేసుకోవాలంటే అతని భాష తెలిసి ఉండాలి.

ఒక భాష సజీవంగా ఉందని చెప్పడానికి మాలాంటి వారికి ఒక ప్రమాణమే ఉంటుంది. అదెన్ని కొత్త తిట్లను స్వీకరిస్తుందో, ఎన్ని కొత్త పొగడ్తలను సృష్టించు కుంటుందో దానిమీదే ఆ భాష కొనసాగింపు ఆధారపడి ఉంటుంది. ఇక్కడ కూర్చున్న మీరందరూ అందుకు దోహదపడాలని నా మనవి''... అనేసి సెలవు తీసుకున్నాడాయన.

కింద కూర్చున్నవాళ్ళు మరింత జోరుగా చప్పట్లు కొట్టి ఆయన చెప్పిందాంట్లో న్యాయం ఉందని అనుకోవడం వినిపించింది.

*10 జూలై 2011*

# నరకగల వారెవరు?

అది ఒక మామూలు దేశం. బోలెడంత మంది పేదవాళ్ళు, కొందరు గొప్పవాళ్ళు కలిసి బతుకుతుండేవారు. బోలెడంత చెడు, కొంత మంచి పక్కపక్కనే సహజీవనం చేస్తుండేది. ఎన్ని అసమానతలున్నా ఏదో ఒక బ్యాలెన్స్ ఉండేది. పేదవాళ్ళ పట్ల ఒక రకమైన జాలి ఉండేది. మంచివాళ్ళ పట్ల ఒక రకమైన గౌరవం ఉండేది.

ఏమైందో ఏమో ... ఉన్నట్టుండి ఆ దేశం నడిబొడ్డులో ఒక చెట్టు మొలిచింది. కొత్తగా వచ్చిన ఎరువేదో ప్రయోగాత్మకంగా దాని మొదట్లో వేసినట్టున్నారు. హఠాత్తుగా అది అన్ని చెట్ల కంటే ఎత్తుగా, వెడల్పుగా పెరిగిపోయింది. వేలాది కొమ్మలు, ఊడలు. ఆకులు కనిపించనన్ని ఫలాలు. ప్రతీదీ బంగారు రంగులో మెరిసిపోతున్నాయి.

జ్ఞాన వృక్షం ఇదే అన్నారు కొందరు.

ఒకాయన చెట్టు పైకి ఎక్కి ఒక్కొక్క పండూ తెంపి పడేస్తుంటే కిందున్న వాళ్ళ నుంచి ఒకటే కేరింతలు. ఇంకా ఇంకా అని అరుస్తున్నారు. ఆయన జాగ్రత్తగా ఎంపిక చేసుకుని కొందరికే విసురుతున్నాడని కొన్నాళ్ళకు మిగతావాళ్ళకు అర్థమైంది. అప్పట్నుంచి కేరింతల కంటే హాహాకారాలు ఎక్కువయ్యాయి.

అది జ్ఞానవృక్షం కాదని అప్పటికి అందరికీ అర్థమైంది. అవినీతి వృక్షమని కూడా తెలిసిపోయింది. కాని అప్పటికే దాని వేర్లు నేలంతటినీ కలుషితం చేశాయి. చుట్టూ ఒకటే విషం. అంత విషాన్ని తట్టుకుని చెట్టు దగ్గర దాకా వెళ్ళి దాన్ని నరకగల వాళ్ళ కోసం ఆ దేశం ఎదురుచూస్తోంది.

*31 జూలై 2011*

# ఆ పుణ్యమూ మీరే కట్టుకోరూ..

**డియర్ బాడీ అండ్ డియర్ బ్రెయిన్,**

పరిస్థితి మా చెయ్యి దాటిపోవడం వల్ల మీకు నేరుగా ఈ ఉత్తరం రాయక తప్పడం లేదు. ఇన్నాళ్ళూ మా స్వేచ్ఛకు భంగం కలిగించకుండా మీ ఏర్పాట్లేవో మీరు చేసుకుని మమ్మల్ని చాలా రకాల రుగ్మతల నుంచి కాపాడారు. అందుకు ధన్యవాదాలు. కాని మారిన పరిస్థితులలో మీరు మా పట్ల మరింత బాధ్యత వహించకపోతే మేము అన్ని విధాలా అన్యాయమై పోతామనే భయం పట్టుకుంది.

రోజూ నిద్రలేవగానే పళ్ళు తోముకున్నట్టే, రోజుకొకసారైనా స్నానం చేసినట్టే, రోజులో రెండు పూటలా అన్నం తిన్నట్టే, శరీరం దాహం అని అరిచినప్పుడల్లా మంచినీళ్ళు తాగినట్టే, బ్లాడర్ నిండినప్పుడల్లా బాత్‌రూమ్‌కి పరిగెట్టినట్టే, దేనికి బద్ధకించినా మలబద్ధకం మాత్రం లేకుండా చూసుకున్నట్టే ... నడక, యోగా లాంటివి కూడా మేము ప్రతిరోజూ చేసేలా మీరు వాటిని మా శరీర విధుల్లో భాగం చేయండి ప్లీజ్.

పళ్ళు తోముకోకపోతే నోరు పాచివాసన వచ్చినట్టే, స్నానం చేయకపోతే శరీరం కంపు కొట్టినట్టే, వేళకి తినకపోతే శోష వచ్చి పడిపోయినట్టే, నీళ్ళు తాగకపోతే నాలుక పిడచకట్టుకు

పోయినట్టే ... శరీరానికి తగిన వ్యాయామం అందనపుడు దానికి ఏదో ఒక తీవ్ర చికాకు కలిగేలా, ఆ పని చేయడం మినహా మరో మార్గం లేకుండేలా ఏదో ఒక ఏర్పాటు చేయాల్సిన పరిస్థితులు వచ్చాయిప్పుడు. ఇన్నాళ్ళూ ఈ వ్యాయామాలను మా విచక్షణకు వదిలేశారు నిజమే. కాని మీరు మాకు ఇచ్చిన గౌరవాన్ని మేము నిలబెట్టుకోలేక పోయాం. కనక దయచేసి నిర్బంధంగా అనిపించనివ్వని మీ సున్నితమైన పద్ధతిలోనే ఈ క్రమశిక్షణ కూడా మాకు నేర్పండి.

ఒక్క శరీరం విషయంలోనే కాదు, మా మెదళ్ళకు కూడా మీరు కొన్ని నేర్పాలి. మా మెదళ్ళకు ఇటీవల విపరీతమైన ధన దాహం, కీర్తి దాహం పట్టుకున్నాయి. వాటి కోసం ఉచ్ఛనీచాలన్నీ మరిచి అది అనేక అడ్డదారులు తొక్కుతోంది. వాటికి ఓ ఐదు పాయింట్లు గరిష్టస్థాయిగా నిర్ణయించి అంతకు మించితే మెదడులోని రక్తనాళాలు చిట్లిపోయేలా మీరే ఏదో ఒక ఏర్పాటు చేసిపెడితే సర్వనాశనం నుంచి మమ్మల్ని కాపాడిన వారవుతారు.

వేరే ఏ దారీ లేకే మీకు ఈ బహిరంగ లేఖ రాయాల్సొచ్చింది. అర్థం చేసుకుని ఈ రెండు బాధ్యతల్ని కూడా ఇకపై మీరే తీసుకోండి.

*14 ఆగస్టు 2011*

# కథలు చెప్పొద్దే అమ్మా!

కథ చెపుతాను ఊ కొడతావా?

ఊహు.

ఏం?

ఎంతసేపని ఒకటే అక్షరం పలకాలి?

మరి నువ్వు వింటున్నట్టు నాకెలా తెలుస్తుంది?

నేను ఊ అన్నంత మాత్రాన వింటున్నానని గ్యారంటీ ఏమిటి?

అదీ నిజమే అనుకో. అంటే నీ ఉద్దేశం నన్ను కథ చెప్పొద్దనా?

నీకు చెప్పాలనుంటే చెప్పు. నాకు వినాలనిపిస్తే వింటాను. కాని నేను వింటున్నట్టు దాఖలా కావాలంటే మాత్రం నా వల్ల కాదు.

అయ్యో అంత పెద్ద మాటలెందుకు? నేను చెపుతానన్నది కథే కదా.

ఇవ్వాళ అది కథే కావచ్చు. రేపు చాడీలు కావొచ్చు. ఎల్లుండి ఏదో తగువు తీసుకొస్తావు. కథ చెప్పినప్పుడు ఊ కొట్టిన అలవాటుతో వాటికీ కొడతాను. ఒకవేళ నేను ఊ అనకపోతే కథలు చెప్పినప్పుడు బిడ్డలు కాని కష్టాలు చెప్పినప్పుడు

బిడ్డలు కారు అని బుగ్గలు నొక్కుకుంటావు. అంత్యనిష్ఠూరం కంటే ఆదినిష్ఠూరం మేలు అంటావు కదా! అందుకే ముందే చెపుతున్నాను.

కథలు వినడానికి కూడా ఇంతగా భయపడే కొడుకును నిన్నే చూశాను...

ఈ కాలం గురించి తెలియదు నీకు. అసలు విషయం చెప్పనా! నువ్వు నీ ఆత్మకథో మన కుటుంబ కథో చెపితే పరవాలేదు. పురాణ కథలు, పుణ్యపురుషుల కథలు చెపుతావు. త్యాగాలు చేసినవాళ్ళ గురించి, యుద్ధాలు చేసిన వాళ్ల గురించి, ప్రజాసేవ చేసిన వాళ్ళ గురించి చెప్పి వాళ్ళురా గొప్పవాళ్ళు... అలా బతకాలిరా అంటావు. అలా బతికే పరిస్థితులు ఉన్నాయా బయట? ఆలోచించు. కథ వింటూ అన్నిసార్లు ఊ కొట్టాక, ఆ తర్వాత అలా బతకలేనపుడు ఏదో తప్పు చేసినట్టు ఉండదూ నాకు! చిన్నవాడినైనా ఎందుకు చెపుతున్నానో అర్థం చేసుకోవే అమ్మా. కథలు చెబుతానని చంపకే.

*2 అక్టోబర్ 2011*

# అవలోకనం

సింహావలోకనం అంటే ఏమిటి తాతా?

వెనక్కి తిరిగి చూసుకోవడం.

ఒక్క సింహాలే చేస్తాయా ఆ పని ?

బహుశా వాటికే మెడ వెనక్కి తిరుగుతుందేమో!

నేను చాలామంది అబ్బాయిల్ని, అమ్మాయిల్ని కూడా చూశానే వెనక్కి తిరిగి చూస్తూ చూస్తూ వెళుతుంటారు.

అది వేరురా. తమ వెనుక అమ్మాయిలు వస్తుంటే వాళ్ళ అందాన్ని చూద్దామని అబ్బాయిలు ఆత్రంగా తల తిప్పి చూస్తూ చూస్తూ వెళతారు. వెనక అబ్బాయిలు వస్తున్నపుడు వాళ్ళేం చేస్తారోనన్న భయంతో అమ్మాయిలు మాటిమాటికి వెనక్కి చూస్తూ నడుస్తారు.

మరి సింహం ఏ కేటగిరీలోకి వస్తుంది?

ఛ. ఛ. సింహానికేం ఖర్మ. అది ఆడదైనా మగదైనా అవతలివాళ్ళను నేరుగా చూడగలదు.

అలాంటపుడు వెనక్కి తిరిగి చూడడానికి సింహావలోకనం అనే పేరు ఎందుకొచ్చింది?

వెనక్కి చూడడమంటే ఊరికే వెనక్కి చూడడం కాదు. గతంలో జరిగిన విషయాలన్నిటినీ తరచి చూడడమని.

సింహానికి ఎంత గతం ఉంటుంది? ఆ గతంలో అది తరచి చూసుకోవాల్సినన్ని విషయాలు ఏముంటాయి?

ఇంతకీ నీ డౌట్ ఏమిటి?

సింహావలోకనం సింహాల కంటే మన నాయకులకే ఉండాల్సిన అవసరం ఎక్కువుందని నా ఉద్దేశ్యం. ఒక చిన్న అడవిలో కొన్ని వందల జంతువులకు మృగరాజుగా వ్యవహరిస్తున్నందుకే అది అన్నిసార్లు వెనక్కి తిరిగి ఏం జరుగుతున్నదో ఎప్పటికప్పుడు గమనిస్తోందంటే, ఇంత పెద్ద దేశంలో ఇన్ని కోట్ల మంది మనుషుల్ని పరిపాలించే రాజకీయ నాయకులు ఇంకెన్నిసార్లు తమ చుట్టూ ఉన్న పరిస్థితులను, తమ చర్యలను అవలోకనం చేసుకోవాలి?

*23 అక్టోబర్ 2011*

# డామిట్ ... కథ అడ్డం తిరగదా!

పోలీసు స్టేషన్లలో కూర్చుని రాసుకుంటున్న వాళ్ళంతా ఎవరు?

క్రైమ్ రిపోర్టర్లు.

ఆస్పత్రుల దగ్గర హడావిడిగా తిరుగుతున్న వాళ్ళు?

క్రైమ్ రిపోర్టర్లతో కలిసి వెళ్ళిన ఫోటోగ్రాఫర్లు అయి ఉంటారు.

జైళ్ళ దగ్గర నిలబడి ఉన్నవాళ్ళు?

వాళ్ళూ వాళ్ళే. ఎక్కువమంది ఉంటే టీవీ రిపోర్టర్లు, కెమెరామెన్ కూడా వచ్చినట్టు.

ప్రెస్ కాన్ఫరెన్స్‌లకు వెళ్ళేవాళ్ళు వేరేవాళ్ళేమో!

వేరే వాళ్ళెక్కడ నుంచి వస్తారు? వాళ్ళూ వీళ్ళూ అంతా ఒకటే.

అంటే నేను అనేది డిజిపి, డిఐజి, సిబిఐ వాళ్ళు పెట్టే ప్రెస్ కాన్ఫరెన్స్‌లలో కనబడే వాళ్ళ గురించి కాదు ...

నేను చెప్పేందీ వాళ్ళ గురించి కాదు.

అర్థం కాలేదు.

సచివాలయంలో కనిపించే రిపోర్టర్లయినా, వివిధ మంత్రిత్వ శాఖలు, పార్టీ ఆఫీసుల దగ్గర కనిపించే రిపోర్టర్లయినా

అందరూ ఇవ్వాళా రేపూ క్రైం రిపోర్టర్లే. ఎందుకంటే ఆ బీట్‌లలో ఉన్న వాళ్ళు రాస్తున్నదీ క్రైం గురించే. ఆ శాఖల వాళ్ళు చేస్తున్న క్రైం గురించైనా రాస్తుంటారు లేదా వేరే వాళ్ళు చేస్తున్నారని ఆ శాఖల వాళ్ళు చెప్పే క్రైం గురించైనా రాస్తుంటారు. మొత్తంమీద ... అంతా క్రైమే. సర్వం మిథ్య నుంచి సర్వం క్రైంకి ఎదిగాం మనం.

కళ్ళు కొంచెం తెరుచుకున్నాయి ...

ఇంకాస్త తెరుచుకుని చూడు. క్రైంలో హ్యూమన్ ఇంట్రెస్ట్ స్టోరీలు (కనిమొళి కన్నీళ్ళు వగైరా), క్రైంలో మెడికల్ స్టోరీలు (అమర్‌సింగ్ అనారోగ్యం వగైరా) క్రైంలో సాహిత్యం, క్రైంలో స్టాటిస్టిక్స్, క్రైంలో రాజనీతి, క్రైంలో న్యాయశాస్త్రం, క్రైంలో ఫిలాసఫీ, క్రైంలో సైకాలజీ,క్రైంలో సోషియాలజీ ఇంకా చాలా చాలా కనిపిస్తాయి.

డామిట్ .... ఈ కథ ఎప్పటికి అడ్డం తిరుగుతుందో!

*13 నవంబర్ 2011*

# మంచివాళ్ళ సభలు

రోజూ రకరకాల సభలు జరుగుతుండడం వల్ల మీరు గమనించి ఉండకపోవచ్చు గాని ఇటీవల ఒక కొత్త ట్రెండ్ మొదలైంది. చాలా ఊళ్ళలో 'మంచివాళ్ళు' సభలు పెట్టుకోవడం మొదలుపెట్టారు.

మొదట్లో కొద్దిమందే వాటికి హాజరవుతుండే వారు. రాన్రాను వాళ్ళ సంఖ్య పెరిగిపోసాగింది. చిన్నాపెద్దా ఆడామగా పేదాగొప్పా అందరూ వెళ్తున్నారు వాటికి.

మొదట్లో నెలకోసారే జరిగేవి. ఇప్పుడు మాత్రం ప్రతిరోజూ జరుగుతున్నాయి. ఎక్కువగా పొద్దుటిపూటే జరిగినా ఆలస్యంగా లేచేవాళ్ళ కోసం ఈ మధ్య సాయంకాలాలు కూడా మినీ సమావేశాలు జరుగుతున్నాయి.

ఇవి మరీ ఎక్కువ సేపు కూడా జరగవు. జస్ట్ ఐదు పది నిమిషాల్లో ముగించేసుకుని బయటికి వచ్చేస్తుంటారు. అయితే బయటికొచ్చాక టీ తాగుతూ కబుర్లు చెప్పుకోవడం, వాదించుకోవడం లాంటి సాధారణ సభా దృశ్యాలు అక్కడ కనిపించవు.

లోపలికి వెళ్ళేటప్పుడు వాళ్ళ చేతిలో ఏదో ఒక దినపత్రిక తప్పనిసరిగా ఉంటుంది. బయటకు వచ్చేటప్పుడు మాత్రం

అది వారికి చేతిలో ఉండదు. లోపలికెళ్ళేటప్పుడు కాస్త ఉద్విగ్నంగా ఉండడం, బయటికొచ్చేటప్పుడు పరమ ప్రశాంతంగా ఉండడం కూడా గమనించొచ్చు.

సభలన్నాక వేదిక, వక్తలు, ఉపన్యాసాలు, చర్చలు, నిర్ణయాలు వగైరా ఉండాలి కదా. అవేమీ లేకుండా, అయిపోయాక కనీసం పత్రికా ప్రకటనలు కూడా ఇవ్వకుండా వాళ్ళు లోపలేం చేస్తున్నారో ఎవరికీ అంతుపట్టలేదు. చివరికి మీడియాకి ఉప్పంది ఒకరోజు పొద్దుట వాళ్ళు లోపలికి దూసుకొచ్చేశారు. వాళ్ళు చూసిన దృశ్యం ఇలా ఉంది -

సభికులందరూ వరుసగా లేచి నిలబడి ఆ రోజు తాము చదివిన ఒక కుంభకోణం, ఒక అవినీతి ఒప్పందం, ఒక అవకతవకల నిర్మాణం, ఒక అక్రమ సంపాదన, ఒక తప్పుడు నిర్ణయం వార్తను చూపెట్టి అందులో తమ ప్రేమయం ఏమీ లేదని ప్రకటించి కూర్చుండిపోతున్నారు. చివరివాడు కూడా అదే మాట చెప్పాక అందరూ లేచి బయటికి వెళ్ళిపోసాగారు.

మీడియా వారిని ఆపి 'ఇందులో మీరు చేస్తున్న మంచి ఏమిటి' అని అడిగింది. 'భలేవాళ్ళే. ఆయా పనుల్లో మా ప్రమేయం లేకపోవడమే మేము చేస్తున్న మంచి పని. ఇవాళా రేపూ మంచివాడు కావడానికి పనిగట్టుకొని మంచి పనులేమీ చేయనక్కరలేదు. ఈ చెడ్డ వాళ్ళ పుణ్యమా అని మంచివాళ్ళవ్వడం ఇప్పుడు బాగా సులభమైపోయింది' అన్నారు వాళ్ళు.

*18 డిసెంబర్ 2011*

# పాపం.. కాలం ఏం చెబుతుంది?

కాలం కాలు మార్చుకోబోతుండగా... బిలబిలమంటూ వచ్చి నిలబడ్డాయి సంవత్సరాలు. వాళ్ళు ఒకర్నొకరు పిలుచుకునే పేర్లు వేరైనా మన సౌలభ్యం కోసం మనం వాటిని పిలుచుకునే అంకెల్నే తగిలించుకుని వచ్చాయి.

ఏమిటన్నట్టు చూసింది కాలం.

ఒక్కో సంవత్సరం ఒక్కో కష్టాన్ని ఏకరువు పెట్టింది. 2011 కరువులు, రైతుల ఆత్మహత్యల గురించి చెబితే 2010 ఉద్యమాలు, విద్యార్థుల ఆత్మహత్యల గురించి, 2009 ఎన్నికలు, నాయకత్వ మార్పిడి, నిజమో కాదో తెలియని ఆత్మహత్యలు... ఇలా మొదటి వరసలో నిలబడ్డ పదకొండూ తమ ఒక్కో ముఖ్యమైన కష్టం గురించి చెప్పుకుంటూ పోయాయి.

కాలం మౌనంగా వింటూ కూర్చుంది.

వెనకాల నిలబడ్డ సంవత్సరాలు ముందుకొచ్చి ఏదో మాట్లాడేందుకు ప్రయత్నించాయి. కాని ముందువి మాత్రం కదలకుండా ఇంకా ఏదేదో చెప్పుకుంటూ పోతున్నాయి. ఎహే.. అవన్నీ మీకొక్కరికే ఉన్నట్టు మాట్లాడతారేమిటి? అరిచాయి వెనకాల నిలబడ్డ సంవత్సరాలు. అరె... మీకున్నవి

మీరు చెప్పుకునే వుంటారు ఇదివరకు. మాకున్నవి మమ్మల్ని చెప్పనివ్వండి. కాలానికి కాకపోతే ఇంకెవరికి చెప్పుకుంటాం? తిరిగి అరిచాయి ముందు నిలబడ్డ సంవత్సరాలు.

వాదోపవాదాలు పెరిగాయి. ఎవరేం మాట్లాడుతున్నారో ఎవరికీ వినిపించకుండా పోయింది. ప్రకృతి.. మానవుడు.. అడవులు.. గనులు.. అభివృద్ధి.. విధ్వంసం.. అవినీతి.. దురాశ వంటి కొన్ని పదాలు మాత్రమే వినబడుతున్నాయి.

కాలం కన్నార్పకుండా చూస్తూనే వుంది.

చివరికి ఒకటో సంవత్సరం కాబోలు అందర్నీ తోసుకుని ముందుకొచ్చింది. దాని తెల్లజుట్టు చూసి అందరూ అరవడం ఆపారు. 'ఇక్కడ ఎవరూ ఎవర్నీ వ్యతిరేకించడం లేదు. అందరికీ  సమస్యలు ఉన్నాయి. అన్నీ ఎప్పట్నించో ఉన్న ముఖ్యమైన సమస్యలే. పైగా కాలానికి తెలియని విషయాలేమీ కావు. కాబట్టి పరిష్కారం గురించి కాలం ఏం చెబుతుందో విందాం. అందరూ కాసేపు మౌనంగా వుండండి...' అంది.

అందరూ ఊపిరిబిగబట్టి కాలం వంక చూశారు.

'మీరూ నా బిడ్డలే. ఈ సమస్యల్ని సృష్టిస్తున్న మానవులూ నా బిడ్డలే. ఈ పరిస్థితుల్లో నేను చెప్పగలిగింది ఒక్కటే. నాట్ బిఫోర్ మి' అని కాలం లేచి వెళ్ళిపోయింది.

*25 డిసెంబర్ 2011*

* *చాలామంది జడ్జీలు న్యాయవ్యవస్థలో ఉన్న 'నాట్ బిఫోర్ మి' సదుపాయాన్ని ఉపయోగించుకుని న్యాయం చెప్పకుండా తప్పించుకుంటున్నపుడు రాసిన కామెంట్.*

# వెనకడుగులు

రోజులో కాసేపయినా వెనక్కి నడవాలనే కోరిక పట్టుకుంది ఒకాయనకు. ఇంతకు ముందంతా అందరిలా ముందుకు నడిచినవాడే ఆయన కూడా. కాని ఎందుకో ఈ మధ్య ఎక్కడికి వెళ్ళినా వెనక్కి నడిచి వెళ్ళాలనిపిస్తోంది ఆయనకు.

వాళ్ళావిడకు చెపితే ముందే రోడ్డు మీదకి వెళ్ళకండి, కొన్నాళ్ళు ఇంట్లో ప్రాక్టీసు చేసి చూడండి అంది. నిజమే... అలవాటు లేక ఏదైన ప్రమాదం జరిగితే అసలుకే మోసం అనుకుని భార్య సలహానే పాటించడం మొదలుపెట్టాడు.

నిద్ర లేవగానే ఇన్ని అడుగులు లెఫ్ట్‌కి, ఇన్ని అడుగులు రైట్‌కి అని లెక్కలేసుకుని బాత్‌రూమ్‌కి, బాల్కనీకి, వంటింటికి, హాలులోకి నడవడం మొదలుపెట్టాడు. ఇప్పుడు ఏ వస్తువు ఎక్కడుందో పరిశీలనగా చూసి గుర్తు పెట్టుకుంటున్నాడు. దానివల్ల అది కనబడడం లేదు, ఇది కనబడడం లేదని వాళ్ళావిడను చీటికీ మాటికీ పిలవడం మానేశాడు. చిన్న శబ్దాన్ని కూడా పసిగట్టడం అలవాటయి ఇంట్లోకి మనిషొచ్చినా, జంతువొచ్చినా పట్టించుకుంటున్నాడు.

ఒక మంచిరోజు చూసి రోడ్డుమీద కూడా వెనక్కి నడవడం మొదలుపెట్టాడు. ఆయన ధ్యాస అంతా గోతుల్లో పడకుండా నడవడమెలా అనే దానిమీదే ఉండడంతో జనం వింతగా చూస్తున్న విషయం కూడా ఆయన గమనించలేదు. కొన్నాళ్ళ తర్వాత నగరాభివృద్ధి కమిటీ వాళ్ళ వార్డులో మీటింగ్ పెడితే తమ రోడ్డులో ఎన్ని గోతులున్నాయో, ఎన్ని చెత్తకుప్పలున్నాయో మునిసిపాలిటీ వాళ్ల సర్వేయర్ల కంటే ఆయనే కరెక్టుగా చెప్పాడు. అలా అలా ఆయన ఖ్యాతి నలుదిశలకూ పాకింది. ఆయన్ని చూడడానికి ఎవరెవరో రాసాగారు.

ఒకరోజు ఆయన పక్కింటి పిల్ల అడిగింది 'అంకుల్ ఇంతకీ ఎందుకు మీరిలా వెనక్కి నడుస్తున్నారు' అని. ఏం లేదమ్మా ఈ మధ్య సమాజంలో చాలామంది వెనక్కే నడుస్తున్నా ఎవరూ ఆ విషయం గమనించడం లేదు. నా చేష్ట ద్వారా దాన్ని హైలైట్ చేద్దామనుకున్నాను. కాని ఇప్పుడు నేనా మాట చెప్పినా ఎవరూ అర్థం చేసుకునే పరిస్థితిలో లేరమ్మా' అన్నాడాయన నిరాశగా.

*15 జూలై 2012*

# ఆశ్చర్యమాశ్చర్యమాయనే!

అడవిలో పులిని చూసి ఆశ్చర్యపోతుంటారు కొంతమంది. టీవీలో చూసి చూసి అలవాటైపోయి ఇదేంటి, ఇదెప్పుడు తప్పించుకుని అడవికి వెళ్ళిపోయింది అనుకుంటారేమో.

అలాగే ఇంత ఎండ ఎప్పుడూ చూళ్ళేదు; నేను పుట్టి బుద్ధి ఎరిగినాక ఇంత వాన పడడం తెలియదు; నేను పుట్టక మునుపు కూడా ఇంత చలి ఉన్నట్టు నాకు గుర్తు లేదు... వంటి ఆశ్చర్యాలను కూడా చాలామంది 'కాలా'నుగుణంగా ప్రకటిస్తుంటారు.

రాజకీయ నాయకుల ఆశ్చర్యాలు వేరే రకం. నిత్యావసర వస్తువులు నిన్నటిదాకా అదుపులో ఉన్నాయే, ఇవ్వాళ పొద్దున ఎలా పెరిగాయో!... పవర్ కట్ రెండు గంటలేనని చెప్పారే, రెండుకు ముందు ఒకటి ఎప్పుడు పెట్టారో గమనించనే లేదే... వంటి అసంఖ్యాక ఆశ్చర్యాలు వారి సొంతం.

ఇన్ని వేల మంది రైతులు వ్యవసాయం చేయలేక చనిపోతున్నారా? ఇన్ని లక్షల మంది ఆడపిండాల్ని గర్భంలోనే

చంపేస్తున్నారా? ఇన్ని కోట్ల మంది బాలబాలికలకు పౌష్టికాహారం అందడం లేదా? ప్రతి డాక్టరూ ఎక్కువెక్కువ మందులు రాసేస్తున్నాడా? ప్రతి వానాకాలంలో ఆదివాసులకు జబ్బులెందుకొస్తున్నాయో?... వంటి ఆశ్చర్యాలు రాజకీయ నాయకుల కంటే ఇతరులు ఎక్కువగా వ్యక్తం చేస్తుంటారు. వారిలో మన యూత్ ఎంతమంది ఉంటారో, అంతర్జాతీయ సంస్థలూ అన్ని ఉంటాయి.

మావోయిస్టు ముద్రవేసి ఎవర్నిబడితే వాళ్ళను చంపడమేనా అని ఈ మధ్య సుప్రీంకోర్టు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేసింది అటువంటి ఎన్‌కౌంటర్లు మొదలైన 30,40 ఏళ్ళ తర్వాత. స్కూళ్ళకు ప్లేగ్రౌండ్స్ ఉండడం లేదని, రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌లు కనబడడం లేదని కూడా వాళ్ళు అప్పుడప్పుడు హఠాత్తుగా ఆశ్చర్యాగ్రహాలు వెలిబుచ్చుతుంటారు.

వాస్కోడిగామా భారతదేశాన్ని, కొలంబస్ అమెరికాను కనుగొన్నాడని చెప్పినప్పుడు ఆశ్చర్యపోని వాళ్ళం మన చుట్టూ నిత్యం జరిగే ఈ విషయాలకు ఎందుకింత ఆశ్చర్యపడిపోతున్నాం? ఆశ్చర్యపడుతున్నంత కాలం పరిష్కారాన్ని వాయిదావేసే సౌలభ్యం ఏదో ఉన్నట్టుంది.

*22 జూలై 2012*

# ఆ ఒక్కటీ అడక్కు

ఆ గుట్ట మీదికి ఉన్నట్టుండి ట్రాఫిక్ పెరిగింది. అక్కడ ఒకాయన కొద్దిరోజులుగా తపస్సు చేస్తున్నాడు. ఆయన ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి ముందుగా చెప్పకపోయినా అందరికీ ఆ విషయం ఎలాగో తెలిసిపోయింది.

కలియుగంలో కూడా తపస్సు చేసే వాళ్ళున్నందుకు కొందరు ఆశ్చర్యపోతే, అలాంటి వాళ్ళుండబట్టే ఆలస్యంగానైనా వర్షాలు కురుస్తున్నాయని కొందరు భక్తిగా దణ్ణం పెట్టుకున్నారు.

డిమాండ్స్ ఏమిటో చెప్పకుండా ఆయన తన మానాన తాను తపస్సు చేసుకుంటూ పోతే ఎలా అని మీడియా మొదట విసుక్కుంది. అయితే ఆ తర్వాత ఇదే బెటర్, ఊహాగానాలకు అవకాశం ఉన్నప్పుడే స్టోరీకి ఆయుష్షు ఎక్కువ అని ఆనందించింది.

తపస్సు అనే పదం చిన్నపిల్లలకు మొదట అర్థం కాలేదు. అంటే ఏమిటి? ధర్నా లాంటిదా, నిరాహారదీక్ష లాంటిదా అని అడిగారు. ఆ పదాలైనా వాళ్ళకు ఎలా తెలుసంటే అవి జరిగినప్పుడు వాళ్ళకు సెలవులొస్తాయి కాబట్టి. వాళ్ళకు

తపస్సు అనే పదం అర్థం చేయించడానికి పెద్దవాళ్ళు వెంటనే 'అమరచిత్ర కథలు' కొని పడేశారు.

అతనెందుకు తపస్సు చేస్తున్నాడో అర్థంకాక దేశమంతా ఒకలాంటి అలజడి నెలకొంది. కొందరయితే సమాచార హక్కు చట్టం కింద ప్రభుత్వానికి దరఖాస్తులు కూడా పెట్టుకున్నారు. ఫలానా పని చేయమని అడిగినవాళ్ళ పనులే చేయలేక చస్తుంటే, అడగని వాడిని కదిలించి సమస్యను నెత్తికెత్తుకోవాల్సిన అగత్యం మాకేమిటి అని వారు కోపంగా బదులిచ్చారు.

ఈలోగా అతని చుట్టూ పుట్టలొచ్చేశాయి. ఆకాశంలో మెరుపులు, ఉరుములు, కుండపోతగా వాన. ఇక తప్పదనుకున్నాడేమో దేవుడు దిగొచ్చాడు.

"భక్తా ఏమిటి నీ కోరిక?" అన్నాడు.

"స్వామీ! ఎంత పొగడ్తకు మనిషి సంతృప్తి చెందుతాడో దయచేసి చెప్పు దేవదేవా!" అన్నాడు.

స్వామి నిట్టూర్చాడు. "ఆ ఒక్క ప్రశ్నకు నేను జవాబు చెప్పలేను. భూమి పుట్టినప్పటి నుంచి పొగడబడుతున్న నేనే ఇంతవరకూ సంతృప్తి చెందలేదు కాబట్టి" అనేసి అంతర్ధానమయ్యాడు.

*29 జూలై 2012*

# ఎంతెంత దూరం...

ఒకప్పుడు ఆకాశం భూమికి చాలా దగ్గరగానే ఉండేదట. ఆకాశంలో ఏం జరుగుతోంది భూమికి, భూమి మీద ఏం జరుగుతోందో ఆకాశానికి ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉండేదట.

కొన్నాళ్ళ తర్వాత భూమి బిజీ అయిపోయి ఆకాశాన్ని అంతగా గమనించడం మానేసింది. అది తన చుట్టూ తాను తిరగాలి. సూర్యుడి చుట్టూ తిరగాలి. పంటలు పండించాలి. భూకంపాల్ని తట్టుకోవాలి. తుఫాన్లు ఓర్చుకోవాలి. పరస్పర సంహార క్రీడ సాగించే తన సహస్ర ప్రాణికోటిని అదుపు చేస్తుండాలి. కాబట్టి ఎండ మరీ మండిపోతున్నపుడో, వానలు రావడం ఆలస్యమైనప్పుడో, వెన్నెల రాత్రులలోనో మాత్రమే తల పైకెత్తి చూస్తుండేది. ఆకాశానికి అంత పని లేదు కాబట్టి అది పగలూ రాత్రీ భూమి మీద జంతువులు, పక్షులు, మనుషులు చేసే పనులను గమనిస్తూ ఉండేది. జంతువులు, పక్షుల జీవితాల్లో పెద్ద మార్పేం ఉంటుంది? అందుకని మనుషుల జీవితాల్నే ఎక్కువగా పరిశీలిస్తుండేది. వాళ్ళ ఆలోచనల్లో మార్పును మొదట పసికట్టింది ఆకాశమే.

కాని భూమికి చెపితే బెంబేలెత్తుతుందని కొన్నాళ్ళు ఊరుకుంది. ఆ తర్వాత భూమి తలెత్తి తన వంక చూడ్డం కోసం రాత్రింబవళ్ళూ ఎదురుచూసింది. జనాభా పెరిగిపోవడంతో భూమికి పనులు పెరిగిపోయి అది ఎవరి వంకా చూడ్డం మానేసింది.

ఈలోగా వాసన పెరిగిపోతోంది. ఆకాశం భరించలేకపోతోంది. పూల వాసన, పండ్ల వాసన, పంటల వాసన, వంటల వాసన అన్నీ పోయి ఒకే ఒక వాసన - కాలుష్య వాసన రాసాగింది. మెల్లగా పైకి జరగడం మొదలుపెట్టింది. భూమికి దూరంగా... బహుదూరంగా వెళ్ళిపోయింది. బహుశా ఇంకా వెళుతూనే ఉంది.

భూమిని చూస్తే దానికి పుట్టెడు జాలి. కాని పాపం ఏం చేస్తుంది?

* ఆకాశం భూమికి ఎందుకు దూరంగా జరిగిందనే దాని మీద అన్ని ప్రపంచ భాషల్లోనూ రకరకాల జానపద కథలున్నాయి. ఈ కాలపు కథగా దీన్ని చెప్పుకుందాం.

*19 ఆగస్టు 2012*

# ‘చెత్త’ ఆలోచనలు

‘ఇక్కడ చెత్త బంగారంగా మార్చబడును’

ఒకరోజు ఉదయం నిద్ర లేచేసరికి మహానగరం నిండా ఈ హోర్డింగులు కనిపించాయి. వివరాలు ఇంటింటికీ పంచిన కరపత్రాలలో ఉన్నాయి.

తడి పొడి భేదం లేదు; ధనిక పేద తేడాల్లేవు; సెలవులు పండగలు ఉండనే ఉండవు. గ్రాము నుంచి క్వింటాలు వరకు ఎంతయినా వెల్‌కమ్. ఇలా ఇచ్చి అలా పాయింట్లు వేయించుకుని వెళ్ళండి. అన్నీ మీ లాయల్టీ కార్డుల్లో భద్రం. నేటి మీ చెత్తే రేపటి మీ బంగారం. మరవకండి. ప్రతిరోజు మీ రాకకై ఎదురుచూసే... పరిశుభ్ర నగర పాలక మండలి.

జనం చాలా ఉత్సాహపడ్డారు. ఇంటి ముందూ, పార్క్ లోపలా, వీధి మలుపుల్లో, ఖాళీ స్థలాల్లో, గుడి బయటా, బడి వెనకా, బిల్డింగుల పైనా, స్మశానాల పక్కనా చెత్త విసిరేసే వాళ్ళందరూ ఇప్పుడు తమ చెత్తను బుద్ధిగా క్యారీ బ్యాగుల్లో వేసుకుని ‘బంగారం’ కౌంటర్లలో ఇచ్చేసి వెళుతున్నారు.

వంద, రెండు వందలు, వెయ్యి, రెండు వేలు... ఇలా అందరికీ పాయింట్లు పెరుగుతూ పోతున్నాయి. గ్రాము, పది గ్రాములు, వంద గ్రాముల చొప్పున జనం పసిడి కలల సంఖ్య కూడా పెరుగుతూ పోతోంది. ఎన్ని పాయింట్లయ్యాక ఇస్తారు? ఎన్ని రోజుల తర్వాత ఇస్తారు? అని రోజూ వాకబు చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వ పథకం కాబట్టి మోసం చేస్తారనే అనుమానం రాలేదెవరికీ. అయినా డబ్బులేమీ కట్టడం లేదు కదా, మనకు పనికి రాని చెత్తే కదా ఇస్తున్నది, నష్టపోయేదేం లేదని సరిపెట్టుకుంటున్నారు.

ఈలోగా ఊరు శుభ్రపడింది. ఇంటింటి చెత్తే కాక ఎక్కడెక్కడ పేరుకుపోయిన చెత్త అంతా కూడా 'బంగారం' కౌంటర్లలో జమ అయిపోయింది. వాళ్ళు దాన్ని తవ్వేసిన గనుల్లో నింపి కరెంటు ఉత్పత్తి చేస్తున్నట్టు అప్పుడప్పుడూ వార్తలొస్తున్నాయి. ఇప్పుడు నగరంలో ఎటుచూసినా చక్కటి దృశ్యం, చల్లని గాలి. అంతకంటే 'బంగారం' ఇంకేం కావాలి అని జనం కూడా ఆ ఊసెత్తడం మానేశారు.

ఎంత మంచి కల అంటారా? లేక ఎంత 'చెత్త' కల అంటారా? మీ ఇష్టం. చెత్త కలలే మంచి కలలుగా మారే రోజు కావాలని కోరుకుందాం.

*9 సెప్టెంబర్ 2012*

# కళ్ళు...కథాకమామీషు!

మనిషికి రెండు కళ్ళూ ముందువైపే ఎందుకుంటాయి? ఎల్లకాలం ముందువైపుకే చూడడం మనిషికైనా, పశువుకైనా ఎంత బోర్. కుట్రలు, కుతంత్రాలు, వెన్నుపోట్లు అన్నీ వెనకవైపే జరుగుతున్నప్పుడు ఆ వైపును కాపలా కాసుకోవడానికి ఒక్క కన్ను అయినా అక్కడ ఉండొద్దా!

అందమైన ఆడపిల్లని దాటేసి ముందుకు వచ్చినపుడు వెనకవైపు కన్ను లేకపోవడం అబ్బాయిలకు ఎంత బాధ. మరీ మొరటువాళ్ళు తలేం ఖర్మ మొత్తం శరీరాన్నే వెనక్కి తిప్పి చూడొచ్చుగాక. కాని వారి సంఖ్య ఎంత? పట్టుబడకుండా చూసి ఆనందిద్దామనుకునే వాళ్ళందరూ ఏమైపోవాలి?

వెక్కిరించే వాళ్ళందరూ మన వెనకే ఎందుకు చేస్తారు ఆ పని? మనం చూడలేమనే కదా. వెనక కూడా ఒక కన్ను ఉన్నపుడు ఎవరికైనా ఆ పని చేయగల ధైర్యం వస్తుందా? రాదు కాక రాదు. అప్పుడు ప్రపంచంలో ఎవరూ ఎవర్నీ వెక్కిరించుకునే అవకాశమే ఉండదు. ఎంత హాయిగా బతుకొచ్చు మనం.

ఇవన్నీ వ్యక్తిగత కారణాలని కొట్టిపారేస్తారేమో. ఒక ముఖ్యమైన సామాజిక కారణం కూడా ఉంది. వెనక కన్ను లేకపోవడం వల్లే వెనకాల ఉండిపోయిన జనం కష్టసుఖాలు తెలియడం లేదని, వాళ్ళను పైకి తీసుకొచ్చే ప్రయత్నం చేయలేక పోతున్నామని అనేవాళ్ళు చాలామంది ఉన్నారు. ఇప్పుడైనా ఒప్పుకుంటారా మనిషికి వెనక కన్ను ఎంత అవసరమో.

వీటన్నిటినీ ఏకరువు పెడుతూ కొంతమంది కలిసి ఒక అర్జీ తయారుచేసి ఎలాగోలా అడ్రసు కనుక్కుని బ్రహ్మకు పంపారు. ఆయన తిరుగుటపాలో ఈ కింది జవాబు పంపాడు.

''ఇంతోటి ఆలోచన నాకు రాకపోలేదు. అటో కన్ను ఇటో కన్ను పెడితే ఏది ముందో ఏది వెనకో తెలియని గందరగోళంలో మీరెప్పటికీ ఉండిపోతారని భయపడ్డాను. కాని 'రెండు కళ్ళూ ముందు వైపు పెడితే మాత్రం అంతకంటే మెరుగ్గా ఉన్నారా మీరు సృష్టించిన జనం...' అని సరస్వతి నన్ను దెప్పని రోజు ఉండట్లేదు ఈ మధ్య.''

*23 సెప్టెంబర్ 2012*

# చెప్పొచ్చేదేమంటే...

జీవ వైవిధ్యం సదస్సు జరిపి తమ ప్రాముఖ్యాన్ని ప్రపంచానికంతటికీ తెలియజేసినందుకు సకల ప్రాణికోటి మానవుడి పట్ల కృతజ్ఞతతో ఉంది. పాత కోపాల్ని పక్కనపెట్టి మనిషిని కూడా అదే స్థాయిలో గౌరవించాలని సంకల్పించాయి అవి.

చాలా సమావేశాలు పెట్టుకున్నాయి కాని ఎంతసేపైనా ఒక ఏకాభిప్రాయానికి రాలేపోయాయి. బిజీగా ఉండి రాలేకపోయిన జీవరాశులను కూడా పిలిపించాయి. రాత్రింబవళ్ళు చర్చించాక చివరికి 'వైవిధ్యం' మీద మరో సదస్సు జరపడమొక్కటే సరైన కృతజ్ఞత అవుతుందని నిర్ణయించాయి.

అనేక కమిటీలుగా ఏర్పడి పనులు చకచకా చేయడం మొదలుపెట్టాయి. ముందుగా నది, సముద్రం, అడవి, కొండ, మైదానం, పచ్చికబయలు అన్నీ ఉన్న ప్రాంతాన్ని సమావేశస్థలంగా ఎంపిక చేశాయి. వచ్చినవాళ్ళు ఉండడానికి వీలుగా గుడిసెలు, పెంకుటిళ్ళు, చెక్క ఇళ్ళు సిద్ధం చేశాయి. రకరకాల ఆహార పదార్థాలను తెచ్చి రెడీగా ఉంచాయి.

చాలా ముందుగానే ఆహ్వానాలు వెళ్ళడంతో జనం పెద్దయెత్తున బయల్దేరి వచ్చారు. మనిషి మనిషి కోసం ఏర్పాటుచేసే సదస్సుల్లో ఏం జరుగుతుందో అందరికీ తెలుసు కాబట్టి దానికైతే అంతమంది రాకపోయేవారేమో! ఇది మిగతా ప్రాణికోటి తమ గౌరవార్థం నిర్వహిస్తున్న సదస్సు కనుక ఆసక్తి కొద్దీ తండోపతండాలుగా తరలివచ్చారు. వచ్చిన వారిలో కొందర్ని ఎంపిక చేసి విడిగా ఉంచారు నిర్వాహకులు.

మర్నాడు అందరూ నిద్ర లేచి చూసేసరికి ఎంపిక చేయబడ్డ ఆ మనుషులు వాళ్ళకొచ్చిన పనులేవో వాళ్ళు చేసుకుంటూ కనిపించారు. అందులో ఏ ఒక్కరూ ఒకే రూపులో లేరు. ఎవరూ రెండో వాళ్ళు చేస్తున్న పని చేయడం లేదు. వచ్చిన వాళ్ళందరి మొహాల్లో కనిపించిన ప్రశ్నార్థకాలకు సమాధానంగా ప్రాణికోటి ప్రతినిధి గొంతు సవరించుకుని ఇలా చెప్పింది: ఈ సదస్సు పేరు మానవ వైవిధ్యం. అన్ని రంగుల వాళ్ళు, అన్ని జాతుల వాళ్ళు, అన్ని వృత్తుల వాళ్ళు, అన్ని విశ్వాసాల వాళ్ళు బతుకుతున్న నేల ఇది. మా వైవిధ్యం మీకెంత అవసరమో మీరు ఈ మధ్య గుర్తించినట్టుగా మీ వైవిధ్యం మీ మనుగడకు కూడా అంతే అవసరమని చెప్పడానికే ఈ ఏర్పాటు.

*7 అక్టోబర్ 2012*

* *హైదరాబాద్‌లో జీవ వైవిధ్యం మీద అంతర్జాతీయ సదస్సు జరిగిన సందర్భంలో.*

# మన్మోహన్‌కో సిక్సర్

శ్రీశ్రీశ్రీ మన్మోహన్ జీజీజీ,

ముందో మూడు, వెనకో మూడు గౌరవాలు తగిలించి నేను మీకు ఈ ఉత్తరం రాయడం వెనకున్న కారణాన్ని ఆర్థికవేత్తలయిన మీరు ఈపాటికి గ్రహించే ఉంటారు.

మా ఇంట్లో ఇటీవల జరుగుతున్న సంభాషణలు ఈ విధంగా ఉంటున్నాయి.

మమ్మీ...లేస్: సారీ నీ కోటా అయిపోయిందమ్మడూ.

అమ్మా...ఆమ్లెట్: వారం కోటా ఆరు గుడ్లూ తినేశావు కదరా.

భార్యామణీ...రిమోట్: రోజుకు ఆరు చానళ్ళు తిప్పడానికే మీకు అనుమతి.

ఇటీవల మా వీధిలో ఒక సీనియర్ సిటిజన్ పేవ్‌మెంట్ మీద వాలుకుర్చీ వేసుకుని కూర్చుంటున్నాడు. సాయంత్రమైతే చాలు పూనకం వచ్చినట్టు వీధిలో వాళ్ళందర్నీ తెగ తిడుతున్నాడు.

ఏమిటయ్యా...ఎంతమంది వస్తారు నీ కోసం? లంచ్ టైంకే ఆరు కార్లు వచ్చెళ్ళాయి మీ ఇంటికి. నువ్వూ, మీ ఇంట్లో

వాళ్ళూ ఇప్పటికే డజనుసార్లు బయటికి వెళ్ళొచ్చారు. ఇది కామన్ రోడ్డు అనుకుంటున్నావా? లేక నీ ప్రైవేట్ రహదారి అనుకుంటున్నావా? ఒక్కో ఇంటివాళ్ళూ ఇన్నేసిసార్లు తిరిగితే రోడ్డు గుంటలు పడక ఏమవుతుంది? తారు రోడ్డయ్యా ఇది... ఇనుప రోడ్డో, ఉక్కు రోడ్డో కాదు.

మీరు ఏమంటూ ఆరు పరిమితి పెట్టారో గాని ఆరు కంటే ఎక్కువసార్లు తన వంటకు వంకలు పెట్టకూడదని మా ఆవిడా, చదువుకోమని ఆరు కంటే ఎక్కువసార్లు చెపితే ఇంట్లోంచి వెళ్ళిపోతానని మావాడూ, టివీ/కంప్యూటర్/సెల్‌ఫోన్ ఈ మూడిట్లో దేన్నయినా సరే రోజులో ఆరు కంటే ఎక్కువసార్లు కట్టేయమని చెపితే హేగ్‌లోని అంతర్జాతీయ కోర్టుకు ఫిర్యాదు చేస్తానని నా కూతురూ...రోజులో కనీసం ఆరుసార్లు బెదిరిస్తున్నారు నన్ను.

ఒక జబ్బుకి ఆరు కంటే ఎక్కువ మందులు రాసినా, ఏడాదిలో ఆరు కంటే ఎక్కువ బ్రిడ్జిలు కూలిపోయినా, ఒక మనిషిని ఒక తప్పుకు ఆరు కంటే ఎక్కువ బూతులు తిట్టినా...ద్వీపాంతర వాసానికి గాని, మంచు ఎడారులకు గాని పంపాలనే ప్రతిపాదనలు కూడా అక్కడక్కడ వినిపిస్తున్నాయి. పెద్దగా చదువుకోని భారతదేశ ప్రజలు ఉన్నట్టుండి ఇంత సృజనాత్మకంగా ఆలోచించగలుగుతున్నారంటే అది కేవలం మీరు ప్రసాదించిన చైతన్యమే.

అందుకు మీకు ఆరు కోట్ల అభినందనలు, ధన్యవాదాలు తెలుపుతూ దేశ ప్రజలందరి తరపున నాదో చిన్న మనవి. దయచేసి మీరు కూడా మాకు విధించిన పరిమితినే పాటిస్తూ మీ మొత్తం పాలనలో ఆరు కంటే ఎక్కువ తప్పుడు నిర్ణయాలు తీసుకోకండి. అంతకంటే ఎక్కువైతే గ్యాస్‌బండకు మేము పూర్తి మూల్యం చెల్లించినట్లే మీరూ చెల్లించాల్సి వస్తుంది.

**ఇట్లు,**

**మీ శ్రేయోభిలాషి**

**శ్రీశ్రీశ్రీ సామాన్య జీజీజీ**

*14 అక్టోబర్ 2012*

* *ఏడాదికి ఒక కుటుంబానికి ఆరు గ్యాస్ బండలు మాత్రమే ఇస్తానని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ప్రకటించినప్పుడు రాసింది.*

# రావమ్మా.. కాళ్ళొదిలి రావమ్మా!

ఏమిటీ లక్ష్మీదేవి? నిత్యపూజలు, దీపావళి దీపావళికి స్పెషల్ పూజలు చేస్తున్నా పలకదేమి? ఎవరైనా చిల్లర మహాలక్ష్మిని ఛీకొట్టినా నోటు మహాలక్ష్మిని ఏనాడైనా పల్లెత్తు మాట అన్నారా? కాలు తగలకముందే కళ్ళకద్దుకుంటామే. అయినా దయ లేకపోతే ఎలా?

తన పిల్లలు రంగు మార్చుకుని విదేశాలకు వెళ్ళిపోతున్నా ఆమె ఎన్నాళ్ళిలా చూస్తూ ఊరుకుంటుంది? మన భక్తులు ఈ దేశంలో కోటానుకోట్ల మంది ఉన్నారర్రా... వాళ్ళ అవసరాలు తీర్చడం నా ఒక్కదాని వల్ల ఏమవుతుందని కోప్పడి వాళ్ళను ఆపాలా అక్కరలేదా? ఆ చలి దేశంలో బ్యాంకు లాకర్లలో ఊరూ పేరు లేకుండా నల్ల రంగు పులుముకుని రహస్యంగా పడి ఉండాల్సిన ఖర్మ మీకేమిటి అని చివాట్లు వేయాలా వద్దా?

నదిలా ప్రవహించాల్సిన తనను కొందరు నేలమాళిగల్లోకి మళ్ళించి, గాలి వెలుతురు సోకకుండా బంధిస్తే విష్ణు చక్రాన్ని రప్పించుకుని బయటపడాలా లేదా? గాలీ నీరూ వెలుగూ లాగా అందరికీ సమానంగా అందాల్సిన నేను

కొన్నిచోట్లే గుట్టలు గుట్టలుగా పేరుకుపోవడమేమిటి, కొందరికి అసలే కనిపించక పోవడమేమిటి, మొదట్లో కొద్దికొద్దిగా ఉన్న ఈ ధోరణి రానురాను పెరుగుతున్నా నాకు సంబంధం లేదన్నట్టు ఉండిపోవడమేమిటి అని ఆమె ఆత్మవిమర్శ చేసుకోవాలా వద్దా?

రైతులు అన్ని విధాలా నష్టపోయి భోరుమని ఏడుస్తున్నా ఆమె సిస్టర్ ధాన్యలక్ష్మి కూడా సైలెంట్‌గానే ఉండిపోతోంది.

ఆలోచించగా ఆలోచించగా ఈ నిర్లిప్తతకు ఒక్కటే కారణం కనిపిస్తోంది. ఆమె రేయింబవళ్ళూ విష్ణుమూర్తి పాదాలు ఒత్తుతూ కూర్చుని ఉండడం వల్ల కుటుంబ బాధ్యతలు లేకపోయినా, పిల్లల బాధ్యత లేకపోయినా సరే - వేరే ఏ పని చేయడానికీ ఆమెకు ఓపిక ఉండడం లేదు. అయినా అసలు ఎక్కడికీ కదలని ఆయనకు నిరంతరం కాళ్ళనొప్పులెందుకుంటాయో తెలియదు. అలోపతి డాక్టరో, ఆయుర్వేద డాక్టరో ఎవరో ఒకరు ఆయన కాళ్ళ నొప్పులకు మంచి మందిచ్చి ధనలక్ష్మికి విముక్తి కలిగిస్తే బాగుండు. మన్మోహన్‌కు, చిదంబరానికి నాలుగు మొట్టికాయలేసి దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దగలుగుతుంది.

*18 నవంబర్ 2012*

# ఈ కథలూ కంచికేనా!

నీతి కథలు బోర్ కొడుతున్నాయని అవినీతి కథల్ని చదవడం మొదలుపెడితే అవి ఇంకా ఎక్కువ బోర్ కొడుతున్నాయని వాపోయాడో యువకుడు.

అన్ని కథల్లో ఒకటే విషయం. ఒక పేదవాడు లేదా మధ్యతరగతి వాడు లేదా గొప్పవాడు ఉంటాడు. వాడు అస్సలు చదువుకోకపోయి ఉండొచ్చు లేదా బాగా చదువుకుని ఉండొచ్చు. డ్రాపవుట్లు ఉండకూడదని కూడా ఏమీ లేదు. తొలి దశలో తండ్రో తాతో పార్టీయో కాలమో సిద్ధాంతమో సిద్ధాంతరాహిత్యమో ఏదో ఒకటి చేయూతను ఇచ్చి ఉంటుంది. వాటికి అతని చొరవో, లౌక్యమో వచ్చి చేరి ఉంటుంది.

సదరు వ్యక్తి సైకిలు నుంచి నేరుగా కారుకు లేదా చిన్నకారు నుంచి పెద్దకారుకు లేదా విమానం నుంచి సొంత విమానానికి ఎదుగుతూ వెళతాడు. ఇంటి సైజు, ఒంటి సైజు కూడా అదే నిష్పత్తిలో పెరుగుతూ పోతుంది. తలపులు నలుపెక్కే కొద్దీ బట్టలు తెలుపెక్కడం కనిపిస్తుంది. పేపర్లలో ఫోటోలు, టీవీలో ఇంటర్వ్యూలు, విదేశీ ప్రయాణాలు, నాయకులతో

విందులు, అంతర్జాతీయ సదస్సుల్లో ఉపన్యాసాలు, చిన్నపిల్లలతో ముద్దూ ముచ్చట్లు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు... ఒకటేమిటి అన్నిచోట్లా కనిపిస్తుంటాడు.

అతనిది అక్రమ సంపాదన, అన్యాయ సంపాదన, మోసపు సంపాదన అని కొందరు గుసగుసగా చెప్పుకోవడం, మరికొందరు సభ్యత మరిచి ఎలుగెత్తి అరవడం కూడా ఏదో ఒక దశలో తప్పనిసరిగా జరిగే ఉంటుంది. అప్పటిదాకా ఆ విషయం తెలియక దూరంగా ఉన్న చాలామంది లెంపలేసుకుని తెలిసి దగ్గరవడం మొదలుపెడతారు. కొందరు ఇంటికెళ్ళి నమస్కారం పెడితే ఇంకొందరు ఇంటికి పిలిచి భోజనం పెడతారు. కొందరు సహచరులుగా, ఎక్కువమంది అనుచరులుగా మారిపోతారు.

ఈ దశలో అతనికి దిష్టి తగులుతుంది. దాన్ని తీయడానికి ప్రభుత్వం దాడులు, కేసులు, జైళ్ళు లాంటి ఏర్పాట్లు చేయిస్తుంది. అవన్నీ అయ్యాక కథ కంచికి, వాళ్ళు వాళ్ళ సమస్త సంపాదనతో ఇంటికి.

కథలన్నీ ఇంతే కదా, ఎన్నాళ్ళు చదువుతాం వాటిని...! విసుగ్గా అన్నాడా యువకుడు.

*2 డిసెంబర్ 2012*

# అనగనగా ఒక రైతు

అనగనగా ఒక ప్రపంచం ఉంది.

ఆ ప్రపంచానికి ఏడు ఖండాలున్నాయి.

ఏడు ఖండాల ప్రజలూ సేద్యం చేసి పంటలు తెచ్చి ఏడు కుప్పలేశారు.

అందులో ఒక కుప్ప ఎండలేదు.

కుప్పాకుప్పా ఎందుకు ఎండలేదంటే నీలం వరదలు ముంచేశాయంది.

వరదలూ వరదలూ పొలాల్లోకి ఎందుకొచ్చారు అంటే మీకు సరైన నీటిపారుదల వ్యవస్థ లేకపోవడం వల్ల అన్నాయి.

నీటి వ్యవస్థలూ నీటి వ్యవస్థలూ మీరెందుకు ఇంకా ఏర్పడలేదు అంటే మమ్మల్ని అడిగేం లాభం, మీరు పెట్టుకున్న మైనర్, మేజర్ ఇరిగేషన్ శాఖలున్నాయిగా వాటిని అడగండన్నాయి.

నీటిపారుదల శాఖలూ నీటిపారుదల శాఖలూ మీరెందుకు పనులు చేయడం లేదంటే ప్రభుత్వం నిధుల బువ్వ పెట్టలేదన్నాయి.

ప్రభుత్వం ప్రభుత్వం నువ్వెందుకు నిధులు కేటాయించలేదంటే బడ్జెట్ సరిపోలేదంది.

బడ్జెట్ బడ్జెట్ నీ లక్ష కోట్లలో కొన్నయినా వీటికి ఇవ్వకపోయావా అంటే ప్రపంచబ్యాంకు వద్దంటే నేనేం చేయనంది.

ప్రపంచ బ్యాంకూ ప్రపంచ బ్యాంకూ నువ్వెందుకు వద్దన్నావు అంటే రైతు ఒక్కడూ స్వతంత్రంగా బతుకుతుంటే ఊరుకుంటానా నేను! అంది.

*11 డిసెంబర్ 2012*

# కాకి...ఓ ఉద్గ్రంథం

తెలుగు సభలకు వెళ్ళొచ్చినప్పట్నించి కాకి కాస్త పరధ్యానంగా ఉంటోంది. అక్కడెవరో మాటల మధ్యలో 'క'కు దీర్ఘమిస్తే కా,'క'కు గుడి ఇస్తే కి, గుడి దీర్ఘమిస్తే కీ....ఇలా ఏదో చెప్పుకుంటూ పోవడం వింది. అది స్థానిక కాకి కాబట్టి తనను ఈ ప్రాంతంలో కాకి అంటారని దానికి తెలుసు. అయితే 'క' గుణింతం అనేదొకటి ఉందని, అది తన పేరుతోనే మొదలవుతుందని దానికి ఇన్నాళ్ళూ తెలియదు. తెలిసాక దానిలో ఒక రకమైన ఉద్వేగం కలిగింది.

వెంటనే అది తమ కాకి పెద్దల దగ్గరకు వెళ్ళింది. మీకు తెలుసా ఈ విషయం అని అడిగింది. 'స్కూళ్ళ పరిసరాల్లో అప్పుడప్పుడు విన్నట్టు గుర్తు. అయితే దీర్ఘము, గుడి అంటే ఏమిటో అర్థం కాలేదు. మన గురించి కాదేమో అనుకుని అంతగా పట్టించుకోలేదు' అని చెప్పాయవి.

దీన్ని అంతటితో వదిలిపెట్టాలనిపించలేదు యువకాకికి. తమ పేరుకూ తెలుగు గుణింతానికీ ఇంత దగ్గర సంబంధం ఉండడం యాదృచ్ఛికం అయి ఉండదని దానికెందుకో గట్టిగా అనిపించింది. కావు కావుమంటూ తాము చేసే శబ్దాల నుంచే 'క'కు దీర్ఘం ఇవ్వడమనే గుణింత సూత్రాన్ని

తెలుగువాళ్ళు మొదట నేర్చుకుని ఉండవచ్చు. అమ్మ దొంగలూ... తమ అరుపు నుంచి అంత పెద్ద విషయం నేర్చుకుని కూడా ఎప్పుడైనా ఆ విషయాన్ని ఒప్పుకున్నారా? 'క'కు దీర్ఘం ఇవ్వాలనే ఆలోచనే వాళ్ళకు రాకపోయి ఉంటే 'కా'తో మొదలైన పదాలేవీ వాళ్ళకు ఉండేవే కావు. అంటే తెలుగు భాష విస్తరణకు అందరి కంటే ఎక్కువగా తామే దోహదం చేసినట్టు. ఈ ఆలోచన రాగానే ఇక ఊరుకోలేదు అది.

కాకులన్నిట్నీ పిలిచి ఒక మీటింగ్ పెట్టి ఈ విషయాలన్నీ పూసగుచ్చినట్టు చెప్పింది. ఒక్కసారి కూడా కావ్ అనకుండా శ్రద్ధగా విన్నాయన్నీ. తెలుగువాళ్ళు వాళ్ళ పిల్లల వినోదం కోసం తమ మీద ఎన్నో కథలు చెప్పుకుంటారని కొన్ని సీనియర్ కాకులు చెప్పాయి. వాటిలో ఎక్కువ భాగం నీతి కథలే ఉంటాయని కూడా చెప్పాయి. ఒక్క తెలుగువాళ్ళే తమ నుంచి ఇన్ని మంచి విషయాలు నేర్చుకుని ఉంటే మిగతా భాషలు మాట్లాడేవాళ్ళు ఇంకెన్ని నేర్చుకుని తమ తమ భాషలలో వాటిని ఉపయోగించుకుంటున్నారో! ఈ ఆలోచన వచ్చిన వెంటనే అన్ని భాషా ప్రాంతాలలో తిరిగే కాకులన్నిటినీ సమావేశపరచాలని, అందరూ కలిసి 'మానవ భాషలకు కాకి జాతి ఇచ్చిన పదసంపద' పేరుతో ఒక ఉద్గ్రంథం తీసుకురావాలని నిర్ణయించాయి. ఆ తర్వాత అనేక జంతు జాతులు, వృక్షజాతులు కూడా అటువంటి నిర్ణయమే తీసుకున్నట్టు వినికిడి. అవన్నీ ఆడియో సి.డి.లుగా విడుదలైతే తప్ప మన భాషకు ఎవరి దోహదమెంతో తెలియదు.

*30 డిసెంబర్ 2012*

# ప్రయాణమూ ఒక పండగే

మన ఊరి కంటే ఏ ఊరైనా బాగుంటుందనుకుంటారు కొందరు. మన ఊరిలో లేనిది ఆ ఊర్లో మాత్రం ఏముంటుంది అనుకుంటారు మరికొందరు.

అలాగే ప్రతి ఊరూ తన ఊరే అనుకునేవాళ్ళూ ఉన్నారు. ఉన్న ఊరును కూడా పరాయి ఊరని అనుకునేవాళ్ళూ ఉన్నారు.

ఈ అనుకోవడాలకు మన ఊరి మంచి చెడ్డలతో ఏమీ సంబంధం లేదు. అది కేవలం మన తత్వానికో, మనస్తత్వానికో సంబంధించిన విషయం.

టూరిస్టులు వేరు, ట్రావెలర్‌లు వేరు అని ప్రయాణ ఫిలాసఫర్లు ఒక సిద్ధాంతం చెప్తారు. రిటర్న్ టికెట్ కొనుక్కోకుండా ప్రయాణమై వెళ్ళేవాడు ట్రావెలర్ అయితే వెనక్కి రావడానికి ఏర్పాటు చేసుకుని వెళ్ళేవాడు టూరిస్టు అని వాళ్ళ సిద్ధాంతం.

వ్యవసాయం నేర్చుకున్నాకే మనిషి చెడిపోయాడని నమ్మే ఫిలాసఫీ ఒకటి ఉంది. అప్పటిదాకా ఒంటరిగానో సమూహంగానో, జంతువుల్ని తప్పించుకునేందుకో పశువుల్ని మేపేందుకో జంగమ జీవితాన్ని గడిపిన మనిషి ఎప్పుడైతే

కాళ్ళను కట్టేసుకుని ఒకచోట ఉండిపోయాడో అప్పట్నించీ ప్రపంచం అతని కళ్ళల్లోకి, అంటే మెదడులోకి ప్రవహించడం మానేసిందట. మిగతా జంతువుల కంటే మనిషి శక్తిమంతుడవడానికి కారణం అతని చేతులు అనుకుంటారు చాలామంది; అది నిజం కాదు, జంతువులకైనా మనుషులకైనా తెలివితేటలనిచ్చేది కాళ్ళే అని ఈ సిద్ధాంతం చెపుతుంది. సొంత ఊరే లేనపుడు సొంత ఆస్తి ఆలోచనే రాదని వాళ్ళ వాదన. అప్పుడు ప్రపంచం ఎంత నిర్మలంగా ఉండగలిగేదో ఊహించుకోండి.

దేవుడి దగ్గరకు వెళ్ళాలన్న కోరికలో ఉన్నది కూడా ప్రయాణాభిలాషేనట. అందుకే దగ్గర దేవుడి కంటే దూరం దేవుడి దగ్గరకు ఎక్కువ మంది బయల్దేరి వెళుతుంటారు.

తెలిసినవి చూడ్డానికి వెళ్ళేవాళ్ళు, తెలియనివి చూడ్డానికి వెళ్ళేవాళ్ళు అని ఇందులో మళ్ళీ రెండు రకాలు. మొదటి కోవవాళ్ళ వల్ల ప్రపంచానికి లాభించేది తక్కువ. ప్రపంచం చిరకాలం గుర్తు పెట్టుకునేది రెండో రకం వాళ్ళనే. గమ్యం కోసం ప్రయాణం చేయడం కంటే ప్రయాణాన్నే గమ్యంగా చేసుకోమని చెపుతున్నవాళ్ళూ ఉన్నారు. భౌతికంగా సాధ్యం కాకపోయినా మానసికంగా దాన్ని సాధ్యం చేసుకోవచ్చేమో చూద్దాం.

*20 జనవరి 2013*

# అదేనా అసలు సమస్య

'ఇన్ని సమస్యలతో సతమతమవుతూ కూడా మీరందరూ మీమీ ఉద్యోగాలు చేసుకుంటూ, పండగలు జరుపుకుంటూ ఏమీ జరగనట్టే ఉండడం ఎలా సాధ్యం?' చాలా ఆశ్చర్యపోతూ అడిగాడొక విదేశీయుడు.

'మీరు కూడా 'ఇన్ని' అన్నారే గాని ఎన్నో కరెక్టుగా చెప్పలేక పోయారు. మా సమస్యల్లో అది కూడా ఒకటి. ఎన్నో తెలియనప్పుడు ఏదో ఘోరం జరిగినట్టు ఎలా ఉండగలం చెప్పండి. అసలు సమస్య అనే పదం మీదే మాకు ఏకాభిప్రాయం లేదు. దేన్ని సమస్య అంటారో ఎవర్నయినా ఆడిగి చూడండి. అది మొదట ఎక్కడ ఎప్పుడు పుట్టిందని ఊరికే అడిగి చూడండి. అమావాస్య నుంచి సమసమాజం వరకు ఎన్ని సమాధానాలు వస్తాయో ఊహించలేరు మీరు. దాన్ని తెలుగులో మొట్టమొదట వాడిన మనిషి ఎవరని అడగండి. అందరూ అవతలివాడి మీద తోసేసి వెళ్ళిపోతారు. సమస్య పట్ల మాకున్న అవగాహన అదీ.

సమస్యలు పలు రకాలని, కొన్ని వాటంతటవి వచ్చి పడితే చాలావరకు మనమే వాటిని కొని తెచ్చుకుంటామని పెద్దలు

చెప్పగా ఎప్పుడో విన్నట్టు గుర్తు. వాటికి ఉదాహరణలు చెప్పమని మాత్రం దయచేసి అడక్కండి. ఏ ఉదాహరణ చెప్పినా కొత్త సమస్యలను కొని తెచ్చుకోవడమవుతుందని మాకందరికీ అనుభవపూర్వకంగా తెలుసు.

సమస్యలకు ముందూ వెనకలు, పూర్వాపరాలు, పుట్టుపూర్వోత్తరాలు, నేపథ్యాలు, పరిష్కారాలు లాంటివి ఉన్నాయని ఒకప్పుడు మేమూ విన్నాము. కాని ప్రతి ముందుకు ఇంకా ముందు, ప్రతి వెనకకు ఇంకా వెనక పుట్టుకొస్తూనే ఉన్నాయి. దాంతో ఏ ముందుకు ముందు ఏముందో, ఏ వెనకకి వెనక ఏం రాబోతోందో తెలియకుండా పోయింది మాకు. అందువల్ల ఇప్పుడు ఏం చేస్తున్నామంటే-

ఒక రోడ్డులో ధర్నానో, నిరాహార దీక్షో జరుగుతుంటే వెంటనే పక్క రోడ్లోకి బండి తిప్పేసి వెళ్లిపోతున్నాం.

ఒక సినిమా మీద వివాదం చెలరేగితే పక్క థియేటర్‌లోకి దూరిపోయి అక్కడ ఏది ఉంటే దాన్ని చూసేసి వచ్చేస్తున్నాం.

మనకున్న పది ఐడెంటిటీ కార్డులూ పనికిరావని ఎవరైనా చెప్పడం ఆలస్యం పదకొండో గుర్తింపు కార్డు సంపాదించుకోవడానికి పరిగెడుతున్నాం.

చేనేతో, వ్యవసాయమో, మరొకటో బతుకుతెరువును ఇవ్వదని తెలిసీతెలియగానే ఎవరితోనూ పోట్లాట పెట్టుకోకుండా నిశ్శబ్దంగా ఈ లోకం నుంచే నిష్క్రమిస్తున్నాం.

అంటే ఏమిటన్న మాట? మేము దేన్నీ అసలు సమస్యగానే భావించడం మానేశాం. అప్పట్నించి మమ్మల్నే అందరూ సమస్యగా భావిస్తున్నట్టు తెలిసింది.'

*3 ఫిబ్రవరి 2013*

# అంతర్యామికీ అలుపొచ్చింది

దేవుళ్ళకు వచ్చే పిటిషన్ల సంఖ్య పెరిగిపోతోంది. మనిషి నుంచి కీటకం వరకూ అందరూ వారి రక్షణ కోరేవారే. అప్పుడెప్పుడో ఏదో యుగంలో మొసలి తన కాలు పట్టుకుందని, రక్షించమని ఏనుగు కోరితే విష్ణుమూర్తి ఆదరాబాదరా పరిగెత్తుకుంటూ వెళ్ళి రక్షించి వచ్చాడు. ఆ తర్వాత ఏనుగులకు తెలివి పెరిగిందో, మొసళ్ళకు బుద్ధి వచ్చిందో తెలియదు గాని అవి అప్పట్నించి పోట్లాడుకోవడం మానేసినట్టున్నాయి. లేకపోతే అల వైకుంఠపురము నుంచి ఆలిని, అస్త్రాలను వెంటబెట్టుకుని ఆయన మాటిమాటికి రావాలంటే మాటలా?

ఇంకో సందర్భంలో భస్మాసురుడికి వరం ఇచ్చి శివుడు లబోదిబోమని ఎస్సెమ్మెస్ పంపితే పాపం మళ్ళీ విష్ణుమూర్తే అప్పటికప్పుడు అప్సరసలా అలంకరించుకుని పరిగెత్తుకుంటూ వెళ్ళాడు. ఆ తర్వాత శివుడు సిగ్గుపడి వరాలు ఇవ్వడం మానేసాడో, అసురులే అటువంటి వరాలు అడగడం వేస్ట్ అనే అభిప్రాయానికి వచ్చారో తెలియదు గానీ ఆయనకైతే మళ్ళీ అలాంటి పరిస్థితి రాలేదు. లేకపోతే

ప్రతిసారీ జెండర్ మార్చుకుని అంత అలంకరణ చేసుకుని వెళ్ళడమంటే మాటలా? వైకుంఠంలోనే ఒక బొతిక్, బ్యూటీ పార్లర్ పెట్టుకోవాల్సి వచ్చేది.

భూమిని, భక్తుల్ని రక్షించడానికి ఎత్తాల్సి వచ్చిన అవతారాలైతే చెప్పే పనే లేదు. చేప, తాబేలు, పంది, సగం సింహం, మరుగుజ్జు, గొడ్డలిమ్యాన్, బ్లాక్‌మ్యాన్, లేడీస్‌మ్యాన్...ఎన్నో.

అయితే ఈ మధ్య దేవుళ్ళకు వస్తున్న అర్జీలు అసుర సంహారం కోసం కాదు. పైగా స్వయంగా రమ్మనీ కాదు. మా జోలికి ఎవరూ రాకుండా మా మానాన మమ్మల్ని బతకనిస్తే చాలని మొరపెట్టుకుంటున్నవే అన్నీ. చిన్న పనే కదా అని వాళ్ళు వాటిని వెంటనే ఐరాస విభాగాలకు ఫార్వర్డ్ చేసి ఊరుకుంటున్నారు. దేవుళ్ళు పంపాక ఏం చేయకపోతే బాగోదని వాళ్ళేమో అర్జీలు పంపిన పశుపక్ష్యాదులకు, మనుషులకు అందరికీ ఏడాదిలో తలా ఒకరోజు ప్రకటించి తమ బాధ్యత నెరవేర్చుకుంటున్నారు. దాంతో ఇప్పుడు పిచ్చుక్కి, గెరిల్లాకి, భాషకు,  బాలలకు అన్నిటికీ రోజులున్నాయి కాని రక్షణ మాత్రం లేదు.

ఈ చిట్కా పని చేయడం లేదని దేవుళ్ళకూ అర్థమైంది కాని ప్రతిదాన్నీ మరోదాన్నించి రక్షించాలంటే ఎన్ని అవతారాలెత్తితే అయ్యేను! శత్రువెవరో స్పష్టంగా తెలియనూ తెలియదాయె. అందుకే వారంలో ఒకరోజు తమకు అట్టిపెట్టేసుకుని ముందు తమ వరకు తాము భద్రంగా ఉండాలన్న నిర్ణయానికి వచ్చినట్టున్నారు.

*24 మార్చి 2013*

# బియ్యపుగింజ తలపోత

ఇలాంటి రోజు ఒకటి తనకు వస్తుందని అది ఎప్పుడూ ఊహించలేదు. ఎంత వైభవంగా బతికింది తను. కనీసం మూడువేల ఏళ్ళ చరిత్ర ఉంది తనకు. రాజ్యాలు పోయినా, రాజులు గతించినా ప్రజలెప్పుడూ తనను కడుపులో పెట్టుకుని కాపాడుకున్నారు. తను ఒక్కపూట ఎవరి ఇంట్లో కనిపించకపోయినా ఆ ఇంటిల్లిపాదీ ఎంత గిలగిలలాడి పోయేవారు. ప్రేమలూ, యుద్ధాలూ అన్నీ తన చుట్టూ కాదూ తిరిగేవి.

అమ్మ పెట్టే ప్రతి ముద్దలోనూ తను ఉండాల్సిందే. అన్నప్రాశన నుంచి అంతిమక్షణం వరకు మనిషిని కనిపెట్టుకుని ఉండేవాళ్ళు ఇంకెవరున్నారు తను కాకపోతే! ఆవకాయ అయినా, ముద్దపప్పు అయినా తనతో కలిసి తింటేనే ఎవరికైనా తృప్తి. శాకాహారులు, మాంసాహారులన్న భేదం తనకెప్పుడూ లేదు. ఎవరు దేన్ని తన పక్కన తీసుకొచ్చి కూర్చోపెట్టినా అన్నిటితోనూ ఎంత బాగా కలిసిపోయేది తను.

మొదట్లో కాస్త నల్లగా ఉండేది తను. అయినా ఎవరూ తనను చిన్నచూపు చూడలేదు. తన మొత్తం కుటుంబాన్నీ

లావుగా ఉన్నా, సన్నగా ఉన్నా, పొట్టిగా ఉన్నా, పొడుగ్గా ఉన్నా - భారతీయ సమాజం ముఖ్యంగా తెలుగు సమాజం తమను ఎంతగా ఆదరించిందని! ఏ మాటకు ఆ మాట చెప్పుకోవాలి. తన ఒక్క విషయంలో వాళ్ళు ప్రాంతీయ భేదాలను కూడా మరిచి గుండెలకు హత్తుకున్నారు. వాళ్ళ ఆప్యాయతకు ఉబ్బితబ్బిబ్బై ఆదమరచి ఉన్నపుడు ఎప్పుడు ఎవరు తనకు ఫెయిర్&లవ్లీ పూశారో గాని తను క్రమంగా తెల్లబడడం మొదలయింది. దాంతో తన తోటివాళ్ళకూ, తనకూ దూరం పెరగసాగింది. ఇదివరకు ఒక ఇంట్లో పక్కపక్కన ఉన్నవాళ్ళం కాస్తా కొన్నాళ్ళకు తలో మూలా ఉండసాగాం. తన కోసం పెద్ద డబ్బాలు, వాళ్ళ కోసం చిన్న డబ్బాలు వచ్చాయి. కొన్నాళ్ళకు అవి అసలు కనిపించకుడా పోయాయి. కొంచెం బాధ అనిపించినా చారిత్రక పరిణామం అని సరిపెట్టుకున్నా.

కాని ఇప్పుడేమైంది? తనను చూసి మొహం చిట్లించేవాళ్ళు ఎక్కువయ్యారు. జబ్బుపడ్డవాళ్ళు తప్ప వేరెవరూ తనతో అలా ప్రవర్తించలేదు గతంలో. ఇప్పుడు ముఖ్యంగా తన రంగు వాళ్ళకు నచ్చడం లేదట. ఇదివరకంతా మల్లెపూవులా ఉన్నావన్నవాళ్ళే తెల్ల విషం అనే దాకా వచ్చారు. తను ఎప్పుడైనా కోరుకుందా ఆ రంగు. వాళ్ళు ఇచ్చిందే కదా. అంతేకాదు ఇప్పటిదాకా తమ ఇళ్ళ నుంచి, పొలాల నుంచి తరిమేసిన తన పాత ఫ్రెండ్స్‌ను ఈ మధ్య జనం మళ్ళీ సగౌరవంగా తోడ్కొని తెచ్చుకుంటున్నారు. వాళ్ళతో తనకేం పేచీ లేదు కాబట్టి మళ్ళీ అందరం ఒకచోట కలిసి ఉండే రోజు వస్తే అంతకంటే తనకేం కావాలి? నిజం చెప్పాలంటే ఈ తెల్ల రంగు తనకూ విసుగ్గానే ఉంది. చిన్నప్పటిలాగా తన రంగులన్నీ తనకు వచ్చేసే రోజు దగ్గరలోనే ఉందనిపిస్తోంది. అప్పుడే తనకు మళ్ళీ మునుపటి ఆదరణ లభిస్తుందనిపిస్తోంది.

*31 మార్చి 2013*

# రసమా...రసాయనమా?

అనగనగా బోలెడు మామిడితోటలు. ఒక్కో తోటలో బోలెడు రకాల చెట్లు. ఒక్కో చెట్టుకూ వందల వేల కాయలు. ఉగాది ముందు వరకు చిన్న పిందెలు. తింటే ఒట్టి ఒగరే. మెల్లమెల్లగా పొడవు సాగి ఒళ్ళు చేసి ఆకుపచ్చ నుంచి పసుపుపచ్చలోకి మారుతూ పులుపు నుంచి తీపికి సాగుతూ ఎంత అద్భుతమైన ప్రయాణం చేసేవో.

మామిడి కాలంలో దేవుడికి ఎవరు ప్రదక్షిణాలు చేసేవారు! వందల కొమ్మలతో వేల కాయలతో నిండు గర్భిణిలా నిలబడే మామిడిచెట్టు చుట్టూ కాదూ పిల్లలూ, పక్షులూ, కీటకాలూ ప్రదక్షిణాలు చేసేది. రంగు మారే లోపల వాసన వచ్చేది. వాసన వచ్చే లోపే నోట్లో నీళ్ళూరేవి. ఆకుపచ్చ ఆకుల వెనక దాక్కునే మామిడికాయలను వెతకడానికి తెరుచుకున్నంత విశాలంగా మరెప్పుడూ తెరుచుకునేవి కావు కళ్ళు. అంత భారం మోస్తున్నా కించిత్ కూడా వంగకుండా ఎంత ఆత్మవిశ్వాసంతో నిలబడి ఉండేవో ఆ చెట్లు. కొంచెం వంగితే నీ సొమ్మేం పోయిందనుకోని పిల్లకాయలెవరూ ఉండేవాళ్ళు కాదు. సొమ్ము ఎందుకు పోదూ! మామిడి పండ్లు వాటి సొమ్మే కదా.

ఎన్ని రకాల పేర్లు వినిపించేవి! అందరికీ తెలిసిన చిన్న రసాలు, పెద్ద రసాలు, బంగినపల్లి, ఇమాం పసంద్, దసేరి, మల్గోవా, అల్ఫాన్సా, నీలాలు కాక ఇంకెన్నెన్ని రకాలు ఉండేవో! సన్నగా పొడుగ్గా, పొట్టిగా బొద్దుగా, పొడుగ్గా లావుగా, రకరకాల రంగుల్లో, రుచుల్లో, ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో... అన్నిచోట్లా అంతే ఆదరణ పొందుతూ ఫలాలలో రాజు, రాణి, మంత్రి, సేనాధ్యక్షుడు, ఆఖరికి రాజనర్తకి అన్నీ తానేగా ఎంత వైభవంగా బతికింది!

ఏవి తల్లీ నిరుడు విరగకాసిన ఆ మామిడి ఫలాలు?

ఏవి తండ్రీ నిరుడు చెట్లకు పండిన ఆ తీపి మామిడి ఫలాలు?

ఏ చెట్టుకు ఏ రకం కాసినా అన్నీ ఒకటే రసాయనం పులుముకుని...ఒకే పసుప్పచ్చ రంగులో...ఏ రుచినీ ఒంట పట్టించుకోకుండా వస్తున్న ఈ పండ్లను ఏ పేరుతో పిలుద్దాం?

మామిడికాయలు చెట్ల మీదే పండాలని ఉద్యమించే మనుషులే కరువయ్యారా?

*21 ఏప్రిల్ 2013*

# దారి మరిచిన తేనెటీగలు

చీమల్లాగే తేనెటీగలు కూడా ఎప్పుడూ మహా బిజీగా ఉంటాయి. ఏదో ఆలోచిస్తూ అవి దారిలో ఆగిపోవడం గాని, ఎటు వెళ్ళాలో తెలియని మీమాంసలో అవి నిలబడిపోవడం గాని చూడం. బయల్దేరే ముందే ఆ రోజు కార్యక్రమమంతా నిర్ణయించు కున్నట్టుగా ఒక మొక్క నుంచి మరో మొక్కకు ఎగిరిపోతూనే ఉంటాయి. అంత స్పష్టత గల తేనెటీగలు కూడా ఈ మధ్య దారి తప్పిపోతున్నాయట.

తేనెతుట్టెలు నేలమాళిగల్లో ఉండవు కదా. చెట్టు కొమ్మమీదో, భవనం పైకప్పు నుంచో దర్జాగా, నిర్భయంగా వేలాడుతూ ఉంటాయి. బిజీ చౌరస్తా కంటే బిజీగా ఉంటుంది అక్కడి దృశ్యం. పగలంతా తోటలెంటా దొడ్లంటా తిరిగి తెచ్చిన మకరందాన్ని దాచడానికి వచ్చిన వాటితో, ఆ పని ముగించుకుని మళ్ళీ బయల్దేరే వాటితో మహా కోలాహలంగా ఉంటుంది ఆ ప్రదేశమంతా. మనకు ఒక్క బ...జ్జ్ అనే ధ్వనే వినిపించినా రెక్కలు టపటపా కొట్టుకుని అవి ఏవేవో సంభాషించేసు కుంటుంటాయి.

అలాంటి తేనెతుట్టెలు ఈ మధ్య నిశ్శబ్దమైపోయాయి. బయటికి వెళ్ళిన తేనెటీగలు తిరిగి ఇళ్ళకు రావడం లేదు. రాణి ఈగ

ఇంట్లోనే ఉంది. పసి ఈగలూ లోపలే ఉన్నాయి. తేనె కూడా అలాగే ఉంది. కాని బయటకు వెళ్ళిన తేనెటీగలు మాత్రం తిరిగి రావడం లేదు.

ఒక తుట్టె అంటే ఒక కుటుంబం. పనిచేసే సభ్యులందరూ మాయమయ్యాక తల్లి ఈగ, పిల్ల ఈగలు ఎన్నాళ్ళు బతుకుతాయి? క్రమంగా శిథిలమవుతూ పోతుంది ఆ తుట్టె. చాలా దేశాల్లో ఖాళీ తుట్టెలను గమనించాక దానికో పేరు పెట్టారు శాస్త్రజ్ఞులు. 'కాలనీ కొలాప్స్ డిజార్డర్'. అంటే 'కుటుంబ శైథిల్య వ్యాధి' అనొచ్చేమో. క్రిమిసంహారక మందులతో పెరిగిన మొక్కలకు పూసిన పూల నుంచి మకరందాన్ని తాగడం వల్లనే అవి పాపం ఎగరలేక ఎక్కడో పడి చచ్చిపోతున్నాయని వారి అనుమానం. మరికొన్ని అనుమానాలు కూడా ఉన్నా ప్రధాన హంతకుడు క్రిమిసంహారకుడేనని భావిస్తున్నారు.

శతకోటి జీవరాశుల్లో ఒక్క తేనెటీగ జాతి పోతేనేం అనుకోవడానికి వీల్లేని పరిస్థితి. అవి లేకపోతే పరపరాగ సంపర్కం ఆగిపోతుంది. కాయలు, పండ్లు పుట్టవు, పండవు. అందుకే ఖాళీ తేనెతుట్టెలు ఖాళీ పల్లెటూళ్ళలా మన భవిష్యత్తును భయపెడుతున్నాయి.

*2 జూన్ 2013*

# చీమ దరఖాస్తు

ఉన్నట్టుండి కురిసిన భారీ వర్షాలకు చీమలన్నీ తడిసి పోయాయి. గొడుగులు తీసికెళ్ళకుండా, రెయిన్ కోట్లు వేసుకెళ్ళకుండా బయటికెళ్ళినందుకు పెద్దచీమలు పిల్లచీమల్ని బాగా కోప్పడ్డాయి. ఋతువులు మారేటపుడైనా వాతావరణ వార్తలు వినడం అలవాటు చేసుకోమని మందలించాయి. గల్లంతయిన చీమలు ప్రాణాలతో ఉన్నాయో లేదోనని ఆ రాత్రంతా బెంగపడ్డాయి. వెంటనే ఏ గోడో, చెట్టో ఎక్కి కూర్చుంటే ఫరవాలేదు కాని డ్రైనేజీలో పడితే...అమ్మో ఇంకేమైనా ఉందా? డ్రైనేజీ దాకా ఎందుకు చిన్న గుంత చాలదూ తమ ప్రాణం పోవడానికి? అయినా ఏటా ఇంత చీమనష్టం జరుగుతుంటే పాలకులకు చీమకుట్టినట్టయినా ఉండకపోవడమేమిటని కొందరు చీమపెద్దలు శాపనార్థాలు పెట్టారు. మర్నాడు చీమపత్రికల్లో తాటికాయలంత అక్షరాల్తో ఇవే వార్తలు.

ఆ రోజంతా చీమనాయకులు చినుకుల్ని లక్ష్యపెట్టకుండా పుట్ట పుట్ట దగ్గరికి వచ్చి పరామర్శించారు. ప్రతి పుట్టకూ పుట్టెడు గింజలు ఇస్తామని, నీళ్ళల్లో నాని కూలిపోయిన

పుట్టల్ని పునర్నిర్మిస్తామని హామీలిచ్చారు. ఆ తర్వాత 'చీమల సౌభాగ్యమే దేశ సౌభాగ్యం' అని రాసి ఉన్న ఫ్లెక్సీలను పట్టుకుని 'చీ' టీవీల వైపు ఊరేగింపుగా వెళ్ళారు.

వాళ్ళందరూ వెళ్ళిపోయాక ఇంత భూప్రపంచంలో మనం భద్రంగా ఉండదగ్గ చోటు ఎందుకు లేకుండా పోయిందని కొన్ని ఉడుకురక్తం చీమలు తమ పెద్దల్ని నిలదీశాయి. సమస్త ప్రాణికోటిలోకీ బహుకష్టజీవులన్న పేరు తెచ్చుకుని కూడా పనిస్థలానికి దగ్గరగా పుట్ట పెట్టుకునే అవకశాం మనకెందుకు లేకుండా పోయిందని శ్రామిక చీమలు ఆవేదన వ్యక్తం చేశాయి. నగరాలకు వలస రావడం వల్ల వస్తున్న ఇబ్బందుల గురించీ; ప్రమాదకరమైన రోడ్లమీదా, బహుళంతస్తుల భవనాలెక్కీ ఆహారాన్వేషణ చేయడంలోని సమస్యల గురించీ ముఖ్యంగా ఆడచీమలు తమ గోడును వెళ్ళబోసుకున్నాయి.

సమస్య చాలా పాతది, పరిష్కారం తమ శక్తికి మించినదని వారికి తెలుసు. అందుకే చివరికి అందరిలాగా వాళ్ళూ ప్రభుత్వానికే ఒక అర్జీ పెట్టుకోవాలనుకున్నారు. అందులో - మిట్ట ప్రాంతాల్లో నివాస స్థలాలు; ఎవరి కాళ్ళకిందా పడి నలిగిపోకుండా నడవడానికి ప్రత్యేక చీమబాటలు; వానలు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తక్షణ సహాయం అందించేందుకు ఒక హెల్ప్‌లైన్; ఏడాది పొడవునా ఆహార భద్రత; చీమనాశిని వంటి మందుల వాడకంపై నిషేధం మొదలైనవన్నీ ఉన్నాయి.

మనుషులకు, చీమలకు ఒకటే రకం సమస్యలుండడం ఈ కాలపు వైపరీత్యం కాక మరేమిటి అనుకున్నాడు ఆ అర్జీని అందుకున్న ప్రభుత్వ గుమాస్తా.

*23 జూన్ 2013*

# హాచ్.. ఇదేం జబ్బో చెప్పండి

చిన్న ప్రశ్నను కూడా పెద్ద జవాబుతో చితక్కొట్టడమే జ్ఞానం.

మనిషికి వచ్చే జబ్బులెన్ని? అని ఒకే ఒక ప్రశ్న అడిగి చూడండి. ఏ వయసులో అన్న ఎదురుప్రశ్నయినా వస్తుంది లేదా ఏ ప్రాంతంలో అన్న ప్రశ్నయినా వస్తుంది. ఈ రెండింటికీ ముందో వెనకో ఆ మనిషి ఆడా మగా, నలుపా తెలుపా పసుపా బ్రౌనా, పేదా గొప్పా లాంటి అనేక అనుబంధ ప్రశ్నలు వస్తాయి.

మనుషులకు లేని ఐకమత్యం జబ్బులకు ఉందని నమ్మేవాళ్ళు ఈ భూమ్మీద నివసించే అన్ని వయస్సుల వారికీ, అన్ని ప్రాంతాల వారికీ, అన్ని వర్ణ వర్గ లింగ భేదాల వారికీ కలిపి దాదాపు లక్ష జబ్బులొచ్చే అవకాశం ఉందని తేల్చారు. అంటే మనమంతా పుట్టుకతోనే లక్షరోగాధికారుల మన్నమాట.

లక్షనేది మానవజాతికి సహజమైన అతిశయోక్తి అంకే తప్ప అన్ని ఎక్కడున్నాయి? ఉంటే అందరం ఎప్పుడో చచ్చి ఊరుకునేవాళ్ళం కదా అనేవాళ్ళూ ఉన్నారు. వాళ్ళ లెక్క ప్రకారం 12 వేల మామూలు వ్యాధులు, ఓ ఆరువేలు

అరుదైన వ్యాధులు ఉన్నాయి. దగ్గు, జలుబు, గొంతునొప్పి, తలనొప్పి, తుమ్ములు, చెవి దిబ్బడ, జ్వరం అని విడివిడిగా లెక్కలేస్తే లక్షేమిటి కోటి అయినా అవుతాయని, అన్ని లక్షణాలనూ కలిపి వైరలో, డెంగీనో, మలేరియానో, టైఫాయిడో ఏదో ఒకటే అనాలని వాళ్ళ వాదన. ఒకాయన ఎ నుంచి జెడ్ దాకా 26 అక్షరాలకు అక్షరానికి 99 చొప్పున వర్గీకరించి రెండున్నర వేలకు కాబోలు వాటిని తగ్గించాడు. ప్రతి అక్షరంతో కరెక్టుగా అన్నే జబ్బులు ఎలా వస్తాయి? కాబట్టి ఇందులో మనకు అర్థం కాని శాస్త్రం ఇంకేదో ఉండి వుండాలి. మనుషుల్ని జాతులుగా చూసినట్టే జబ్బుల్ని కూడా 'రకాలు'గా మాత్రమే గుర్తించాలని ఇంకో వాదన ఉంది. దాని ప్రకారం జస్ట్ 39 రకాల జబ్బులు మాత్రమే ఉన్నాయి మనకు.

హమ్మయ్య... లక్ష నుంచి 39 కి వచ్చేశాం. కాని ఛత్... దిస్ ఈజ్ ఆల్సో టూమచ్ అన్నాడు ఒక శాస్త్రవేత్త. అసలు జబ్బులనేవే లేవన్నాడాయన. ఉన్నదల్లా జబ్బే. అది వచ్చే మార్గాలు ఆరు, కారణాలు రెండు అన్నాడు. ఏదయినా ఎక్కువవడం లేదా తక్కువవడం వల్ల మాత్రమే అనారోగ్యం వస్తుంది కాబట్టి అనారోగ్యం సింగిల్ డిజిట్ అంటాడాయన.

ఇదంతా కాదు. జబ్బుల గురించి మనకు సరైన అవగాహన రావాలంటే ఉన్న జబ్బుల్ని లెక్కపెడుతూ కూర్చోవడం కాదు, మనం ఇప్పటిదాకా తుడిచిపెట్టిన జబ్బులెన్నో ఆ విషయం తేల్చండంటోంది ఒకామె. అవి ఎన్నో లేవు, ఒకే ఒక్కటి, దాని పేరు మశూచి అని కూడా చెప్పిందామె. దీని అంతరార్థం మనం పశు పక్ష్యాదులను అంతరింపజేసినంత చురుకుగా వ్యాధుల్ని తుడిచిపెట్టలేక పోయామని, సృష్ట్యాది నుంచి మనతో ప్రయాణిస్తున్న జబ్బులన్నీ మనల్ని అంటిపెట్టుకునే ఉన్నాయని. ఇందులో ఎన్ని విషయాలున్నాయో చూడండి.

కాబట్టి వర్షాకాలంలో రాగాలాపన చేయగల అదృష్టవంతులు కొందరే. రెండు లక్షల ఏళ్ళుగా క్రిములతో నిరంతర యుద్ధం చేస్తూ ఓడిపోతున్న మనిషి ఈ ఋతువులో చేయగలిగింది ఎక్కువగా రోగాలాపనే.

*7 జూలై 2013*

# హైless సిండ్రోమ్

ఏమిటంత డల్‌గా ఉన్నారు...బి.పి.లేదా షుగర్ డౌన్ అయ్యాయా?

లేదు, నార్మల్‌గానే ఉన్నాయి. కాని కాస్త నీరసంగా ఉంది.

నార్మల్‌గా ఉండి కూడా నీరసంగా ఉన్నారంటే రక్తంలో హిమోగ్లోబిన్ తగ్గడమో లేక థైరాయిడ్‌లో తేడానో వచ్చి ఉండాలి.నా మాట విని డాక్టర్ దగ్గరికి వెళ్లండి.

ఇది డాక్టర్లు నయం చేసేది కాదులెండి.

ఏదైనా మనోవ్యథా? వాటికీ డాక్టర్లు ఉన్నారు కదా.

మీకు అర్థం కావడం లేదు. ఇది శారీరకమూ కాదు, మానసికమూ కాదు.

ఎంత విచిత్రం! ఈ రెండూ కాకుండా వేరే ఏ జబ్బు ఉంటుంది?

మిగతా వాటి గురించి నాకు తెలియదు గాని నాకైతే ఒకటి ఉంది.

అంటే మీరెందుకు నీరసంగా ఉంటున్నారో మీకు తెలుసన్న మాట. చెప్పండి చెప్పండి ఆ జబ్బు పేరేమిటి?

దానికి ఇంకా ఎవరూ పేరు పెట్టినట్టు లేదు.

మరీ మంచిది మీ పేరే పెట్టేసుకోవచ్చు హాయిగా. మానవజాతి ఉన్నంతకాలం ఎవరో ఒకరికి ఈ జబ్బు మళ్లీ రాకుండా పోదు. అప్పుడు పేరు వెతుక్కోకుండా రెడీగా ఉంటుంది. పైగా ఎప్పటికీ మీ పేరు చిరస్థాయిగా ఉంటుంది.

నిజమే గాని దానికి  పేరు పెట్టడం కష్టం.

మీడియా వాళ్ళనడిగి చూడండి. అందరికీ అర్థమయ్యేలా సూక్ష్మ పేర్లు పెట్టడంలో వాళ్ళు సిద్ధహస్తులు.

దీనికి వాళ్ళు పెట్టరండి. అసలు ఇదొక జబ్బు అని కూడా వాళ్ళు ఒప్పుకోరను కుంటున్నాను.

అరే.. విచిత్రంగా ఉంది. ఒప్పుకోకపోవడానికి వాళ్ళెవరు... జబ్బు వచ్చినవాళ్ళే చెప్తుంటే?

నిజమే కాని వాళ్ళ సమస్యలు వాళ్ళకుంటాయి కదా!

ఇంతకీ మీ కొచ్చిన జబ్బు లక్షణాలేమిటండి?

శరీరం, మనస్సు రెండూ కూడా నిత్య ఎగ్జయిట్‌మెంట్‌ను కోరుకుంటున్నాయి. ఏ హడావిడీ లేకుండా సూర్యుడు రోజూ ఇంచుమించు ఒకే టైంకి ఉదయించడం, పిల్లలు టైం ప్రకారం రెడీ అయ్యి బయటికి వెళ్ళిపోవడం, ఒక్క మాట మాట్లాడకుండా భార్య టిఫిన్ తెచ్చి టేబుల్ మీద పెట్టి వెళ్ళడం ఇవేవీ నచ్చడం లేదు నాకిప్పుడు. క్రికెట్ మ్యాచ్ అయినా, వానలైనా, నేరాలైనా, ధరలైనా, తెలంగాణ అయినా, పంచాయితీ ఎన్నికలైనా వాటి గురించి ఒక భూకంపం  వచ్చినట్టుగా, ఒక సునామీ విరుచుకుపడ్డట్టుగా వినడం అలవాటై నా శరీరం హై బిపి, హై షుగర్‌లనే నార్మల్‌గా భావిస్తోంది. అందువల్ల ఉద్వేగాలు తగ్గినప్పుడు నీరసంగా అనిపిస్తోంది.  దానికి డాక్టర్లు ఏం చేయగలరు చెప్పండి?

*21 జూలై 2013*

# అవ్వా... రాజెప్పుడొస్తాడే!

కొద్ది రోజులుగా ఒక ముసలావిడ ప్రతిరోజూ చీకటి పడే వేళకి గుడి దగ్గరికి వచ్చి కూర్చుంటోంది. పక్కన ఒక పిల్లవాడు ఉంటాడు. మనవడు కాబోలు.

దారినపోయే వాళ్ళలో కొందరు ఆసక్తిగా చూస్తూ వెళ్ళేవాళ్ళు. కొందరు మాత్రం అనుమానంగా వెనక్కి తిరిగి చూస్తూ వెళ్ళేవాళ్ళు. కొద్దిమంది ఆగి డబ్బులివ్వబోయే వాళ్ళు. కాని ఆమె ఎప్పుడూ తీసుకునేది కాదు. బీట్ కానిస్టేబుల్స్ మారినప్పుడల్లా ఆమె దగ్గరకు వచ్చి ఆగి ఏదో అడిగేవారు. ఆమె ఏం చెప్పేదో గాని వాళ్ళు నవ్వుకుంటూ వెళ్ళిపోయేవాళ్ళు.

ఆ చుట్టుపక్కల ఏ అలికిడి అయినా ఆవిడా, పిల్లవాడూ ఇద్దరూ లేచి నిలబడి చూసేవాళ్ళు. తాగి తూలుతూ వెళ్ళేవాళ్ళను, కొట్లాటలు పెట్టుకునే వాళ్ళను గమనిస్తుండే వాళ్ళు. ఎక్కడా జాగా లేక అక్కడికొచ్చి ముడుచుకుని పడుకునే వాళ్ళ దగ్గరకు కూడా వెళ్ళి చూసొచ్చేది అవ్వ. పిల్లవాడు రోడ్డు పూర్తిగా నిర్మానుష్యమయ్యాక ఆ చివర్నించి ఈ చివరికి నేల వంక చూసి నడుస్తూ ఏవో లెక్కలు పెట్టుకునేవాడు. చెత్త పారేసే వాళ్ళను, దాన్ని ఊడ్వడానికి వచ్చేవాళ్ళను కూడా వారు ప్రతి రోజూ కన్నార్పకుండా చూసేవాళ్ళు.

అవ్వా, మనవడూ మౌనంగా వాళ్ళ పని వాళ్ళు చేసుకోవడమే తప్ప ఎవరితో పెద్దగా మాట్లాడేవారు కాదు. కాని ఎవరి కోసమో ఎదురు చూస్తున్నట్టుండేది వాళ్ళ చూపు.

ఒక రాత్రి ఒక పెద్దాయన అదే రోడ్డులో నాలుగుసార్లు అటూ ఇటూ తిరగాల్సి వచ్చింది. వీళ్ళను గమనించి దగ్గరకొచ్చి నిలబడ్డాడు. వాళ్ళ చేతుల్లో కొన్ని కాగితాలు కనిపిస్తే అడిగి తీసుకున్నాడు. ఆ రోడ్డులో ఎన్ని గుంతలున్నాయో, ఎంతమంది తాగి తూలి పడిపోయారో, సుమారుగా ఎంత చెత్త చెల్లాచెదురుగా పడి ఉందో, ఒక మనిషికి ఎన్ని దోమల చొప్పున తిరుగుతున్నాయో వగైరా లెక్కలున్నాయి అందులో. 'ఎవరికి ఇవ్వాలని రాసుకున్నారు ఈ లెక్కలన్నీ?' ఆశ్చర్యపోతూ అడిగాడా పెద్దాయన. 'రాత్రి పూట రాజులు మారువేషంలో వచ్చి ప్రజల కష్టసుఖాలు కనుక్కుంటారని నా మనవడు చందమామ కథల్లో చదివాడట. ఆయనొచ్చినప్పుడు ఇద్దామని చూస్తున్నాం' అంది అవ్వ.

*12 జనవరి 2014*

# ఎవరు మేలంటారు?

ఒకాయన చైనాలో విమానం దిగీ దిగగానే 'మేడ్' అనే ఊరు ఎక్కడుంది అని అందర్నీ అడగడం మొదలుపెట్టాడు.

అందరూ తెలియదంటే తెలియదన్నారు.

అదేంటి 'మేడ్' తెలియకపోవడమేమిటి? చైనాలో అందరికీ తెలుసనుకున్నానే అని అతను ఆశ్చర్యపోయాడు.

ఏ ప్రాంతమో చెప్పగలవా అని అడిగారు వాళ్ళు. ఊహూ ... చెప్పలేను అన్నాడతను.

అది ఏ రాష్ట్రంలో ఉందో, దేనికి ప్రసిద్ధో ఏమీ తెలియకుండా ఎలా వచ్చావని వాళ్ళు విసుక్కున్నారు. పోనీ ఆ ఊరి గురించి నీకెలా తెలుసో కనీసం అదైనా చెప్పమన్నారు.

వెంటనే అతను తన బ్యాగ్‌లో ఉన్న వస్తువులన్నీ బయటకు తీసి వాటి మీద ఉన్న అక్షరాలు చూపించాడు. అన్నిటి మీదా ఒకటే రాసుంది. మేడ్ ఇన్ చైనా అని. చైనాలో అదొక ఊరు అనుకున్నాడు అతను.

* * *

దేవుడు మనుషుల్ని వేరువేరుగా తయారుచేస్తూ తయారు చేస్తూ చైనా దగ్గరకొచ్చేసరికి అలిసిపోయాడట (చైనా

వాళ్ళందరూ ఒకేలా ఎందుకుంటారో ఇప్పుడు మీకు అర్థమై ఉంటుంది). చేసిన అన్యాయాన్ని సరిదిద్దుకోవడానికి 'ఇకనుండి అన్ని వస్తువులూ ఇక్కడే తయారు చేయబడతాయి' అని వరమిచ్చాడట.

* * *

పెట్రోల్ రేటు ఎప్పుడు తగ్గుతుంది?
చైనాలో తయారవడం మొదలయ్యాక.

* * *

తమ మీద ఇలాంటి జోకులెన్నో ఉన్నా చైనా వాళ్ళు పాపం పట్టించుకోరు. వస్తూత్పత్తి కోసమే పుట్టినట్లు ఏ దేశంలో ఏ కొత్త వస్తువు తయారైనా అచ్చం అలాంటిదో, లేదా దానికంటే మరింత అందంగా కనిపించేదో తయారుచేసి కారుచౌకగా అందిస్తారు. అది ఎన్నాళ్ళుంటుందనే దానికంటే వాళ్ళు ఎంత తక్కువ వేతనం తీసుకుంటుంటే అవి తయారవుతున్నాయనేది మనం ఎక్కువ ఆలోచించాల్సిన విషయం. అయినా ఖరీదైన కొత్త వస్తువుల్ని తయారుచేసి ఆర్థిక అంతరాలను పెంచే వాళ్ళకంటే ప్రతి కొత్త వస్తువునూ చాలా త్వరగా, తక్కువ ధరకు సామాన్యుడికి అందుబాటులోకి తీసుకువచ్చే వీళ్ళే నయమేమో!

*24 అగస్టు 2014*

# విలేఖరికో విన్నపం

నీటికి, బియ్యానికి, కరెంటుకు, వంటగ్యాస్‌కు రేషన్ ఉన్నట్టే కొన్ని రకాల వార్తలకు కూడా రేషన్ ఉండాలని భావించాడో పెద్దాయన. ఆ మాట చెప్పడానికి వీధిలో ఉండే ఓ విలేఖరి దగ్గరకు వెళ్ళాడు.

రైతుల ఆత్మహత్యల్లాంటి వార్తల గురించేనా మీరు అంటున్నది. నిజమే అవి గుండె కలుక్కుమనే వార్తలే. ప్రతి రోజూ కాకుండా వారానికోసారి ఇంతమంది చనిపోయారని వేయమంటారా? అడిగాడు విలేఖరి.

కాదు... కాదు... ఎంత బాధ అనిపించినా వాటిని వారానికోసారి వేయమనేంత దుర్మార్గుడ్ని కాదు నేను. నేనూ రైతునే. రైతుకు పుట్టినోడ్నే.

మరైతే ఉత్తరాంధ్ర తుఫాను దృశ్యాల గురించా! వాటిని చూస్తే ఎవరికైనా గుండె తరుక్కుపోవడం ఖాయం. కాని భయంకరమైన తుఫాను కాబట్టి వేస్తున్నాం.

అయ్యయ్యో! దాని గురించి రాయొద్దని, చూపెట్టొద్దని నేనెందుకు అంటాను? అంత కఠినాత్ముడ్ని కాదు నేను.

శ్రీశైలం నీళ్ళు, విద్యుత్ లాంటి విభజన గొడవలు మిమ్మల్ని బాగా కలత పెడుతున్నాయేమో! కాని వాటి గురించి ఒకటి రెండు వార్తలు రాసి సరిపెట్టడం మా చేతిలో పని కాదే!

చిన్నప్పుడే మహాభారతం చదువుకున్నవాడిని. మా ఊర్లో, మా కుటుంబంలో ఆస్తి పంపకాల గొడవలెన్నో చూసినవాడిని. ఎంత బాధ అనిపించినా దాయాదుల స్పర్థలు ఇలాగే ఉంటాయని తెలుసు కాబట్టి వాటి మీద రేషన్ పెట్టమని ఎందుకంటాను?

మరి ఏమిటి పెద్దాయనా నీ సమస్య?

ధనవంతుల జాబితా అని ఏటా ఒకటేస్తుంటారు. అందులో ప్రతి సంవత్సరం అవే పేర్లు ఉంటయ్యి. కాస్త కిందికో పైకో జరుగుతాయంతే. వారం వారం పట్టువస్త్రాలు కట్టుకుని గుళ్ళ చుట్టూ తిరుగుతుంటారు కొందరు ప్రముఖులు. గుడి మారినా మనుషులు వాళ్ళే ఉంటారు. అలాగే ప్రతి సభలోనూ ఒకే రకం మాటలు, వాగ్దానాలు, విమర్శలు, ఆరోపణలు చేస్తుంటారు కొందరు. రోజుకు ఇన్ని నీళ్ళు, ఇంత కరెంటు, నెలకింత బియ్యం, వంటగ్యాస్ లాగ ఈ వార్తల్ని కూడా ఏడాదికి ఇన్నని వేస్తే సరిపోతుందని నా ఉద్దేశం. దయచేసి నా విన్నపాన్ని మన్నించండి.

*2 నవంబర్ 2014*

# ఎంత నిర్భయంగా బతుకుతున్నాం..

రాత్రిపూట ఒంటరిగా నడవడానికి భయపడతాం.

పగటి పూట కూడా నిర్మానుష్యమైన ప్రదేశాల్లో ఒంటరిగా నడవడానికి భయపడతాం.

ఎత్తుగోడల మీద నుంచి దూకడానికి భయపడతాం.

ఎత్తయిన ప్రదేశాల నుంచి కిందికి చూడడానికి కూడా భయపడతాం.

రంగుల రాట్నంలో గిరగిరా తిరగడానికి భయపడతాం.

ఆగిపోయిన లిఫ్ట్‌లో నిలబడడానికీ భయపడతాం.

వరద నీళ్ళలో నడవడానికి భయపడతాం.

రోడ్డుమీద ట్రాఫిక్‌లో నడవడానికీ భయపడతాం.

ఉరుములకు భయపడతాం.

మెరుపులకు భయపడతాం.

పిడుగులకు అంతకంటే ఎక్కువ భయపడతాం.

పెద్ద పెద్ద జంతువులకే కాదు... ఎలుకలకు, బల్లులకు, బొద్దింకలకు, ఆఖరికి దోమలకు కూడా భయపడతాం.

ఆకలికి భయపడతాం.
అప్పు చేయడానికి భయపడతాం.

సీటు రాకపోయినా, చదువు రాకపోయినా,
మార్కులు రాకపోయినా, ఉద్యోగం రాకపోయినా,
జీతం పెరగకపోయినా అన్నిటికీ
భయపడతాం.

నీళ్ళను చూసి భయపడతాం.
నిప్పుల్ని చూసీ భయపడతాం.
వ్యాధిని చూసి భయపడతాం.
డాక్టరును చూసీ భయపడతాం.

బతుక్కి భయపడతాం.
చావుకీ భయపడతాం.

దేవుడికి ఎలాగూ భయపడతాం.
దెయ్యానికి అంతకంటే ఎక్కువ భయపడతాం.

కాని ఇన్ని వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటుంటే వాళ్ళు రేప్పొద్దున దెయ్యాలై మనల్ని పీక్కుతింటారేమోనని మాత్రం మనం భయపడ్డం లేదు. దేవుడు శిక్షిస్తాడనీ మనం భయపడ్డం లేదు. రైతుల మంచితనం మీద, నిస్సహాయత మీద మనకు ఎంత నమ్మకం!

*4 అక్టోబర్ 2015*

# అనాగరిక ఒత్తిడి

సింధు నాగరికత ఎందుకు ధ్వంసమైందో తెలుసా?

తెలీదు. నాకే కాదు, ఎవరికీ తెలీదు.

పోనీ అక్కడ నివసించిన ప్రజలు ఏమైపోయారో తెలుసా?

ఊహు. అది కూడా ఎవరికీ తెలీదు.

భూకంపం వల్ల ధ్వంసమై ఉంటే అందరూ ఒకేసారి చచ్చిపోయి ఉండేవాళ్ళు. కాని భూకంపం వల్ల ధ్వంసమవలేదని అందరూ ఒప్పుకుంటున్నారు కాబట్టి జనమంతా ఒకేసారి చచ్చిపోలేదని అర్థమవుతోంది. అలాంటపుడు వాళ్ళందరూ ఎక్కడికి వెళ్ళి ఉండొచ్చు?

అప్పటికి బస్సులు, రైళ్ళు, విమానాలు ఏమీ లేవు కాబట్టి ఎక్కడికైనా నడిచే వెళ్ళి ఉండాలి.

నడిచి సరే, కలిసే వెళ్ళి ఉంటారంటావా?

చచ్చినా వెళ్ళి ఉండరు. కలిసే ఉండదలచుకుంటే వేరే చోటుకు ఎందుకు వెళతారు? అక్కడే ఉంటారుగా!

పాయింటే. కాని అన్ని వేల మంది ఒకేసారి ఒకరికి తెలియకుండా ఒకరు ఎక్కడికి వెళ్ళి ఉండొచ్చు?

ఒకరికి తెలియకుండా ఒకరు వెళ్ళారని ఎందుకు అనుకోవాలి? నువ్వు ఈశాన్యానికి వెళ్లు. నువ్వు వాయవ్యానికి వెళ్ళు. నువ్వు నైరుతికి వెళ్ళు, నువ్వు ఆగ్నేయానికి వెళ్ళు ... కొంత దూరం వెళ్లాక మళ్లీ దిక్కు మార్చి ఇంకో వైపు వెళ్ళు ... ఇలా చెప్పుకుని బయల్దేరారేమో!

అంటే ఒకరికొకరు ఎప్పటికీ తారసపడకూడదని అనుకున్నారంటావా?

నాకైతే అదే అనిపిస్తోంది. అందరూ ఒకే చోట చేరితే మళ్ళీ హరప్పా, మొహంజదారో లాంటి నగరాలను నిర్మించి వాటిని నిలబెట్టడానికి ఇప్పుడు మనం చేస్తున్నట్టే గాడిదచాకిరీ చేయాల్సొస్తుందని భయపడి ఉంటారు. చిన్న చిన్న గుంపులుగా తలో దిక్కూ పారిపోయి ఉంటారు.

తర్వాతయినా వాళ్ళు ఎక్కడో చోట కనబడాలిగా!

మన గ్రామాలు, కుగ్రామాలన్నీ అవేనేమో! పట్టణ నాగరికతను భరించలేక దూరదూరంగా ఎక్కడెక్కడో స్థిరపడ్డ ప్రజలందరూ వాళ్ళేనేమో!

అంటే ఇప్పుడు మనం ...

తప్పదు మనిషి అనేవాడెవడూ ఇంత 'నాగరికత'ను భరించలేడు.

నాలుగు కాలాలపాటు ఆరోగ్యంగా బతకాలంటే మనం కూడా వాళ్ళ దారిలో పోక తప్పదు. లేదా ప్రతి ఇంట్లో ఒక ఒ.వి.కె (ఒత్తిడి విరుగుడు కేంద్రం) అయినా ఏర్పాటు చేసుకోక తప్పదు.

*25 అక్టోబర్ 2015*

# ప్రశ్న... జవాబు

ప్రశ్నల్ని పారేసుకుంటూ వెళుతున్నాడు ఒకాయన.

అరే... అదేమిటి... అలా పారేసుకుంటూ వెళతావేమిటి? ఉంచు ఉంచు... అని బతిమిలాడుతోంది ఒకామె.

అక్కరలేదు... అవసరం తీరాక వేటినీ ఉంచుకోకూడదు... గబగబా ముందు కెళుతూ అన్నాడాయన.

ప్రశ్న అవసరం ఎప్పటికీ తీరేది కాదు... అది నీకూ తెలుసు... నచ్చచెపుతున్నట్టుగా అందామె.

నేను అన్ని ప్రశ్నల గురించీ చెప్పడం లేదు. నా దగ్గరున్న ఈ ప్రశ్నల్ని ఇక దాచి ఉంచడం అనవసరమనుకుని పారేస్తున్నాను... కాస్త నిదానంగా చెప్పాడతను.

ఒక మాట చెప్పు... నీ ప్రశ్నలకు సమాధానాలు దొరికాయా? దొరకనపుడు ఎలా పారేస్తావు... సూటిగా అడిగిందామె.

దొరకలేదు కాబట్టే పారేస్తున్నా.

దొరికేదాకా నీ దగ్గర ఉంచుకునే సహనం కూడా నీకు లేకపోతే ఎలా?

ఎప్పుడూ ఇవే ప్రశ్నలు పట్టుకుని తిరగాలంటే విసుగ్గా ఉంది. అస్తమానం వీటినే మళ్ళీ మళ్ళీ అడుగుతుంటే

వినేవాళ్ళకీ విసుగ్గా ఉంటోంది. అందుకే వీటిని పారేసి కొత్త ప్రశ్నల్ని తయారు చేసుకుందామనుకుంటున్నా.

పాత ప్రశ్నలకు జవాబులు దొరకనంతకాలం మనం కొత్త ప్రశ్నలు అనుకునే వాటి కడుపు లోపల పాత ప్రశ్నలే దాక్కుని ఉంటాయి.

మరేం చేయమంటావు?

మన ప్రశ్నలకు జవాబులు దొరికే వరకు ప్రశ్నల్ని భద్రంగా దాచుకోక తప్పదు. జవాబులు దొరికే సమయానికి ప్రశ్నలు మన దగ్గర లేకపోతే మనకు కలిగిన ఈ కాస్త జ్ఞానం కూడా వృథా అయిపోతుంది. జవాబులు తెలియలేదని మన ముందు వాళ్ళంతా ప్రశ్నల్ని పారేసుకుంటూ పోయుంటే అసలు ప్రశ్నించవచ్చనే విషయమే మనకు తెలిసుండేది కాదు. అవునా కాదా?

జవాబు చెప్పకుండా అన్ని ప్రశ్నల్నీ మళ్ళీ జేబులో వేసుకోవడం మొదలు పెట్టాడాయన.

ఏడాదికొకసారి వాళ్ళకిది మామూలే.

*1 నవంబర్ 2015*

# మనిషి డైరీలో ఒక పేజీ

అరగ్లాసు నీళ్ళలో ఒక స్పూను ఆపిల్ సిడార్ వినెగర్, రెండు స్పూన్ల తేనె కలుపుకుని తాగి చేతికి పీడోమీటర్ పెట్టుకుని వాకింగ్‌కి బయలుదేరాడు అనికేత్. ఎంతసేపు ఎంత వేగంగా ఎంత దూరం నడిస్తే ఎన్ని కాలరీలు తగ్గుతాయో తెలిపే పరికరం అది.

ఎన్నాళ్ళైౖ మిత్రుడొకరు దాన్ని బహుకరించేంత వరకు అనికేత్ మామూలు వాకింగ్ చేసేవాడు. అప్పుడు సూర్యోదయాల్ని చూస్తూ పక్షి పాటలను వింటూ పరిసరాలను గమనిస్తూ తెలిసిన వాళ్ళను పలకరిస్తూ పిల్లలు కనిపిస్తే నవ్వుతూ వెళుతుండేవాడు. ఇప్పుడు ఆ పనులు చేయడం కుదరడం లేదు. మధ్యలో ఆగితే ఆ రోజు వెయ్యాల్సిన పదివేల అడుగుల్లో కొన్ని వందల అడుగులు తగ్గిపోతాయని భయం. పైగా ఆఫీసుకెళ్ళేలోపల తినాల్సిన పండ్లు, పప్పులు; వేసుకోవాల్సిన మాత్రలు, గుళికలు ఈ మధ్య చాలా ఉంటున్నాయి కాబట్టి వెంటనే ఇంటికెళ్ళాల్సిన అవసరం కూడా ఏర్పడింది.

దాని అర్థం అతనేదో జబ్బు మనిషని కాదు. సంపూర్ణ ఆరోగ్యవంతుడే. అయితే ఇవ్వాళా రేపూ ఎవరూ ఆ మాట

గట్టిగా అనేట్టు లేదు. తనలాంటి వాళ్ళే ఉన్నట్టుండి ఐ.సి.యులలో చేరడం చూస్తున్నాడతను. కొందరు అట్నించి అటే మహాప్రస్థానానికి కూడా వెళ్ళిపోతున్నారు. అందువల్ల అన్ని రకాల జబ్బులకు దూరంగా ఉండాలని నిర్ణయించుకుని అతను ఒక పట్టిక తయారు చేసుకున్నాడు. చేసుకున్నాడంటే అతను సొంతంగా చేసుకున్నాడని కాదు. అన్ని రకాల వైద్య, పౌష్టికాహార నిపుణులను సంప్రదించే తయారు చేసుకున్నాడు.

అందరికీ  అంత ఓపిక, అంత సమాచారం లేకపోవచ్చు కాబట్టి ఎవరు అడిగినా అతను ఆ పట్టిక గురించి కొంచెం వివరంగానే చెపుతాడు. వాకింగ్ నుంచి తిరిగి వెళ్ళగానే అతను ముందు పెరుగులో నానబెట్టిన మెంతుల్ని, ఆ తర్వాత నీళ్ళలో నానబెట్టిన బాదం పప్పుల్ని తింటాడు. మెంతులు ఎందుకంటే డయాబిటిస్ రాకుండా. బాదం ఎందుకంటే ఒమేగా ఫ్యాటీయాసిడ్స్ ఉంటాయని. వృద్ధాప్యంలో కూడా చర్మం ముడతలు పడకుండా ఉండడానికి ఆలివ్ ఆయిల్ పూసుకుని, విటమిన్ - డి కోసం కాసేపు ఎండలో నిలబడి, ఆ తర్వాత గ్రీన్ టీ తాగి, స్నానమయ్యాక తొమ్మిది రంగుల్లోని తొమ్మిది రకాల పండ్లను సలాడ్‌లా చేసుకుని తిని ఆఫీసుకెళతాడు. అన్ని పండ్లు ఎందుకంటారేమో గుండె జబ్బులు, క్యాన్సర్లు, బ్రెయిన్ స్ట్రోక్స్, కిడ్నీ ప్రాబ్లెమ్స్ రాకుండా ఉండాలంటే ఆ మాత్రం పండ్లు తినాలట. వీటికి కాస్త ముందో వెనకో రెండు స్పూన్ల అవిసె పొడి కూడా తినగలిగితే ఇంకా మంచిదని ఈ మధ్య అది కూడా మొదలుపెట్టాడు.

ఆఫీసుకెళ్ళాక కూడా అతనికి ఆరోగ్య ధ్యాసే. గంటకి ఒకసారి లేచి పది అడుగులు వేయడం, రెండు నిమిషాలు ప్రాణాయామం చేయడం, మునికాళ్ళ మీద పైకి లేచి ఒక నిమిషం నిలబడడం ఇలా. సాయంత్రాలు కూడా అతనికి ఖాళీ ఉండదు. మర్నాటి కోసం పప్పులు నానబెట్టుకోవడంలో, పండ్లు తెచ్చుకోవడంలో, మందులు కొనుక్కోవడంలో బిజీగా ఉంటున్నాడతను. ఇంక సమాజాన్ని, రాజకీయాలను పట్టించుకునే తీరిక అతనికెక్కడిది!!

*20 డిసెంబర్ 2015*

# కొన్ని వివరణలూ... కొన్ని కృతజ్ఞతలూ

2002 లో ఆంధ్రజ్యోతి దినపత్రికలో నేను ఫీచర్స్ ఎడిటర్ గా చేరినపుడు ఈ శీర్షికను ఇన్నేళ్ళు రాస్తానని అస్సలు అనుకోలేదు. అప్పుడు ఆదివారం అనుబంధం విభాగంలో మహమ్మద్ ఖదీర్‌బాబు, మల్లంపల్లి సాంబశివరావు, కందుకూరి రమేష్‌బాబు నా సహోద్యోగులుగా ఉండేవారు. అన్ని శీర్షికలలో ఒకటిగా మేము 'సండే కామెంట్' పేరును అనుకున్నపుడు దాన్ని ప్రత్యేకంగా నేనే రాయాలనేమీ అనుకోలేదు. ఎవరికి ఆ వారం ఒక మంచి ఆలోచన వస్తే వాళ్ళు రాయొచ్చనేదే అప్పటి నా ఆలోచన. డైలీలో వచ్చే 'నవ్య' పేజీలు కూడా నేనే చూసేదాన్ని కాబట్టి పని చాలా ఎక్కువగా ఉండేది. పైగా రాతబద్ధకం చాలా ఎక్కువ నాకు (ఇప్పటికీ). ఖదీర్ అప్పటికే చేయితిరిగిన రచయిత కాబట్టి మొదటి రెండు మూడు నెలలలో తనే ఎక్కువ రాశాడు. అప్పటి ఎడిటర్ కె. రామచంద్రమూర్తి గారు, ఇంటర్నెట్ ఎడిటర్ జగన్, రచయిత జి.ఆర్.మహర్షి కూడా ఒకట్రెండు రాసినట్టు గుర్తు. కొన్నాళ్ళు పోయాక రామచంద్రమూర్తి గారు అది ఎడిటర్స్ కామెంట్ కాబట్టి వేరే ఎవరి చేతా రాయించకండి, మీరే రాయండి అని చెప్పారు/ఆదేశించారు. థాంక్స్ మూర్తి గారూ...మీరు ఆ మాట అంత గట్టిగా చెప్పకపోయుంటే నేను ఇవన్నీ రాసి ఉండేదాన్నే కాదు.

అయితే పేరు పెట్టుకోమని ఆయనా, మరి కొందరూ ఎంత బలవంతపెట్టినా దానికి మాత్రం ఒప్పుకోలేదు నేను. పేరు పెట్టుకునేంత గొప్ప రాతలు కావనుకోవడం ఒక కారణమైతే ఎవరు రాస్తున్నారో తెలియకపోతే పాఠకులలో ఒక రకమైన కుతూహలం ఉంటుందని, ముఖ్యంగా expectations

బరువు ఉండదని అనుకున్నా.(అసలు విషయం నాకు మంచి పేరు రాకపోయినా పరవాలేదు కాని చెడ్డపేరు మాత్రం రాకూడదన్న స్వార్థం అనుకుంటా.) ఏమైతేనేం ఈ కామెంట్స్ ('బహుళం', 'ఐ' పేరుతో వచ్చినవి కూడా కలిపి) దాదాపు 14 ఏళ్ళ పాటు అనామకంగానే వచ్చాయి. నో రిగ్రెట్స్.

ఇవేమీ నేను ముందుగా ఆలోచించి రాసినవి కావు. శనివారం సాయంత్రం ఆదివారం సంచిక మొత్తం తయారయ్యాక ఆఖరి గంటలో రాసినవే. చాలాసార్లు ఏ విషయం మీద రాయాలో చివరి నిమిషం దాకా నా మెదడులో క్లూ కూడా ఉండేది కాదు. సాయంత్రం ఆరు దాటినప్పటి నుండి మా వాళ్ళంతా ఆత్రుతగా, ఆందోళనగా నా క్యాబిన్ వంక చూస్తుంటే ఆ ఒత్తిడి పెరిగి పెరిగి చివరికి ఒక ఐడియాగా అది లోపలెక్కడో మెరిసి (లేక పేలి అనాలో), అప్పుడు ఒక్కొక్క వాక్యమూ రూపుదిద్దుకుని మా న్యూస్‌ప్రింట్ ప్యాడ్ మీద రెండు పేజీలు నిండగానే ఠక్కున ఆగిపోయేది. పేజీలో అంతే చోటు ఉన్నందుకు ఎంత సంతోషమేసేదో! చాలా ఏళ్ళ పాటు వాటి మొదటి పాఠకుడు నా సహోద్యోగీ, రచయితా అయిన గొరుసు జగదీశ్వరరెడ్డి. రెండో రీడర్ మా బిజినెస్ ఎడిటర్ వి. శ్రీనివాస్. వీరిద్దరూ పాస్ మార్కులు వేస్తే ఇక ఢోకా లేదని ఊపిరి పీల్చుకునేదాన్ని. గొరుసే కంపోజ్ చేసి సరైన బొమ్మ వెతికి పెట్టేవాడు. ఉద్యోగ ధర్మంగానే కాక చాలా ఇష్టంగా కూడా ఆ పని చేసి పెట్టినందుకు చాలా థాంక్స్ గొరుసూ.

మొదట్లో కొందరు ఇవి కె. శ్రీనివాస్ (అప్పుడాయన అసిస్టెంట్ ఎడిటర్, ఇప్పుడు ఎడిటర్) రాస్తున్నారని అనుకునేవారట. అది ఆయనకు కాంప్లిమెంట్ అవునో కాదో గాని నా రాతలకైతే కాంప్లిమెంటే. ఆయన తన 'సంభాషణ' పుస్తకానికి ముందుమాట రాయమని అడిగినప్పుడు 'నన్నెందుకు ఎంచుకున్నారని' నేను ఆశ్చర్యపోతే 'మీ సండే కామెంట్స్ చదివి' అన్నారాయన. అది సండే కామెంట్‌కి దక్కిన గౌరవంగానే భావిస్తాను నేను.

ఒక్కోసారి ఏ ఐడియా రాక ఈ ఒక్కసారికి నువ్వు ఏదైనా చెప్పకూడదూ అని ఫోనులో బాలగోపాల్‌ను అడుగుతుండేదాన్ని. 'అలా రాయడం నా వల్ల కాద'ని తప్పించుకునేవాడు. ఏ ఆదివారమూ ఇంట్లో ఉండడు కాబట్టి చదివాడో లేదో నాకు చాలా కాలం తెలిసేది కాదు. అడగడానికి మొహమాటం. కాని ఎక్కడున్నా ప్రతి ఆదివారం నాడు ఆంధ్రజ్యోతి కోసం వెతుక్కుని చదివేవాడని మా

హెచ్.ఆర్.ఎఫ్ మిత్రులు నా చెవిన వేసినపుడు సంతోషించాను. ఎప్పుడన్నా ఇంట్లో ఉండి చదివిన సందర్భాలలో మాత్రం అభినందనగా తల మీద చిన్నగా తట్టేవాడు. అదే ప్రశంసగా భావించి చాలా ఆనందపడేదాన్ని. ఈ పుస్తకం చేతికిస్తే అదే పని చేసేవాడేమో!

మా అమ్మ (వేమన కృష్ణకుమారి) ఈ కామెంట్స్ కి గొప్ప అభిమాని. వేరే ఎందరు ఇష్టపడ్డా ఆమె ఇష్టపడడం, వీటి గురించి గర్వంగా చెప్పుకోవడం నాకు చాలా సంతృప్తిని ఇచ్చేది. నచ్చితే ఇంటికొచ్చిన వాళ్ళందరి చేత చదివించేది. ఆదివారం నాకొచ్చే ఫోన్లన్నీ దాదాపు కామెంట్ గురించి మాట్లాడడానికి స్నేహితులు చేసే ఫోన్లే. కొందరు జానపద కథలు రాసినప్పుడు మాత్రమే ఫోన్లు చేసేవాళ్ళు. కొందరు రాజకీయాలు రాసినప్పుడు మాత్రమే స్పందించేవాళ్ళు, కొందరు నీతి కథలను, మానవీయ కథనాలను మాత్రమే ఇష్టపడేవాళ్ళు... ఇలా రకరకాలు. అన్నీ బాగున్నాయని వాళ్ళూ అనుకోలేదు. నేనూ అనుకోలేదు. అందుకే ఆరేడు వందల కామెంట్ల లోంచి ఒక వంద మాత్రమే ఎంపిక చేసాం.

దినపత్రిక పాఠకులందరూ సాహిత్య పాఠకులు కారు కాబట్టి మొదటి నుండి నా భాషను, భావాలను సరళంగా ఉంచడానికే ప్రయత్నించాను. కామెంట్ రోజువారీ విషయాలకు సంబంధించినదిగానే ఉండాలి; కాని అందులో వారు గమనించనిదేదో వారి దృష్టికి తీసుకురావాలి, విస్మరించినదేదో వారి స్మరణకు తీసుకురావాలి. ఇదీ నా ప్రయత్నం. ఈ రచనల కోసం నేను ఎక్కువగా ఎంచుకున్న రూపం జానపద కథలు, యక్షప్రశ్నల్లాంటి సంవాదాలు, వ్యక్తిగత తలపోతలు. ఈ పనిలో దేవుళ్ళ నుండి ఏడు చేపలు, బేతాళ విక్రమార్కులు, మార్టిన్ అవర్‌ల దాకా ఎందరు నన్ను ఆదుకున్నారో! కొత్త అన్వయింపులకు తగిన కథలు ఎన్నెన్ని ఉన్నాయో వీళ్ళందరి దగ్గరా.

ఇంకో రహస్యం కూడా చెప్పాలి మీకు. చాలా సందర్భాలలో మన చుట్టూ జరుగుతున్న పరిణామాల మీద వచ్చిన విపరీతమైన కోపాన్ని, బాధనే నేను ఈ కాలమ్‌లో వెళ్ళగక్కాను. అయితే వంద శాతం కోపాన్ని పది శాతంగా, వంద శాతం ఆక్రోశాన్ని ఇరవై శాతం ఆక్రోశంగా మార్చి మృదువుగా, నిష్ఠూరంగా, వెక్కిరింతగా చెప్పడం అలవాటు చేసుకున్నా. ఇది మంచి ఇది చెడు అని పెద్దవాళ్లకు చెప్పేటపుడు తీక్షణ స్వరం సత్ఫలితాన్ని ఇవ్వదన్న ఉద్దేశంతోనే ఆ

జాగ్రత్త పాటించాను. అందుకే ముఖేష్ అంబానీ ముంబయిలో అంత అసహ్యాకరమైన ఇల్లు కట్టుకుని wealth display చేసినా దాన్ని నేరుగా తిట్టడం కంటే ఏటి ఒడ్డున మనం కలలు కనే పర్ణ కుటీరాలను గుర్తుచేసి విమర్శించడం మెరుగనుకున్నాను. అలాగే మీడియాలో ఉంటూ మీడియా చేస్తున్న హానిని మరీ ఘాటుగా ఎత్తి చూపడం వీలు కాదని వారిని తిట్టడానికి రకరకాల డొంకతిరుగుడు పద్ధతులను ఆశ్రయించాను. బహుశా అందువల్లే ఈ కాలమ్ ఇంతకాలం కొనసాగిందనుకుంటున్నాను.

**ఇక కృతజ్ఞతల విషయానికి వస్తే...**

ముఖ్యంగా ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ గారికి చెప్పాలి అన్నేళ్ల పాటు అంత స్వేచ్ఛగా రాయనిచ్చినందుకు. ఆయన చదివేవారో లేదో నాకు తెలియదు కాని ఆంధ్రజ్యోతి డైరెక్టర్ అయిన ఆయన సహచరి కనకదుర్గ గారు మాత్రం చదివేవారని నాకు తెలుసు. అప్పుడప్పుడు ప్రశంసిస్తూ మెసేజ్‌లు పెట్టడమే కాక మధ్యలో ఒకసారి మానేస్తే తిరిగి ప్రారంభించమని కోరారు కూడా.

ప ర్ స్పె క్టి వ్స్ సభ్యులైన జి. హరగోపాల్, వి.ఎస్. ప్రసాద్, డి. నరసింహారెడ్డి గార్లకు, ముఖ్యంగా ఆర్ కె కు చాలానే కృతజ్ఞతలు చెప్పాలి. తను వెంటపడకపోతే, ఎమోషనల్ బ్లాక్‌మెయిల్‌కు సైతం పాల్పడకపోతే ఈ పుస్తకం వచ్చేదే కాదు. పెద్దగా అలవాటు లేకపోయినా అడగ్గానే ముందుమాట రాసేందుకు ఒప్పుకుని ఏకబిగిన 50, 50 చొప్పున చదవడమే కాక  నా కామెంట్ల అంతరార్థాన్ని పట్టుకుని పంచతంత్ర కథలు, పెద్దబాలశిక్ష లాంటి కితాబులు ఇచ్చిన చిరకాల మిత్రుడు, కథా రచయిత ఉణుదుర్తి సుధాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. నా ఆలోచనల్ని ఆకాశంలో పక్షుల్లా కవర్‌పైన ఎగరేసిన ఆర్టిస్టు మిత్రుడు అన్వర్‌కు కూడా ప్రత్యేక కృతజ్ఞతలు. బాలగోపాల్ రచనల గాఢాభిమాని అయి ఉండి కూడా వీటిని ఇష్టంగా చదివి, వాటి 'గొప్పదనాన్ని' అప్పుడపుడూ నాకే విడమర్చి చెప్పి, వీటి ఎంపికలో నాకు సాయపడిన మా బ్రహ్మయ్యకు (డి.ఆర్.డి.వో లో సైంటిస్ట్, మంచి చదువరి) కూడా కాసిన్ని కృతజ్ఞతలు.

**వేమన వసంతలక్ష్మి**

*3 జూలై 2018*

# పర్‌స్పెక్టివ్స్ ఎందుకోసం

మానవజాతి భవిష్యత్తును గురించి ఇవ్వాళ చాలా చర్చ జరుగుతూ ఉంది. ఏ రకమయిన అసమానతగానీ, అణచివేతగానీ లేని సమాజం కావాలని అభ్యుదయవాదులందరూ కోరుకుంటారు. కానీ ఆ సమాజ స్వరూప స్వభావాలను గురించి ఏకాభిప్రాయం మట్టుకు అభ్యుదయవాదులలో సర్వత్రా లేదు. మార్క్స్ రచనలతో ఒక ప్రామాణికమయిన రూపం తీసుకున్న చర్చ ఈనాటికీ ముగియలేదు. అణచివేతలోనూ అసమానతలోనూ కొత్త కోణాలను చరిత్ర ముందుకు తెచ్చేకొద్దీ చర్చ మరింత వాడిగా సాగుతూ ఉంది. మరింత జటిలం అవుతూ ఉంది. కొత్త కోణాలలో కొన్ని నిజానికి చాలా పాతవే కావడంతో వాటిని ఇన్నాళ్ళూ ఎందుకు చూడలేకపోయామన్న విమర్శ చర్చకు కొంత వేడిని కూడా చేరుస్తూ ఉంది.

ఆ చర్చలో అనేక రకాల దృక్పథాలు గల వ్యక్తులు పాల్గొంటున్నారు. అనేక ఉద్యమాలు పాల్గొంటున్నాయి. అసమానతకూ, అణచివేతకూ కొత్త కోణాలను ఆవిష్కరించేవారు, ఇప్పటికే ఉన్న విప్లవ సిద్ధాంతాలు వాటిని ఆకళింపు చేసుకోలేవనే వారు, అసలు కొత్త కోణాలు ఆవిష్కరణే నిరుపయోగమయిన ప్రయాస అనుకునేవారు, ఇప్పటికి ఉన్న సిద్ధాంతాలే సామాజిక జీవితంలోని అన్ని పార్శ్వాలనూ అవగాహన చేసుకోగలవనుకునేవారు, అసలు 'సిద్ధాంతం', 'నిర్మాణం' అనేవే మానవజాతి వికాసానికి అవరోధం అనుకునేవారు, అభ్యుదయం కోసం ఇప్పటిదాకా జరిగిన ప్రయత్నమంతా వృథా అనుకునేవారు, దాని మంచి చెడుల నుండి గుణపాఠాలు తీసుకోగలమనుకునేవారు, రాజకీయ ఆచరణలో నిమగ్నం అయినవారు, ఆచరణతో నిమిత్తం లేనివారు... ఇంకా అనేకులు ఇవాళ మానవ భవితవ్యాన్ని గురించిన ఈ చర్చలో పాల్గొంటున్నారు.

ఈ చర్చకు సంబంధించి 'పర్‌స్పెక్టివ్స్'కు ఒక దృక్పథం ఉంది. మానవ సమాజం గురించీ దాని భవిష్యత్తు గురించీ బుద్ధుడి నుండి ఈనాటిదాకా అనేకులు ఊహలు చేశారు. సిద్ధాంతాలు చేశారు. ఎవ్వరూ కాదనలేని ఆదర్శాలు మన ముందుంచారు. ఆ ఆదర్శాలను సాధించే మార్గాలను ప్రతిపాదించారు. ఈ అన్వేషణకు శాస్త్రీయ ప్రాతిపదిక కల్పించి నేలమీద నిలబెట్టింది మార్క్సిజం.

మార్క్సు రచనలు చేయడం మొదలుపెట్టిన తరువాత చర్చ యావత్తూ ఆయన ప్రతిపాదించిన అధ్యయన చట్రం చుట్టూ పరిభ్రమిస్తూ ఉంది. అంగీకరించేవాళ్ళూ, సవరించేవాళ్ళూ, తిరస్కరించే వాళ్ళూ అందరూ దానినే ప్రమాణంగా స్వీకరించారు. ఇవ్వాళ తూర్పు యూరప్, సోవియట్ రష్యా, చైనా దేశాలలో వస్తున్న మార్పుల ఫలితంగా చెలరేగుతున్న చర్చ స్వభావం కూడా ఇందుకు భిన్నంగా లేదు. ఇకమీదట ఉండబోతుందని మేము అనుకోవడం లేదు.

ఇప్పటికీ సిద్ధాంతం ఆచరణలకి సంబంధించిన సమస్యలని మార్క్సిజం అధిగమించిందని చెప్పలేం. పాత సమస్యలు పరిష్కరించుకునే క్రమంలో కొత్త సవాళ్ళు మార్క్సిజం ముంగిట కొస్తున్నాయి. కొత్త నిర్వచనాలు, కొత్త ప్రతిపాదనలు, ప్రత్యామ్నాయాలు రూపొందుతున్నాయి. సామాజిక పరివర్తన కోసం జరుగుతున్న మొత్తం చర్చలో భాగమే మార్క్సిజం గురించిన చర్చ కూడా. ఈ చర్చలో అన్ని కోణాలకూ అన్ని పోకడలకూ వేదిక కల్పించాలని 'ప ర్ స్పె క్టి వ్స్' భావిస్తూ ఉంది. ఆర్థిక పరిమితుల వల్ల అన్ని పుస్తకాలు ప్రచురించ వీలుకాకున్నా, ఆ దిశగా చర్చను ప్రతిపాదించే పుస్తకాలను ప్రచురించాలనుకుంటున్నాం.

అణచివేతనూ, అసమానతనూ వ్యతిరేకించేది ఏదయినా ప్రజాస్వామిక దృక్పథమే. మౌలికంగా అభ్యుదయ దృక్పథమే. ఆపైన ఎన్ని తేడాలున్నా వినదగినదే, చర్చించదగినదే, అధ్యయనం చేయదగినదే. *'నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ'* అని మావో ఒక చారిత్రక సందర్భంలో ఇచ్చిన పిలుపుకు ఈ నిర్దిష్టమయిన అర్థంలో సార్వత్రిక ప్రాతిపదిక ఉందని 'ప ర్ స్పె క్టి వ్స్' భావిస్తూ ఉంది. ఆ అవగాహనతో ప్రచురణలు చేపడుతోంది. ప్రజాస్వామిక స్వభావం కలిగిన సమర్థవంతమయిన రచనలను ఎక్కువగా తెలుగులో, వీలున్నప్పుడు ఇంగ్లీషు, హిందీలో కూడా ప్రచురించడం ద్వారా కొనసాగుతున్న 'గ్రేట్ డిబేట్'కు దోహదం చేయాలని మా సంకల్పం.

**కె. బాలగోపాల్**
**ప ర్ స్పె క్టి వ్స్**
సామాజిక శాస్త్రం / సాహిత్యం
హైదరాబాదు

మే
1999

# 1988 నుంచి 2018
# పర్‌స్పెక్టివ్స్ ప్రచురణలు

| | | | |
|---|---|---|---|
| ★ 1. | Probings in the Political Economy of Agrarian Classes and Conflicts | May 1988 | by K. Balagopal<br>Ed. G. Haragopal |
| ★ 2. | సహచరులు | జూలై 1989 | వరవరరావు |
| ★ 3. | పతంజలి భాష్యం | జూలై 1989 | కె.ఎస్.వై. పతంజలి |
| ★ 4. | సృజన సంపాదకీయాలు | జనవరి 1990 | వరవరరావు / సాహితీ మిత్రులు |
| ★ 5. | అభివృద్ధి వెలుగునీడలు | మే 1990 | ఆర్.ఎస్.రావు |
| ★ 6. | కఠోర షడ్జమాలు | తొలి ముద్రణ 1990<br>మలి ముద్రణ 1996 | వసంత కన్నబిరాన్ |
| ★ 7. | మతవర్గ తత్వం | ఫిబ్రవరి 1991 | ఎడిటర్స్ : హరి, జి. హరగోపాల్ |
| 8. | ఇలా మిగిలేం | తొలి ముద్రణ 1991<br>రెండవ ముద్రణ 1993<br>మూడవ ముద్రణ 2012 | చలసాని ప్రసాదరావు |
| ★ 9. | పరాధీన భారతం | తొలి ముద్రణ 1992<br>మలి ముద్రణ 1993 | ఎ.బి.కె. ప్రసాద్ |
| ★ 10. | డంకెల్ దుశ్శాసనం | జూన్ 1993 | నూర్ భాషా |
| ★ 11. | దినదినగండం | సెప్టెంబర్ 1993 | అనువాదం : ఎం. కోదండ రాం |
| ★ 12. | మన చలం | మే 1994 | ఎడిటర్ : కృష్ణాబాయి |
| ★ 13. | Towards Understanding Semi Feudal Semi Colonial Society | Jan 1995 | by R.S. Rao<br>Ed. D. Narasimha Reddy |
| ★ 14. | ఏదో సారా కథ | జూలై 1995 | బుర్ర రాములు |
| ★ 15. | శాక్కో-వాంజెట్టి | నవంబర్ 1995 | బి. చంద్రశేఖర్ |
| ★ 16. | బంగారమ్మ కథ | జనవరి 1996 | అనువాదం : కృష్ణాబాయి |
| ★ 17. | కార్టూన్ కబుర్లు | సెప్టెంబరు 1996 | మోహన్ |
| 18. | నాకో పిస్తోల్ కావాలి | అక్టోబర్ 1996 | అనువాదం : చలసాని ప్రసాదరావు |

| | | | |
|---|---|---|---|
| 19. | సాహిత్యంలో వస్తు శిల్పాలు | మార్చ్ 1997 | త్రిపురనేని మధుసూదనరావు |
| ★20. | కల్లోల కథా చిత్రాలు | డిసెంబర్ 1997 | కె. బాలగోపాల్<br>ఎడిటర్ : చలసాని ప్రసాద్ |
| ★21. | ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంస్కరణలు / ప్రపంచ బ్యాంక్ ఎజెండా | మార్చ్ 1998 | ఎడిటర్ : డి. నరసింహారెడ్డి |
| ★22. | మూడు దశాబ్దాల నక్సల్బరీ గమ్యం-గమనం | తొలి ముద్రణ : ఆగస్ట్ 1998<br>మలి ముద్రణ : అక్టోబర్ 1998 | ఎడిటర్స్ : ఎస్. సుధాకర్, ఎం. కోదండరాం |
| ★23. | పరాధీన భారతంలో దారితప్పిన రూపాయి | డిసెంబర్ 1998 | ఎ.బి.కె. ప్రసాద్ |
| ★24. | శారద నవలలు (ఏది సత్యం, మంచీ-చెడు, అపస్వరాలు) | ఆగస్ట్ 1999 | శారద (ఎస్. నటరాజన్) |
| ★25. | సింగరేణి | నవంబర్ 2000 | ఎం.డి. మునీర్, ఎం.డి. అన్వర్ |
| ★26. | ఖాదర్ లేడు | మే 2001 | మహమ్మద్ ఖదీర్ బాబు |
| ★27. | ప్రమాదంలో ప్రజారోగ్యం | ఫిబ్రవరి 2002 | డా॥ ఎస్. తిరుపతయ్య<br>డా॥ పి. జగదీశ్వర్ |
| ★28. | ఎన్జీవోల కథ | జనవరి 2003 | బి. చంద్రశేఖర్ |
| ★29. | జాగ్తే రహెూ | జూన్ 2003 | చలసాని ప్రసాదరావు<br>ఎడిటర్ : డి. వెంకట్రామయ్య |
| ★30. | ఉదయగీతిక (రెండవ కూర్పు తొలిముద్రణ) | డిసెంబర్ 2003 | రచన : యాంగ్ మో<br>అనువాదం : ఎన్. వేణుగోపాల్ |
| ★31. | వరల్డ్ సోషల్ ఫోరం ఆర్థిక రాజకీయాలు | జనవరి 2004 | RUPE (MUMBAI)<br>అనువాదం : బి. చంద్రశేఖర్ |
| ★32. | ఎర్రమందారాలు (రెండవ కూర్పు తొలిముద్రణ) | మే 2005 | రచన : లోకువాంగ్-పిన్ యాంగ్ యీ-యెన్<br>అనువాదం : డా॥ టి. నళిని |

| | | | |
|---|---|---|---|
| 33. | నూరేళ్ళ తెలుగు నవల (1878-1977) | తొలి ముద్రణ : ఆగస్ట్ 2007 రెండవ ముద్రణ : డిసెంబర్ 2015 | సహవాసి సంపాదకులు : డి. వెంకట్రామయ్య |
| ★ 34. | అల్లం రాజయ్య సాహిత్యం-1 మూడు నవలలు- (కొలిమంటుకున్నది, ఊరు, అగ్నికణం) | జనవరి 2008 | అల్లం రాజయ్య సంపాదకులు-వరవరరావు |
| 35. | విభిన్న | ఆగష్టు 2008 | హరిపురుషోత్తమరావు |
| 36. | పతంజలి భాష్యం (రివైజ్‌డ్) | మార్చ్ 2009 | కె.ఎన్.వై. పతంజలి |
| 37. | మృగన | ఏప్రిల్ 2009 | విమల |
| 38. | రాజ్యం - సంక్షేమం | మొదటి ముద్రణ: అక్టోబర్ 2010 రెండవ ముద్రణ: అక్టోబర్ 2011 | కె. బాలగోపాల్ |
| 39. | అల్లం రాజయ్య సాహిత్యం-2 సృష్టికర్తలు (కథలు) | ఏప్రిల్ 2011 | అల్లం రాజయ్య సంపాదకులు-వరవరరావు |
| 40. | సంభాషణ | జూలై 2011 | కె. శ్రీనివాస్ |
| 41. | దళిత | మొదటి ముద్రణ: అక్టోబర్ 2011 రెండవ ముద్రణ: నవంబర్ 2016 | కె. బాలగోపాల్ |
| 42. | జాజిమల్లి | మొదటి ముద్రణ: డిసెంబర్ 2011 రెండవ ముద్రణ: ఏప్రిల్ 2012 | మల్లీశ్వరి |
| ★ 43. | త్రిపుర (కథలు) | డిసెంబర్ 2011 | త్రిపుర |

| | | | |
|---|---|---|---|
| 44. | ప్రాణహిత | మొదటి ముద్రణ: జూలై 2012<br>రెండవ ముద్రణ: సెప్టెంబర్ 2012 | అల్లం నారాయణ |
| 45. | మనిషి మార్క్సిజం | మొదటి ముద్రణ: అక్టోబర్ 2012<br>రెండవ ముద్రణ: మార్చ్ 2013<br>మూడవ ముద్రణ: నవంబరు 2016 | కె. బాలగోపాల్ |
| 46. | కొమురం భీము (నవల)<br>అల్లం రాజయ్య సాహిత్యం-3 | మొదటి ముద్రణ: జనవరి 2013<br>రెండవ ముద్రణ: అక్టోబర్ 2016 | సాహు<br>అల్లం రాజయ్య<br>సంపాదకులు-వరవరరావు |
| 47. | సింహాలపేట (కథలు) | మార్చ్ 2013 | రమణజీవి |
| 48. | రిజర్వేషన్లు - ప్రజాస్వామిక దృక్పథం | మొదటి ముద్రణ: అక్టోబర్ 2013<br>రెండవ ముద్రణ: ఫిబ్రవరి 2014<br>మూడవ ముద్రణ: డిసెంబరు 2016 | కె. బాలగోపాల్ |
| 49. | వసంతగీతం (నవల)<br>అల్లం రాజయ్య సాహిత్యం-4 | డిసెంబర్ 2013 | అల్లం రాజయ్య<br>సంపాదకులు-వరవరరావు |
| 50. | LEADERS BEYOND MEDIA IMAGES | December 2013 | K. Bala Gopal<br>Ed. G. Hara Gopal |
| 51. | స్వేచ్ఛారావం<br>(సామాజిక రాజకీయ వ్యాసాలు) | జూలై 2015 | జి. హరగోపాల్ |
| 52. | ఆదివాసులు:<br>వైద్యం సంస్కృతి అణచివేత | మొదటి ముద్రణ అక్టోబర్ 2015<br>రెండవ ముద్రణ: జనవరి 2018 | కె. బాలగోపాల్ |

| | | | |
|---|---|---|---|
| 53. | ఆదివాసులు:<br>చట్టాలు-అభివృద్ధి | మొదటి ముద్రణ:<br>అక్టోబర్ 2016<br>రెండవ ముద్రణ:<br>జనవరి 2018 | కె. బాలగోపాల్ |
| 54. | తల్లి చేప (కథలు)<br>అల్లం రాజయ్య సాహిత్యం-5 | ఏప్రిల్ 2017 | అల్లం రాజయ్య<br>సంపాదకులు-వరవరరావు |
| 55. | నక్సలైట్ ఉద్యమం<br>వెలుగు నీడలు | మే 2017 | కె. బాలగోపాల్ |
| 56. | సినిమా ఒక ఆల్కెమీ | మే 2017 | వెంకట శిద్ధారెడ్డి |
| 57. | బహుళ<br>(సాహిత్య విమర్శ) | ఏప్రిల్ 2018 | సంపాదకులు:<br>ఎ.కె. ప్రభాకర్ |
| 58. | సండే కామెంట్స్ | జూలై 2018 | వేమన వసంతలక్ష్మి |

★***ప్రతులు లేవు***

***త్వరలో...***

1. **అతడు** - సంపాదకులు:వరవరరావు
   (అల్లం రాజయ్య సాహిత్యం-6)

2. **కల్లోల దశాబ్దాలు** - కె. బాలగోపాల్

**Perspectives**

Social Sciences / Literature
Publishing for Change

ఆదివారం ఆంధ్రజ్యోతి సండే కామెంట్

# Sunday Comments by V. Vasantha Lakshmi

Selected Comments from Andhrajyothi Sunday magazine



ఈ రచనలన్నీ కూడా సామాన్యుల పక్షాన నిలబడి పాఠకులను ఆలోచింపజేస్తాయి. ప్రజాహితాన్ని కోరుకుంటూనే కొత్త కోణాలను ఆవిష్కరిస్తాయి. ఈ పనిని అవి ఎంతో సున్నితంగా, మనుషుల పట్ల ప్రేమతో, సంఘం పట్ల నిష్ఠతో, పర్యావరణం పట్ల శ్రద్ధతో చేస్తాయి. ప్రతి రచనలోనూ కనీసం ఒకటో రెండో గుర్తుంచుకోవలసిన వాక్యాలూ, ఆగి ఆలోచించాల్సిన సందర్భాలూ కనిపిస్తాయి. మరోవైపు ప్రజాకంటకుల్ని, దుర్మార్గుల్ని, అవినీతిపరుల్ని అవకాశం దొరికినప్పుడల్లా నిర్దాక్షిణ్యంగా మాటల కొరడాతో చావగొడతాయి. అలాగని ఈ రచనల్లో ఎక్కడా సైద్ధాంతిక చర్చలు లేవు. వ్యంగ్యం మితిమీరలేదు. హాస్యం వికటించలేదు; చురకలే గాని వాతల్లేవు. ఈ రచనలన్నీ కూడా ఒక చిరకాల మిత్రురాలు తమతో ప్రత్యక్షంగా సంభాషిస్తున్న అనుభూతిని పాఠకులకు కలిగిస్తాయి. ఇక్కడున్నవన్నీ ఏకపక్ష తీర్మానాలకు, అంతిమ పరిష్కారాలకు దూరంగా నడయాడే ప్రజాస్వామిక ప్రతిపాదనలు.

- ఉణుదుర్తి సుధాకర్

ISBN 978-93-81172-15-5

Perspectives
Social Sciences/Literature
Publishing *for* Change

Rs:150/-